# ఇన్ ది మూడ్ ఫర్ లవ్

పన్నెండు ప్రేమ కథలు

సంపాదకులు

అపర్ణ తోట

వెంకట్ శిద్దారెడ్డి



# ఇన్ ది మూడ్ ఫర్ లవ్

# ప్రపోజల్

ప్రేమ కథలా? ఇప్పుడెందుకు? అని మీరు అడగొచ్చు. ఇప్పుడే ఇలాంటి ప్రేమకథల సంకలనం అత్యవసరం అని మాకనిపించింది.

ఈ ప్రేమకథల పుస్తకం హఠాత్తుగా ఒక సాయంత్రం ఆలోచన వచ్చి ప్రచురించింది కాదు. ఆ ఆలోచనకు కనీసం మూడేళ్ళ వయసుంది.

తెలుగులో రచయితలం కొందరం, కాస్త సీరియస్‌గా రాస్తున్నాం అనే అవగాహన వచ్చేసరికి మా రచనలు చదివే చదువరులు తగ్గిపోయారనే విషయం అర్థమైంది. అసలు ఎందుకు రీడర్స్ సరిపడాలేరు అనే ప్రశ్న సాహిత్యకారులను గత ఇరవయ్యేళ్ళుగా వేధిస్తూనే ఉంది. దృశ్య మాధ్యమం, ఇంటర్నెట్, ఇంగ్లీష్ మీడియం చదువు – ఇలా కొన్ని కారణాలు పైకి కనిపించినా, ఇవి ఏవీ అసలు కారణాలు కాదు.

ఎందుకంటే, ఇప్పటికీ ఇంగ్లీషు పుస్తకాలు మార్కెట్లో బాగానే అమ్ముడవుతున్నాయి. తెలుగులో అలాంటి వాతావరణం లేదు. కాస్త ఆలోచించాక అర్థమైందేటంటే, మన తెలుగులో సాహిత్యానికి పరిచయం చేసే ఎంట్రీపాయింట్ ఎక్కడో తెగిపోయింది. పాలో కొయిలో, డాన్ బ్రౌన్ లాగా అటు కమర్షియల్‌గా హిట్ అయి ఇటు పాఠకుల జనాభాను పెంచే సాహిత్యం తెలుగులో రాకపోవడమే అందుకు కారణం అనిపించింది.

ఇదివరకటి రోజుల్లోలా మనకు ఇప్పుడు పాపులర్ రచనలు లేవు. యండమూరి, యద్ధనపూడిలాగా సాహిత్యం నుంచి సినిమా వరకు రచయితలు పెద్దగా చేరలేకపోతున్నారు. రాజకీయ, సైద్ధాంతిక కథలు మొదలవడం బావున్నా, సాహిత్యానికి బాగా గాంభీర్యం పెరిగి యువత కాస్త బెదురుగా చూసే సమయం ఇది. వారికి కాస్త ధైర్యం ఇద్దామనే ఆలోచనతోనే ఈ పుస్తకాన్ని ముందుకు తెస్తున్నాం.

మరి అందరినీ అలరించి, చదివించే కథాంశం ఏమిటి అని ఆలోచిస్తే 'ప్రేమ' అని తేలింది. అది మనకి సినిమాలు చూస్తే బాగా అర్థమవుతుంది. రొమాంటిక్ కామెడీలే కాకుండా సమాజంలోని వివిధ నేపథ్యాలను కూడా ప్రేమకథలుగా చెప్పొచ్చనడానికి ఉదాహరణలు సినిమాల్లో చాలానే ఉన్నాయి. ఈ మధ్యనే వచ్చిన 'పరియేరుమ్ పెరుమాళ్' మంచి ఉదాహరణ. మనజీవితాన్ని నడిపించేది ప్రేమే. అసలు ప్రేమించి ఎంతకాలమైంది? ప్రేమను ఆస్వాదించి ఎంత కాలమైంది? ప్రేమను ప్రేమగా చదివి ఎంతకాలమైంది? అందుకే మేము కూడా ప్రేమకథల సంకలనం తీసుకురావాలనే ఆలోచనకి వచ్చాం.

అయితే ఈ సంపుటిలో రచయితలను, బాగా రాస్తారని పచ్చి స్వార్థం, మా

స్నేహితులనే ఒక లౌల్యమూ తప్ప మరే విధంగానూ ఎన్నుకోలేదు. దీని వెనుక కమిటీలు ఏమీ వేయలేదు. అందరూ సాహిత్యాన్ని ఎంతో కొంత ప్రాక్టీస్ చేస్తున్నవారే అయినా, రాసుకుంటూ పోయారు కానీ రీడర్షిప్ గురించి వారికి పెద్దగా పట్టలేదు. కొన్నేళ్ల క్రితం మా ఇద్దరి మధ్యా జరిగిన సాధారణ సంభాషణలోంచి వచ్చిన ఆలోచనే ఈ పుస్తకానికి నాంది.

అడగ్గానే స్పందించి ఈ పుస్తకానికి కథలు రాసిచ్చిన రచయితలందరికీ మా ధన్యవాదాలు. అలాగే మా కథలన్నీ చదివి తొలి పాఠకురాలిగా మాలో ఉత్సాహం నింపిన చైతన్య పింగళికి, చాలా శ్రమతో ప్రూఫ్ దిద్దిన కిషోర్‌దాస్ గారికి, వి.మల్లికార్జున్ గారికి మా ధన్యవాదాలు. ఈ కథల పుస్తకం తేవడంలో మాకు సహకరించిన ఝాన్సీ నల్లమెల్లి, అనంతు చింతలపల్లి, కవర్‌పేజికి అందమైన పెయింటింగ్ అందించిన మోషే దయాన్‌గారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు,

గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న రైటర్స్‌మీట్‌లో మమ్మల్ని భాగం చేసి, ఈ పుస్తకం తేవటానికి స్ఫూర్తినిచ్చిన నిర్వాహకులు మహమ్మద్ ఖదీర్‌బాబు, టైటానిక్ సురేష్ గార్లకు ఈ పుస్తకం అంకితం.


ఇటువంటి కథా సంపుటాలు చాలా అవసరం. ఈ బిజీ జీవితంలో ఉత్తమ కథలను ఎన్నుకుని చదవడానికి అవకాశం లేదు. స్థలాభావం, రాజకీయ కారణాల వలన రచయితలు తమ కథలను ప్రచురించడానికి సరైన మీడియం లేదు. వెబ్ మ్యాగజైన్‌లు కొంత వరకు లోటును పూడ్చినా, వానికున్న పాఠకులు పరిమితమైనవారే. ఇప్పుడు పాఠకులకు కావాలనుకున్న కథలు దొరకకపోవడమే కాదు, రచయితకు పాఠకుల లోటు కూడా ఉంది. ఈ వారధి నిర్మించాలంటే వీలైనన్ని కథా సంపుటాలు వెలువడడమే మార్గం.

ఈ పుస్తకానికి వచ్చిన స్పందనను బట్టి భవిష్యత్తులో మరిన్ని ప్రయత్నాలు చేసే ఆలోచనైతే ఉంది. ప్రస్తుతానికి మా ఈ ప్రేమకథలని మేం ప్రేమించినంత గాఢంగానే మీరు కూడా ప్రేమిస్తారని ఎదురుచూస్తున్నాం.

దీనిని కొనసాగించడం ఇక పాఠకులైన మీ చేతుల్లోనే ఉంది.

అపర్ణ తోట<br>
వెంకట్ శిద్దారెడ్డి<br>
డిసెంబర్ 2018

✦✦✦




**న్యూవేవ్ బుక్స్**

సినిమా/సాహిత్యం,

హైదరాబాద్

2018

**ఇన్ ది మూడ్ ఫర్ లవ్**
అపర్ణ తోట
వెంకట్ శిద్దారెడ్డి

For Copies:
**www.amazon.in**

**నవతరంగం చలనచిత్రం**
ఎమ్మెల్యే కాలనీ, బంజారాహిల్స్,
హైదరాబాద్.
ఫోన్ : 970 597 2222, 984 988 8773

పబ్లిషర్స్
**న్యూవేవ్ బుక్స్**
సినిమా/సాహిత్యం
ఎమ్మెల్యే కాలనీ, బంజారాహిల్స్,
హైదరాబాద్ - 500 034.

ముద్రణ
**హిమాలయ ప్రింటర్స్**
ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్,
హైదరాబాద్.

ప్రచురణ సంఖ్య - 1
**మొదటి ముద్రణ - డిసెంబర్, 2018**

కవర్‌పేజి ఆర్ట్
**మోషే దయాన్**

బుక్ మేకింగ్ & కవర్ డిజైన్
**మహి బెజవాడ**
970 597 2222

లే-అవుట్
**ఝాన్సీ నల్లమెల్లి**

కంపోజింగ్
**టీమ్ ఆర్షియో**
(వెంకట్, మహి, ఝాన్సీ)
www.artioadvertising.com

వెల : రూ. 200/-

e-book
**www.kinige.com**



'Love is, of course, a central preoccupation of literature.'

*- Victoria HislLop*

# ఎన్ని ఎన్ని ప్రేమలో...

**19**
సత్యవేణి
నాగేంద్ర కాశి
prasad.kbn2010@gmail.com

**37**
వాలెంటైనుడెవ్వరే...?
అపర్ణ తోట
thota.aparna@gmail.com

**53**
మూడో కథ
అరిపిరాల సత్యప్రసాద్
satyaonline@gmail.com

**65**
నిద్ర గన్నేరు
రిషి శ్రీనివాస్
srinivasarishi@gmail.com

**77**
లవ్ మే హాపెన్
స్వాతి కుమారి
swathikumari@gmail.com

**89**
బ్యాక్వాటర్స్
పూర్ణిమ తమ్మిరెడ్డి
purnimat07@gmail.com

**99**
నా జూలియా
మానస ఎండ్లూరి
manasaugc@gmail.com

**117**
గన్స్ అండ్ మాన్సూన్స్
మహి బెజవాడ
mahypallav@gmail.com

**145**
రామి
మిథున
midhuname6@gmail.com

**165**
మోహఋతువు
ఉషజ్యోతి బంధం
vedasamhitha@gmail.com

**179**
ది గేమ్స్ వియ్ ప్లే
వెంకట్ శిద్దారెడ్డి
venkat.thedirector@gmail.com

**209**
జింగిల్ బెల్స్
కె.వి. కరుణ కుమార్
karunakumar06@gmail.com

# ప్రేమలేఖ

"I can't write without a reader. It's precisely like a kiss - you can't do it alone." - *John Cheever*

ప్రియమైన నీకు.

తెలుసు కదా! మనిషి ఆలోచనలు అక్షరరూపం దాల్చినప్పుడు మనిద్దరం పుట్టాం. జన్మమాధుర్యంలో సోలిన మన చేతుల్ని చిరునవ్వుతో విడదీసి ఈ లోకంలో వదిలారు. అప్పట్నుంచీ మనం ఒకరికొకరం అన్నట్టు ఉంటూ వచ్చాం.

మనిద్దరం ఎక్కడెక్కడ కలిశామని చెప్పడానికి ఒక అంతంటూ ఉందా? చెరువుగట్ల పైనా, వెన్నెల రాత్రుల్లో. బస్సుల్లో, రైళ్లలో, విమానాల్లో కలిసాం. సముద్రపు ఒడ్డున, వేసవి సాయంత్రాలలో.

అంతేనా! మనం తిరగని చోటంటూ ఉందా? ఊర్లు దాటాం. పట్టణాలు తిరిగాం. దేశాలు విడిచాం. కొత్తలోకాల్లో రెక్కలు కట్టుకుని తిరిగాం. గ్రహాలు, నక్షత్రాలు, పాలపుంతలు – మన ప్రయాణంలో మనం చూసిన చోట్లన్నీ లెక్కపెట్టగలమా?

మనుషుల మధ్య మనం కలిసి తిరిగాం. ఏకాంతంలోనూ మనం కలిసే ఉన్నాం.

ఎన్ని వేల సంవత్సరాలదో కదా మన పరిచయం. నీకోసం ఎంతమంది కొత్తవాళ్లని తీసుకొచ్చి నీకు పరిచయం చేశానో గుర్తుందా? రాజేశ్వరి గుర్తుందా? అమీర్? మీరా? వీళ్లందరితోనే కదా మన సావాసం ఒకప్పుడు. వాళ్లతో స్నేహమొద్దని పెద్దవాళ్లు ఎంత వారించినా రహస్యంగా ఎలా కలిసేవాళ్లమో గుర్తులేదా? పాపం దయానిధి గుర్తున్నాడా? కోమలి, అమృతలు గుర్తున్నారా? వెన్నెల్లో ఆడపిల్ల గుర్తుంది కదా! తనకోసం ఎంత

వెతికించుకుందో గుర్తుందా? వీళ్లందరిని నీకు పరిచయం చేసింది నేనే కదా! వీళ్లేనా? ఊర్వశి–పురూరవుడు, లైలా–మజ్ను, రోమియో–జూలియట్ వీళ్లంతా నీకు పరిచయమే కదా! నేనింత చేసినప్పటికీ నేనెప్పుడూ నీతో అనలేదు – నువ్వు నాకు ఋణపడ్డావని. ఎందుకంటే నేనే నీకు ఎక్కువ ఋణపడి ఉన్నానేమో అనిపిస్తుంది ఒక్కోసారి. ఎందుకంటే నువ్వులేకుండా నేను లేనుగా!

నేను రాయడం. నువ్వు చదవడం.

నా కోసం చిరిగిన చొక్కాలు తొడుక్కున్నావు. కానీ పుస్తకాలు కొనడం మానలేదు.

అసలు నువ్వూ, నేను లేకుంటే ఈ చరిత్రే ఉండేదా?

కానీ ఈ మధ్య నువ్వు మారిపోయావు. నేను రాసిందేదీ నీకు నచ్చడం లేదు. నీకు నచ్చేలా నేను రాయడం లేదు. నేనంటే కోపమొచ్చిందో ఏమో పుస్తకాలన్నీ విసిరేసి వెళ్లిపోయావు. మనిద్దరి మధ్య ఒక అగాధమే ఏర్పడింది.

ఎందుకు నన్నిలా హఠాత్తుగా వదిలేసి వెళ్లావు? నీకేం కావాలో నాకు తెలియడం లేదు. నీకు కావాల్సినట్టు నేను ఉండలేకపోతున్నాను. నాకు కావాల్సినట్టు నిన్ను మలుచుకోవడం కూడా నీకు తెలియదు. ఒక్కసారి కనిపిస్తే మనం మాట్లాడుకుందాం. కలలో ఏదో స్ఫురిస్తుంది. అందమైన స్వప్నాలేవో ప్రతి రాత్రి నన్ను వేధిస్తాయి. నన్ను వెతుకుతూ వచ్చే నీ అడుగుల చప్పుడు నా హృదయంలో ధ్వనిస్తుంది. కళ్లు తెరుస్తాను. వాటన్నింటినీ అక్షరాలను చేయడంలో విఫలమవుతాను. నువ్వు మాయమవుతావు.

ఎంత రాసాను నీ కోసం. ఒకచోట విప్లవం, ఒకచోట భయం, ఒకచోట విధ్వంసం. ఒకచోట శృంగారం మరోచోట విషాదం. బాధలు రాసాను. కష్టాలు రాసాను. కానీ అన్నింటికంటే నేను రాసిన ప్రేమే నాకు చాలా ఇష్టం. చలం అన్నట్టు – "ప్రేమ తేజస్సుతో ప్రపంచం వెలిగిందనీ, ప్రేమ రూపాలతో దిక్కులు మారుమోగుతున్నాయని, రాసుకున్న ప్రేమ సంగతి బైటపడుతుందేమోనని అమిత భయం." అందుకేనేమో నేను ప్రేమ సాహిత్యానికి దూరమయ్యాను.

నీవుండబట్టి, ఈ సాహితీ ప్రపంచమింత సుందరం, హృదయాకర్షమూనూ నాకు. చదివే నువ్వు లేకపోతే నాకు ఈ రాసే పనేమిటి? ఎవరికోసమో రాయడమేంటి? నీకోసం నువ్వు రాసుకోమని చెప్పే ఎంతోమందిని చూశాను. వారితో నాకు పనేమిటి? వీరెవరో నాకు తెలియదు. నేను వీరికర్థం కాను, నేనిట్లా యెందుకు వెతుకుతున్నానో ఊహించలేరు.

నేను నీ కోసం వెతుకుతున్నాను. నేను చదువుకున్న పుస్తకాల్లో నీ గురించి రాసారేమోనని చూశాను. గొప్ప రచయితలెవరైనా నీ జాడ తెలుపుతారేమోనని అడిగాను. నీవెక్కడైనా కనపడతావేమోనని మొహాలు వెతుకుతూ దేశమంతా తిరిగాను. ఎవరెవరినో అడిగాను నీ గురించి. నువ్వు లేవనే బాధకంటే భయం ఎక్కువైంది నాకు.

"Let us read, and let us dance; these two amusements will never do any harm to the world." అని చెప్పిన ఫ్రెంచి రచయిత వోల్టేర్ మాటలు మనం చదువుకున్నాం కదా. నువ్వు తిరిగొస్తే మనం మళ్లీ కలిసి చదువుకుందాం.

నువ్వు వస్తే మనం కాలువ గట్టుపైన చలిమంట వేసుకుందాం ఇద్దరం పలవల్లో, వట్టి గడ్డిమీద పడుకుందాం. సత్యవేణిని కలుద్దాం. మురళీకృష్ణతో కలిసి రావులపాలెం వంతెన మీదుగా ప్రయాణం చేసి హైదరాబాద్ వద్దాం. శ్వేతని కలుద్దాం. తనతో కలిసి పబ్‌కి వెళ్దాం. స్కూటీపై హైదరాబాద్ మొత్తం తిరుగుదాం. కృష్ణ ఎక్కడ ఉన్నాడో వెతుకుదాం. శ్వేతని కృష్ణకి పరిచయం చేద్దాం. ప్రేమంటే చెస్ గేమ్ కాదని వాళ్లకి చెప్దాం.

వస్తావా మరి?

వస్తే నీకు పాత డైరీలు చదివి వినిపిస్తాను. సీతాకోకచిలుకకు అన్ని రంగులు ఎలావచ్చాయో కథలు కథలుగా చెప్తాను. నల్ల అంటే తమిళంలో మంచి అని కొంత తమిళం నేర్పిస్తాను. అళగి అనే తమిళ్ అమ్మాయిని పరిచయం చేస్తాను. నీకు పామా అంటే ఏంటో చెప్తాను. వయసుమించినా ప్రేమ తగ్గదనే ఒక పెద్దాయన్ని పరిచయం చేస్తాను. మూవాన్ అంటే ఏంటో ఆ వయసు వాళ్లకి తెలియదుగా పాపం. ప్రేమించడం విడిపోవడం చాలా సాధారణం అనుకుని మూవాన్ అయిపోవాలనుకునే ఈ తరం వాళ్లని కూడా నీకు పరిచయం చేస్తాను. మూవాన్ అవడమంటే, తనలోనుంచి తనని పెకిలించుకుని – అడ్డొచ్చే జ్ఞాపకాల్ని చిత్తుగా తొక్కెయ్యలేక సతమతమయ్యే వాళ్లూ ఉన్నారిక్కడ. వాళ్లందరినీ నువ్వు కలవాలి.

మనం ఇంకా చాలామందిని కలవాలి. శరావతి బ్యాక్వాటర్స్‌కి వీకెండ్లో ట్రిప్‌కి వెళ్దాం. అక్కడ శరత్, ఉష ఇంకా చాలామందిని కలవొచ్చు. తిరిగొచ్చి యూనివర్శిటీలో రేఖ, జూలియా, సందీప్‌ని కలిపిస్తాను. వాళ్లతో మాట్లాడితే నీకన్నీ తెలిసిన అనుభూతులే అయినా మళ్లీ కొత్తగా ప్రేమలో పడడం ఎంత బావుంటుందో తెలుస్తుంది కదా!

ప్రేమంటే గుర్తొచ్చింది. నువ్వు రీనాని కలవాలి. మేఘని కలవాలి. నిలాని

కలవాలి. వీళ్లందరికీ ప్రేమని పరిచయం చేసిన జార్జ్ ఎవరో తెలుస్తాడు. కానీ జార్జ్ ఎవరో తెలుసుకోవాలంటే మనం శ్రీలంక వెళ్లాలి. కిలినోచ్చి, మాంగుళం, పులియంగుళం మీదుగా జాఫ్నా – కాండీ హైవేలో మనం ప్రయాణించాలి. అక్కడి వర్షంలో మనం తడిసిముద్దైపోతాం.

వర్షంలోనే కాదు ప్రేమలోకూడా తడిసిముద్దైపోవచ్చని నీకు తెలియాలంటే మళ్లీ మనం ఇండియా రావాలి. విజయనగరం జిల్లాకి వెళ్లాలి. అక్కడ రామిని కలవాలి. ఆమె మాటలు, వూసులు వినాలి. ఈ భూమి పుట్టిందీ, నీరు పారేదీ ఆమె కోసమూ, బైరి కోసమేనట. వాళ్ల తిరుగుల్లు, పెమానకాలు వినాలి నువ్వు.

ప్రేమంటే ఇంతేనా అని నువ్వాన్నావనుకో, మోహావేశాన్ని మాటల్లో చెప్పలేని ఒకమ్మాయిని పరిచయం చేస్తాను. దేహసౌఖ్యంలో దైవత్వాన్ని అనుభవించలేని వాళ్లని ప్రేమే కాదు, ఏ భావావేశమూ తాకలేదేమో! అని చెప్తే నిజమే కదా అనిపిస్తుంది.

నేను కూడా ఈ సారి నీకోసం కొత్త కొత్త కథలు రాస్తాను. నాకూ రాయడమంటే ఇష్టమే. కానీ పదాలు మనసులో ఉన్నంతవరకే ధైర్యంగా ఉంటాయి. కాగితం మీద రాసేటప్పటికి అవి పిరికిగా జర్రున జారిపోతున్నాయి, అర్థాలు కోల్పోతున్నాయి, నువ్వొస్తే నాకు ధైర్యమొస్తుంది. జారిపోయే నా పదాలకూ ధైర్యం నేర్పిస్తాను.

నన్ను నమ్ము. నిన్ను ప్రేమగా చూసుకుంటాను. ఎంత ప్రేమగా అంటే, కూతుర్నేమైనా అంటే వాడిని చంపేద్దామనుకునే తండ్రంతా ప్రేమగా నిన్ను చూసుకుంటాను.

న్యూ ఇయర్‌తో మొదలై, సంక్రాంతి, వేలంటైన్స్ డే, రంజాన్, దీపావళి, వినాయక చవితి, దసరా, క్రిస్మస్ వరకూ – ఇలా సంవత్సరం మొత్తం నిన్ను పండగలా చూసుకుంటాను. ఎన్నో ప్రదేశాలు తిప్పుతాను. ఎండాకాలపు వేడిలో, వర్షాకాలపు తడిలో, సీతాకాలపు చలిలో – అన్ని కాలాల్లో నీ కోసం ఒక కథనై నీ తోడుంటాను.

నువ్వు మళ్లీ నా కోసం వస్తావు కదూ!

పాఠకుని అన్వేషణలో
ప్రేమకథ

✦✦✦



# నాగేంద్ర కాశి

పుట్టింది గోదావరి ప్రాంతం కోనసీమలో. ఇంజినీరింగ్ చేసి ప్రస్తుతం ఒక ఏరోస్పేస్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. పదిలోపు కథలు రాశాను. ప్రస్తుతం రెండు సినిమాలకి రచయితగా పని చేస్తున్నాను. బహుశా రాయకుండా ఉండలేకపోవడం వల్లే కథలు రాస్తున్నానేమో అనిపిస్తుంది. ఈ రాతపని లేకపోతే పెద్ద వాక్యూమ్ ఉండేదేమో. జీవితంలో కులం, మతం, డబ్బు – సాధారణంగా ఈ మూడూ కారణాలే చాలా ప్రేమకథల్ని చంపేస్తాయి. ఈ మూడూ కాకుండా, అసాధారణంగా నా కంటికి కనిపించిన ఇంకో కారణం ఈ ప్రేమకథని రాయించింది.

“ దాన్ని నేను ఎప్పటికీ సెక్స్ అనలేను. ప్రేమించిన మనిషి దూరమైపోయి ఒక్కసారి కనబడితే ఆ ఉండలేనితనాన్ని, చెప్పలేని బెంగని, మాటలు చెప్పలేని మాటల్ని శరీరంతో పలికించడం. ”



# సత్యవేణి

"ఏంటి... సంక్రాంతికి లీవ్ అప్రూవ్ చేశాడా?"

మేనేజర్ కేబిన్ నుంచి వచ్చిన చందనని అడిగింది కొలీగ్.

"ఎస్స్..." అని నవ్వి సీట్లో కూర్చుని పక్కనున్న కృష్ణని చూసింది.

మాసిన గెడ్డం. గాలికి వదిలేసిన పెరిగిన జుట్టు. సిగరెట్లు తాగడంతో నల్లగా మారిన పెదాలు. రాత్రి మందు తాగడం వల్ల ఎర్రగా మారిన కళ్ళు, కళ్ళ కింద నల్ల జీరలు. ఎప్పటి లాగే హెడ్ ఫోన్స్ పెట్టుకుని సీరియస్‌గా పని చేసుకుంటున్నాడు.

డెస్క్ మీద కొట్టింది.

హెడ్ ఫోన్స్ తీసి, సిగరెట్టా అని చేత్తో సైగ చేసి అడిగాడు. తలూపింది. ఆమెకి ఎప్పుడైనా సిగరెట్ తాగాలంటే కృష్ణతో వెళుతుంది.

అమ్మాయి – సిగరెట్ అని మోరల్ లెక్చర్ పీకడని. అమ్మాయి సిగరెట్ తాగుతుంటే ఆత్రుతగా ఏవేవో ఊహించుకునే మగాళ్లలా చూడడని. ట్రావెలింగ్ గురించి ఎక్కువగా చెప్తాడని.

ఇద్దరూ ఆఫీస్ బయట ఉన్న చిన్న షెడ్డు దగ్గర కొచ్చారు. లైట్స్ తీసి తానొకటి వెలిగించి ఆమెకొకటి ఇచ్చాడు.

"పండక్కి లాంగ్ వీకెండ్ కదా! ఇంటికి వెళ్ళడం లేదా?" అడిగింది.

లేదన్నట్టు తలూపాడు కృష్ణ.

"పోనీ నాతో వస్తావా? రెండు రోజులు ఉండి వెంటనే వచ్చేద్దాం. నీ కార్‌లో వెళదాం," అంది.

రాను అన్నట్టు పొగ వదులుతూ తల అడ్డం గా ఊపాడు.  దేనికీ సమాధానం చెప్పలేదు. ఆరు నెలల్లో ఏ రోజూ కూడా.

మాట్లాడకపోయినా అతని దగ్గరి కొచ్చే ఒకే ఒక అమ్మాయ్ చందన. ఆమెను చూస్తే ఎందుకో గతం గుర్తుకొస్తుంది. కానీ గతం ఊబిలోకి జారనివ్వకుండా తన చేతిని పట్టుకుని, తనలోని శూన్యాన్ని మాటలతో, ప్రశ్నలతో, యేవో ఊసులతో చెల్లాచెదురు చేస్తుందని అతనికి ఇష్టం.

"నిన్ను చూస్తుంటే భయంగా ఉంది కృష్ణా. నేను నీ ఫ్రెండ్ అన్నావ్? నీ కంపెనీ బావుంటుంది అన్నావ్! అవన్నీ మందు తాగినప్పుడు మాటలేనా అయితే. సరే."

ఏం మాట్లాడకుండా సిగరెట్ తాగుతున్నాడు.

చందన సిగరెట్ పడేసి, లెమన్ టీ చెప్పింది.

"మీదే వూరు," అడిగాడు.

"వైజాగ్"

"నాతో ఎందుకు బోర్. హాయిగా ఫ్లైట్‌లో వెళ్లచ్చుగా!"

"వైజాగ్ అయితే ఫ్లైట్‌లోనే వెళ్లేదాన్ని. డాడీ మమ్మీ యూఎస్ వెళ్లారు. మా బాబాయ్ ఇంటికెళ్ళాలి. మా కజిన్‌ని చూసి రావాలి." అంది.

"ఎక్కడ?"

"సిరిపల్లె. అమలాపురం దగ్గర," అని ఏదో చెప్తోంది.

కృష్ణకి గొంతు లోపలి గాలి ఆగిపోయినట్టు అనిపించింది.

"టీ తాగి, పోదామా," అంది, డబ్బులిస్తూ...

"నువ్వు పద "అన్నాడు. చందన వెళ్ళిపోయింది.

షెడ్ వెనక్కు వెళ్ళి చిన్న రాయి మీద కూర్చుని, సిగరెట్ వెలిగించాడు. కన్నీళ్లతో మొహం తడిసిపోయింది. నలుగురిలో నవ్వడానికున్న వెసులుబాటు ఏడవడానికి ఉండదని మానేశాడు. మెదడు మొద్దు బారిపోయింది. ఎన్నాళ్లైపోయింది ఇంటికెళ్లి? సత్యవేణి ఎలా ఉంది? వాళ్ళాయన్ని పిల్లల్నేసుకుని పండక్కి ఇంటికొస్తుందా? నన్ను చూస్తే?

సత్యవేణిని మర్చిపోయుంటే అతను ఈ పాటికి చచ్చిపోయుండేవాడు.

ఎలాగైనా సత్యవేణిని చూడాలనిపించింది. ఒక్కక్షణం కూడా ఉండాలని పించలేదు.

లోపలికొచ్చాడు.

చందన డెస్క్ దగ్గరకొచ్చి – "నేనూ వస్తాను. సాయంత్రం బయలుదేరదాం" అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ.

ఆరు సంవత్సరాలైంది అతను ఊరెళ్ళి. ఊరు మర్చిపోడానికి చాలా ఊళ్లు తిరిగాడు.

గతంనుంచి పారిపోడానికి చాలా ప్రయత్నాలు చేశాడు. అదే గతం మళ్ళీ అతన్ని లాక్కెళుతోంది.

కారు ఎల్బీనగర్ దాటింది.

తన లోపలా, కారు లోనూ నిశ్శబ్దం.

చందన పక్కన కూర్చుంది. ఎఫ్ ఎమ్ పెట్టింది, కొత్త పాటొస్తోంది.

"ఆహా... లాంగ్ డ్రైవ్... అదీ నీతో... వైన్ కొనిస్తావా నాకు?" అంది నవ్వుతూ.

చిన్నగా నవ్వి మాట్లాడకుండా కార్ స్పీడ్ పెంచాడు.

"మాట్లాడు. ఎందుకలా ఉంటావ్ కృష్ణ? ఎప్పుడు అడిగినా చెప్పవ్? ఎవరా అమ్మాయ్? ప్లీజ్ చెప్పవా?" అంది బతిమాలుతూ.

"వింటావా?" అన్నాడు డ్రైవ్ చేస్తూ.

ఎఫ్ ఎమ్ స్విచ్చాఫ్ చేసింది.

"నేను మధ్యలో ఏడిస్తే నవ్వుకోకు. ఆగిపోతే అడగకు. నేనెంత చెప్పగలనో అంతే చెప్తాను."

నిశ్శబ్దం. చెట్టుకింద రాలిపోయిన పళ్ళు ఏరుకుంటున్నట్టు, గతంలో క్షణాల్ని ఏరుకుంటున్నాడు.

కారు హైవే మీద దూసుకు పోతోంది.

“సత్యవేణి”

“ఏం పేరు” అని అడిగింది మళ్ళీ.

“సత్యవేణి.

ఆ అమ్మాయ్ నాకు చిన్నప్పటి నుంచి తెలుసు. హైస్కూల్ నుంచి మాత్రం కొత్తగా తెలుసు.

వాళ్ళ ఇంటికి మా ఇంటికి పంట కాలవ అడ్డు. దానికంటే పెద్ద అడ్డు కులం. కాలవ దిగువన మా ఇళ్ళు. ఎగువున వాళ్ళ ఇళ్ళు.

వర్షాకాలంలో సరదాగా కాలవ దగ్గర చేపలు పట్టుకునేటప్పుడు గుమ్మం మీద కూర్చుని చూసేది. ఆ వాన నీటిలో కాళ్ళు ఒరిసిపోయేలా నిలబడి పోయేవాణ్ణి చూడ్డానికి.

శీతాకాలం కాలవ గట్టుపైన చలిమంట దగ్గర కూర్చుని, నుయ్యి దగ్గర నీళ్లు తోడుకెళ్తూ, బిందె నడుం మీద పెట్టుకుని ఎప్పుడెప్పుడు వెళ్తుందా అని బట్టలన్నీ ఆ మంట దగ్గర పొగతో నల్లగా అయిపోయేవరకూ, వికారం వచ్చిపడిపోయేవరకూ ఉండి పోయేవాడిని.

ఎండాకాలం కాలవ రేవు లోంచి మడత మంచం మీద కూర్చుని మల్లెపూలు కట్టుకొనే సత్యవేణిని చూడ్డానికి వాళ్ళ ఇంటి పక్కనే ఉన్న కొబ్బరికాయల గుట్టలో నా రెండు కళ్ళు పడేసేవాడిని.

నాకు వానా కాలం, ఎండా కాలం, శీతాకాలం అలాగే తెలుసు. ఆ అమ్మాయితోనే గుర్తు.

ఇండియార్ సబ్బార్ ఆడుతున్నప్పుడు వాళ్ళింటి వెనకాలున్న గడ్డిమేటు దగ్గరే ఎప్పుడూ దొరికి పోయేవాడిని. కేవలం అక్కడ దొరికి పోడానికే ఆడేవాడిని.

తొమ్మిదో తరగతి.

ఆ రోజు రామాలయం దగ్గర తెర సినిమా నాకోసమే వేశారనిపించింది. వంకాయ రంగు పట్టు లంగా, గులాబీ రంగు జాకెట్. తల్లో కనకాంబరాలతో వచ్చింది, పన్ను మీద పన్నుతో సత్యవేణి నవ్వుతుంటే చీకట్లో ఆ తెర మీద బొమ్మకంటే వెలుగ్గా కనిపించింది ఆ మొహం.

వెనక్కి చూసింది. యేవో పొడి పొడి మాటలు తప్ప మాట్లాడుకున్నది లేదు.

రెండు సార్లు వెనక్కి చూసింది. బలం వచ్చింది.

మూడోసారి చూస్తే ఆమె వెనకాలే ఉండాలని చేసిన ఆ పది అడుగుల ప్రయాణం... జీవితంలో గొప్ప ప్రయాణం.

వెనక్కి చూసింది. దగ్గరగానే ఉన్నాను. అమ్మాయికి చెమటలు పట్టేశాయ్. నా వీపంతా తడిసిపోయి చొక్కా వీపుకి అంటుకుపోయింది.

నీతో మాట్లాడాలి అన్నాను.

ఏంటి? ఇక్కడే మాట్లాడు అంది కంగారు బయటపెట్టి, భయాన్ని దాచిపెట్టి.

ఏం మాట్లాడతాం?

నాకు తెలియదు. భయమేసి పక్క తోటలోకి పారిపోయి చీకట్లో నిలబడి పోయాను.

సత్యవేణి వస్తుందని నమ్మకం.

అంత గట్టిగా ఎప్పుడూ దేవుణ్ణి కూడా నమ్మలేదు.

అరగంట తర్వాత వచ్చింది, ఫ్రెండ్‌ని కాపలాగా పెట్టుకుని.

మొదటిసారి దేవుడున్నాడనిపించింది.

ఎదురుగా అమ్మాయ్. ఏం మాట్లాడానో  గుర్తు లేదు కానీ చీకట్లో తన చేతినీ, గాజుల్ని పట్టుకున్నా. అరచేతుల్లో చెమట. అంతకంటే ఎక్స్‌ప్రెషన్ తెలీలేదు నాకు. ఆ ధైర్యం ఎలాగొచ్చిందో కూడా తెలీదు.

అది నా ఫస్ట్ లవ్ లెటర్.

సత్యవేణి పారిపోయింది.

తొమ్మిదో తరగతిని మొత్తం ఆ ఒక్క సంఘటన నడిపించింది.

పదో తరగతి.

సంక్రాంతి ప్రభల తీర్థం రోజు.

ముద్దు పెట్టుకునే క్షణం కంటే ముందు ఆ పదినిమిషాల మౌనంలో ఇద్దరూ మాట్లాడుకునే మాటలు ఉంటాయి చూడు. అవే గొప్ప మాటలు. అది memorable for ever. నాకింకా అదే గుర్తుంది. ఆమె పెదాల వగరు, పెదాల మీద చిరు చెమట. ఆ ఊపిరి వాసనా. తర్వాత రెండ్రోజులు నాకు కనిపించలేదు. చీకట్లో ఇద్దరం ఒకటే అని రూఢి అయినాక మర్నాడు వెలుగులో ఇద్దరూ చూసుకునే moment కోసం ఎదురుచూడడం ఉంటుంది చూడు అదీ ఎదురు చూడడం.

ఆ చూపే గుర్తుండి పోతుంది. ఆలా చూడడానికి చాలా ప్రయత్నాలే చేశా ఆ రోజు. చివరికి సాయంత్రం బయటికి వచ్చింది. కాలవ ఒడ్డున మందారం చెట్టు దగ్గర నుంచుంది. దగ్గరికెళ్ళాను.

పెద్ద లారీ సౌండ్ వినపడింది.

'ఏయ్...', అని చందన కేక పెట్టింది.

రాంగ్ రూట్‌లో వస్తున్న లారీ పక్కనుంచి వెళ్ళిపోయింది.

కృష్ణ ఏంకాదన్నట్టు డ్రైవ్ చేస్తూ

'వాళ్ళ నాన్న చూశాడు' అన్నాడు.

లారీ గురించి మర్చిపోయి "ఏమైంది?" అని అడిగింది.

కాలవ దగ్గర చిన్న గొడవ. రెండు నెలలు మాటలు లేవు. ఆ అమ్మాయిని తిట్టాడు. నన్ను కొట్టడానికి కొచ్చాడు. భయమేసింది. రెండు నెలలు సరిగ్గా ఆ గుమ్మం వైపు చూడలేదు. స్కూల్‌లో మాట్లాడ్డానికి భయం. వెనకాల వెళ్ళడానికి భయం.

వాళ్ళింట్లో పాలు కొనుక్కునే సత్తెమ్మ ఇత్తడి చెంబులో ఉత్తరాలు నడిచాయి.

'సూర్యాపేట. సిగరెట్ బ్రేక్' అని కారు పక్కకి ఆపుతూ అన్నాడు.

ఇద్దరూ దిగి టీ తాగారు. చందన ఏం మాట్లాడ్డం లేదు.

కొంచెం సేపటికి కారు రోడ్డెక్కింది."తరవాత" అంది. చెప్పడం మొదలుపెట్టాడు.

"చూడడం, మాట్లాడడం దాటి రోజూ కలవాలని, తనని ముట్టుకోవాలని కంగారు పడకుండా ముందు కంటే బాగా ముద్దు పెట్టాలని, ముందు కంటే బాగా తన చేతి వేళ్ళు నిమరాలనీ, ముందు కంటే బాగా తన పొడుగు జడతో ఆడుకోవాలని అనిపించడం

మొదలైంది. ఆ అనిపించడం గోడలు దూకడం, రేగుపళ్ల కంపల్లోనుంచి నడవడం, రాత్రిళ్లు తోటల్లో నక్కి కూర్చోవడం నేర్పింది.

ఎందుకో సత్యవేణితో మాట్లాడకపోతే చచ్చిపోతాననిపించింది ఆ రోజు. వెళ్లాను. సత్యవేణిది వసారా పక్కగది. కిటికీ తలుపు తోస్తే వాళ్ల నాన్న చూసేశాడు.

ఈసారి ఇంకొంచెం పెద్ద పంచాయితీ. సత్యవేణి నాన్న నానా బూతులు తిట్టాడు.

ఎందుకెళ్లావ్ అని అడిగారు.

నాకు మాట రాలేదు.

కేకలేశారు. కేకల్లో కులం వచ్చింది.

కులం తక్కువ కొడుకులు అన్నాడు, ఎంగిలి మెతుకులు తినే ఏబ్రాసులమన్నారు. నేను బాధపడింది ఆ మాటలకి కాదు. మా నాన్న నా తరుపున ఆ మాటల్ని కాస్తున్నందుకు బాధేసింది.

కులం గురించి పదే పదే మాట్లాడుతుంటే, బాగర్తమ్మ విషయం లేపాడు మా మాయ్య.

బాగర్తమ్మ సత్యవేణి వాళ్ల ఇంట్లోనే పనిచేసేది. కొన్నాళ్లకి ఇంటినుంచి తోటలో పాక దగ్గరికి మార్చాడు వాళ్ల నాన్న. ఆవిడకి మొగుడ్ని దూరం చేశాడు. ఇది తెలిసి పిల్లలు దూరం అయిపోయారు. బాగర్తమ్మ మొగుడు దింపులు తీసేవాడు. వీళ్ల తోటలో ఓ రోజు పెద్ద చెట్టెక్కి, కింద బాగర్తమ్మతో పరాచికాలు ఆడుతున్న అతన్ని చూసి చెట్టు మీద నుంచి మోకుతోనే గింగరాలు తిరుగుతూ పడిపోతే ముక్కు మొహం కొట్టుకుపోయాయ్. వెన్నుపూస దెబ్బతింది. మంచం పట్టాడు.

తర్వాత బాగర్తమ్మ మరి మనిషవ్వలేదు.

మీ చేల్లో, తోటల్లో పనిచేసే ఆడది పడుకోడానికి కావాలి. అప్పుడు నీకు కులం గుర్తురాలేదా అని అడిగారు.

వాళ్లందరూ ఒక్కసారి చల్లబడి పోయారు.

ఎందుకంటే అక్కడున్న పది మందిలో ఆరుగురికి ఈ దెబ్బ తగిలింది.

చివరికి మా నాన్న తప్పొప్పుకోవడంతో ఆ గొడవ అలా సద్దుమణిగింది.

తర్వాత చాలా రోజులు కలవలేదు.

'ఒక్క ముద్దుకే మోజు తీరిందా' 'కాలేజీలో ఎవరన్నా తగిలారా?' లాంటి ఉత్తరాలు సత్తెమ్మ చెంబులోనుంచి మా ఇంటికి వస్తున్నాయ్. నాన్నని నలుగురిలో నిలబెట్టడం గుర్తొచ్చి ఆగిపోయేవాడ్ని.

తనది ఉమెన్స్ కాలేజ్. కానీ ఒకే బస్సు ఎక్కి వెళ్ళేవాళ్ళం. బస్‌పాస్ తీసుకునే రోజు నాకు పండగ రోజు. అందరూ అదే డిపో దగ్గరికి వచ్చి తీసుకునేవారు. త్వరగా పాస్ తీసుకుని, సినిమాకి వెళ్లేవాళ్లం ఫ్రెండ్స్‌తో. రెండున్నర గంటలు తన చేతిలో నా చేయి ఉండేది. రెండున్నర గంటలు నా మాటలు తన చెవి దగ్గర మోగేవి. ఇప్పుడు పెద్దోళ్ళు చెప్తారు చూడు మా టైంలో ఒక అణా ఇప్పుడు వందకో ఎంతకో సమానం, దానికి ఇన్నొచ్చేవి, అన్నొచ్చేవి అని అలా నాకు ఆ రెండున్నర గంటల్లో చాలా వచ్చేవి. ఆ రెండున్నర గంటలూ ఇపుడు రెండు వారాలకో, రెండు నెలలకో సమానం.

ఆ సినిమాల పేర్లు గుర్తున్నాయ్ గాని సినిమాలేవీ గుర్తులేదు.

కొన్నాళ్ళకి సత్తెమ్మ చచ్చి పోయింది. పాల చెంబు ఉత్తరాలు ఆగిపోయాయ్.

డిగ్రీ కోసం వేరే చోటికి పోతున్న రోజు.

నేను తనకి చెప్పలేదు. చెప్తే ఏడుస్తుందని.

ఎలా తెలిసిందో, పరిగెత్తుకుని రేవు దగ్గరికి వచ్చింది.

మొదటిసారి నేను తన కళ్ళ నీళ్లు చూశాను. పది అడుగుల కాలవ, కొంచెం గట్టిగా మాట్లాడితే వినిపిస్తుంది. కానీ మాట్లాడలేని పరిస్థితి.

వెనకాల వాళ్ల నాన్న కొబ్బరి చిక్కంలో కాయలేసుకుని నా వైపు చూస్తూ పోతున్నాడు. ఇంటికెళ్లి రెండు కేకలేస్తే సత్యవేణి వెళ్లి పోయింది.

ఊరి దాటిపోతున్న బస్సు వెనక్కి పోతే బాగుణ్ణు అనిపించింది.

వేరే ఊరు వెళ్లినా, కొత్త ఫ్రెండ్స్ పరిచయం అయినా తన ను మర్చిపోలేక పోయేవాడిని. గుర్తొస్తే ఎంతమందిలో ఉన్నా ఆ జ్ఞాపకం లాక్కెళ్లి పోయేది. ఇంటి దగ్గర ఫ్రెండ్స్‌ని అడిగితే ఎవరూ సత్యవేణి ఇంటికెళ్లే సాహసం చేయలేకపోయేవారు, వాళ్ల నాన్న మూర్ఖత్వం తెలిసి.

గట్టిగా రెండు నెలలు ఓపిక పట్టాను. సెలవలు వచ్చాయ్.

ఆ రోజు ఇంటికెళ్లేటప్పటికి అర్ధరాత్రి అయింది. సత్యవేణి ఇంటి ముందు కొబ్బరికాయల గుట్టలు, దాని మీద కొబ్బరాకులు పేర్చి ఉన్నాయ్. కాపలాగా రెండు బల్బులు వెలుగుతున్నాయి. బ్యాగ్ పడేసి కాలవ అవతలికి పోదామనిపించింది. పోయాను. కొబ్బరి గుట్ట కింద రెండు వీధి కుక్కలు పడుకున్నాయ్. అలవాటైన కుక్కలు. మొరగలేదు.

వెనక వసారా నుంచి వెళ్లి, సత్యవేణి గది కిటికీ తోశాను.

తరవాత అని అడిగింది చందన ఉండబట్టలేక.

"విజయవాడ వచ్చేశాం. ఆకలేస్తుంది, ఏదన్నా తిందాం," అని కారు పక్కన ఒక హోటల్ దగ్గర కారు ఆపాడు.

'మధ్యలో ఆపకు. చెప్పు' అంది బతిమాలుతున్నట్టు.

'ఆ రోజే చివరి రోజు. మళ్లీ తననెప్పుడూ కలవలేదు' అని దిగి డోర్ వేశాడు.

ఏడుపొచ్చింది. సిగరెట్ వెలిగించాడు. కాల్చిన తర్వాత ఏమీ తినాలనిపించలేదు అతనికి.

నిజంగా ఆరోజేనా తనని చివరిసారి కలిసింది అనుకున్నాడు.

కాలం అతని గాయానికి మందులా పనిచేస్తున్నా గాని, లోపల పచ్చిపుండు అతన్ని తినేస్తూ ఉంది.

వెనకే వచ్చి నుంచుంది చందన.

"ఏంటి, ఏడుస్తున్నావా" అంది కృష్ణని చూసి.

మొహం పక్కకి తిప్పుకున్నాడు.

అతని మొహం చూసే ప్రయత్నం చేయలేదు తను.

పక్కనే ఉన్న వైన్ షాప్‌కి వెళ్లి రెండు బీర్లు తీసుకొచ్చి, కారు తాళాలు ఆమెకిచ్చి, కార్లో కూర్చుని గట గటా తాగాడు.

ఎంత బీరు నీళ్లు లోపలికెళ్తుంటే, అన్ని నీళ్లు కళ్ల వెంబడి బయటికి వచ్చేస్తున్నాయ్.

చందన ఏం మాట్లాడలేదు.

ఏలూరు రోడ్డు మీద కారు వెళ్తోంది. కాలువలో అరటి డిప్పల మీద కార్తిక దీపాలు వెలుగుతున్నాయి.

ఇంక అతనికి ఏం చెప్పాలనిపించలేదు.

'సత్యవేణి లేచిందా?' మెల్లిగా అడిగింది.

కారు విండో కిందకి దించాడు. చల్లగాలి. ఒక సీసా అయిపోయింది, రెండో బీరు తాగుతూ.

"నాకోసమే చూస్తున్నట్టు, కిటికీ లోనుంచి కొబ్బరాకు పెట్టి లేపగానే లేచి కూర్చుంది.

పట్టీలు తీసి పక్కన పెట్టింది. గాజులు తీసి బల్ల మీద పెట్టి వెనకాల ఉన్న చింత చెట్టు కిందకి వచ్చింది.

నన్ను అమాంతం గట్టిగా పట్టుకుని, ఏడుపు వినిపించకుండా చాలాసేపు ఏడ్చింది.

నా షర్ట్ మొత్తం తడిసిపోయింది. ఏం మాట్లాడలేక పోయాను తనతో ఏడవడం తప్ప.

ఇంకా లోపలి తోటల్లోకి వెళ్ళిపోదాం అంది.

చీకటికి భయపడలేదు కానీ, మనుషులకి భయపడి బాడవ దాటి, అరటితోటల్లోకి వెళ్లిపోయాం.

చిన్న పాక. కొబ్బరాకుల బనిపె వేసుంది. గేదెల ముందు పలవల్లో వట్టి గడ్డి వేసుంది. గేదెలకు దోమలు కుట్టకుండా వెలిగించిన సైకిల్ టైర్, ప్లాస్టిక్ కంపు కొడుతూ వెలుగుతూ ఉంది.

ఇద్దరం పలవల్లో, వట్టి గడ్డి మీద పడుకున్నాం. గాలి కిందకి రాకుండా ముచ్చెట్ల మీద నుంచే పోతోంది.

'నన్నొదిలేసి పోయావ్' అంది గట్టిగా ముద్దు పెడుతూ.

'ఉండలేకే వచ్చేశాను' అన్నాను.

తర్వాత మా మధ్య మాట లేదు. నా మీద చుట్టూ చెయ్యి గట్టిగా వేసి పట్టుకుంది. వొణుకుతుంది. శ్వాశ ఎగ పీలుస్తోంది.

దాన్ని నేను ఎప్పటికీ సెక్స్ అనలేను. ప్రేమించిన మనిషి దూరమైపోయి ఒక్కసారి కనబడితే ఆ ఉండలేనితనాన్ని చెప్పలేని బెంగని, మాటలు చెప్పలేని మాటల్ని శరీరంతో పలికించడం.

నాకెందుకో that's the true lauguage అనిపిస్తుంది.

వట్టి గడ్డి మీద అలసిపోయి పడుకున్నాం చాలాసేపు. తను నా గుండెల మీదే ఉండిపోయింది. చాలా సేపటి తర్వాత ఈ లోకం మాట్లాడుకునే మాటల్లోకి వచ్చాం.

కానీ ఆ రోజు మాకిద్దరికీ తెలీదు అవే చివరి మాటలని.

ఒక సంవత్సరం ఆగమన్నాను.

తను ఓపిక పడతానంది.

తెల్ల వారుతుండగా, నేను చేల మధ్యలోనుంచి ఇంటికెళ్లి పోయాను.

తర్వాత రోజంతా తన వాసనే ఒళ్ళంతా. సత్యవేణి రెండు చేతుల్లోనూ ఉన్నట్టు అనిపించేది.

దేన్నో గెలిచినట్టు, ఏదో సొంతమై నాది అన్నట్టు.

తను బయటకు రాలేదు ఆ రోజంతా.

సాయింత్రం పూట, ఆరెంపీ పంతులుగారు వాళ్లింటికి వెళ్లడం చూశాను. సత్యవేణికి జ్వరం అని తెలిసి నవ్వుకున్నాను.

చందన నవ్వింది.

డిగ్రీ ఫైనల్ ఇయర్.

ఒకరోజు ఇంటి దగ్గరి నుంచి ఫోన్.

కాలవ దిగి వస్తుంటే ఎప్పుడూ ఎదురొచ్చే నాన్న, ఇంటి బయట వాకిట్లో పడున్నాడు. కదలకుండా రెండు కాళ్ల బొటన వేళ్లకి పురికొస కట్టారు. పక్కన తాటి నారతో పాడె కడుతున్నారు. చిన్న కేక పెడితే విలవిల లాడిపోయే నాన్న, నేను భోరుమని ఏడుస్తుంటే అసలు కదల్లేదు. నీకు నాకు అయిపోయింది ఇంకన్నట్టు కనీసం చూడలేదు. కళ్లు తిరిగి అక్కడే పడిపోతే కనీసం లేపకుండా వెళ్ళిపోయాడు.

అమ్మది చిన్న వయసు. తెల్ల చీర చుట్టి కూర్చోబెట్టారు. చూడ్డానికే భయం వేసింది. నేను దగ్గరికి వెళ్లలేదు. బుర్రంతా ఖాళీ అయిపోయింది. నాతో తీసుకు పోదాం అనుకుని రమ్మని అడిగాను. ఇల్లొదిలి రానంది. ఏదైనా ఉద్యోగం వచ్చాక తీసుకు పోదామనుకున్నా.

నేనొక్కడినే వెళ్ళిపోయాను. డిగ్రీ ఫైనల్ ఇయర్ అది. వారానికి ఒకసారి ఊళ్లోకి వచ్చినప్పుడు ఎస్టీడీ బూత్‌లో నుంచి నేను అద్దెకుండే ఇంటి ఓనర్‌కి ఫోన్ చేసేది సత్యవేణి. ఆ నెంబర్ నాకింకా గుర్తే.

అలాగే ఒకరోజు సత్యవేణి నుంచి ఫోనొచ్చింది. ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తున్నారని, వాళ్ళ నాన్న చచ్చినా పెళ్ళికి ఒప్పుకునేలా లేడని. అన్నవరం పారిపోయి పెళ్లి చేసుకుందాం అని ఇద్దరం గట్టిగా నిర్ణయించుకున్నాం. కోటిపల్లి రేవు దగ్గర రేవు దాటి, అనపర్తి దగ్గర రైలెక్కి అన్నవరం పోదామని అనుకున్నాం. ఆ గుడికే ఎందుకు వెళ్దామనుకున్నామో తెలియదు. సాక్ష్యం కోసం కాకపోయినా సాయం కోసం ఊళ్ళో ఇద్దరి ఫ్రెండ్స్‌ని రెడీగా ఉండమని చెప్పి ఊరు బయల్దేరాను.

నా ఫ్రెండ్స్ వాళ్ళ ఫ్రెండ్స్‌కి చెప్పినట్టున్నారు నేను వెళ్ళేటప్పటికి, సత్యవేణిని వేరే చుట్టాలింటికి తీసుకుపోయారని తెలిసింది.

ఫ్రెండ్స్‌ని వేసుకుని చాలా చోట్ల తిరిగాను.

వైజాగ్ హాస్పిటల్‌లో ఉందని ఎవరో చెప్తే వెళ్ళాను.

“ఎక్కడా?” అనడిగింది.

“గాజువాక దగ్గర ఒక ప్రైవేట్ హాస్పిటల్. సత్యవేణి అన్న వరసయ్యే అతను కనిపించాడు. అక్కడే ఉందనుకుని వెయిట్ చేశాను. వాళ్ళ నాన్న కనిపించాడు. ఇంకా చాలామంది ఉన్నారు.

బయట సిగరెట్ తాగడానికొచ్చిన ఒక కాంపౌండర్‌ని అడిగితే సూసైడ్ కేసు, ఇప్పుడు బాగానే ఉంది అన్నాడు.

ఏం చేయడానికి అవకాశం లేదక్కడ.

బాగానే ఉందన్న చిన్న ఆనందంతో బస్టాండ్ కొచ్చాను. అంతే మళ్ళీ ఇంకెప్పుడూ చూళ్ళేదు సత్యవేణిని “అన్నాడు బీర్ గుటకేస్తూ.

“ఎందుకు” అనడిగింది.

“నేను ఇక్కడివరకే చెప్పగలను. ఇంతకు మించి నా వల్ల కాదు.”

ప్రపంచంలో ఇంకెవ్వరు అడిగినా అతను ఇంతకు మించి చెప్పడు. అది అక్కడితో ఆగిపోవాలి.

సీట్ రెక్లయిన్ బటన్ నొక్కి వెనక్కి వాలాడు. చందన డ్రైవ్ చేస్తోంది.

అతనికి ఆ రోజు జరిగింది గుర్తొచ్చింది.

గాజువాక బస్టాండ్ దగ్గర నిల్చుంటే, వెనకనుంచి సత్యవేణి నాన్న వచ్చాడు.

అతని భుజం మీద చెయ్యేశాడు.

నువ్వంటే నాకేదో కోపం అనుకున్నావేమో, ససే అలాటిదేమీ లేదురా అబ్బిగా. కానీ ఓ విషయం సెప్తే ఆలోసించుకుంటావని తోసింది.

ఇప్పుడింక సెప్పేయాలి మరి.

మరి మీ నాన్న సచ్చిపోయిన తర్వాత...

ఆపాడు.

మీ అమ్మదా పాపం సిన్న వయసు. వరస కుదరదేమో, అలా కానీయ్ మరి అనేసి వెళ్ళిపోయాడు.

ఇనప ముళ్ళ కంప నెత్తి మీద పెట్టి దిగేసినట్టు అనిపించింది. నిజం తెల్సుకుందామన్న ధైర్యం లేదు. నిజం తెలుసుకుంటే అది నిజం అని తెలిస్తే...

వాళ్ళమ్మ మీద ఏమాత్రం కోపం రాలేదు. గౌరవమూ పోలేదు. ఫోన్ చేసి వాళ్ళమ్మతో మాట్లాడి, ఉద్యోగం వచ్చిందని అబద్ధం చెప్పి ఊళ్లు పోయాడు. పూణే, ముంబై, చెన్నై, బెంగుళూరు. ఊర్లో ఎవ్వరితోనూ కాంటాక్ట్ లేదు. ఒక వాట్సాప్ గాని, ఫేస్బుక్ గాని మెయింటెయిన్ చేయలేదు. తాగుడు అలవాటైంది. తాగి రోడ్డు మీద పడి పోతే ఎవరో ఒకరు తన రూమ్‌కి తీసుకొచ్చిన సందర్భాలు బోలెడు ఉన్నాయి. కానీ ఎందుకో బతికే ఉన్నాడతను.

“కారాపు” అన్నాడు పైకి లేస్తూ.

కారు రావులపాలెం వంతెన మీద ఆగింది. సిగరెట్ వెలిగించాడు. చుట్టూ మంచు గోదారి నీళ్ల లాగ. తెల్లటి ఆ మంచులో ఎర్రగా వెలుగుతోంది అతని సిగరెట్, పొగ కనిపించకుండా.

సిగరెట్ ఆరిపోయింది.

కారెక్కాడు.

"గాజువాకలో ఏమైందో నేను చెప్పనా" అంది చందన.

ఆశ్చర్యంగా చూసాడు ఆమె వైపు.

"సత్యవేణి మా ఇంట్లోనే వుంది కొన్నాళ్ళు. సత్యవేణి నా కజిన్. నీ పేరు మురళీ కృష్ణ కదా. సత్యవేణి నిన్ను మురళి అని పిలిచేది."

పక్కకు తిరిగి ఆమె వైపే చూస్తున్నాడు.

"సత్యవేణి చచ్చిపోవాలనుకోవడానికి కారణం ఇప్పుడు నువ్వు దాచిపెట్టిన కారణమే.

సైలెంట్‌గా ఉండేది. ఏం మాట్లాడేది కాదు, తినేది కాదు. కొన్నాళ్ల తర్వాత నాతో మాట్లాడడం మొదలు పెట్టింది.

మురళి అని నీ గురించి నువ్వు చెప్పిన డీటెయిల్స్ కంటే ఎక్కువ చెప్పేది. ఒక్కోసారి పిచ్చి లేచినట్టు అరిచేది. చుట్టు పక్కల వాళ్ళు అడగడం మొదలు పెట్టారు. మా డాడీ సిరిపల్లె తీసుకు పొమ్మని చెప్పాడు. ఆ మాట తర్వాత మా కుటుంబాలు దూరమై పోయాయి.

సత్యవేణిని సిరిపల్లె ఇంటికి తీసుకొచ్చారు. రాత్రి టైంలో కేకలేస్తూ ఉండేదట. తన కూతుర్ని ఎక్కడ పిచ్చిది అంటారన్న భయంతో కేకలేసినప్పుడల్లా గుప్పెడు బిళ్ళలు నోట్లో కుక్కి నీళ్లు పట్టించేవాడు. మహా మూర్ఖుడు మా బాబాయ్. అడ్డొస్తే చిన్నమ్మని తన్నేవాడు.

ఎవరైనా వేరేవాళ్లు బిజినెస్ విషయాలు మాట్లాడడానికి ఇంటికొస్తే కేకలు పెడుతుందని బిళ్ళలు ముందే వేసేసేవాడు.

రెండేసి రోజులు పడుకునే ఉండేది.

ఒక్కోసారి నాతో ఫోన్లో మాట్లాడేది, మురళి గురించి కనుక్కో అనేది.

ఒక్కోసారి తాగి గోడకేసి కొట్టేవాడంట. నరకం అనుభవించింది.

చివరకు మొత్తం మాట్లాడ్డం మానేసింది. అప్పుడప్పుడు కేకలు. అంతే. గుళ్ళకి తిప్పుతున్నారు. సంబరాలు చేయిస్తున్నారు. అయినా మామూలు మనిషి అవ్వలేదు.

"నీ కోసమే చూస్తుంది మురళి" అంది కళ్లు తుడుచుకుంటూ..

"పెళ్లి చేద్దామని చూశాడు. పిచ్చిదాన్ని చేసుకోడానికి ఎవరొస్తారు?"

కారు అమలాపురం ఎర్ర వంతెన పక్కనే, కాలవ రోడ్డు మీద పోతోంది.

కారాపు అని దిగి, చందనని పక్క సీట్లో కూర్చోమని చెప్పి కారు స్పీడ్‌గా పోనిచ్చాడు.

కన్నీళ్లు అడ్డం వచ్చి దారి కనబడ్డం లేదు.

అక్కడక్కడా పిల్లలు సెల్‌ఫోన్లలో పాటలు పెట్టుకుని పొద్దున్న భోగి మంటకి దుంగలు పోగెడుతూ ఉన్నారు.

కారు కాలవ దిగువన ఆగింది. పరిగెత్తుకుని వెళ్ళాడు.

తెలియని కుక్కలు మొరుగుతున్నాయ్. పట్టించుకోలేదు.

సత్యవేణి ఇంటి దగ్గర కొబ్బరి కాయల గుట్టల స్థానంలో ఒక పాక వేసి ఉంది. కాపలా లైట్లు వెలుగుతున్నయ్.

అదే వసారా.

అదే కిటికీ.

ఆ సత్యవేణి కాదు. తలుపు తీశాడు. లైట్ వెలుగుతూనే ఉంది. సన్నని చేతికీ మంచంకోడుకీ యెర్రని బట్ట కట్టేసి ఉంది. రేగిపోయిన జుట్టు. నొక్కుకు పోయిన బుగ్గలు. నిద్ర పోతోంది.

ఏడుస్తూ పక్కకి వచ్చాడు. వాళ్ళిల్లు దాటుతుండగా

ఎలా తెలిసిందో మరి,

సత్యవేణి రెండు పెద్ద పెద్ద కేకలేసింది.

✦✦✦



# అపర్ణ తోట

సోషల్ వర్క్‌లో పి.జి. చేశాను. తరువాత ఎన్.జి.ఓ.ల్లో, కార్పొరేట్‌లలో ఉద్యోగం. ప్రస్తుతం రచన మీదే ధ్యాస పెడుతున్నాను. చిన్న వయసులోనే ఎవరెస్ట్ ఎక్కిన పూర్ణ మాలావత్ కథను నవలగా రాస్తున్నాను. కథలు, కవితలు, కొన్ని ఇంటర్వ్యూలు, పుస్తక పరిచయాలు, వ్యాసాలు, కాలమ్స్ రాశాను. స్నేహితులు, పాటలు, పుస్తకాలు, కొత్త ప్రదేశాలు ఉత్సాహాన్నిస్తాయి. ప్రేమ కథను చదివి చాలా కాలమైందని బెంగవేసి రాసుకున్న కథ ఇది. తమకు ఏం కావాలో, ఎంత కావాలో, ఎలా కావాలో స్పష్టత ఉన్న శ్వేత వంటి అమ్మాయిలంటే భలే ఇష్టం.

“ స్ట్రాటజీ మార్చి ఆడితే గెలవడానికి
ప్రేమ ఏమీ చెస్ గేమ్ కాదు. ”



# వాలెంటైనుడెవ్వరే...?

కృష్ణ గబగబా హాల్ చివరికి వచ్చి డయాస్ వైపు చూశాడు.

అటు ఇటు ఫ్లవర్ మార్జిన్స్‌తో, అంచెలంచెలుగా దూకుతున్న కాస్కేడ్. మధ్యలో దీప్తి–అర్ణవ్‌ల పేర్లు. కింద నుంచి లయబద్ధంగా మారుతున్న లైట్లతో, డయాస్ ప్రతి అర నిముషానికీ ఊసరవెల్లిలా రంగులు మార్చుకుంటోంది. వెన్యూ డెకొరేషన్ పూర్తయినట్లే.

నెక్స్ట్...

“బాలు, మ్యూజిక్...” కృష్ణ అరుపుతో బాలు మ్యూజిక్ స్టార్ట్ చేసాడు. కళ్ళుమూసుకున్నాడు కృష్ణ. హాల్ మొత్తం ఏ.ఆర్. రెహ్మాన్ అలలు అలలుగా నిండిపోయాడు.

“పర్ఫెక్ట్” బొటన వేలు చూపించాడు కృష్ణ. మ్యూజిక్ ఆగిపోయింది.

బయట రిసెప్షన్ దగ్గర ఫ్లవర్ అరేంజ్‌మెంట్ మరొకసారి చూసుకున్నాడు కృష్ణ.

“అయిపోయింది బాబాయ్” దీప్తి నాన్న కృష్ణ వైపు చూసి, వెళ్ళమన్నట్టు తలూపాడు.

“గైస్, లెట్స్ గో.” అబ్బాయిలందరూ చకచకా తయారవడానికి పైకి వెళ్లారు. అమ్మాయిలు అంతకు ముందే తయారయి దీప్తి దగ్గర ఉన్నారు.

అందరూ తయారయే సమయానికి కింద ఫంక్షన్ మొదలైపోయింది. బాలు మాత్రం అద్దం ముందు నుంచి కదలడం లేదు.కొత్త హెయిర్ స్టైల్ పదేపదే చూసుకుంటున్నాడు. ధగధగలాడుతున్న బ్రౌన్ బ్లేజర్, ఫేషియల్ చేయించుకున్న మొహంతో పోటీ పడుతోంది.

"రే రారా.." కృష్ణ విసుగ్గా డోర్ పట్టుకుని ఎదురు చూస్తున్నాడు. వెనుక మిగిలిన కజిన్స్ కిచకిచమంటున్నారు

"అన్నా", ప్రీతమ్ కృష్ణ దగ్గర కొచ్చి గుసగుసలాడాడు... "వాడీ రోజు వాడి గాళ్‌ఫ్రెండ్‌కి ప్రపోజ్ చేస్తున్నాడు."

"వీడా..." కృష్ణ నోరు తెరిచాడు. "ఆ శ్వేత, దీప్తి స్కూల్ మేట్?"

ప్రీతమ్ అవునన్నట్టు తలూపాడు. "సచ్చాడు మనోడు. అది పిచ్చ ముదురు కదరా..."

"మనోడు ప్రేమించాడంటన్నా." అయోమయంగా చూశాడు కృష్ణ. "నిన్న బ్యాచిలరెట్‌కి రమ్మంటే రాలేకపోతివి..."

నిజమే మందెక్కువైతే బోల్డన్ని నిజాలు బయటకు చెప్పేస్తారు నా కొడుకులు.

"ఏంటి", బాలు కఫ్ లింక్స్ సర్దుకుంటూ వచ్చాడు.

"ఏం లేదు, రా... "కృష్ణ ముందుకు నడిచాడు" సాహసం షాయవలెరా... జై పాతాళ భైరవి!" అని బాలుని భుజంతో తోసి నవ్వాడు.

బాలు కొద్దిగా తూలి, ప్రీతమ్ వైపు ఒక చూపు విసిరాడు.

* * *

కింద బాంక్వెట్ హాల్‌లో హడావిడి మొదలయింది. పెళ్లికూతురు దీప్తి, వీళ్ళని చూసి పైనుంచే చెయ్యి ఊపుతోంది.

కృష్ణ దగ్గరకు వచ్చి డయాస్ మీదకి ఒక్క గెంతులో దూకి, రెండు చేతులూ చాపుతూ దగ్గరకు రాబోయిన దీప్తిని మోకాళ్ళ దగ్గరే పట్టేసుకుని ఎత్తుకున్నాడు. దీప్తి పకపక నవ్వుతూ, "చిన్నప్పటినుంచి ఇంతే..." అంటోంది. పక్కనే అర్ణవ్ నవ్వుతూ చూస్తున్నాడు.

కజిన్స్ అంతా త్వరగా చేరారు డయాస్ మీదకి. చకచకా కొన్ని పోజులు ఇచ్చారు. అందరూ మొబైల్ కెమెరాని క్లిక్ మనిపిస్తూనే ఉన్నారు. క్యాండిడ్ పిక్చర్స్ కోసం ఫోటోగ్రాఫర్ ముందే ఎంగేజ్ చేసుకున్నారు.

ఆ రోజు రాత్రి వరకు హడావిడిగానే గడిచింది. ఫ్యామిలీ డిన్నర్‌కి ముందు అంతా హడావిడి చేసి దీప్తి కాబోయే భర్తతో షాంపేన్ బోటిల్ ఓపెన్ చేయించారు. కాక్టైల్స్ మొదలయ్యాయి.

మూడు పెగ్గులయ్యాక బైటకి నడుస్తూ సిగిరెట్ వెలిగించాడు. కాస్త దూరంగా ఉన్న లాన్‌లో శ్వేత, బాలు కనిపించారు. బాలు ఏదో మాట్లాడుతున్నాడు. ఇంకా ప్రపోజ్ చేసినట్లు లేదు మరి. శ్వేత మొహంలో ఏ భావమూ కనిపించడం లేదు. కాసేపటికి బాలు గొంతు మారింది. “వీడికిప్పుడే పెళ్ళి గోల.” కృష్ణకి విసుగొచ్చి ఫోన్ తీసి చెక్ చేసుకున్నాడు.

సిగరెట్ అవగొట్టి వెనక్కి వస్తూ లాన్ వైపు మళ్ళీ చూస్తే ఇద్దరూ అక్కడ లేరు. లోపలి రాగానే బాలు గబగబా పైన రెస్ట్రూమ్ వైపు వెళ్తున్నాడు. శ్వేత కనిపించలేదు.

కృష్ణ నిట్టూర్చి నవ్వుకున్నాడు. రెస్ట్ రూమ్ లాక్ చేసి ఉంది. లోపల నుంచి సన్నగా ఏదో వినిపిస్తోంది. చెవి తలుపు మీద పెట్టాడు. నిజమే. లోపల ఎవరో ఏడుస్తున్నారు. “రే, బాలు” బదులులేదు. “రే...”

“తలుపు తియ్యి బే, లేకపోతే నీ వీపు బద్దలుకొడతాను.”

బాలు తలుపుతీశాడు.

“ఏమయిందిరా...” బాలు ఏం మాట్లాడలేదు. “ఆ పిల్ల ఒప్పుకోలేదనేగా...”

కృష్ణ టాయిలెట్ ముందు నిలబడ్డాడు. “ఆ పిల్ల ఒప్పుకోదని మా అందరికీ తెలుసు రా... ఒప్పుకున్నా, కొన్నిరోజుల్లో బ్రేకప్ అయిపోయుండేది. నీకూ ఆ పిల్లకీ ఎక్కడరా... నువ్వేమో మిల్క్ బాయ్‌వి, అదేమో ఒక కాలిక్యులేటర్.”

“కాదన్నా, మొన్న వాలెంటైన్స్‌డేకి కాల్ చేసినప్పుడు బానే మాట్లాడింది. నేనిచ్చిన ఫ్లవర్స్, బొకె, గిఫ్ట్ కూడా తీసుకుని థాంక్స్ చెప్పింది.”

“ఇప్పుడు నో చెప్పిందిగా.” జిప్ వేసుకున్నాడు. “ఏడవకు బే, పిల్ల ఎలాంటిదో తెలిసి కూడా... ఆపు ముందు.” ఫ్లష్ చేస్తూ అన్నాడు. “రే, ఓ మాట చెప్పనా, నువ్వు హాయిగా పిన్నివాళ్ళు చూసిన పిల్లని చేస్కో. నీలాంటి మెత్తని వాడిని ఆడించేస్తార్రా.”

"రా, పోదాం." టిష్యూ డస్ట్ బిన్‌లో పడేస్తూ శ్రీరామ్ వైపు కళ్ళెగరేశాడు .

"నువ్వెళ్ళు."

కృష్ణ కోపంగా చూడబోయి ఆగి, భుజం తట్టి, "త్వరగా రారా... భోంచేద్దాం.." అని బయటికొచ్చి చూశాడు.

శ్వేతా, లాబీలో ఉంది. పల్చటి లెహంగా, వర్క్ చేసిన బ్యాక్ లెస్ చోళీ, టిష్యు దుప్పట్టా. కృష్ణ గబగబ మెట్లు దిగాడు.

"హాయ్." పలకరించాడు. ఇద్దరికీ పెద్దగా పరిచయం లేదు.

"హాయ్." మొహమాటంగా నవ్వింది.

"క్యాబ్ కోసమా..." పక్కనున్న పిల్లర్ని ఆనుకుని నుంచున్నాడు. ఇందాక తాగిన స్కాచ్ పనిచేస్తోంది.

"అవును."

"గుడ్. అమ్మాయిలు నీలా ధైర్యంగా ఉండాలి. ఒక్కదానివే వెళ్తున్నావుగా. ఇదే ఫెమినిజం అంటే. మన పనులు మనం చేసుకోవడం."

శ్వేత మొహమాటపడుతున్నట్లు నటిస్తూ విసుగ్గా నవ్వింది.

"ఫెమినిజం అంటే ఇంకో మాట కూడా... మన బాధ్యతని పక్కవాళ్ళ మీదెయ్యకుండా మనమీద మనమే ఆధారపడడం." శ్వేతా, చూపు మరల్చింది. క్యాబ్ ఎంతకీ రాదు.

కృష్ణకి మంట తగ్గలేదు. "మా ఊర్లో రాజమ్మ ఉంది." కళ్ళు రుద్దుకున్నాడు. "రాజమ్మా, మొగుడు తనని వదిలేసినా భయపడకుండా ఇద్దరు పిల్లల్ని కష్టపడి పెంచుతోంది. ఒక్క పని అని కాదు నీతిగా ఉండే పని ఏదైనా సరే... పిల్లలు బాగా చదువుకుని పైకొస్తే చాలు అన్నదే ఆమె గోల్. భర్త మళ్లీ వెనక్కి వచ్చే నెపంతో కొత్త చీర కొనుక్కొచ్చి బతిమాలినా సరే, 'కాళ్ళు ఇరగ్గొడతా' అని బెదిరించింది. మీ ఫెమినిస్టులకి ఆమె అర్థం కాదులే. మీరంతా సోఫిస్టికేటెడ్ అర్బన్ లాట్ కదా..."

క్యాబ్ వచ్చింది. శ్వేత వెనక్కి తిరిగి "బై" కూడా చెప్పకుండా వెళ్ళిపోయింది.

"చూతియా సాలీ..."

* * *

డాన్స్ ఫ్లోర్ అదిరిపోతుంది. ఒళ్ళు చిల్లు పడే సంగీతం గుండెల్లో దరువేస్తుంది. క్షణంలో నాలుగైదు మెరుపులు మెరిసినట్లు డిస్కో లైట్స్. దీప్తి, అర్ణవ్ అంతా ముందే వచ్చేశారు. డాన్స్ ఫ్లోర్ మీద డాన్స్ చేస్తున్నారు బాలు, శ్వే...త...

"అన్నా, ఇంత లేట్ ఏందీ?" దీప్తి కృష్ణ భుజం మీద వేలితో పొడిచింది.

"దీప్తి, ఏందే ఇది?" కృష్ణ సమాధానం చెప్పకుండా డాన్స్ ఫ్లోర్ వైపు చూసి తలెగరేశాడు. "అది అదే..." దీప్తి నవ్వింది.

"ఫ్లైట్ ఎప్పుడు?"

"రేపు ఈవెనింగ్ 7 కి." దీప్తి ఎం.ఎస్ చేయడానికి వర్జీనియా వెళ్తోంది. పెళ్లి వెనక్కి వచ్చాకే.

"సారీ, హ్యాపీ బర్త్ డే" దీప్తిని దగ్గరికి తీసుకుని నుదుటి మీద ముద్దు పెట్టాడు.

"షాట్స్ కొడదామా?" అర్ణవ్ ఆడిగాడు. అందరూ బార్ కౌంటర్ వైపు మళ్ళారు. బాలు నెమ్మదిగా డాన్స్ ఫ్లోర్ నుంచి వచ్చాడు...

శ్వేతని కూడా రమ్మన్నట్టు చేయి ఊపింది దీప్తి. షాట్స్ తీసుకున్నాక శ్వేత మళ్లీ డాన్స్ ఫ్లోర్‌కి వెళ్లిపోయింది. బాలు వెనుకనే... "రే, ఆగు. ఏందీ మళ్లీ సెట్ అయిందా?" కృష్ణ మెడ పట్టుకుని వెనక్కి లాగాడు.

"ఏమన్నా?" అని అడిగి, కంగారుగా, "లేదన్నా, మేమెప్పుడూ ఇంతే. మా ఇద్దరికి డాన్స్ అంటే ఇష్టం. అట్లనే కదా క్లోజ్ అయింది."

"రే, నువ్ హోప్ పెట్టుకోకు."

"అయ్యా, అన్నా! ఆ పిల్ల తరువాత రోజు నన్ను కలిసి మాట్లాడింది... వి ఆర్ ఓన్లీ ఫ్రెండ్స్... ఎవరన్నా, అంత క్లియర్‌గా చెప్పాక మళ్లీపోతామా?" వాడి మాటలకి ముద్దొచ్చాడు. దగ్గరికి లాక్కుని ముద్దుపెట్టుకున్నాడు. వెనుక నుంచి శ్వేత కృష్ణ వైపు కోరగా చూసినట్లనిపిస్తుంది. కావాలనే శ్రీరామ్‌ని ఇంకోసారి ముద్దుపెట్టుకుని వదిలాడు.

శ్వేత పెగ్ రీఫిల్ కోసం బార్ వైపు వచ్చింది. ఆమె వేసుకున్న హాల్టర్ నెక్ టాప్ అద్దాల నుంచి వెలుగు నల్లని బార్ కౌంటర్ మీదకి దూకుతోంది. ఇద్దరూ ఆర్డర్ కోసం వెయిట్ చేస్తున్నారు. కాసేపు మౌనం. శ్వేత ఉన్నట్టుండి కృష్ణ వైపు తిరిగింది.

"సో, రాజమ్మ బావుందా?" పేరు గుర్తుంచుకుంది బాగనే. "ఇక్కడికి తీసుకురాక పోయారా? వచ్చిందా? పిలిచుంటే వచ్చేదేమో..."

తన ఆర్డర్ తీసుకుని కృష్ణ తలొంచుకుని వచ్చేశాడు... కాస్త దూరం వచ్చాక వెనక్కి తిరిగి చూస్తే శ్వేత తన గ్లాస్ అందుకుంటూ అక్కడ బార్‌మ్యాన్‌తో ఏదో మాట్లాడుతోంది.

రాజమ్మ ఇక్కడికి వస్తుందా, శ్వేత రాజమ్మ ఉండే ఊరిలో ఉంటుందా. అతి ప్రెస్టీజియస్ కాలేజీలో చదివే శ్వేతాకీ, ఊర్లో కూలిపని చేసుకునే రాజమ్మకీ పోలిక ఒక్క ఆడతనమేనా? తను అదొక్కటే చూ...శా...

ప్రీతమ్ డాన్స్ చేస్తూ వెనుక నుంచి కృష్ణ మీద పడ్డాడు. గ్లాస్‌లో స్కాచ్ కృష్ణ జీన్స్ మీద పడింది. "రే" అరిచాడు. "తాగుబోతు నాయాల"

* * *

"ఇంటర్న్ షిప్‌కి వచ్చిన వాళ్ళిద్దరూ, మీకు రిపోర్ట్ చేస్తారు."

"లాస్ట్ ఇయర్ ఈ తలనొప్పి లేదుకదా, ఈ ఇయర్ ఆఫర్ ఏంటి."

"లాస్ట్ ఇయర్ మీరు సీనియర్ ఏరియా సేల్స్ మాత్రమే. ఈ ఇయర్ మీరు మేనేజర్ సర్."

"అబ్బా, ఉన్న టీంతోనే చస్తున్నా..."

"ఓకే, ఒక కన్సొలేషన్, ఇద్దరు అమ్మాయిలే. రెపుటెడ్ కాలేజెస్ నుంచి వచ్చారు. ఇదిగో, వాళ్ళ బయో..."

సరిత. పిల్ల పద్ధతిగా ఉంది. రెండో పిల్ల – గాడ్, శ్వేత!

తర్వాత రోజే శ్వేత జాయిన్ అయింది. తనలాగే కంగు తింటుందేమోనని చూశాడు కృష్ణ. మామూలుగానే ఉంది.

తర్వాత లంచ్ మీటింగ్‌లో చెప్పింది. చేరే ముందే హెచ్ ఆర్‌ని కనుక్కుందంట. వెబ్సైట్, సోషల్ మీడియా కూడా చూశాను అని చెప్పింది. మీటింగ్ ప్రిపరేటరీ వర్క్ ఇస్తే సరిపోతుందనుకున్నాడు కృష్ణ.

నెమ్మదిగా శ్వేత కృష్ణ టీంలో ఒదిగిపోయింది. మామూలు ఇంటర్న్ లాగా కాకుండా అంత ప్రొఫెషనల్‌గా బిహేవ్ చేయడం ఆశ్చర్యంగా ఉండేది అందరికీ. కృష్ణ ఇంటర్న్‌షిప్ రోజుల్లో అంత కాన్ఫిడెంట్‌గా ఉండేవాడు కాదు.

శ్వేత చాలా అగ్రెస్సివ్ వర్కర్. ప్రాస్పెక్టివ్ క్లయింట్ డేటాబేస్ తయారు చేయడం, క్లయింట్ కంపెనీ ప్రోడక్ట్ రిక్వైర్‌మెంట్స్ రీసెర్చ్ చేయడం. ప్రోడక్ట్ శాంపిల్స్ కొరియర్ చేయడం ఇలా చాలా బాగా చేసేది. నెమ్మదిగా తనకి డాక్యుమెంటేషన్ వర్క్ కూడా ఇవ్వడం మొదలుపెట్టాడు.

హై రిఫ్లెక్సీస్ ఉన్న అమ్మాయిగా పేరు తెచ్చుకుంది శ్వేత, టీంలో. ఒకసారి క్లయింట్‌కి శాంపిల్స్ కొరియర్ చేసేంత సమయం కూడా లేనప్పుడు శ్వేత వీడియో చేసి వాట్సాప్ నుండి పంపింది. శాంపిల్‌ని చూపించడమే కాకుండా, దాని ఫీచర్స్‌ని కూడా చెపుతూ చూపించడం వల్ల క్లయింట్ చాలా ఇంప్రెస్ అయ్యాడు. సాయంత్రానికి ఆర్డర్ కన్‌ఫర్మ్ అయింది. ఇంత త్వరగా ఆర్డర్ కన్‌ఫర్మ్ అవడం ఇదే మొదటిసారి కృష్ణకు.

తర్వాత రోజు శ్వేతను పిలిచి టీమ్ అందరి మధ్యలో మెచ్చుకుని డెయిరీ మిల్క్ చాక్లెట్ ఇచ్చాడు. “ఇట్స్ ఆల్ అబౌట్ యాక్సెసింగ్ ఇన్ఫర్మేషన్ అండ్ యూజింగ్ టెక్నాలజీ”, అంది విలాసంగా. కృష్ణకెందుకో ఆ దిలాసా నచ్చలేదు. “ఆమె అందం, ఆ దిలాసా, తల వెనక్కి వంచడం, తెలియని గ్రేస్ ఉందీమెలో. కానీ అంతే స్వార్థం కూడా కనిపిస్తుంది.” అనుకున్నాడు కృష్ణ.

ఆ రోజు రాత్రి కృష్ణ ఏం తోచక ఫోన్‌లో ఫోటోలు చూస్తుంటే శ్వేత డెమో వీడియో కనిపించింది. ఆ వీడియో మళ్ళీ ఓపెన్ చేసి చూశాడు. ఆమె చేతులు మాత్రమే కనిపిస్తున్నాయి వీడియోలో. చేతి వేళ్ళు సన్నగా, చక్కగా షేప్ చేసి నెయిల్ పాలిష్ వేసిన గోర్లతో, కదులుతుంటే వేళ్ళతో నృత్యం చేస్తున్నట్లనిపించింది. చేతి కదలికల మధ్యలోంచి ఆమె సన్నటి మణికట్టుకి అతుక్కునున్న నాజూకు బ్రేస్లెట్ తొంగి చూస్తున్నట్లు అప్పుడప్పుడు మెరుస్తోంది.

పక్క మీద వాలి శ్వేత గురించి ఆలోచించాడు. ఆమె మొహం అంతా పొడుచుకొచ్చినట్లు ఉంటుంది. ముక్కు, గడ్డం, చీక్ బోన్స్ అన్ని. ఆఖరికి ఆ చూపులు కూడా. ఆమె గడ్డం కిందపక్కగా ఒక లేతాకుపచ్చని నరం మెడ కిందవరకూ సాగి హఠాత్తుగా మాయమవుతుంది. వెచ్చగా నిట్టూర్చి ఫోన్ పక్కనే పడేసి పక్క మీద వాలాడు కృష్ణ.

శ్వేత ఇంటర్న్ షిప్ పూర్తయ్యింది. తన రిజల్ట్స్ కూడా వచ్చేశాయి. మంచి స్కోర్ వచ్చింది. కృష్ణ జాగ్రత్తపడి ప్యాకేజీ తగ్గకుండా ముందే హెచ్ ఆర్ తో మాట్లాడాడు. శ్వేత లాంటి రిసోర్స్‌ని వదులుకుంటే మూర్ఖత్వమే అవుతుంది. శ్వేత అదే టీంలో ఉండిపోయింది.

* * *

ఒకరోజు, కృష్ణ కొలీగ్ సందీప్ వచ్చి కలిశాడు కృష్ణని. సందీప్ ఎం. డి మేనల్లుడు. కృష్ణ కన్నా చిన్నవాడు. "సో, యు హావ్ దిస్ గాళ్ శ్వేత ఇన్ యువర్ టీమ్?"

"ఎస్... వై?"

"లిఫ్ట్‌లో కలిశాను. వెరీ విట్టీ హౌ ఈజ్ షి విత్ వర్క్?"

"ఎక్సెప్షనల్లీ గుడ్. వై?"

"ఆమెని నా టీమ్‌లో చేరమని అడుగుదామని అనుకుంటున్నా. మీకు ఓకే నా?"

"ఆమె చేరుతుందని నేను అనుకోను. అడిగి చూడండి" కృష్ణ బయటికి అలా అన్నాడే కానీ అతనికీ తెలీదు. కానీ తన వల్ల ఆమె అవకాశాలు పోగొట్టుకుంది అనుకోకూడదు. ఒకవేళ కృష్ణ వద్దన్నా సందీప్ ఆమెని తన టీంకి రప్పించుకోగలిగే సత్తా ఉన్నవాడు.

మధ్యాహ్నం క్లయింట్ మీటింగ్ ఉంది. కృష్ణ శ్వేతని కూడా తనతో రమ్మన్నాడు. కృష్ణ రిసెప్షన్ దగ్గరికి వెళ్లేసరికి శ్వేత అటువైపు తిరిగి నిలబడి ఉంది... వెనక నుంచి ఆమెని చూస్తే వేరేగా ఉంది. నాజూకు అనడం కన్నా సన్నగా ఉంది అనడం కరెక్ట్. జుట్టు మొత్తం పైకి ఎత్తి ముడి వేసి, ముడిలో పెన్సిల్ దూర్చింది. ఆమె చామన ఛాయ మెడ మీద సన్నని వెండి గొలుసు. ఉన్నట్టుండి ముందుకు వంగింది. ఆ వంగే పద్ధతిలో ఏదో ఈజ్ ఉంది ఆమెకి. బ్లాక్ టాప్, కాళ్ళ పిక్కలను దాటే పెన్సిల్ స్కర్ట్. చెవులు పక్కగా నూనూగు జుట్టు.

వెనక్కితిరిగింది. "హాయ్, కృష్ణ! రిపోర్ట్స్ అన్నీ అప్డేట్ చేసేశాను. ప్రెజెంటేషన్ కూడా రెడీ... వెళదామా?"

"ఓకే" ఇద్దరూ బయటకు నడిచారు. కార్‌లో ఎక్కువ మాట్లాడలేదు. కృష్ణకి సందీప్ ప్రపోజల్ మీద కాస్త కోపంగా ఉంది.

"శ్వేతా, నీ ఫ్యామిలీ గురించి చెప్పు", అన్నాడు ఉన్నట్టుండి.

"అమ్మ, నాన్న, నేను, తమ్ముడు."

"నాన్న ఏం చేస్తారు."

"నాన్న ఇంజినీర్." అంది. కాసేపు ఆలోచించి, "మామూలుగా అయితే ఇంతే చెప్పేదాన్ని. కానీ మీరు ఫెమినిస్ట్ అని తిట్టారుగా..." నవ్వింది. "అమ్మ పెద్దగా

చదువుకోలేదు. LIC ఏజెంట్‌గా ప్రయత్నాలు చేస్తుంటుంది. నాన్నకి ఫైవ్ ఇయర్స్ బ్యాక్ ఆక్సిడెంట్ అయింది. ఒక కాలు తీసేశారు. సో మొబిలిటీ లేని జాబ్స్ చూసుకోవడంతోనే గడిచిపోతుంది."

"నీ స్టడీస్?"

"ఎడ్యుకేషన్ లోన్... ష్యూరిటీ మా మావయ్య ఇచ్చాడు." కృష్ణ కొద్దిసేపు మాట్లాడలేదు. శ్వేత డబ్బున్న అమ్మాయిలానే ప్రవర్తిస్తుంది మరి.

"కానీ నిన్ను చూస్తే..."

"ఐ నో హౌ టు ప్రెజెంట్ మైసెల్ఫ్. ఇప్పుడిక అవసరం లేదు. ఐ యాం వర్కింగ్ ఫుల్‌టైం."

కాసేపాగి "ఐ థాట్ యు ఆర్ సెల్ఫ్ సెంటర్డ్." అన్నాడు.

"ఓ, దట్ ఐ యామ్. ఐ వాంట్ టు మేక్ లాట్స్ ఆఫ్ మనీ."

"ఫెయిర్ ఎనఫ్." ఒప్పుకున్నట్లు తలూపాడు, దీప్తి ఎంగేజ్మెంట్ గుర్తొచ్చింది. "ఐ యామ్ సారీ అబౌట్... దీప్తీస్..."

"నాట్ ఓకే దెన్ బట్ నౌ ఇట్స్ ఓకే బాస్. "పక్కకు తిరిగి నవ్వుతూ అన్నది కానీ గొంతు బొంగురుగా ఉంది.

* * *

శ్వేత సందీప్ ఆఫర్‌ని తీసుకోలేదు. స్ట్రాటజిక్ టీంలో చేరే ముందు, సేల్స్ ఎక్స్పీరియన్స్ కావాలన్నది. కృష్ణ స్థిమితపడ్డాడు.

సందీప్ ఈ మధ్యలో కృష్ణ కేబిన్‌కి ఎక్కువసార్లు వస్తున్నాడు. కారణం అందరికీ అర్థమైంది. అప్పుడప్పుడు కృష్ణ కూడా టీజ్ చేస్తున్నాడు. కానీ సందీప్ శ్వేతని పలకరించినప్పుడు కృష్ణకి ఎక్కడో ఒక మూల గుండుసూదితో గుచ్చినట్లుండేది.

సందీప్ ఏ రకంగా చూసినా ఆమెకు మంచి మ్యాచ్ అవుతాడు. ఐఐటీ ఐఐఎం ప్రోడక్ట్. ఎం.డి కి దగ్గర బంధువు. ఆస్తిపరుడు. శ్వేతకి కూడా అతనంటే ఇష్టమేనేమో అనిపించేది కృష్ణకి. సందీప్ ఎప్పుడు వచ్చినా బాగా పలకరిస్తుంది. ఎప్పుడైనా ఒకోరోజు రాకపోతే తర్వాత కృష్ణ కేబిన్‌లో సందీప్ ఎదురుపడగానే "ఏంటి, బిజీ అయిపోయారు" అని అడుగుతుంది.

న్యూ ఇయర్ పార్టీలో సందీప్ శ్వేత కలిసి ఎంసీఇంగ్ చేశారు. ఆ స్టేజి మీద ఇద్దర్నీ అలా చూస్తుంటే బావున్నట్టే అనిపించారు కృష్ణకి. శ్వేత అంత చిన్నదైనా సరైన పద్ధతిలో స్పీకర్లను పిలవడం, కంగారు పడకుండా హుందాగా తనని తాను క్యారీ చేయడం, మళ్లీ చిన్న చెణుకులు విసరడం – చాలా టాలెంటెడ్ అని అర్థమైంది.

ప్రోగ్రామ్ మధ్య కాఫీ బ్రేక్‌లో కృష్ణని వెతుక్కుంటూ వచ్చింది శ్వేత. "యు డిడ్ వెల్," అన్నాడు మెచ్చుకోలుగా.

"ఐ యామ్ ట్రైన్డ్ అండ్ ఎక్సపీరియెన్స్డ్. పార్ట్ టైం వర్క్ చేసేదాన్ని కేటరింగ్, ఎంసీఇంగ్, హెూస్టింగ్..."

"ఓకే... డ్రెస్ కూడా బావుంది."

"ఓ దిస్?" కృష్ణకి దగ్గరగా వచ్చింది. ఆమె పెర్ఫ్యూమ్ తేలిగ్గా కృష్ణ పైకి సాగింది. "దిస్ ఐ రెంటెడ్. సిక్స్ హండ్రెడ్ ఫర్ యాన్ ఈవెనింగ్." చెవిలో నెమ్మదిగా చెప్పి, చిన్నగా నవ్వింది. కృష్ణ వెన్నులో చక్కిలిగింత పుట్టింది.

ప్రోగ్రాం అయి డిన్నర్ అయేసరికి రాత్రి పదకొండు గంటలైంది. కృష్ణ ఎంత వద్దనుకున్నా శ్వేతను గమనిస్తూనే ఉన్నాడు. శ్వేత కనిపించినపుడల్లా సందీప్‌కి ఏవో మాటలైతే పుట్టుకొస్తున్నాయి. ఆమెను కంపెనీ చైర్మన్‌కు పరిచయం చేశాడు. ఆయనతో శ్వేత కాస్త ఎక్కువసేపే మాట్లాడడం చూశాడు కృష్ణ.

అర్ధరాత్రి దాటుతోంది. ఆఫీస్ క్యాబ్స్ రెడీగా ఉన్నాయి. కృష్ణ అందరికీ బై చెప్తూ వస్తున్నాడు. శ్వేత, సందీప్‌లు దూరంగా నడుస్తూ నెమ్మదిగా చీకటిలో కలిసిపోయారు.

కృష్ణ కాసేపు వాళ్ళు వెళ్లిన వైపే చూస్తుండిపోయాడు. వాళ్ళు చీకటిలోకి వెళ్ళకముందు ఖాళీ చేసిన ప్రదేశంలోని శూన్యమంతా అతని మనసులోకి చేరింది. అతనికెందుకో కోపం రాలేదు. మనసు కాస్త తేలిగ్గా కూడా అనిపించింది. 'సెలబ్రేటింగ్ ది ఈవెనింగ్స్ సక్సెస్,' బయటకే అన్నాడు.

కార్ తాళాలు తీస్కుని మిగిలిన వారికి చెప్పి ఇంటికి వచ్చేశాడు. ఆ రాత్రి నెట్ ఫ్లిక్స్‌లో రెండు సినిమాలు వరుసగా చూసి తెల్లవారుఝామున ఎప్పుడో పడుకున్నాడు.

* * *

పొద్దున్నే శ్వేత అతని కేబిన్‌కి పిలిచి వర్క్ ఇచ్చి పంపేశాడు. శ్వేత కూడా కాస్త సీరియస్‌గానే కనిపించింది. "ఇదే బెటర్", అనుకున్నాడు.

అతనికి బాలు ఎక్కువగా గుర్తొచ్చేవాడు. ఫిబ్రవరి ఫస్ట్ వీక్‌లో దీప్తి ఫోన్ చేసింది. "నేను వచ్చేశా అన్నా.... ఎప్పుడు కలుద్దాం?"

మళ్లీ కజిన్స్ అంతా కలిశారు. శ్వేత కూడా వస్తుందేమో అని కృష్ణ ఎవరికీ తెలీకుండా వెతికాడు. కనిపించలేదు. దీప్తిని అడిగేసాడు చివరికి. "మేమంతా వేరేగా కలుస్తున్నాం అన్నయ్య, ఐ డోంట్ వాంట్ టు మిస్ ఎనీ వన్." అంది ఉద్రేకంగా... "గ్రేట్", అని ఊరుకున్నాడు.

సందీప్ రాకలు బాగానే తగ్గాయి. "శ్వేత రావద్దందేమో...." అనుకున్నాడు కృష్ణ.

ఉన్నట్టుండి ఒకరోజు సందీప్ కృష్ణ కేబిన్‌కి వచ్చాడు. శ్వేత లీవ్‌లో ఉంది ఆ రోజు.

"బడ్డీ, ఐ వాంట్ టు టెల్ యు సంథింగ్. నీకు తెలుసు కదా, ఐ యామ్ ఇన్ లవ్ విత్ హర్." కృష్ణ తలూపాడు. ఇప్పుడతనేమి అడుగుతాడు. ఆమెని సందీప్ డిపార్ట్మెంట్‌కి పంపమనా. తన టార్గెట్స్ బాగానే సఫర్ అవుతాయి, పైగా ఇది ఫిబ్రవరి.

"ఐ యామ్ గోయింగ్ టు టెల్ హర్ ", లేచి కాసేపు అలానే నుంచుని అలోచిస్తూ ఉండిపోయాడు. ఉన్నట్టుండి ఏదో గుర్తొచ్చినట్లు గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు.

* * *

వాలెంటైన్స్ డే. ఆఫీస్‌లో మళ్ళీ హెచ్ ఆర్ హడావిడి.

ఆఫీస్ అంతా ఎర్రరంగు పులుముకున్నట్లుంది. ఎర్ర బెలూన్లు, ఎరుపు రంగు లవ్ ఐకాన్స్. ఆడవాళ్ళందరూ పింక్ డ్రెస్ కోడ్‌లో నడిచే గులాబీ కొమ్మల్లా ఉన్నారు.

అందరికీ రెడ్ రోజెస్ ఇచ్చారు.

కృష్ణకు శ్వేత గుర్తొచ్చింది. తన రెండు ఆడుగులు వేస్తే కాబిన్ బయటే ఉంటుంది. ఇచ్చి చెప్పెయ్యొచ్చు.

వద్దు.

ఫోన్ మోగింది. "కృష్ణన్న... నేను బాలు ని. ఐ యామ్ గోయింగ్ టూ ప్రపోజ్ టు మై గాళ్ దిస్ వాలెంటైన్స్ డే. అమ్మవాళ్ళు కూడా ఓ.కే చెప్పేశారు."

"ఎవర్రా అమ్మాయి." అనుమానంగా అడిగాడు. అసలే శ్వేతకి డిమాండ్ బాగా పెరిగిపోతోంది.

"ఫ్యామిలీ ఫ్రెండ్స్, అన్నా.."

"ఓకే చెప్పడమేంటి."

"పేరెంట్స్ నుంచి క్లియరెన్స్ వచ్చింది. ఆ అమ్మాయికీ ఓకే అంట వాళ్ళ పేరెంట్స్ చెప్పారు."

"సో ఓకే అయిన అమ్మాయికే ప్రపోజ్ చేస్తున్నావా... ఏందిర... నీ..."

"రిస్క్ ఎందుకన్నా... మళ్ళీ టాయిలెట్‌లో కూచుని ఏడవాలె.

చటుక్కున నవ్వాడు కృష్ణ. "రే, ఒక పిల్లకి నీ మీద సహజంగా ఇష్టం పుట్టడం కూడా మిరకిల్ లాగా చెప్తున్నావు. పో బే."

"పో అన్నా, అందరూ నీ లెక్క స్టడ్‌లనుకున్నావా". దబాయించాడు, పిల్ల ఒప్పుకోగానే ధైర్యం వచ్చినట్లుంది. "సరే, నువ్వు రావాలె మన వాళ్లంతా వస్తున్నారు. తనకి సర్ప్రైజ్ అరేంజ్ చేసిన. అమ్మావాళ్లు కూడా ఉంటారు."

"సరే, ఎక్కడ?"

"లొకేషన్ పంపుతా"

వాట్సాప్ నోటిఫికేషన్. శ్రీరామ్ నుంచి కాదు. శ్వేత నుంచి. "ప్లీజ్ కం టు టెర్రస్." సందీప్‌కి ఎస్ చెప్పేసి ఉంటుందా? ఇప్పుడు ఇద్దరు తనకు థాంక్స్ చెప్తారా. చికాకు వచ్చింది. వెళ్లొద్దనుకున్నాడు. వెళ్తేనే మంచిదిలే. తాను పట్టించుకోలేదనే అనుకుంటుంది. కృష్ణ లిఫ్ట్ లోంచి పై ఫ్లోర్‌కి వచ్చాడు.

తెలివైన పిల్ల. తనకేం కావాలో తెలిసిన పిల్ల. బాగా డబ్బు సంపాదించాలన్నది కదా, ఎందుకు వదులుకుంటుంది ఇతనిని... మెట్లెక్కుతున్న కొద్దీ పైన అడుగులు నీరసం గా పడుతున్నాయి. గాలిలో తేలిగ్గా చిన్న చిన్న పదాలు చెవిన వేస్తున్నాయి. సందీప్ విసురుగా ఏదో అంటున్నాడు.

శ్వేత గొంతు వినపడింది. కాసేపటికి తాను కూడా కనపడింది. చేతిలో బొకే ఉంది. "అఫ్కోర్స్ సందీప్, బట్ డోన్ట్ ఐ హవె ఆ రైట్ టు సే నో? యు షన్ట్ ఫోర్స్ మీ. మొన్న కూడా చెప్పా కదా."

"ఐ రియల్లీ లవ్ యు. అందుకే..."

"నిజంగా అంత లవ్ ఉంటే సందీప్, యు షుడ్ రెస్పెక్ట్ వెన్ ఐ సే నో. మా పేరెంట్స్‌తో ఎందుకు మాట్లాడావు?"

"నువ్వొప్పుకుంటావు అనుకున్నా."

"ఓన్లీ ఇఫ్ ఐ లవ్ యు. నేను న్యూ ఇయర్ డే నే చెప్పానుగా. ఇప్పుడు సడన్‌గా వాళ్ళు చెప్పారని ఒప్పుకోను. స్ట్రాటజీ మార్చి ఆడితే గెలవడానికి ప్రేమ ఏమీ చెస్ గేమ్ కాదు. నా మీద గౌరవం లేనివాళ్ళని నేను ప్రేమించలేను."

కాసేపు మౌనం.

"ఓకే లాస్ట్ టైమ్. డు యు...?" సందీప్ గొంతు చికాకుని తొక్కిపెట్టినట్టు ఉంది.

"నో..."

చేతిలో ఉన్న గిఫ్ట్ విసిరి నేల కసి కొట్టాడు. గబగబా మెట్ల దగ్గరికి వచ్చాడు. కృష్ణ పక్కకు జరిగాడు కానీ సందీప్ అతని వైపు చూశాడో లేదో తెలీదు.

వాట్సాప్ నోటిఫికేషన్ సౌండ్ వచ్చింది. బాలు లొకేషన్ పంపాడు. ఆ పిల్ల ఫోటో కూడా... ప్రశాంతంగా నవ్వుతూ ఉందా అమ్మాయి. అందం కన్నా పసితనం కనిపిస్తుంది ఆమెలో...

శ్వేత నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చింది. కృష్ణ ఫోన్ స్క్రీన్ లాక్ చేశాడు.

"క్రిష్" ఆగింది. 'సో, యు హర్డ్ మీ.' చూసింది. క్రిష్ణ చిరుత చూపుకు చిక్కుకున్న జింక పిల్లలా విలవిలలాడాడు.

"కాఫీ...?" చేయిసాచింది.

"ష్యూర్..." చేయందుకున్నాడు

ఇద్దరూ మెట్లు దిగి పార్కింగ్ వైపు వెళ్లారు .

కృష్ణ తన కార్ వైపు వెళ్ళబోయాడు.

"నో, వెయిట్. నా బైక్ మీద వెళదాం. తీసుకొస్తాను." ఆమె టు వీలర్స్ వైపు నడిచింది.

కృష్ణ ఆమె కోసం పార్కింగ్ వే దగ్గర ఆగి ఎదురు చూస్తున్నాడు. ఆమె బ్యాక్‌ప్యాక్ వేస్కుని యాక్టివాని అతని ముందు ఆపింది. "యు వాంట్ టు రైడ్?".

"నేనా? ఓకే."

బైక్ రైడ్ చేయడం మానేసి ఐదేళ్లయింది. హెల్మెట్ తీసి అతనికందిస్తూ వెనక సీట్ మీదకి స్లయిడ్ అయింది. పెన్సిల్ స్కర్ట్ మోకాళ్ళ పైకి జరిగింది. కృష్ణ లాప్టాప్ బాగ్ కాళ్ళ దగ్గర పెట్టి స్టార్ట్ చేసాడు.

"ఎక్కడికి"

"లాంగ్ డ్రైవ్‌కి"

"ఈ ట్రాఫిక్ లోనా?"

"యా అందుకే బైక్." కాసేపాగి అంది. "ఇంకొక రీజన్ కూడా." రెడ్ లైట్ పడింది.

"ఎందుకు?" బండి ఆపి బ్యాలెన్స్ చేయడానికి ముందుకు వంగాడు.


కొద్ది సెకండ్లు ఏమీ మాట్లాడలేదు. కృష్ణ గుండె కొట్టుకునే చప్పుడు అతనికే వినిపిస్తుంది. వెనుక కొంచెం కదిలింది ఆమె. "మీ నడుం చుట్టూ చెయ్యి వేయడానికి కన్‌సెంట్ ఉందా?"

కృష్ణకి ఒకేసారి బలం వచ్చింది. "ఒళ్ళంతా వేయడానికి కన్సెంట్ ఉంది." గాఢంగా ఊపిరి పీల్చుకుంటూ అన్నాడు.

కృష్ణ నడుము చుట్టూ ఆమె తీగల్లాంటి చేతులు బిగుసుకున్నాయి.

గ్రీన్ లైట్ పడింది. యాక్సిలరేటర్ రైజ్ చేసాడు...


✦✦✦



# అరిపిరాల సత్యప్రసాద్

ఆంగ్ల మాధ్యమంలో చదువులు, కార్పొరేట్ ఉద్యోగం, వీటి మధ్యలో చెరగని తెలుగు భాషాభిమానం. ఇదీ స్థూలంగా నేను. వృత్తిపరంగా అనివార్యమైన కార్పొరేట్ ప్రపంచాన్ని దగ్గరగా చూసి, అందులోని డొల్లతనాన్ని తరచుగా కథా వస్తువు చేస్తుంటాను. ఆధునిక పరిణామాల నేపథ్యంలో మారుతున్న సమాజ ముఖచిత్రాన్ని, దాని వల్ల మనందరిలో కలిగే అంతఃసంఘర్షణలని అక్షరీకరించడం అంటే ఇష్టం. 'ఊహా చిత్రం' 'కథ చెప్తాను వింటావా' 'నాల్నాలుగుల పదహారు', 'మొపాస కథలు' నా ప్రచురణలు

“ ప్రేమ అనేది లేని ప్రపంచం వుంటే
అందులో కన్నీళ్ళు వుండవేమో. ”



# మూడో కథ

"నిజంగా ఎవరినీ ప్రేమించలేదా నువ్వు?"

"లేదు,"

"ఎందుకు?"

"నాకు చిన్నప్పటినుంచి ప్రేమంటే ఇష్టంలేదు,"

"చిన్నప్పటినుంచా?" అవతలివైపు నుంచి నవ్వు. "ఎంత చిన్నప్పటి నుంచి?"

సమాధానం చెప్పాలనిపించలేదు. చాలాసేపటి వరకు.

"నీకో కథ చెప్పాలి."

* * *

ప్రేమకు కొలమానం ప్రాణం అయితే దేవి ప్రేమను వందశాతం అనుభవించింది. అందుకే ఆమె శాశ్వతంగా బతికే చోటికి వెళ్ళిపోయింది.

* * *

మేము ప్రేమించుకున్న కారణం ఏమిటా అని ఆలోచించాను ఈ రోజు. ప్రేమించుకున్న కాలం మాత్రమే గుర్తుంది. కారణం తెలియదు. కంది పూలపై వాలిన

సీతాకోకచిలకలా రంగులన్నీ చీరగా కట్టింది దేవి ఆ రోజు. ఆ వేసవి మొదటి మల్లెపూలు గంపల్లో నిండుతున్న రోజు.

“కాసిన్ని మల్లెపూలు ఇస్తారాండీ? పూలజడ వేయించుకుంటా”

పూలమధ్యలో వున్న నన్ను కూడా పువ్వుగానే భావించాయేమో కందిపూల మీద సీతాకోకచిలకలు. వచ్చి నా గుండెలోనే ఎగురుతూ వుండిపోయిన రోజు. ఆ రోజు మార్చి పన్నెండు. ఉగాది.

పరిచయం ఆ రోజుది కాదు.

క్లాసులో ఎన్నోసార్లు కాకెంగిలి పిప్పర్మెంట్లు తిన్న జ్ఞాపకాల తీపి పోలేదు ఇంకా. ఏ పండక్కో సివిల్ డ్రస్ లో వచ్చిన రోజు విన్న కాలి పట్టీల చప్పుడు చెవుల్లో వలయాలుగా తిరుగుతూనే వుంది. క్లాసు బయట గ్రౌండ్ దగ్గర వేప చెట్టు కింద కూర్చోని బాక్సులు తెరిచినప్పుడు కలిసిపోయిన గుబాళింపు ప్రతి శ్వాసలో ఇప్పటికీ తెలుస్తూనే వుంది. స్కూల్ వదిలిన తరువాత దారిలో వర్షం పడితే చెట్టుకింద ఆగినప్పుడు తడిపిన చిరుజల్లు చలి ఈ రోజుకీ సన్నగా వణికిస్తూనే వుంది.

కానీ ఆ ఉగాది రోజు మళ్ళీ పరిచయం అయ్యింది. కొత్తగా. ఆ తరువాత మళ్ళీ మళ్ళీ పరిచయం అయింది. ప్రతిసారీ కొత్తగా.

మా పూలతోట పరిమళాలు మాతో మాటలు చెప్పేవి. మా మధ్య మాటలు లేకుండా చేసేవి.

“పూల పైన వాలే సీతాకోకచిలకలమై ఎగిరిపోవాలి,” అన్నాను నేను

“అన్ని రంగులుండి పొగరుగా ఎగిరే సీతాకోకచిలకల కన్నా వినయంగా వుండే గోధుమరంగు చిమటలు బాగుంటాయి నాకు,” అంది దేవి.

“చూడటానికి సీతాకోకచిలకలా వున్నా రంగులేకపోతే అది ఒక పురుగు మాత్రమే” అన్నాను నేను అయిష్టంగా అప్పుడు చెప్పిందామె. చిమట రంగు గురించి.

అన్ని సీతాకోకచిలకలు తెల్లగానే సృష్టించబడ్డాయి. రంగులు వుంటే బాగుంటుంది అనిపించింది వాటికి. రంగులు కావాలంటే మాటలా? పూలని ముద్దాడి పెదవులకు అంటిన పుప్పొడి మోసుకొచ్చి ఒక చోట చేర్చాలి. చేర్చిన పుప్పొడిలో రంగులు విడదీయాలి. ఏ రంగుకి ఆ రంగు తీసిన తరువాత ఆ రంగులో ఆకులపై రాలిన మంచు బిందువులు కలుపుతూ సీతాకోకచిలక రెక్కలపైన అద్దాలి.

అన్ని సీతాకోకచిలకలు రంగులు అద్దుకోవాలని అనుకున్నాయి. చిత్రంగా అందులో ఒక్క సీతాకోకచిలకే పుప్పొడి సేకరించడంలో పడిపోయింది. ఒకటి నిద్రపోయింది. ఒకటి అజమాయిషీ మొదలుపెట్టింది. ఇంకొకటి ఎవరికి ఏ రంగు వెయ్యాలో నిర్ణయించడం మొదలుపెట్టింది.

పూలలో పుప్పొడి మొత్తం అయిపోయింది. రంగులు పేరుకున్నాయి. ఎరుపు, పసుపు, నీలం, పచ్చ – తెల్లటి సీతాకోకచిలకలన్నీ రెక్కల్ని టపటపలాడించాయి. రంగులు అద్దడం మొదలుపెట్టారు. పుప్పొడి సేకరించిన సీతాకోకచిలక 'నాకు ఏ రంగు వేస్తారు?' అంది.

'కావాల్సినన్ని రంగులు వున్నాయి. నీకు వెయ్యకుండా వుంటామా' అన్నాయి మిగిలినవి. వాటికి మాత్రం రంగులేసుకోవడం మొదలుపెట్టాయి.

ఎర్రటి రంగు మీద పచ్చటి బొట్లు. పచ్చటి రంగు మీద నీలం చారలు. నీలం రంగు మీద నల్లటి కళ్లు. అబ్బో – ఒకో సీతాకోకచిలక కొత్త కోక కట్టినట్లు వయ్యారాలు పోతూ ఎగిరిపోయాయి. చివరికి ఆ సీతాకోకచిలక వంతు వచ్చింది. చూస్తే ఏముంది?

రంగులన్నీ కలిసిపోయాయి. అటు మట్టి రంగు ఇటు నలుపు కానీ చిక్కని గోధుమ రంగు. ఏం చేస్తుంది? అదే వేసుకుంది. అలా చిమటగా మారిపోయింది.

* * *

"ఎంత బాగా రాశారో కదా?"

"ఆయన ఇందులో రాసుకోని విషయాలు ఇంకా చాలా వున్నాయి"

"లైక్?"

"వాళ్ళ ఇళ్లలో చాలా గొడవలయ్యాయి. కాస్ట్ వేరు కదా. ఇద్దర్నీ కలవనీయకూడదని ఎన్నో చేశారు. తిట్టారు. కొట్టారు. వేరే సంబంధాలు చూశారు. ప్రేమించడం అవసరమా అనేంతలా టార్చర్ పెట్టారంట. వాళ్ళ మాట విని దేవిని తీసుకొచ్చేయకపోతే దాని బతుకు ఇంతకన్నా బాగుండేదేమో అంటుంటాడు నాన్న ఎప్పుడన్నా"

"ఆ విషయాలు లేవా డైరీలలో"

"రాయలేదు ఎందుకో"

"ఆ డైరీలలో ప్రేమ మాత్రమే వుండాలనుకున్నారేమో."

“అదే కదా నేను చెప్పేది. అన్ని కష్టాలు పడాల్సిన ప్రేమలో అసలు పడాల్సిన పనేంటి? ఊహల్లో మాత్రమే వుండే ఇంప్రాక్టికల్ ప్రేమ గురించి రాసుకోని, జీవితంలో వాస్తవాలను, ప్రాక్టికల్‌గా జరిగిన అవమానాలను దాచుకున్నంత మాత్రాన ప్రేమ గొప్పది అయిపోతుందా?”

“అంత గొప్పగా ప్రేమించుకున్న వాళ్ళకి పుట్టిన నువ్వు – ప్రేమ మీద నమ్మకం లేదంటావెందుకు?”

అతని దగ్గర సమాధానం వుండదని ఆమెకు తెలుసు. కొన్ని క్షణాల మౌనం విన్న తరువాత మళ్ళీ తనే అడిగింది.

“నిజంగా నువ్వు ఎవరినీ ప్రేమించలేదా?”

“లేదు”

“నిన్ను ఎవరూ ప్రేమించలేదా?”

“లేదు”

“అబద్ధం. కావాలనే చెప్పట్లేదు నువ్వు. నిన్ను ఎవరూ ప్రేమించలేదా? ఎవరూ ఐ లవ్యూ అని చెప్పలేదా?” చిన్నగా నవ్వుతూ అడుగుతోంది.

“చెప్పేదాకా రానివ్వలేదు నేను. ఏ మాత్రం అనుమానం వచ్చినా వెంటనే తుంచేసేవాణ్ణి”

“ఏం చెప్పేవాడివి?”

“నాకు ప్రేమ మీద నమ్మకం లేదు. ప్రేమించడం టైమ్ వేస్ట్ తప్ప ఇంకేం వుండదు. సో నా మీద ఎలాంటి ఆశలు పెట్టుకోవద్దు అని చెప్పేవాడిని”

“ఓ మై గాడ్” అంటూ నవ్వేసింది. “మరి అమ్మాయిలు ఏమనేవాళ్లు?”

“అంతే. ఈ సంగతి నా ఫ్రెండ్స్ సర్కిల్‌లో అందరికీ తెలుసు. అందుకే ఏ అమ్మాయి అలా ఆలోచించేది కాదేమో”

“ఏమో చెప్పకుండా మనసులోనే దాచుకోని వున్నారేమో?”

“ఐ డోన్ట్ థింక్ సో”

రెండు క్షణాలు ఫోన్లు రెండు మూగపోయాయి.

"నీకు అందరికన్నా బాగా క్లోజ్‌గా వుండే అమ్మాయి ఎవరు?"

"ఎందుకు"

"చెప్పు"

"నల్ల అళగి"

"సమాధానం వెంటనే చెప్పావంటే...?"

"ఎందుకంటే నా సంగతి ఆ అమ్మాయికి బాగా తెలుసు. ఐ మీన్ లవ్ గురించి నా ఒపీనియన్. ఆ అమ్మాయి కూడా అదే టైప్. అందుకే ఇన్ని సంవత్సరాలు మేం ఫ్రెండ్స్‌గా వుండగలిగాము"

"ఎన్ని సంవత్సరాలు?"

"ఆరు"

"ఆ అమ్మాయి గురించి చెప్పవా?"

"ఆ అమ్మాయి గురించి చెప్పడానికి ఏం లేదు."

"ప్లీజ్... ప్లీజ్..."

* * *

పేరు అళగి. ఐఐయం అహ్మదాబాద్‌లో ఇద్దరం ఒకే బ్యాచ్. నల్లగా వుంటుందని నల్ల అళగి అనేవాళ్ళు గులుతె ఫ్రెండ్స్. అది ఆ అమ్మాయికి తెలిసిపోయింది. డైరెక్ట్‌గా నా దగ్గరకే వచ్చి అడిగింది. ఆ పేరు నేను పెట్టలేదని చెప్తే ఒప్పుకోలేదు. చాలాసార్లు సారీ చెప్పించుకుంది. చివర్లో నవ్వేసింది.

"తమిళ్‌లో నల్ల అంటే మంచి అని అర్థం. మీ భాషలో ఏమనుకున్నా నా భాషలో నేను మంచిదాన్ని అని పొగిడినట్లే. ఐ డోంట్ మైండ్" అంది నవ్వుతూ...

ఎండ్ దెన్ వీ బికేమ్ ఫ్రెండ్స్.

ఐఐయం చాలా స్ట్రెస్‌ఫుల్‌గా వుంటుంది. కొలాబరేషన్ తప్పదు. కామర్స్ చెప్పించుకోడానికి నా దగ్గరకి వచ్చేది. చాలా మంది వచ్చేవాళ్ళు. వాళ్ళలో అళగి కూడా. తరువాత మా అస్సైన్‌మెంట్స్ పార్టనర్ కూడా.

హాస్టల్లో తన రూమ్‌లో కన్నా నా రూమ్‌లోనే ఎక్కువ టైమ్ గడిపేది. బ్యాచ్ మొత్తానికి తెలుసు. ఐ మీన్... అక్కడ ఇదంతా కామన్. లవ్ స్టోరీస్, టూ ఇయర్ కాంట్రాక్ట్ లవ్, ఫ్రెండ్స్ విత్ బెనిఫిట్స్... అన్నీ జరుగుతుంటాయక్కడ. కానీ మేము ఇద్దరం ఫ్రెండ్స్‌గానే వుండిపోయాం. నథింగ్ ఎల్స్.

ఆ ఎడ్యుకేషన్ విధానం అట్లాంటిది. ప్రెజర్. ప్రెజర్. ప్రెజర్. యూ నీడ్ సమ్ వన్. చాలాసార్లు సెల్ఫ్ డౌట్ వస్తుంది. ఫెయిల్యూర్ కుంగదీస్తుంది. ధైర్యం చెప్పడానికి ఒకళ్ళు కావాలి. కన్నీళ్ళు కార్చడానికి ఒక వెచ్చటి కౌగిలి కావాలి. నాకు అవన్నీ అళగే అయ్యింది. అళగికి నేను. ఎంత క్లోజ్ అంటే ఒకోసారి లేట్ నైట్ వరకు ఏదో వర్క్ చేసుకుంటూ నా బెడ్ మీదే పడుకోని నిద్రపోయేది. నా పక్కనే. బట్ ఐ స్వేర్. నథింగ్ రాంగ్ వజ్ ఇన్ అవర్ మైండ్.

తమిళ్ గ్యాంగ్‌కి కొంచెం కోపం వుండేది. అళగి తెల్లగా వుండే టామ్ బ్రామ్ అయ్యుంటే ఇంకా ఎక్కువ కోపం వుండేదేమో మరి. బట్ వాళ్ళందరూ ష్యూర్, మేము ఇద్దరం లవ్‌లో వున్నామని. మాకు తెలిసినప్పుడు హాయిగా నవ్వేసుకున్నాం. ఇప్పటికీ రాజన్ అడుగుతుంటాడు. అళగికీ నీకు మధ్య నిజంగా ఏం లేదా అని.

ఇద్దరికీ హైదరాబాద్ పోస్టింగ్స్, వేరే వేరే కంపెనీలలో. మా ఇంటికి వచ్చేది. నాన్న హాస్పిటలైజ్ అయినప్పుడు నా పక్కనే వుంది. నాన్న కూడా "మంచి పిల్లరా. నువ్వంటే ఎంత ఇష్టమో" అన్నాడు. నాకు కూడా ఇష్టమే. ఇష్టమంటే ప్రేమ కాదు కదా. ఆ విషయం మా ఇద్దరికీ తెలుసు.

* * *

"నాకు ఒకసారి అళగిని చూపిస్తావా?"

"మన పెళ్ళికి వస్తుందిగా! చూడు ఎంత హడావిడి చేస్తుందో. నిన్నుచూడాలని తను కూడా అంటోంది"

చాలాసేపు మాట్లాడలేదు ప్రణవి.

"నీకు మీ అమ్మ గుర్తుందా?"

"చాలా లీలగా. అమ్మ ముఖం కన్నా, నాన్న చెప్పిన ముఖమే నాకు గుర్తుంది. అమ్మ చనిపోయిన తరువాత నుంచి నాన్న మాటలే మారిపోయాయి. ఏదో వేరే భాషలో మాట్లాడతాడు. ముఖ్యంగా అమ్మ గురించి చెప్పేటప్పుడు. ఏంటో పక్షులు,

ద్వీపాలు, తన్నుకుపోయే గద్దలు అంటాడు. అమ్మని వర్ణించేటప్పుడు మాత్రం భలే చెప్తాడు. ఏదో పదం వుంది... ఆ... సొగసు. సొగసుగా చెప్తాడు."

"నువ్వు మీ నాన్న డైరీలు చదువుతావని ఆయనకి తెలుసా?"

"తెలియదు... తెలిస్తే ఏం కాదు... ఆయన బాధంతా వుంది అందులో. అదంతా చదివి నేను బాధపడతానని అనుకుంటాడు. అంతే."

"అందులో ఇంకేమన్నా చదవ్వా ప్లీజ్..."

"ఇప్పుడే కదా ఆయన డైరీలు చదవడం...."

"ప్లీజ్... డిస్కస్ చెయ్యొద్దు... జస్ట్ నాలుగు పేజీలు చదువు ప్లీజ్..."

"ఓకే... జస్ట్ ఎ మినిట్..."

* * *

రెక్కల ఊహలు బాగుంటాయి. కానీ ఆ రెక్కల బరువే కిందకి లాగేస్తుందని అప్పుడు తెలియదు మాకు.

అండలేని ఇద్దరం కుటుంబంగా మారాము. కష్టమనే అలలు చాలా వచ్చి మాకు నిలబడటం నేర్పించి వెనక్కి వెళ్ళాయి. సునామీ వస్తుందని ఊహించలేదు మేము. దేవికి కేన్సర్.

"నా దగ్గరే వుంటావా? ఊపిరి అందనప్పుడు అడుగుతాను ముద్దుపెడతావా?"

పక్కనే ఎలా వుండగలను? బతకడానికి సంపాదించడం కాదు, బతికించడానికి సంపాదించాల్సిన రోజుల్లో?

ప్రేమ అనేది లేని ప్రపంచం వుంటే అందులో కన్నీళ్ళు వుండవేమో.

మరింకేముంటాయి? డబ్బులు. హాస్పిటల్ బిల్స్. మెడిసిన్స్. కన్సల్టేషన్ ఫీజ్.

డబ్బు అక్కర్లేదు. నేను సంపాదిస్తాను. నా శరీరాన్ని నోట్ల కట్టలుగా మారుస్తాను. కానీ ఒక మనిషి తోడు కావాలి.

"మీరు వస్తారా నాన్నా? అమ్మా?"

"ఇంత బతుకు బతికి దానికి ఊడిగం చెయ్యమంటావట్రా?"

"అది చచ్చిపోయిన తరువాత చెప్పు వచ్చి ఇంత మట్టి వేస్తాం."

తల్లిదండ్రి అత్తామామలుగా మారకూడదని తీసుకున్న నిర్ణయాలు. చావనీ వాళ్ళని.

"ష్! అక్కరలేదు మనకు. ప్రేమంటే తెలియనివారు వాళ్లు. అలాంటి కుటుంబాలలో పుట్టాం కదా–నన్ను ప్రేమించి ఎంత మంచిపని చేశావురా."

దేవి నా చేతుల్లోనే వుంది. నవ్వింది.

కౌగిలించుకోమంది.

"గట్టిగా" అంది.

సీతాకోకచిలకలు. తెల్లటి సీతాకోకచిలకలు. ఇంతకాలం నాతో వున్నవి ఈ సీతకోకచిలకేలా? ఇప్పుడు ఇలా విడిపడి ఎగురుకుంటూ... హాస్పిటల్ గది నిండా అవే... ఎగురుతూ... వాటన్నింటి మధ్యలో గోధుమరంగు చిమట. ఎగురుతూ... నా నుంచి దూరంగా ఎగురుతూ..

కౌగిలి మిగిలింది.

చేతుల్లో మనిషిలేదు.

ఎక్కడో పుట్టిన రెండు అలలు ఒకదానిని ఒకటి వెతుక్కుంటూ తిరిగాయి. వందల ఏళ్ళు. వేల మైళ్లు. అగాధాలు. ప్రేమించుకునే కాలంలో కలిశాయి. గట్టిగా ఢీ కొని ముద్దు పెట్టుకున్నాయి. మళ్ళీ వెనక్కి వెళ్ళిపోయాయి. సముద్రంలో నీళ్ళుగా మారిపోయాయి. మళ్ళీ అలలుగా మారాలి. వందల ఏళ్ళు ఆగాలి. వేల మైళ్ళు ప్రవహించాలి. అగాధాలు దాటాలి. మళ్ళీ కలవాలి.

* * *

"నేను ఎన్నిసార్లు ఏడ్చానో తెలుసా?"

"ష్! పెళ్ళిపీటల మీద ఏడుపు గురించి మాట్లాడేదాన్ని నిన్నే చూశాను"

"మీ నాన్నని చూసిన ప్రతిసారీ ఆయన రాసిన వాక్యాలే గుర్తుకొస్తున్నాయి"

"తరువాతైనా ఒప్పుకున్నారా మీ తాతయ్యా వాళ్ళు?"

"ఎవరినీ కలవనివ్వలేదు నాన్న. అదే నేను చెప్పేది. ప్రేమ బాగానే వుంది కానీ దాని పర్యవసానాలు? అవన్నీ కలిపి లెక్కేస్తే ప్రేమ ఇచ్చే ఆనందం..."

"ఏంటి కాస్ట్ బెనిఫిట్ ఎనాలసిసా? నువ్వో పెద్ద ఐసీడబల్యూఏ ఎండ్ ఎంబీయే"

"అవును అది కూడా ఐఐయం"

"పెద్ద గొప్పేకానీ... అళగి ఏది?"

"తను రాలేదు"

"ఏం?"

"వేరే జాబ్ వచ్చిందట. నాకు చెప్పను కూడా చెప్పలేదు. పోస్టింగ్ నోయిడా. నిన్ననే ఫ్లైట్ ఎక్కిందట."

ప్రణవి ఇంకేదో మాట్లాడబోయింది. కానీ అప్పుడే మోగిన మంగళవాయిద్యాలు ఆమె గొంతుకి అడ్డంపడ్డాయి. పెళ్ళి అయిపోయేదాకా మాట్లాడలేకపోయింది. తెల్లగా మెరిసిపోయే తన ఒంటి రంగుని చూసుకుంటూ వుండిపోయింది.

✦✦✦



# రిషి శ్రీనివాస్

మాది విజయనగరం. వయస్సు 30 చదువుకున్నది బిటెక్. ప్రస్తుతం ఇన్ఫోసిస్‌లో టీం లీడ్‌గా పని చేస్తున్నాను. కథ వ్రాయడం నాకు ఒక అనివార్యత. ఇప్పటివరకూ వివిధ పత్రికల్లో 15 కథలు రాశాను. నా మొదటి కథ 'రెక్కలు' 2014లో ఈనాడులో ప్రచురించబడింది. ఒకప్పటి బాల్య/కౌమార్య వివాహాలు, లిబిడో, బహుభార్యత్వంలో రొమాన్స్ గురించి ఇప్పటి ప్రిజుడిస్ ఈ కథ.

“ ఆడదానికి నిద్రలేకుండా చెయ్యడం కన్నా
ఆమె ప్రశాంతంగా ఆదమరచి నిదురించే సాంత్వనలో
స్త్రీని ఉంచడం ఎక్కువ మగతనం అనిపించిన ఘడియలవి. ”



# నిద్ర గన్నేరు

ఈ కథ నేను అరవయ్యేళ్ళ క్రితమే రాయాల్సింది.

కానీ అప్పుడే ఫస్ట్ ఫారంలో చేరిన నాకు సెలవు చీటీలకు మించిన తెలుగు, చాకలి పద్దులకు మించిన లెక్కలు రావు. పదిహేనేళ్ళ వయసుకింకా ఫస్ట్ ఫారంలోనే గుడ్లు పెడుతున్నానంటే నాకు చదువు చేతకాదని అప్పట్లో మా వాళ్ళందరికీ అర్థమైపోయింది. మరి చదువు చేతకానివాడికి సంసారం ఎలా చేతనవుననుకున్నారో ఏవిటో పెళ్ళి చేసేశారు. పెళ్ళంటే కేన్ బెత్తంతో పెళ్ళి కాదు నిజంగా పెళ్ళే !

వర్ధనమ్మతో ! వర్ధనం. నిత్యం పలవరిస్తేగానీ ఆ పేరులోని లాలిత్యం పట్టుబడదు. పెళ్ళినాటికి ఆమెకు పన్నెండేళ్ళు.

"వర్ధనమ్మ 72F ఎటెండెంట్ ఎవరండీ" మధుర స్మృతుల సరోవరాన్ని చెదరగొట్టగల చెక్కుడు రాతి గొంతుతో అడిగింది నర్స్.

"వర్ధనం నేనే" అనడానికి టైం పట్టింది. ఏమే ఉసేయ్‌ల పిలుపులలో విస్మృతంగా విసిరేయబడి పగిలిన శకలాలని పేర్చి కూడబలుక్కునేందుకు.

"ఫీడింగ్ తీసుకు రండి సర్".

మిక్సీలో వేసిన పప్పన్నం. నేను పొట్లాంతో కొని తెస్తే ఆమె ముక్కులో అమర్చబడ్డ గొట్టంలోనికి లాఘవంగా పోస్తుంది నర్స్. ఆ ఐ.సి.యూ. లోని బెడ్ పై పసిపాపలా

పడుకుంది ఆమె. వర్ధనం పుట్టడం నాకు బాగా గుర్తు. మా మేనత్త పురుడు మా ఇంట్లోనే. మంత్రసానిని తీసుకొచ్చాడు సత్యంతాత. నాకు తాత వరుస అంటే పెద్దోడేం కాదు. ఓ పదేళ్ళుంటాయి.

వర్ధనం పుట్టినప్పుడు కూడా ఇలాగే ఒక ఇనప మంచం మీద పడుకోబెట్టేరు. అప్పుడు వర్ధనం అందరికీ ముద్దొచ్చేది. ఇప్పుడు ఆమె నాకు తప్ప ఎవరికీ ముద్దుగా కనబడదు. నా కళ్ళు ఏళ్ళ తరబడి చేసిన సాధన అటువంటిది.

వర్ధనమ్మతో నీ పెళ్ళట్రా... అని వాలకాలు కట్టాడు సత్యంతాత. నాకు మాత్రమే సొంతమైన ఒక తోడు అన్న స్పృహను మించి అప్పటికి పెళ్ళంటే ఏం తెలియదు. మా ముంగిలిలో అలికిన మండపంలో కాళ్ళు తిమ్మిరెక్కేంతసేపు మఠమేసి కూర్చోబెట్టి ఏదో చేసేశారు. మా మేనత్త వాళ్ళు ఏడ్చేరు. ఎవరో భోజనాలు బాలేవన్నారు. ఆ రోజేదో అలా గడిచిపోయింది. అంతే గుర్తుంది. ఇయం సీతా మమసుతా సహధర్మ చరీతవా...

మర్నాడు కార్యం అన్నారు. అంటే ఏంటో తెలియకపోయినా ఏదో గగుర్పాటు. అరికాళ్ళ కింద ఎవరో మేకతోలుతో నిమిరినట్టు చక్కలిగిలి లాంటి పులకరం. ఏదో మనం చెయ్యకూడని పనిని చెయ్యడానికి ఉద్యుక్తత వ్యక్తపరచినట్లు ముఖంలో ఒక సంసిద్ధత.

పంతులు గారు వచ్చి మళ్ళీ ఏవో మంత్రాలు చదివారు. పరమాన్నం తినిపించమన్నారు. పెళ్ళి కుదిరాక వర్ధనం తలెత్తి నన్ను చూడ్డం అదే మొదలు. మునివేళ్ళకు కొన్ని మెతుకులు అంటుకొనేలా వెండి గిన్నిలోనికి చేతులు పోనిచ్చాను గానీ వర్ధనం సౌందర్యాతిశయమును దాటి నా చూపులు దారి మరల్చుకునే సాహసం చెయ్యలేదు.

మెల్లగా వేళ్ళు ఆమె పెదవులవద్దకు పోనిచ్చాను. సిగ్గుపడుతూ చిన్నగా నోరు తెరిచి అధరాలతో అన్నాన్ని లాక్కుంది. అద్గదీ... అప్పుడు కదా దాన్ని పరమాన్నం అని పిలవాలి! అంతవరకు అది వట్టి అన్నం.

తనూ నాకు తినిపించింది. చిన్నప్పటి నుంచి తెలిసిన పిల్ల అలా తినిపించేసరికి సిగ్గనిపించింది. తరువాత ఏవో వాయినాలిప్పించారు. పూబంతితో ఆటలాడించారు. ఆ సమయంలో బంతాట ఆడడం అత్యంత అర్ధరహితంగా, అపరిపక్వంగా అనిపించింది గానీ ఏవిటీ కాలయాపన అని దొడ్డవారిని అడిగే సాహసం చెయ్యలేదు.

కాసేపటికి మమ్మల్నిద్దర్నే ఆ గదిలో వదిలేసి అందరూ బైట వాకిట్లో పట్టి మంచాలేసుకుని పడుకున్నారు. విసనకఱ్ఱ, కిరసనాయిలు బుడ్డీ లాంతరు పక్కనే పెట్టి వెళ్ళిపోయింది మా అమ్మ.

కింద చాప మీద తెల్ల దుప్పటి పరిచి ఉంది. ఏదో హడావిడిగా సర్దినట్లు మల్లెలు చెదురుమదురుగా ఉన్నాయి.

ఎప్పుడూ చూసే పిల్లే అయినా ఆ రోజు లాంతరు వెలుగులో పచ్చగా కనబడింది.

"మనకేంటి ఇటువంటి స్థితి దాపురించింది" అన్నట్లు చూస్తున్నాయి కళ్ళు. బుగ్గలకింకా సిగ్గుపడేంత వయసు రాలేదు.

పెళ్ళి కుదిరిందన్న తత్తరలో కోరుకొండ కంసాలింటికి తీసుకెళ్ళి వర్ధనం ముక్కు కుట్టించేసింది మా చిట్టిమామ్మ. ఆ నొప్పింకా సలుపుతున్నట్లు ముక్కు పుడకను సర్దుకుని "స్..." అన్నది. బొండు మల్లెను పీలిస్తే ఎలా ఉంటుందో ఆమె "స్..." విన్నా అలాగే అనిపించింది నాకు. అది చెవికి ఇంపైన వాసన అనుకోవాలో ఏమో.

ఇందాక నేను తినిపించాక సరిగ్గా తుడుచుకోలేదేమో ఒక్క పాల చుక్క ఆమె కింది పెదవి పుట్టు మచ్చను కప్పుతూ కిందకి దూకాలా వద్దా అని తూలుతూ నిలబడింది.

"మూతికి పాలనురగ అంటింది. తుడుచుకోలేవూ" అన్నాను ఏదో ఒకటి అనాలి కాబట్టి.

"మీరే తుడవండి" అనే తెలివి లేదో ఉన్నా లేనట్లు తుడుచుకుందో.

తెలియని పిల్లైతే "ఏం చదివావు", "నీ గురించి ఏమైనా చెప్పు" లాంటి ప్రశ్నలు వేసే వెసులుబాటు ఉండేది. ఇక్కడ తావే లేదు.

"వీణా షణ్ముఖవడివు పాడిన శివ దీక్షాపరురాలనురా పాట నీకు బాగా వచ్చు కదా. ఒకసారి పాడతావా"

ముందు మొహమాటపడ్డా తరువాత పాడింది. ఉత్తప్పుడు మామూలుగా అనిపించే ఆ గాత్రం ఆ పూట మహాద్భుతంగా అనిపించింది. భుజం తట్టాను. ఆమె భయంతో పక్కకు జరిగింది. గిల్టీనెస్ అన్న మాట నాకు అప్పట్లో తెలియదు కానీ తను పక్కకు జరిగినప్పుడు నాకు కలిగిన భావం అదే.

నుదుటిపై చిరు చెమట పడితే విసనకఱ్ఱతో విసిరాను. గోడ వారగా చేరగిలబడి పక్కకి ఒత్తిగిల్లి పడుకుంది. దగ్గరకు వెళ్ళొచ్చో లేదో నన్న మీమాంశ నాకు. అక్కడే కూర్చొని చూశాను నేను. ఎంతకీ నిద్రపోదు.

"ఏం?"

"నాకు పామా చెయ్యందే నిద్ర పట్టదు" అంది.

ఈ పామా అన్న పదం మా ప్రాంతానికే చెందినదో లేదా మా ఇళ్ళకు మాత్రమే పరిమితమయ్యిందో తెలియదు గానీ మునివేళ్ళతో వీపు మీద లాలనగా, వీవనగా తగిలీ తగలనట్టు తేలియాడించే ప్రక్రియనే పామా అంటారు.

అది కవ్వింపు కాదు. ఆమె అంతటి జాణా కాదు. అప్పుడప్పుడు అనసూయత్తతో వర్ధనం పామా చేయించుకోవడం గుర్తే.

ఆమె వద్ద అనుమతి తీసుకోకుండా మీద చెయ్యి వేశాను. సినిమాలో హీరో హీరోయిన్ని పట్టుకున్నప్పుడు ఇచ్చే విచిత్రమైన ఎక్స్‌ప్రెషన్లేవీ ఆమె ఇవ్వలేదు. పైపెచ్చు దెయ్యాలు తిరిగే మధ్యరాత్రి మదీనా సాయిబు తావీజు ఒంట్లోకెక్కించే భరోసా లాంటి ఉపశమనం ఆమె ముఖంలో. వణికించే చలిలో అరచేతుల మధ్య పుట్టించే సాంత్వన లాంటి వెచ్చ. ఆమె జాకెట్ కాపుకి దొరకని వీపు పైనా, మెడ చుట్టూ, బుగ్గలపైనా, నుదుటి పైనా సుతారంగా నా వేళ్ళను కదిలించాను. ఇంత గొప్ప ప్రక్రియైనటువంటి పామా గురించి పురాణాల్లోనూ, ఇతిహాసాల్లోనూ వర్ణించలేని కవుల అవగాహనా రాహిత్యానికి తిట్టుకున్నాను.

అదే మొదటి సారి స్త్రీని ముట్టుకోవడం. కానీ ఆమె బాలిక, స్త్రీ కాదని నాకు తెలియదు. అంతకుముందు నాకన్నా పెద్దవారైన ఆడవాళ్ళని ముట్టుకున్నా ఇలా అనిపించలేదెందుకో. పసి పాప లాంటి చర్మం. అలా నిమురుతూ ఉన్నాను. ఎందుకో అంతకన్నా ఇంకా ఏం చెయ్యాలనిగానీ చెయ్యొచ్చుననిగానీ అనిపించలేదు. నెమ్మదిగా నిద్రలోనికి జారింది. చిన్నప్పుడెప్పుడో తను నెలల పిల్లగా ఉన్నప్పుడు ఉయ్యాలలో ఎలా నిద్రిస్తుండగా చూసానో అలాంటి నిద్రే. ఆడదానికి నిద్రలేకుండా చెయ్యడం కన్నా ఆమె ప్రశాంతంగా ఆదమరచి నిదురించే సాంత్వనలో స్త్రీని ఉంచడం ఎక్కువ మగతనం అనిపించిన ఘడియలవి. ఇంతకీ నిద్రలేకుండా చేసే ఆ మొదటిరకం తక్కువ మగతనం అంటే ఏవిటి ? నేను తక్కువ మగాడ్ని అనిపించుకోవాలంటే ఏవిటి చెయ్యవలసి ఉంది ? లాంటి చింతనలో నేనుండగా తెల్లవారిపోయింది.

రోహిణీ కార్తెలు.

పగలంతా ఆమెను కలుద్దామని ఏదో ఒకటి మాట్లాడదామని అనిపించింది. కానీ వీలు పడలేదు. రెండు మూడు రోజుల్లో రానున్న ఉగాదికి ఈరోజే ఏ గుడిలోనో

ఏ పంతులుగారో ఏ పంచాంగ శ్రవణమో పెడితే, దానికి నూతన వధూవరులకు ప్రవేశం నిషేధిస్తే ఎంచక్కా ఈ మందనంతా గుడికి తోలేసి నేనొక్కడ్నే నా పెళ్ళానికి పామా చేసుకుంటూ కూర్చునేవాడ్ని కదా అనుకున్నాను. ఇలా పనికొచ్చే కార్యక్రమాలు పెట్టకుండా ఆ పంతులుగారు ఇంట్లో కూర్చుని ఏం చేస్తున్నారో. బహుశా అతనుకూడా వారి భార్యకు పామా చెయ్యడంలో నిమగ్నులై ఉండి ఉండవచ్చుననుకుని సమాధానపడ్డాను.

పెళ్ళాం లేని ఒంటికాయ శొంఠికొమ్ము సూరీడు ఆరింటి వరకు అస్తమించకుండా అక్కడే తచ్చాడాడు. నిన్నటిది తొలిరాత్రి. నేటిది మలిరాత్రి.

నిన్నంత కొత్త లేదు. ఆమె ఈసారి నన్ను చూసి పలకరింపుగా నవ్వింది. తరువాతెప్పుడో మా ఇంటికి ట్యూబ్ లైట్ వచ్చినప్పుడు ఈ కాంతిని పోలిన వెలుగుని మునుపే నేనెలా ఎరుగుదునానని ఆలోచించగా ఇప్పటి ఈ నవ్వు గుర్తొచ్చింది.

నేనూ నవ్వాను.

"నిన్న రాత్రి బాగా నిద్రపట్టిందా"

"పట్టింది. అమ్మలక్కలు అడిగినప్పుడూ ఇదే చెప్పేను"

"ఏమడిగారు"

"రాత్రి నీ మొగుడు ఏం చేశాడూ అని"

"ఏం చెప్పేవ్"

"పామా చేసాడని చెప్పేను. గొల్లున నవ్వారు. మనం చెయ్యవలసింది అది కాదు కామోసు"

"పెద్ద ఆరిందవు... ఏం చెయ్యమన్నావ్ ?"

"ఏమో... నాకేం తెలుసు ?"

"నీకేమీ తెలియదా ?"

"తెలియదు. కానీ ముద్దు పెడతారేమో అనుకున్నాను"

నాకు నవ్వొచ్చింది. "ఇంకేం అనుకున్నావ్"

''బట్టలు విప్పమంటారేమోనని భయపడ్డాను. మీరు విప్పమంటే పారిపోదామనుకున్నాను. కానీ మీరు మంచివారు."

"ఎందుకు మంచివాడ్ని... బట్టలు విప్పమని అడగనందుకా ముద్దు పెట్టనందుకా"

"బట్టలు విప్పమని అడగనందుకు"

"అయితే ముద్దు పెట్టనందుకు చెడ్డ వాడినా"

లెంపలు వేసుకుని "అయ్యో కాదు" అంది. ఆ క్షణం, అప్పటి ఆమె రూపం తలచుకుంటే ఆ తక్కువ మగతనమేదో ఇప్పటికీ నాకు అనుభవంలోనికి వస్తుంది. దగ్గరకు తీసుకుని బుగ్గపై ముద్దు పెట్టాను. ఆమె ఏమీ అనకపోయేసరికి రెండో బుగ్గపై కూడా.

"చాలు చాలు" అంది.

"పడుకుంటావా"

"హ్మ్.."

"పామా చెయ్యనా"

"హ్మ్.."

చేశాను. వేళ్ళతో కాదు. పెదవులతో.

తొంగళ్ళ రాత్రి నాడు ఒకర్నొకరం గట్టిగా కౌగిలించుకుని పడుకోవడం తప్ప ఏం చెయ్యలేదు. ముద్దులు పెట్టుకున్నాం అని చెప్పుకోవడం అప్రస్తుతం. అయితే కథ ఇక్కడితో అయిపోలేదు.

మూడు నిద్రలు చెయ్యాలి కాబట్టి మాకు ప్రత్యేకమైన గదినిచ్చారు గానీ ఆ తరువాత నుంచి అలవాటు ప్రకారం ఆడవారు గదిలో, మగవారు వాకిట్లో పడుకోడం షరా మామూలైంది.

నాకు ఆమెతో మాట్లాడాలని, ముట్టుకోవాలని ఉండేది. కానీ పగలు బడి. సాయంత్రాలు "పెళ్ళయ్యింది. కనీసం ఎస్.ఎస్.ఎల్.సి. అయినా పాస్ అవ్వు" అన్న మావటి పొడుపులు.

అది వయసు కాకపోయినా విరహం ఏ స్థాయికి వెళ్ళిందంటే పద్దెనిమిదేళ్ళకే వేరు కాపురం వెళ్ళిపోతానని అడిగేంత. ఆమెకు పదిహేను. అమ్మ ఏడ్చింది. అయినా ఆస్తి పంచెయ్యమన్నాను.

వేరే ఊరెళ్ళి వ్యాపారం పెట్టాను. రాణించింది. ఆమెకు పద్దెనిమిది నిండే వరకూ రోజు మలి రాత్రి లాంటి రాత్రులే. తరువాత ఒక రోజున మంచివాడ్ని

కాననిపించుకున్నాను. ఆ తరువాత నెమ్మదిగా దుర్మార్గుడ్ని, రాక్షసుడ్ని, కిరాతకుడ్ని ఇంతింతై మరియు తానింతై తోయదమండలాగ్రమునకల్లంతై. మీకు ఈ రాక్షసత్వం నప్పిందని నవ్వుతుంది. తక్కువ మగతనం రుచి కూడా బాగానే ఉంది అనిపించింది.

ఆమెకు నిద్రెక్కువ.

పదింటిదాకా లేచేది కాదు. పసుపు నీరు పారని స్నానాల గది, గూట్లోనుంచి బైటకు రాని కాటుక–తిలకం, రథంలా నేలమట్టం కాని ముగ్గు, వాడిన తులసి మొక్క, కల్లాపి లేని వాకిలి, సుప్రభాతం లేని పూజగది, కాఫీ అంటుకోని నా పెదాలు... ఇవన్నీ బాగానే ఉండేవి నిదురిస్తున్న ఆమెను చూస్తుంటే.

నిద్రించే వాళ్ళని ముద్దు పెట్టుకోకూడదని ఎవడో చెప్పేడట. ఆ చెప్పినోడి పెళ్ళాం వాడికన్నా ముందే నిద్ర లేస్తుంది కావొచ్చు.

టేబుల్ ఫ్యాన్ ఇటు తిరిగినప్పుడు తొలిగిన ఆమె పైట... రవికలో దాగిన బుధుడు కుజుడు. రెండిటిలో ఏది చిన్న గ్రహం? నదీనదాల పంపకాలు అసమంగా జరిగినప్పుడు పుష్టిగా ఎదిగిన పంటలా ఒకటి. కొద్దిగా రాశి తగ్గినట్లు ఇంకొకటి. సారూప్యత లోపించడమే కదా అందమంటే.

నీకు నడుమే లేదు... పిడికిడంత నడుము, పట్టుకుంటే దొరకని నడుము... వల్లకాడేం కాదూ. లంబార్ స్పాండిలైటిస్ వచ్చి న్యూరాలజిస్ట్ చుట్టూ నీ పెళ్ళాన్ని తిప్పినప్పుడు తెలుస్తుంది నడుము ఉందో లేదో. ఎందుకొచ్చిన కప్పల తక్కెడ మాటలు?

ఆమెకు మాత్రం నడుముంది. చిరుబొజ్జ కూడా ఉంది. ఐడియల్ డైమెన్షన్స్ ఉండడానికి మనిషా మరా?

తొడల మీద స్ట్రెచ్ మార్క్స్ కూడా ఏదో డిజైన్ పెట్టినట్లు అందంగా ఉండేవి తనకి. ఆమె అందమైన మోకాలికి బోడి గుండుతో పోలికేవిటి? ట్రాష్.

నా పిచ్చి గానీ ఇదంతా నా సొంతమా? సొంతమవడం అంటే ఏవిటి ?

ఎంతకొరికినా ఆమె అందంలో అణురేణువైనా నాలోనికి ఇంకించుకోలేనప్పుడు ఆమె నా సొంతం ఎలా అయ్యింది?

పదేళ్ళ మా వైవాహిక జీవితంలో మేం తల్లిదండ్రులం కాలేకపోయాం. ఆమె తీవ్ర మనస్థాపం చెందింది. ఎన్నో మొక్కులు, నోములూ, వ్రతాలూ, పత్యాలూ,

వైద్యాలూ ఫలితం శూన్యం. గొడ్డుదాన్ని అంటగట్టారని మా మేనత్తని దుమ్మెత్తిపోసింది మా అమ్మ. వంశం నిర్వీర్యమైందని కలత చెందాడు నాన్న.

ఇక్కడొక విచిత్ర స్థితి తటస్థించింది. నేనెరగకుండా మా పెద్దలు, మా మేనత్త కుటుంబం కలిసి కూడబలుక్కుని మా మేనత్త రెండో కూతురు చిట్టిని నాకు ఇచ్చి రెండో పెళ్ళి చేయదలచారు.

నాకు అప్పటికి వయసు తక్కువ కాబట్టి అంత జ్ఞానం లేదుగానీ మొదటి భార్యకు సంతానం కలగకపోతే అప్పట్లో రెండో పెళ్ళి చేసేవారు. బహుభార్యత్వం అప్పట్లో పెద్ద వింతేమీ కాదని ఈ ప్రతిపాదన నా వరకు వచ్చినతరువాత అవగతమైంది.

ఇంతకూ చిట్టి ఏమనుకుంటుంది ? అసలు వర్ధనం ఏమనుకుంటుంది ? వాళ్ళిద్దరూ ఏమనుకుంటారోనని ఆలోచిస్తున్న నేను ఏమనుకుంటున్నాను!!

పెళ్ళిళ్ళపై వధూవరుల నియంత్రణ లేని రోజులవి. రెండో పెళ్ళి అయిపోయింది. మళ్ళీ అదే గ్రీష్మం. మళ్ళీ అదే ఇంటిముందు అలికిన మండపం. మళ్ళీ అవే మంత్రాలు. ఈసారి భోజనాలు బాగా కుదిరినాయి. మా మేనత్త కూడా ఏడవలేదు. పాప పరిహారం చేసుకుని మోక్షం పొందినట్లు గుండె బరువు దింపుకుని ఉంటుంది.

కార్యం రోజు పంతులు ఈసారి మరింత శ్రద్ధగా మంత్రాలు చదివాడు. నేను మరింత శ్రద్ధగా పరమాన్నం తినిపించాను. అయితే ఈ మాటు పరమాన్నం వర్ధనం చేసింది. బంతాటలూ, తాంబూలాలూ తరుణీకుచాలూ...

వర్ధనం తన చెల్లిని గదిలోనికి పంపి ఆమె ముందు గదిలో పడుకుంది.

వర్ధనాన్ని మనసారా ప్రేమించిన మాట నిజమేగానీ ఎందుకో చిట్టి నా గదిలో ఉన్నందుకు ఏదో తెలియని ఉద్విగ్నత. ఈమె వయసు పదహారు. అయినా అగ్నిహోత్రం. మొదటి రాత్రే కాంక్షగా చూసింది. వర్ధనం కన్నా ఎత్తుగా, బలంగా ఉంది. అన్నేళ్ళ సంసారిక జీవితం కళ్ళకు సౌందర్య పిపాసని తగ్గించి మోహావేశాన్ని పెంచింది. అట్టి కళ్ళకు బలిష్టమైన పిరుదులు, బరువైన కటిద్వయం, నునుపైన భుజాలు తప్ప ఏమీ కనబడలేదు. ఆమెను ఆక్రమించుకున్నాను. ఆమె శరీరంలోని భాగాలన్నీ వదిలేస్తే ఎగిరి వెళ్ళిపోతాయేమోనన్నంత తొందరగా... దేన్నీ విడిచిపెట్టకుండా... అనుభవం తెచ్చిన ప్రజ్ఞ, పనివాడితనం అక్కరకు రాగా...

ఒకరోజు చిట్టి గర్భవతి అయ్యింది. వర్ధనానిది ఏడుపూ నవ్వూ కాని తటస్థ స్థితి. అమ్మ వంద కొబ్బరికాయలు కొట్టింది. నాన్న ఊరంతా చాటింపు వేశాడు. సత్యంతాత అరటి గెలలు పంపించాడు.

ఇక మీసం మెలేస్తాననుకున్నారు అందరూ. నాకు మాత్రం సిగ్గుగా అనిపించింది. భార్యకు కడుపు తెప్పించడంలో పౌరుషం ఏముందీ... అసలితంగా సంభోగించలేకపోవడం చేతకానితనమైతేనూ!

మా అత్తకు ఒంట్లో బాగుండకపోతే వర్ధనం చిట్టెమ్మని పురిటికి పంపించకుండా ఇంట్లోనే చేసింది. అలా అలా చిట్టెమ్మకు ఏడుగురు సంతానం కలిగారు. సంతానమైతే చిట్టెమ్మకి కలిగారు గానీ నేను ఎక్కువగా కలిసింది వర్ధనంతోనే.

అయితే గమ్మత్తుగా ఇద్దరిపైనా ప్రేమ కలిగింది నాకు. చిట్టెమ్మ పైన ఏ ప్రేమాలేకుండా ఆమెను భార్యగా స్వీకరించి ఆమెతో శారీరక సుఃఖాన్ని పొందుతున్నాను అని చెప్పడం అబద్ధమే అవుతుంది. అలాగని వర్ధనం మీద ప్రేమ రవ్వంతైనా తగ్గిందని చెప్పడం సత్యదూరం.

ఇద్దర్నీ సమానంగా చూసుకున్నాను. పొరపాటున వర్ధనానికి బదులు చిట్టినీ చిట్టి బదులు వర్ధనాన్ని మార్చి పిలిచేవాడ్ని. ఇద్దరూ ఒకటే నాకు. ఒకటి రెండు సందర్భాల్లో తప్పిస్తే వాళ్ళిద్దరూ గొడవపడిన సందర్భాలు దాదాపుగా అరుదే !

"వర్ధనమ్మ 72F ఎటెండెంట్ ఎవరండీ"

"నేనే.."

"డాక్టర్ గారు మీతో మాట్లాడాలంట. పెండింగ్ బిల్ క్లియర్ చేసి రండి. గ్రౌండ్ ఫ్లోర్ రిసెప్షన్" అంది.

నా సెల్ మోగింది. తీశాను.

"అక్కకి ఎలా ఉందండీ?"

"ఉంది. ఇంకా ఐ.సి.యూ. లోనే"

"అక్కడే మీరూ ఉండిపోతారా? ఇంటికి దయ చెయ్యరా?"

"వర్ధనం దగ్గిర ఎవరో ఒకరుండాలి కదే"

“వర్ధనం నేనే... అక్క పేరు చిట్టి” ఫోన్ కట్ చేశాను.

కౌంటర్ కి వెళ్ళి బిల్ కట్టే ముందు పేషంట్ రికార్డ్ మార్పించాను... చిట్టెమ్మ 72F.

పైకి వచ్చి ఐ.సి.యూ. అద్దంలో నుంచి ఆమెను చూశాను.

ఆమె నిదురిస్తూ ఉంది. ఏ పామా అవసరం లేకుండా.

✦✦✦



# స్వాతి కుమారి

రిషివాలీ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్నాను. మనుషులంటే ఆసక్తి. మనుషుల ఆలోచనలు, మాటతీరు, రకరకాల వ్యక్తిత్వాలు ఎప్పుడూ కొత్తగానే అనిపిస్తాయి. వాటిని గమనించడం ఒక వ్యాపకం. చుట్టుపక్కల ఉన్న వాతావరణాన్ని గమనించడం, పదాల్లో పెట్టడం ఒక ఇష్టమైన ఆట. అరుదుగానే రాసినా కథలు రాయడం వెనకున్న కారణాలు ఇవే. రాసే వాక్యం చదవడానికి అందంగా ఉండాలనేది ఒక పట్టుదల. కథ చెప్పే పద్ధతి రొటీన్‌గా ఉండకూడదని ప్రయత్నం.

“మూవాన్” - నాలోంచి నన్ను పెకిలించుకుని,
అడ్డొచ్చే జ్ఞాపకాల్ని చిత్తుగా తొక్కేసి, వేర్ డూ ఐ మూవాన్?




# లవ్ మే హాపెన్

'లవ్ మే హాపెన్'

For love that smiled in April
Is false to me in May.
- *Sara Teasdale*

వేసవి శెలవులు అయిపోతున్నాయన్న స్పృహని అతిప్రయత్నం మీద మర్చిపోతూ లాన్ మీద బెలూన్లు ఎగరేస్తూ, సబ్బు బుడగలు ఊదుతూ పిల్లలు. ఉప్పేసిన నిమ్మసోడా లోంచి పైకెగసే తుంపరలు తాకేలా మొహానికి దగ్గరగా తీసుకుని పగటి అలసటని మర్చిపోయే నడివయసు పెద్దమనుషులు. సాయంత్రానికి ఫెళఫెళ తగ్గి ఇస్త్రీచేసి మడతపెట్టిన పాత పట్టుచీరలా రోహిణికార్తె ఎండ.

ట్యాంక్‌బండ్ మీద, ఏ చాటూ లేని బెంచీలో, చూడనట్టు నటిస్తూ కదిలిపోయే వందల చూపుల మధ్య వాళ్ళిద్దరూ. మెడలో నల్లటిదారానికి గుచ్చిన నత్తగుల్ల లాకెట్తో ఆమె. కొత్తగా ప్రయోగం చేసిన జెల్ వల్ల జిడ్డుగా కనపడుతున్న హెయిర్ స్టైల్‌తో అతను.

అతను ఆమె చేతిని తన రెండు చేతుల్లోకి తీసుకున్నాడు. దురుసుగా వెనక్కి లాక్కుంది. సంకోచంగా నడుం వెనగ్గా...

వేళ్లతో విదిలించి కొట్టింది.

"అదేది? ఇటియ్యి" అతని చేతిలో చెమటకి తడిచిన ప్రేమలేఖని గుంజుకుంది. తన దగ్గరున్న పొట్లాంలోంచి కొన్ని పల్లీలు ఆ కాగితంలోకి విదిలించి ఇందాకట్నుంచీ వీళ్లనే చూస్తున్న బిచ్చగత్తె చేతిలో పెట్టింది.

"కెంపు, ప్లీజ్, నువ్వంటే ప్రాణం రా!"

"చల్, ఇదంతా మనకి నడవదు. రూమ్మేట్ ఊరెళ్ళింది. ఈ శనివారం ఫోన్ చేసి వచ్చేయ్ కావాలంటే."

అతను విలవిల్లాడిపోయాడు. సమాజం ఆమోదించదనే భయంతో కన్నీళ్ళని దాచుకున్నాడు. అప్పటిదాకా మోచేతి వరకు మడిచిపెట్టిన ఫుల్ స్లీవ్స్ మడతలు విప్పి ముంజేతి మీదకి లాక్కున్నాడు. మణికట్టు వెనకవైపు బ్లేడుతో ఆరోజు ఉదయమే రాసుకున్న "కె" అక్షరం కవర్ అయిందా లేదా అని సరి చూసుకున్నాడు.

"పార్లల్ కెళ్లాలి. పోతున్న." సడెన్‌గా లేచి అటుగా వెళ్తున్న ఆటో కేకేసింది. ఆటో యూ టర్న్ తీసుకుని వచ్చేలోపు బెంచి మీదే ఉండిపోయిన అతన్ని పిలిచింది.

"బాబీ..."

ఉలిక్కిపడి ఇటు చూశాడు.

"ఒడ్డూ పొడుగూ బాగుంటావ్ కదా. అంతే. అంతకన్నా ఏం లేదు. మళ్ళీ ఇదో డ్రామా అవద్దు రేపు."

ఆటో వచ్చి ఆగింది.

కేఫ్ సైలెన్స్‌లో "ఫ్రూట్ పల్ప్ లాటే" ఆర్డర్ చేసి ఎదురు చూస్తుంది వాన. మెయిల్ బాక్స్ తెరిచి చూసింది – ఫ్లిప్కార్ట్, లింకిడ్ ఇన్, ఇండిగో, టాక్స్ సూత్రా వాట్సాప్ చూసింది – ఆఫీస్ గ్రూప్‌లో వీకెండ్ ఔటింగ్ ప్లాన్స్. ఫేస్బుక్ తెరిచింది. నాలుగేళ్ల క్రితం ప్రపోజ్ చేసిన పాత కొలీగ్, స్టేటస్మార్చాడు. "నా బంగారు తల్లులు" కవల పిల్లల ఫోటో ప్రొఫైల్ పిక్ పెట్టాడు. కాస్త వీక్‌గా ఉన్నారు. నడుమునుండి గొడుగుల్లా విచ్చుకున్న గౌన్లతో ఇద్దరూ. వెనక ఏదో లాన్, జారుడుబల్ల, మరో నాలుగేళ్ల తర్వాత వీళ్లవే యూకేజీ గ్రాడ్యుయేషన్ డే ఫోటోలు పెడతాడు.

'ఉఫ్'మని పెద్దగా గాలొదిలి, ఫోన్ బ్యాగ్‌లో పెడుతుంటే చేతికి తగిలింది పేపర్ ఉండ. దాన్ని టేబిల్ మీద పెట్టి అరచేతుల్తో సాఫీగా చేసింది. రాత్రి ట్యాంక్‌బండ్ మీద నడిచేటప్పుడు ఎవరో నలిపి విసిరేస్తే కాలికింద పడింది. మామూలు కాగితమైతే

పట్టించుకోకపోయేదే, నలిపేసినా ఆకర్షించేలా దాన్నిండా హృదయం గుర్తుల ప్రింట్. రేపు చూడొచ్చులే అనుకుని, తీసి బ్యాగ్‌లో వేసుకుంది.

అక్షరాలమీద కాస్త నూనె మరకలు. కళ్లజోడు సరిచేసుకుని చదవడానికి ప్రయత్నిస్తుంది.

ఈలోగా ఆర్డర్ వచ్చింది. అరుణ్ కూడా వచ్చాడు. ఆమె పక్కన ఉన్న కుర్చీని టేబుల్ ఇవతలవైపుకి లాక్కుని కూర్చున్నాడు.

"ఈ చెవిలో గాలి ఆ చెవిలోకి కొడుతుంది. బైక్ మీద రాకుండా ఉండాల్సింది."

ఎదురుగా ఉన్న గ్లాస్ తీసుకుని రెండు గుక్కలు గటగటా తాగేశాడు.

"మిక్స్డ్ ఫ్రూటా? బాగుంది... ఏంటది చదూతున్నావ్?"

"ఏదో ప్రేమలేఖ, ఎవరో కుర్రాడు చాలా అమాయకంగా రాశాడు. అమ్మాయి పేరు మాత్రం బాగుంది, "కెంపు"

"అవును. కొత్తగా ఉంది. సరే చెప్పు. ఏంటి మాట్లాడాలన్నావ్?"

ఆ కాగితం ఉండచుట్టి గురిచూసి మూలనున్న డస్ట్బిన్‌లోకి విసిరింది. లాటే గ్లాస్ మీద వేళ్లతో చిన్నగా దరువేస్తూ అంది.

"నిన్న నా పుట్టిన్రోజు"

"హే! సారీ... బిలేటెడ్"

"అందుక్కాదు. నాకిప్పుడు ముప్ఫై ఐదేళ్ళు"

"విషయం ఏదో సీరియస్‌లా ఉందే – ఊ... చెప్పు"

"అమ్మ పోయి ఆరు నెల్లౌతుంది. చాలా సంవత్సరాలుగా ఇద్దరమే ఉంటున్నాం. ఆ వయసులో ఆమె ఒంటరిగా ఉండలేదని నేను, నా బిజీ లైఫ్ లో ఇంట్లో ఉండి చూసుకుంటున్నానని ఆమె, బయటికి చెప్పుకునేవాళ్లం. తను ఇంట్లో ఉంది కదా అని నేనెప్పుడూ త్వరగా ఇంటికెళ్లలేదు. ఆఫీస్‌లో ఓవర్ టైం. తర్వాత బయట తిరగడం. వీకెండ్ పార్టీలు. ఒకవేళ ఎప్పుడైనా తలనొప్పితో త్వరగా ఇంటికెళ్ళిపోతే ఆమె తన గదిలోంచి బయటికొచ్చి చూసిందీ లేదు..."

"ఎందుకని అంతదూరం? మామూలుగా అట్లా ఉండరు కదా?"

"నా చిన్నప్పుడే అతనికి దూరమైంది. తను ఒంటరిగా ఉండగలిగే మనిషి కాదు. నాకు ఇబ్బందేమో అని మరెవరికీ దగ్గర కాలేకపోయింది. చాన్నాళ్ళు హైపర్ సెన్సిటివ్‌గా ఉండేది. ఎప్పుడూ దిగులుగా, విసుగ్గా. తర్వాత ఉన్నట్టుండి ఏమైందో ఏడవడం మానేసింది. తను చెయ్యాల్సిన పనులు చేసేది. నాక్కావల్సినవి చూసుకునేది. అంతే. బహుశా, నన్ను చూస్తే ఆమెకి తన త్యాగం గుర్తొచ్చేదేమో. నాకేమో నావల్ల ఆమె ఇట్లా అయిందని పెద్ద గిల్ట్ ఉండేది. అందుకే ఇద్దరం ఒకళ్లనొకళ్లం తప్పించుకు తిరిగేవాళ్లమేమో!"

"ఐనో. చాలా బాధగా ఉంటుంది, దగ్గరివాళ్ళు ఉన్నప్పుడు ఇన్సెన్సిటివ్‌గా ఉంటాం. మళ్ళీ తిరిగొస్తే ఈసారి అలా ఉండకూడదు అనుకుంటాం. ఆమెతో బాగుండాల్సింది అనిపిస్తుందా?

వాన ఏం మాట్లాడలేదు. గ్లాస్ ఎత్తి మిగిలిన లాటే తాగేసింది.

కళ్ళజోడు తీసి పక్కన పెట్టింది. టేబిల్ మీద రెండు కన్నీటి చుక్కలు. అరుణ్ కుర్చీ ఆమె పక్కకి లాక్కున్నాడు. హోల్డర్ లోంచి టిష్యూలు తీసి ఆమె చేతికిచ్చి చిన్నగా వీపు మీద తట్టాడు.

"ఆవిడ పోయినప్పుడు కూడా ఏడవలేదు నువ్వు. యు మస్ట్ బీ మిస్సింగ్ హర్ నౌ"

"ఊహూ... నో... ఇట్స్ హర్ ప్రెసెన్స్ దట్ ఐ మిస్."

"రెండూ ఒకటి కాదా?"

"మొదటి రెణ్నెల్లూ నువ్వు చెప్పినట్టే ఆలోచించా. మేము వేరేలా ఉండాల్సిందా? నేను తన కోసం ఏమైనా చేసుం డాల్సిందా? అసలు నా చిన్నప్పుడు ఏం జరిగింది? నేనెందుకు దేనికీ బాధ్యత తీసుకోలేదు. ఇట్లా రాత్రీ పగలు ఒకటే ఆలోచన్లు. కానీ ఈ ఆలోచనంతా ఒకరోజు ఆగిపోయింది. అయిందేదో అయిపోయింది. అంతకన్నా డిఫరెంట్‌గా ఏం జరిగేది కాదు అనిపించింది."

"ఎగ్జాక్ట్లీ... మన స్వభావాలు, పరిస్థితులు, అవసరాలు, ప్రయారిటీస్... ప్రతీ స్టేజ్‌లోనూ బోలెడు అడ్డంకులు ఉంటాయి. వెనక్కెళ్ళినా రిపెయిర్ చెయ్యలేం కొన్నిటిని"

"హ్మ్, ఇంతకీ నీకు చెప్పాలనుకున్న విషయం అది కాదు.."

"ఓ! మరేంటి?"

* * *

వాళ్ళిద్దరూ బిర్లా మందిర్ మెట్లు దిగుతూ ఉన్నారు. ఆ అమ్మాయి ఊరికూరికే చున్నీ సర్దుకుంటుంది. బాబీ అస్తమానం సెల్ చెక్ చేసుకుంటున్నాడు. 'మాట్రిమోనీ ప్రొఫైల్‌లో ఫెయిర్‌గా ఉంది, బయట అంత కలర్ లేదు' అనుకున్నాడు మనసులో. ఇద్దరికీ దాహంతోనూ, టెన్షన్‌తోనూ గొంతులెండిపోతున్నాయి.

"అంటే... నాన్న చెప్పారు. ఫ్యామిలీ అదీ నచ్చిందని. మీరు చూడాలన్నారనీ కానీ... లేకపోతే నేనసలు..." ఆ అమ్మాయి ముందుకు పడుతున్న పొట్టిజడని వెనక్కి వేసుకుంది. రోజూ వదిలేసే జుట్టుని ఆరోజే బలవంతంగా అల్లినట్టు తెలిసిపోతుంది.

"ఆ... అదే... అదే, అమ్మ చూసి రమ్మంది. ఫార్మాలిటీ కదా." చెమటతో అతుక్కుపోయిన వాచ్‌ని మణికట్టుమీద విదిలిస్తూ అన్నాడు.

"ఏంటా మచ్చ? వాచ్ కింద" ఆమె సిగ్గుగా పక్కకి చూస్తూ అంది.

"నథింగ్, వంట చేస్తుంటే కాలింది. పెళ్ళైపోతే ఈ బాధలుండవుగా. "ఆమె వైపు అర్థవంతంగా చూశాడు. ఆ అమ్మాయి అరచెయ్యి అడ్డుపెట్టుకుని చిన్నగా నవ్వింది.

* * *

"నాకిప్పుడు ముప్ఫై ఐదేళ్ళు"

"ఇందాక చెప్పావ్"

"టీనేజ్ నుంచీ ఇప్పటివరకూ, బోయ్ ఫ్రెండ్స్, ఎఫైర్స్ చాలానే నడిచాయి. పాతవాటి గురించి దిగులు పడటం, మిస్ అవడం కాలేజ్ రోజుల్లో ఉండేదేమో కానీ, తర్వాతెప్పుడూ లేదు. ఆఫీస్‌లో ఉన్నంతసేపూ రేస్‌లో ముందుండటం మీదే ధ్యాస. సాయంత్రమయ్యేసరికి బయట ఎవరో వెయిట్ చెయ్యడమో, నేనెళ్ళి పిక్ చేసుకోడమో. కాసేపు ఊరిమీద తిరగడం, వీలు కుదిరినప్పుడు ప్రైవసీ వెతుక్కోవడం. ఇంటికెళ్లాక అర్థరాత్రి వరకూ చాట్స్. వీటన్నిటి మధ్యల్లో గ్యాప్ ఉన్నప్పుడు అమ్మమాటలకి బదులు చెప్పడమో, ఎదురు చెప్పడమో. అంతే రొటీన్"

"ఇన్నాళ్ళుగా ఒకేచోట పనిచేస్తున్నాంగా, నీ లైఫ్ స్టైల్ ఇదని తెలుసు."

"ఇప్పుడు నేను ఇంటికెళ్ళేసరికి పొద్దున్న ఎక్కడ పెట్టిన వస్తువులు అక్కడే ఉంటాయి. నేను చేస్తే తప్ప ఏ శబ్దమూ రాదు. బాల్కనీలో నా బట్టలు మాత్రమే ఆరేసి ఉంటాయి. నేనలా సోఫాలో కూర్చుని టీవీ చూసేటప్పుడు అమ్మ అటూ, ఇటూ తిరుగుతూ ఉండటం, గది తలుపు వెయ్యడం, తియ్యడం ఇవేం లేవు. "ఇవ్వాళ ప్లంబర్

వచ్చేళ్ళాడు, రేపు మందులు తీసుకురా, ఫ్రిజ్‌లో పాలున్నాయేమో చూడు, చెప్పులు బయట తగలెయ్యి. తలపగిలిపోతుంది – ఆ పాటాలాపి పడెయ్. రిమోట్ నేలమీదుంటే కళ్లకి కనపడట్లే?" ఇట్లా ఎవరూ... ఎవరూ మాట్లాడరు నాతో. కొలీగ్స్, ఫ్రెండ్స్, జోక్స్ చెబుతారు, ఎప్పుడూ నవ్వుతూ పాలిష్డ్‌గా, టూ స్వీట్‌గా మాట్లాడ్తారు. ఎందుకో వెగటేస్తుంది. ఫ్లర్టింగ్, రొమాంటిక్ టాక్... ఇవైతే మరీ చిరాగ్గా ఉన్నాయ్. "కీప్ స్మైలింగ్, యు ఆర్ ఆసం, లుకింగ్ గార్జియస్" ఇలా ఎవరైనా అంటే లాగి కొట్టాలనిపిస్తుంది. పొద్దున సెల్ చూడగానే గుడ్ మాణింగ్ మెసేజ్ ఉంటే ఫోన్ విసిరికొడుతున్నా. "పనివాళ్ళెవరూ లేరిక్కడ, బెడ్ టీ ఇచ్చి లేపడానికి" అని డబా డబా తలుపు బాదే శబ్దంతో నిద్ర లేవాలనిపిస్తుంది.

అరుణ్, అర్థమౌతుందా?

అసలు... ఈ మే నెల్లో రోజూ నాలుగుసార్లైనా అనేది "ఉష్షో, ఏవెండలు, ఏవెండలు, మగ్గిపోతన్న ఈ ఇంట్లో" అని.

గుప్పెళ్ళు మూసి టేబిల్ మీద గుద్దింది. "అబ్బా" అని ఎదురు దెబ్బ తగిలినట్టు పెద్దగా అరిచింది. భుజాలు ఎగిరిపడుతుంటే వెక్కుతూ ఏడుస్తుంది. అమ్మ చనిపోయిన ఆర్నెల్లకి మొదటిసారి ఏడుస్తుంది.

"అర్థమవుతుంది, రిలాక్స్" అరుణ్ ఆమె భుజం చుట్టూ చెయ్యేసి పొదివి పట్టుకున్నాడు. కంగారుగా అటు వచ్చిన సర్వర్‌తో "ఏం లేదు. వుయార్ ఫైన్" అని చెప్పి పంపేశాడు.

దుఃఖం నెమ్మదించాక సర్దుకుని అంది.

"ఎప్పుడు ఏ రిలేషన్‌లో ఉన్నా, ఎవర్తోనూ కలిసి ఉండాలనుకోలేదు. ఇప్పుడనిపిస్తుంది. ఐ నీడ్ ఎ ప్రెసెన్స్ ఎట్ హెూం, టు మేక్ ఇట్ ఎ హెూమ్.

తన భుజం చుట్టూ ఉన్న అతని చేతి వేళ్లలోకి తన చేతి వేళ్ళు దూర్చి అదాటున అడిగింది.

"పోనీ నువ్వొచ్చేస్తావా? ప్లీజ్. ఉండిపోతావా నాతో?"

* * *

There is a better place than this, Emptiness. ఆడియో సిస్టమ్‌లో గంటనుంచి అదే పాట ప్లే అవుతుంది.

మిట్టమధ్యాహ్నం మంచానికి అడ్డంగా పడి నిద్రపోతుంది కెంపు. అది వచ్చిన నిద్రకాదు. తెచ్చుకున్న నిద్ర. ఏడ్చేడ్చి కళ్ళు వాచి, గోడకేసి తలబాదుకుని, అడవి జంతువు అరుపులా గదిలో వస్తువులు కంపించేలా వెర్రిగా కేకలేసి, ఇవన్నీ కాదని రాత్రుళ్ళలానూ వీలు కాదని, పగటిపూట బలవంతంగా తెచ్చుకున్న నిద్ర. నేలమీద చించి పోగులు పెట్టిన పాత డైరీలు, ఫ్యాన్ గాలికి గదంతా ఎగురుతూ ఉన్నాయి. డైరీల్లోనుంచి టైప్ చేసుకున్న వాక్యాలు లాప్టాప్ తెర మీద వెలుగుతున్నాయి.

పోయినేడాది ఇదే నెల

ఇవ్వాళ అతన్ని కలవాల్సినరోజు.

అతనొస్తానంటే వద్దని, వస్తే బావుండని

చెప్పకుండా ఏదో ఒక క్షణంలో తప్పక వచ్చేస్తాడని

ఆశపడి భయపడి గాయపడి భంగపడి

చివరికి అతను రాకుండానే మిగతా రోజుల్లానే గడిచిపోయినరోజు

అప్పట్లో ఐతే, ఎంతవద్దన్నా వచ్చేవాడు. ఏ భయాన్నీ లెక్క చెయ్యకుండా.

ఇప్పుడా? రావొద్దంటే నిజంగానే రాడు.

ఏమో! రమ్మన్నా రాడేమో!

ఏమన్నాడు? "బ్రేకప్" – ఇష్టాన్నా, కలలనా, హృదయాన్నా?

"మూవాన్" – నాలోంచి నన్ను పెకిలించుకుని, అడ్డొచ్చే జ్ఞాపకాల్ని చిత్తుగా తొక్కేసి, వేర్ డూ ఐ మూవాన్?

"అలవాటైపోతుంది" – ఏడుపా? బతుకా? రెండూ కాని శూన్యమా?

అంతకుముందు ఏడాది ఇదే నెల

"సముద్రం ఒడ్డున ఇసుకలో ఉన్నా... మిస్ యూ"

"మంచంమీద దుప్పట్లో ఉన్నా... మిస్ యూ టూ"

"ఇక్కణ్ణుంచి ఏం తీసుకురాను?"

"ఒక నత్తగుల్ల తెస్తావా?"

ఇంకొన్ని నెలల ముందు

"ఈ చీర ఎలా ఉంది?"

"నువ్వు కట్టుకుంటే బావుంది. విప్పితే నువ్వు బావుంటావు."

ఆ మధ్యలో ఎప్పుడో ఒకరోజు

"హెలో"

"ఆ, ఇప్పుడే స్నానం అయింది"

"అయ్యో ముందే తెలిస్తే వీడియో కాల్ చేద్దును."

"సంపుతా కొడకా, సంగజెప్పు"

మరీ మరీ మొదట్లో

నువ్వంటే ఎన్ని బింబాలు?

నువ్వంటే ఎన్ని అద్దాలు!

ప్రతీ అద్దంలోనూ నీరూపమే

అన్ని రూపాల్లోనూ అద్దంలా మెరిసిపోయే నువ్వే.

కెంపు ఉలిక్కిపడి లేచింది. మెడలో లాకెట్ గట్టిగా పట్టుకుంది. కలలోని వెక్కిళ్ళు బయటకీ కొనసాగుతుంటే మంచినీళ్ళు తాగి ల్యాప్టాప్ మూసేసి దిండు గట్టిగా కౌగిలించుకుని మళ్ళీ పడుకుంది.

* * *

ఆటో స్పీడ్‌గా వెళ్తుంటే ఎదురుగాలికి అతని జుట్టు ఎగురుతోంది. ఇవ్వాళ జెల్ పెట్టుకోలేదు.

"అమ్మాయి నచ్చింది. ప్రొసీడ్ అవుదాం" అని అమ్మకి ఫోన్లో చెప్తుంటే సెల్ పింగ్ మంది. "మీరు చాలా హాండ్సంగా ఉన్నారు. నేను నిజంగా నచ్చానా?" పెళ్ళి చూపులమ్మాయి.

"యూ లుక్ హెూంలీ. ఆమ్మకి చెప్పేశాను." ఆని టైప్ చేసి సెల్ జేబులో పెట్టుకున్నాడు. చేతిలో ప్లాస్టిక్ కవర్‌లో కొబ్బరిచిప్ప ప్రసాదం, ఒక ముక్క కళ్లకద్దుకుని తినబోతూ... "ఓ! ఇవ్వాళ శనివారం" చిన్నగా గొణుక్కున్నాడు. సెల్ బయటికి తీసి కాంటాక్ట్స్‌లో "కె" అక్షరం చూసి డైల్ చేశాడు.

* * *

అరుణ్ పొలమారేదాకా నవ్వుతూ ఉన్నాడు.

“ఇందుకు పిలిచావా నన్ను? గాడ్! ఇట్లా ఇట్లా అడిగేస్తావా? నువ్వు నిజంగా టూమచ్.”

నవ్వుతూనే మాట్లాడుతున్నాడు – “అసలు నన్నెందుకు?”

“ముందా నవ్వడం ఆపు. చెప్తాను. ఇన్నేళ్ళ పరిచయంలో ఒక అంచనా ఉంటుందిగా. మెంటల్లీ హెల్దీ మనిషి అని, ఛాదస్తాల్లేకుండా సింపుల్‌గా, ఓపెన్‌గా ఉంటావని...”

“అవన్నీ కొసరు. అసలు కారణం ఇంకేదో ఉంటుందిలే. చెప్పు”

“అంటే... మరీ... నాలుగేళ్ళుగా ఒకే టీంలో క్లోజ్‌గా పని చేస్తున్నామా? కాస్త ఏజెడ్ బట్ ఎలిజిబుల్ బాచిలర్‌వి. అయినా నేనెప్పుడూ నీకు ఎట్రాక్ట్ అవకుండా జాగ్రత్త పడ్డావుగా... అందుకు ముచ్చటేసి...”

అతనెటో చూస్తూ ఏదో పాట హం చేస్తున్నాడు.

“చెప్పింది విన్నావా? ఉంటావా నాతో?”

ఆమె చెయ్యి విడిపించుకుని చకచకా అడుగులేస్తూ కేఫే డోర్ వరకూ వెళ్లాడు. ఏం చెయ్యాలో తోచనట్టు వాన కూడ కుర్చీ వెనక్కి తోసి గబగబా వెళ్ళింది.

“ఏయ్, ఆగు, సారీ, నీకిష్టం లేకపోతే...” ఆమె వాక్యం ఇంకా పూర్తి కాలేదు.

“ఇందాకట్నుంచి డోర్ తెరిచి పట్టుకున్నా, నీకు పనివాళ్లెవరూ లేరిక్కడ. బయటకి తగలడు. ఇంటికెళ్దాం”

ఒక్క క్షణం ఏం అర్థం కాలేదు.

అర్థం అయ్యాక వాన ఆగలేదు.

సరిగ్గా నాలుగు సెకండ్ల తర్వాత కేఫ్ సైలెన్స్ డోర్ ఒక గట్టి కౌగిలింత బరువుకి కిర్రుమని ఊగింది.

* * *

(who knows, Sara could be wrong at times!)

✦✦✦



# పూర్ణిమ తమ్మిరెడ్డి

వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజినీరుని. చదవుకోవడం ఎక్కువ ఇష్టం. రాయడమనేది ఊహలన్నీ ఊసులై (aksharf.com) అనే నా బ్లాగుతో మొదలైంది. పదేళ్ళుగా పుస్తకం.నెట్ (pustakam.net) నిర్వహణ బాధ్యతలు పంచుకుంటున్నాను. అడపాదడపా కథలు రాస్తుంటాను. కరెంటు, రెంటులాంటి కష్టాల మధ్య సాహిత్యానికి దూరమవకుండా ఉండేందుకు ప్రయత్నిస్తూ ఉంటాను.

“యు ఆర్ ఆన్ యువర్ బెస్ట్ పాత్,
డిస్పైట్ మోర్ దన్ యూజ్‌వల్ మెస్.
యు విల్ రీచ్ యువర్ డెస్టినేషన్ ఇన్ ఫ్యూ లైఫ్‌టైమ్స్!”



# బ్యాక్వాటర్స్

"ఉష, ఇంజినీరింగ్ క్లాస్మేట్"

టెంపోకి మళ్ళీ బ్రేక్ పడింది. అర్ధరాత్రి కావస్తున్నా బెంగళూరుకి మాత్రమే అలవాటైన ట్రాఫిక్. డ్రైవర్ క్యాబిన్ దగ్గర నుంచొన్న వాళ్ళిద్దరూ ముందుకు తూలబోయారు. ముందు సీటులో ఉన్నవారు చేతులు అడ్డుపెట్టుకున్నారు. ఆమె బ్యాలెన్స్ ఆపుకుంటూ అతడి చేయి పట్టుకుంది.

"మొండిది. పట్టుకుంటే వదలదు." ఇరవై మంది దాకా ఉన్న ఆ టెంపోలో వాళ్ళకి చెప్పాడు శరత్. పట్టుకున్న చేయి ఠక్కున ఆమె వదిలేసింది.

ఇప్పుడామె వంతు. మూడు విషయాలు చెప్పాలి:

అ) అతడి పేరు

ఆ) వారి బంధం

ఇ) అతడు తనలో మార్చుకోవాల్సిన ఒక్క విషయమేమిటని తాను అనుకుంటుంది. వంతుల వారీగా, ఇద్దరేసి చొప్పున, టెంపోలో ప్రయాణం చేస్తున్న మిగిలినవారంతా చెప్పేశారు. స్నేహితులు, ప్రేమికులు, కలిసి పనిచేస్తున్నవారు, ఒకటే కుటుంబానికి చెందినవారు, ఇంతకు ముందు కలిసి చేసిన ట్రెక్కుల్లో పరిచయమైనవారు ఉన్నారు ఆ గుంపులో.

"శరత్. చెప్పాడుగా, ఇంజినీరింగ్ కలిసి చదివాం." అంటూ వచ్చేయబోయింది.

ట్రెక్ లీడర్లు ఒప్పుకోలేదు. "ఇంజినీరింగ్ అంటే నాలుగేళ్ళు! మస్ట్ బి డీప్ ఫ్రెండ్షిప్. చెప్పాలి."

"షిక్వా అప్నో సే కీ జాతీ హై!" అని వచ్చి సీటులో కూర్చుంది. అతడు వచ్చి పక్కనే కూర్చున్నాడు. అటువైపు సీటులో ఉన్న అన్వర్‌ని చూసింది, కొరకొరా. మొబైల్ తెరిచి, "యు విల్ పే ఫర్ దిస్!" అని మెసేజ్ చేసింది. బదులుగా ఒక నల్లకళ్ళద్దాల నవ్వు స్మైలీ వచ్చింది.

వాళ్ళ తర్వాత ఒక అమ్మాయి మిగిలింది. ఒక్కత్తే పరిచయం చేసుకుంది. ఆమెకి ఒంటరిగా ట్రెక్స్ చేయడం అలవాటంట! అలా పరిచయం చేసుకోవచ్చనుకుంటే, తను కూడా ఒక్కత్తే వచ్చానని చెప్పేది కదా?

"బేబీ, మనం ఒక్కళ్ళమే లవర్స్ అనుకుంట గ్రూప్లో..." అంటూ వయ్యారాలు పోయింది ముందు సీటులో ఉన్న అమ్మాయి. "ట్రీట్ అస్ స్పెషల్" అని లీడర్లతో అంది. "ఇది హనీమూన్ ప్యాకేజ్ కాదు మేడం. ట్రెక్కింగ్ చేయాలి. రేపు తెలుస్తుంది ఎవరు హీరోలో, ఎవరు జీరోలో!!" అన్నాడు ఒక ట్రెక్ లీడ్.

"ఆల్రైట్ ఫోక్స్! రేపు మనం శరావతి బ్యాక్వాటర్స్ చూడబోతున్నాం. సుమారుగా ఆరేడు కిలోమీటర్లు నడుస్తాం. బోలెడన్ని వాటర్ గేమ్స్ ఆడతాం. ఇట్ విల్ బి ఫన్, వి ప్రామిస్. బట్ ఆన్ సమ్ కండిషన్స్" అంటూ అక్కడ చేయాల్సినవి, చేయకూడనివి చెప్పుకొచ్చారు. అడిగిన సందేహాలు తీర్చారు. వచ్చే రెండు రోజులు శరీరానికి అలవాటు తప్పిన పనులు చేస్తాము కాబట్టి, సుబ్బరంగా నిద్రపొమ్మని చెప్పి టెంపోలో లైట్లు తీసేశారు.

శరత్ ఎలానో ఎదుటి సీటుకింద కాళ్ళు ఇరికించి, తల ఒక పక్కకి వాల్చి కళ్ళు మూసుకున్నాడు. నిద్రొచ్చే? మెలకువగా ఉంటే మాట కదులుతుందనో? మనిషి అవసరానికి మించిన డిప్లమసీ పాటిస్తుంటాడు. అన్వర్ కన్నుకొట్టే స్మైలీ పంపాడు – "యు విల్ థాంక్ మి ఫర్ దిస్!". ఉష మొబైల్ తీసి స్పెషల్ క్యారెక్టర్స్ అన్నీ టైపు చేసి పంపింది, బొటనవేళ్ళల్లో కోపాన్నంతా నింపి.

టెంపోలో చీకటి. బయటా మసక వెలుతురు. పక్కనే శరత్. కష్టపడి అలవాటు మానుకున్న మాదకద్రవ్యం మళ్ళీ కళ్ళెదుట పడినట్టు, పరిచయమున్న అతడి వాసన నిలువనివ్వటం లేదు. అతడి మీద చేయి వేస్తే? దగ్గరగా జరిగి తల వాల్చితే? ఏం

చేస్తాడు? పక్కకు నెట్టేస్తే? పట్టుకుంటే? నెట్టక, పట్టుకోక, చేయి వేసిందని తెలుస్తున్నా, ఊరుకుంటే?

ఆమె కిటకీ వైపుకి తల తిప్పింది. టెంపో సిటీ దాటినట్టుంది. వేగమందుకుంది. గాలి కూడా వేస్తుంది. బెంగళూరుకి అలవాటులేని ఉక్క. ఎండాకాలంలో కూడా రోజుకి ఒకసారైనా పడాల్సిన వాన, ఇప్పుడు జూన్ వెళ్ళిపోతున్నా జాడలేదు. “వర్స్ట్ సమ్మర్, మ్యాన్! ఇది బెంగళూరు కాదసలు!” అని జనాలు ఆయాసపడుతున్నారు. చూస్తూ చూస్తూ పరిస్థితులు చేజారిపోవటమంటే ఏంటో ఉషకి బాగా తెల్సు. పరిస్థితులు చేజారిపోతున్నాయని తెలుస్తున్నా చూస్తూ ఉండిపోవడం కూడా తెల్సు. మనవాళ్ళ విషయంలో అయినా, మన సిటీల విషయంలో అయినా.

దూరపు ప్రయాణం, అందులోనూ రాత్రి పూట. అది తెచ్చే నిశ్శబ్దం, ఏకాంతం. పైగా పక్కనే అతడు. గతాన్ని మరోసారి తోడిపోయడానికి మనసుకి అనువైన సమయం.

అందుకు శరీరం మాత్రం సహకరించలేదు. రెండు వారాల బట్టీ విపరీతమైన పని ఆఫీసులో. దానికి తోడు బ్యాక్పాక్ వేసుకొని చాలాసేపు నిలబడింది. టెంపో పదింటికల్లా సోని సిగ్నల్ కోరమంగలకి వస్తుందని చెప్పాడు అన్వర్. ఆమె తొమ్మిదిన్నరకే వచ్చేసింది. మడివాల నుండి బయలుదేరిన టెంపో కోరమంగలకి రావడానికి గంటపైగా పట్టింది. నాలుగు కిలోమీటర్ల దూరం గూగుల్ మ్యాప్స్‌లో ఎర్ర జెర్రిపోతులా కనిపించింది.

బంధాలకి కూడా కోఆర్డినేట్స్ ఉండి, వాటిని కొలవగలిగే ఆప్స్ ఉంటే, వాళ్ళిద్దరి మధ్య దూరాన్ని, “యు ఆర్ ఆన్ యువర్ బెస్ట్ పాత్, డిస్పైట్ మోర్ దేన్ యూజువల్ మెస్. యు విల్ రీచ్ యువర్ డెస్టినేషన్ ఇన్ ఫ్యూ లైఫ్‌టైమ్స్!” అని చెప్పేదేమో!

* * *

నడుస్తూ, నడుస్తూ ఉండగానే అమాంతంగా లాండ్స్కేప్ మారిపోయింది. పొలాలు, పాకలూ, గుట్టలూ, పుట్టలూ – మనిషి ఆధిపత్యాన్ని తెలిపే ఆనవాళ్ళన్నీ మాయమైపోయాయి. అనంతాకాశం, దాన్ని అద్దంలా ప్రతిబింబిస్తున్న నీటి సమూహం, మంచి కలర్ కాంట్రాస్ట్ అన్నట్టు గట్టంతా ఇటుకరంగు ఎరుపులో ఒక పక్క. శ్రద్ధగా అలికినట్టు గట్టు మీద గాట్లు – కనుచూపుమేర. నీటి మధ్యలో మంచి ఎఫెక్ట్ ఇవ్వడానికన్నట్టు నిటారుగా మోడుబారిన చెట్లు, ఎండిన కొమ్మలతో. ఎప్పుడో విండోస్ వాల్పేపర్ల మీదో, పనిగట్టుకొని గూగుల్లో ఎక్సాటిక్ ప్లేసెస్ గురించి వెతికినప్పుడు మాత్రమే కనిపించేలాంటి దృశ్యం.

మొబైళ్ళు, కెమెరాలు పోటీపడ్డాయి. కళ్ళెదుట కనిపిస్తున్న దానిలో భాగమవ్వాలని, దాన్ని దాచుకోవాలని.

కొలీగ్స్ అంతా కలిసొచ్చిన గ్యాంగ్, ఉషకి కెమెరా ఇచ్చి గ్రూప్ ఫోటో తియ్యమని అడిగారు.

ఫ్రేమ్లో ఒక చెట్టు, నీరు, మట్టి అన్నీ వచ్చేలా సెట్ చేసుకుంది. కెమెరా ఇచ్చేశాక కూడా ఆ చెట్టునే చూస్తుండిపోయింది. దానికి ఒక కొమ్మ మాత్రమే ఉంది. నీటిలో దాని నీడ తేలియాడుతుంది. తల తిప్పకుండా కేవలం కనుపాపలు మాత్రమే చెట్టునుండి తిప్పి ఇటువైపు చూస్తే శరత్ కనిపించాడు గట్టు మీద. ఆమె అటూ-ఇటూ మార్చి మార్చి చూసింది. ఆ చెట్టుని. అతడిని.

అన్వర్ ఆమెనే చూస్తున్నాడని ఆమె చూసుకోలేదు. "జీ నహీ భర్ రహా, క్యా?" అని అడిగాడు, తనివి తీరటం లేదా? "బార్ బార్ నసీబ్ హెూనెవాలా నజారా తో నహీ!" అంది ఆమె. అతడిని చూసి దాదాపు ఏడాది అవుతుంది మరి.

ఫోటోల హడావిడి అయ్యేసరికి అవతలి గట్టుకి తీసుకెళ్ళడానికి రెండు దోనెలు వచ్చాయి. మనిషి బరువుని బట్టి, వెంటున్న సామాను బట్టి నలుగురైదుగురిని ఒక్కోదాంట్లో పంపడం మొదలెట్టారు. అన్వర్, అతడి కొలీగ్ ఉన్న దోనెలో ఉష కూడా ఎక్కింది. శరత్ వెనక్కి ఉండిపోయాడు.

నీటి మధ్యలో ఆ చెట్టుకి దగ్గరగా వెళ్ళారు. దూరం నుండి చూసినప్పుడు, బాగుంటుంది కదా అని ఎవరో అక్కడ 'ప్లేస్' చేసినట్టు అనిపించింది గానీ దగ్గర నుండి చూస్తే అర్థమయ్యింది. ఆ చెట్టు ఎప్పటినుండో ఉండేదని, అది అప్పుడు ఇప్పుడు కూడా చెట్టేనని. బహుశా, శరావతి అనే నది మీద ఆనకట్ట కట్టకముందు నుండీ ఉందేమో? నది మీద ఆనకట్ట కట్టాక వెనక్కి తన్నిన నీరే "బ్యాక్వాటర్స్" అయ్యాయని గ్రూప్ లీడర్ చెప్పాడు. కేరళలో సముద్రపు నీరు వెనక్కి తన్నిన బ్యాక్వాటర్స్కి ఇక్కడకి ఎంత తేడా? అక్కడంతా బూడిదరంగులో నీళ్ళు, ఆకాశం, మధ్యమధ్యలో ఏవో నీటి మొక్కలు. నిలిచిన నీటిలో జీవం మనలేదు. కానీ, ఇక్కడేమో కళ్ళనూ, మనసునూ ఉక్కిరిబిక్కిరి చేసే రంగులు. ఆమెకి వెనక్కి తిరిగి ఒక్కసారి శరత్ని చూడాలనిపించింది. "కదలొద్దు. దోనెకి బ్యాలెన్స్ ముఖ్యం" అని పడవ నడిపే అతను వారించాడు.

అవే దోనెలు అటూ ఇటూ ట్రిప్పులేసి మొత్తానికి అందరినీ ఆవలి గట్టుకి చేర్చాయి. శరత్ చివరి ట్రిప్పులో వచ్చాడు. అతడితో పాటు నిన్న చివరిగా ఒక్కత్తే పరిచయం చేసుకున్న అమ్మాయి ఉంది. ఆమె దోనె దిగుతూ తడిగా ఉన్న మట్టిలో కాలు బెణికి

జారిపడింది. శరత్, అన్వర్లతో సహా అందరూ వంతులవారీగా ఆమెకు భుజాల సాయం అందించారు.

దోనెలు దిగిన దగ్గరనుండి ఓ రెండు మూడు కిలోమీటర్లు నడిస్తే గానీ వాళ్ళుండబోయే చోటు రాలేదు. గట్టూ, ఎదురుగా నీరు, వెనుకేమో దట్టమైన అడవి. "పోయిన ఏడాది నీరు ఇక్కడ వరకూ ఉండేది." అని చెప్పాడు ట్రెక్ లీడ్. "అప్పుడింకా వెనక్కి టెంట్లు వేసేవాళ్ళం. మూడేళ్ళ బట్టీ చేస్తున్నా ఈ ట్రెక్, నీరంత వెనక్కి వెళ్ళడం చూళ్ళేదు.."

కొంచెం సేద తీరాక అందరినీ దగ్గర్లో స్విమ్మింగ్ స్పాట్కి తీసుకెళ్ళారు లీడర్లు. ఉష కూడా వెళ్ళింది వాళ్ళతో పాటు. నీటిలోకి దిగకుండా ఒడ్డున కూర్చుంది. నీళ్ళల్లో మోకాళ్ళ వరకు, నడుం లోతు వరకు ఆడుతున్న వారందరిని చూసింది. ఈదగలిగినవాళ్ళని నీటి మధ్యలో ఉన్న మోడు మీదకి ఎక్కి దూకమని ప్రోత్సహించాడు లీడ్. ఉషకి ప్రమాదమనిపించింది, కొమ్మ విరిగిపోతే? లీడరే ఎక్కి, దూకి చూపించాడు. మెల్లిగా కొందరు ప్రయత్నించడం మొదలుపెట్టారు. చెట్టుకున్న బలం ఆమెను ఆశ్చర్యపరిచింది. లవ్ బర్డ్స్ జంటలో అమ్మాయి వచ్చి ఫోటోలు తీయమంది ఉషని. ఒక పావుగంట తీశాక, వాళ్ళ ముద్దూ మురిపాల డోస్ భరించలేక టెంట్లు వేసిన దగ్గరకి వచ్చేసింది.

అక్కడ శరత్, కాలు బెణికిన అమ్మాయి ఉన్నారు.

"ఇంట్లో ముందు ఒప్పుకోలేదుగానీ, ఆ హింసలు నేను పడలేకపోయాను. బయటకి వచ్చేశాను." ఉషను చూసినా చెప్తున్నది ఆపలేదు ఆ అమ్మాయి. "ఐ యామ్ ట్వెంటీ సెవెన్. సింగిల్–మ్యారీడ్–సింగిల్ ఎగైన్! లైఫ్ ఫక్స్!" అని చెప్పింది, ఉష వైపు కూడా చూస్తూ.

"టెల్ మి ఎబౌట్ ఇట్. ఒక్క ఆక్సిడెంట్. ఫ్యామిలీ మొత్తం" చెప్తూ శరత్ ఆగిపోయాడు. "షిట్" అన్నది ఆ అమ్మాయి. "ఐ యామ్ సారీ! ఎవరూ మిగల..."

"నోప్... నేను తప్ప, నోబడీ!" కొన్ని నిముషాల పాటు ఇబ్బందికరమైన నిశ్శబ్దం, ముగ్గురి మధ్య. పిట్టొకటి గట్టిగా అరుచుకుంటూ చక్కర్లు కొట్టింది. ఉషకి కూడా అరవాలనిపించింది.

"అబద్ధం చెప్తున్నాడు వీడు. ఆ ఆక్సిడెంట్ వీణ్ణి కూడా మింగేసింది."

శరత్ అప్పటికే అక్కడనుండి వెళ్ళిపోయాడు. "మస్ట్ బి టఫ్ ఆన్ హిమ్" అన్నది ఉషను చూసి. "ఆన్ మి టూ!" అని అనబోయింది ఉష.

* * *

రాత్రి భోజనాలు అయ్యాక అందరూ క్యాంప్ ఫైర్ చుట్టూ గుమిగూడారు.

“అయ్యల్లారా, అమ్మల్లారా! మొదలెట్టండి కథలు. వణుకు పుట్టాల, దడదడలాడాల!” అంటూ లీడర్ ఉత్సాహపరచడానికి ప్రయత్నించాడు. “అసలే పున్నమి రాత్రి.” అన్నాడు. “అయినా అమావాస్యలా ఉంది. చంద్రుడు కొంచెం కూడా కనిపించటం లేదు” అందో అమ్మాయి.

సాయంత్రం సన్సెట్ బాగుంటుందని రెండు కి.మీ. నడిపించుకొని వెళ్ళాడు. తీరా చూస్తే మబ్బులు పట్టేసి సూర్యుడు కొంచెం కూడా కనబడలేదు. రాత్రి టెంపోలో ఇరుక్కొని కూర్చొని, పొద్దున్న నుండి నడిచి, నీళ్ళల్లో ఆడి – నడుం ఇక నిలబడని వాళ్ళు మెల్లిమెల్లిగా వాలిపోయారు.

ఒక రౌండ్ మొత్తం పేరుపేరునా అడిగాడు కానీ ఎవరూ కథ అందుకోలేదు. అన్వర్‌తో పాటు వచ్చిన కొలీగ్ హర్యానాలో ఏదో చుడేల్ గురించి చెప్పాడు. ఆ తర్వాత తెలుగబ్బాయి ఒకడు బేగంపేట్ వైట్ హౌస్ వెనుక వీధిలో జరిగిన మర్డర్ కథ ఏదో చెప్పాడు.

ఉషని ఆటపట్టిస్తూ “దెయ్యాలు కూడా కథ చెప్పొచ్చు.” అన్నాడు లీడర్. ఆమె నవ్వి ఊరుకుంది. ఆమెకు మాత్రమే సొంతమైన హారర్ స్టోరీ కళ్ళ ముందు కదలాడింది.

“సెక్స్... దానికి మించిన మందు లేదు.” శరత్ని ఎలా కాపాడుకోవాలో తెలీటం లేదని ఆమె ఏడిస్తే వాళ్ళ గ్యాంగ్ ఇచ్చిన సలహా.

చేతి వేళ్ళల్లో వేళ్ళు వేసింది. దగ్గరగా జరిగింది. భుజానికి భుజం రాసుకుంది. మొహం తన వైపు తిప్పుకుంది. చెంపల మీద ఊదింది. జుట్టులోకి వేళ్ళు పోనిచ్చింది. గట్టిగా ముద్దుపెట్టుకుంది. వెనక్కి జరిగి చూసింది. ఒక్కసారి వాటేసుకుంది. మొహం మీద ముద్దులు పెట్టింది. ఛాతీనంతా తడిమింది. చేతులు చేతుల్లోకి తీసుకొని తన ఛాతీ మీద తిప్పింది. వేసుకున్న షర్ట్ లోపలకి చేతులను తీసుకెళ్ళింది.

అతడి కళ్ళల్లోకి చూసింది. తననే చూస్తున్న కళ్ళు. తన దగ్గర ఆగని కళ్ళు. ఏ భావం కనిపించని కళ్ళు. తనను గుర్తుపడుతున్నాడా, లేడా అని అనుమానం తెప్పించే కళ్ళు. అసలు మనిషి ఇంకా ఉన్నాడా, లేడా అని భయపెట్టే కళ్ళు.

చెంపల మీద కొట్టింది. చూపు మారలేదు.

భయంగా లేచి నుంచుంది. చూపు మారలేదు.

పరిగెత్తుకొని బయటకు వచ్చింది. చాలా దూరం పరిగెత్తింది.

"గివ్ హిమ్ సమ్ టైమ్.", "ప్లీజ్ అండర్స్టాండ్!", "నీకే ఇంత కష్టంగా ఉంటే, అతడి పరిస్థితేంటి?", "కొంచెం ఓపికపట్టు." అన్నీ ఆమెను తరిమాయి. ఆమె పరిగెత్తుతూ పోయింది. అతడికి అండగా ఉండాలన్న తాపత్రయంలో, ఆదుకోలేకపోతున్నానన్న అపరాధభావనతో, తమ బంధాన్ని కాపాడగలిగేంత శక్తి తన ప్రేమకి ఉందో, లేదోనన్న అనుమానాలతో...

కొన్ని జీవితకాలాలు పట్టేంత దూరం ఏర్పడింది.

మ్యూచువల్ ఫ్రెండ్స్ ఫేస్బుక్లో పెట్టిన ఫోటోలు చూసేది. అతడిని ఫోటోషాప్ చేసినట్టుండేవి–ఎటో చుస్తూ, ఏదో ఆలోచిస్తూ, ఆ ఫ్రేమ్కి తనకీ ఏ సంబంధం లేనట్టుండేవి ఆ ఫొటోలు.

కానీ, కనీసం ఫ్రేమ్లో ఉండేవాడు. ఉషతో అదీ లేదు. "ఆక్సిడెంట్ నావల్ల జరిగిందని నువ్వు అనుకుంటున్నావా?" లాంటి అసంబద్ధమైన ప్రశ్నలు కూడా అడిగింది. అన్నింటికీ ఒకటే సమాధానం – మౌనం.

* * *

"ఇంత సైలెంట్ ఏంటి బాబూ, నువ్వు? మాటలొచ్చా నీకసలు?" ట్రెక్ లీడ్ అడిగాడు శరత్ని. క్యాంపులో దాదాపుగా అందరూ నిద్రపోయారు. అరకిలోమీటర్ నడిస్తే ఒక బ్యూటిఫుల్ స్పాట్కి తీసుకెళ్తానంటే, అన్వర్, శరత్, ఉష తప్ప ఎవరూ రాలేదు.

"ఏం? ఇంతటి స్వచ్ఛమైన నిశ్శబ్దాన్ని ఎందుకు మాటలతో పాడు చేయాలి?" ఉష కోపం దాచలేకపోయింది. అన్వర్ ట్రెక్ లీడ్ని పక్కకు తీసుకెళ్ళాడు ఏదో వంకతో.

మొత్తం చీకటి. అంతా నలుపు. ఇంకో రంగుకి అవకాశం లేదు ఆ కాన్వాస్లో. అయినా, రవ్వంత షేడ్ తేడాలతో ఎన్ని నలుపులో... ఆకాశమంటూ ఓ నలుపు, మబ్బుల చాటున చంద్రుడున్నది ఇక్కడేనని చెబుతున్న పల్చబడిన నలుపు, గాలికి సన్నగా కదులుతున్న నీళ్ళ నలుపు, నిటారుగా మోడులా నుంచున్న చిక్కటి నలుపు, గుబురుగా దూరంగా చెట్ల నలుపు.

ఆకాశం, చంద్రుడు, నీరు, చెట్లు, గట్టు, వాళ్ళిద్దరూ – ఒకటే నల్ల దుప్పటి ముసుగేసుకున్నట్టు. ముసుగులో గుసగుసలాడుకుంటున్నట్టు.

"ఇలానే ఉంటుంది. ప్రతి రాత్రి. ప్రతి రోజు. ప్రతి క్షణం ఇంత చీకటి. ఇంత సైలెన్స్!

"ఇంటికి వెళ్తే ఎవరూ ఉండరు. సడన్గా అమ్మ పిలుస్తున్నట్టు అనిపిస్తుంది. అందరూ వచ్చేసినట్టు అనిపిస్తుంది. ఇట్స్ కిల్లింగ్ మీ!"

తడుముకుంటూ అతడి చేతిని చేతిలోకి తీసుకుంది. దాన్ని ఆసరాగా తీసుకొని దగ్గరగా జరిగి, వీపు చుట్టూ చేయి వేసింది.

"నాకెందుకీ శిక్షో తెలీదు. బట్, యు డిజర్వ్ బెటర్."

"యు ఆర్ నాట్ ఎ చాయిస్ ఫర్ మి. ఆ స్టేజ్ మనం దాటేశాం. అర్థమవుతుందా నీకు?"

* * *

ఇంకా వెలుగు రాకముందే అందర్నీ లేపి తిరుగు ప్రయాణానికి సిద్ధం చేశారు ట్రెక్ లీడర్లు. పక్షుల కచేరీ వింటుండిపోయారు కొందరు. రాత్రి వాన పడినా మబ్బులింకా వీడలేదు. ఒక్క రాత్రిలో పోయే ముసురు కాదది.

మళ్ళీ దోనెల్లో అవతలి గట్టుకి చేరుకున్నారు. దగ్గర్లో ఉన్న ఒక కొండ మీదకి ఎక్కారు, ఓ నాలుగైదు కి.మీ.లు నడిచి. కొందరు కొండ శిఖరానికి ఎక్కారు, శరత్ ఉన్నాడు వారిలో. మిగితా వాళ్లంతా టాప్ వ్యూ కనిపించే దగ్గర ఆగిపోయారు. ఆమె మళ్ళీ మళ్ళీ తనివి తీరా చూసుకుంది బ్యాక్ వాటర్స్ని. "ఇక్కడికి జోగ్ ఫాల్స్ చాలా దగ్గర." ఎవరో అన్నారు. శరత్ కొండ పైనుండి దిగుతూ కనిపించాడు.

సోమవారపు రద్దీకి ఆదివారం రాత్రి నుండే సన్నద్ధమవుతుంది బెంగళూరు ట్రాఫిక్. సిటీలోకి అడుగుపెట్టి రెండుగంటలు అయ్యింది. టెంపోలో గట్టిగా మ్యూజిక్. ఉన్న చోటులోనే డాన్సులు చేస్తున్నారు కొందరు.

"హే! మీరు కూడా లవర్సా? ఛుపా రుస్తుమ్స్!" అంది పక్కకే ఉన్న లవ్-బర్డ్స్ జంటలో అమ్మాయి, శరత్ ఉషలను చూసి.

కాలు బెణికిన అమ్మాయి వెనక్కి తిరిగి నవ్వింది, "నేను అనుకున్నా!" అంటూ.

సిటిలో ఉక్క మళ్ళీ స్వాగతం పలికింది. చేరాల్సిన గమ్యం ఇంకా గంటకుపై మాటేనని చెప్పాయి మ్యాప్స్.

ఉష కళ్ళల్లో మాత్రం బ్యాక్వాటర్స్ రంగులు నిండి ఉన్నాయి, నలుపుతో సహా.

✦✦✦



# మానస ఎండ్లూరి

నెల్లూరులో పుట్టాను. రాజమండ్రిలో పెరిగాను హైదరాబాద్‌లో ఉంటున్నాను. ఇక్కడ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పీజీ చేశాను. నా కథా సంకలనం 'మిళింద' ఈ సంవత్సరం వెలువడింది. ప్రేమకథలు రాసినప్పుడు ఒక లాంటి సంతృప్తి ఉంటుంది. నేను కేవలం స్త్రీ పురుషుల మధ్య ఉండే ప్రేమని వారి ప్రేమ జీవితాన్ని మాత్రమే చూడను. భిన్నంగా ఉండే వారి ప్రేమలు, సెక్సువల్ మైనారిటీస్ ప్రేమలు నన్ను వెంటాడుతుంటాయి. ప్రేమకి లింగం లేదు. అలాంటప్పుడు లింగ భేదాలు, తారతమ్యాలు ఉండవు కదా!

“ అన్నీ తెలిసిన అనుభూతులే.
అనుభవించిన జ్ఞాపకాలు కళ్ళ ముందే ఉన్నా
మళ్ళీ నూతనంగా ప్రేమలో పడడం బావుంది. ”



# నా జూలియా

“రేఖా! ఎప్పుడు చెప్తావ్ ఇంట్లో” నా దగ్గరగా వస్తూ అడిగాడు సందీప్.

“చెప్తాలే నా పీహెచ్డీ పూర్తి చేయాలి కదా” మంచం మీద కాస్త ఇబ్బందిగా కూర్చుంటూ అన్నాను.

“మనకంటే తర్వాత వచ్చిన మన జూనియర్స్ సతీష్ రుక్సానా పెళ్లి చేసుకుని కాపురం పెట్టేశారు. మా ఇంట్లో మన విషయం ముందే తెలుసు కాబట్టి పెద్దగా ఇబ్బంది పెట్టరు. మీ ఇంట్లో కూడా అనుమానాలు ఉన్నాయి మనం ఏదో ఒక రోజు ఈ మాట చెప్తామని. అదేదో త్వరగా కానివ్వచ్చు కదా” నా నడుం మీంచి టీ షర్ట్ పైకి లేపుతూ మాట్లాడుతున్నాడు సందీప్.

“దీపు నాకు బాలేదు పోరా. ఇప్పుడు కాదు” మీదకు వస్తున్న సందీప్‌ని ఆపకుండానే అన్నాను.

“నిజంగా ఒంట్లో బాలేదా..” మాటలు గుసగుసలయ్యాయి.

“ఎన్నిసార్లు చెప్పినా ఇంతే. మరకలవుతాయి. లే” తనని నా వైపు ఇంకాస్త లాక్కుంటున్నా.

“ఉతికితే పోతాయిలే”

"నొప్పిగా ఉంది ఇంక చాలు"

"మ్మ్... అప్పుడేనా"

బాధననుభవిస్తూ అతన్ని తృణీకరిస్తున్నట్టు నటిస్తూ కొన్ని నిమిషాల్లోనే అరుణ కొసను తాకాను. సందీప్ స్నానం చేసి వచ్చి మత్తుగా నిద్రపోతున్న నన్ను లేపాడు.

"పడుకోనీ కొద్దిసేపు"

"ఏహే లెగు బెడ్ షీట్ మార్చాలి" కసిరాడు.

ఓపిక లేకుండానే స్నానానికి వెళ్లాను. మధ్యలో తలుపు కొట్టి నానబెట్టమని బెడ్ షీట్ ఇచ్చాడు.

కొత్త దుప్పటి పరిచి పక్క సర్దాడు. బట్టలు మార్చుకున్నాడు. నేను బయటకు వచ్చిన వెంటనే బండి తాళాలు తీసుకుని

'బియ్యం పెట్టు కూరలు తీసుకొస్తా'నంటూ  బయలుదేరాడు.

'బియ్యం కూడా పెట్టేసి వెళ్లచ్చు కదా. అసలే నీరసంగా ఉందని చెప్పాను. ఎప్పుడూ ఇంతే' విసుక్కుంటూ వంటింట్లోకి వెళ్లాను చేసేది లేక.

* * *

"ఐ లవ్ యు"

"సరే. అయితే ఏం చేయమంటావ్"

"నన్ను పెళ్లి చేసుకోమంటాను"

"ఏంట్రా నా మీద నమ్మకం లేదా? సాయంత్రం మమ్మీ వస్తుంది. నేను హాస్టల్‌కి వెళ్ళాలి. జరుగు"

నిలబడే పెనవేసుకున్న సందీప్ నన్ను మరింత బిగుసుకున్నాడు.

"ఎన్ని రోజులు"

"రెండు"

"నా వల్ల అస్సలు కాదు"

"తప్పదు"

"నన్ను వచ్చి పలకరించమంటావా మీ మమ్మీని. చూసి కూడా చాలా రోజులైంది"

"వద్దు. అనుమానమొస్తుంది. పీహెచ్డీ థీసిస్ సబ్మిట్ చేశాక చెప్తా. అప్పుడు ఏదైనా గొడవ వచ్చినా నా రీసర్చ్ డిస్టర్బ్ అవ్వదు"

"ఎంతసేపు నీ స్వార్థం తప్ప నా కంగారు పట్టదా నీకు? ఇప్పటికే నీకు మూడు సార్లు సంబంధాలు ఖాయం అయ్యేదాకా తెచ్చుకున్నావ్"

"సరే చూస్తాలే. హాస్టల్ రూమ్ క్లీన్ చేసుకోవాలి. వెళ్ళి నెలైంది. అవునూ కరెంట్ బిల్లు కట్టేవా"

"కడతాను రేపు. టైంకి రెంటు కరెంటు బిల్లు కడతామంటేనే కదా మనకి ఇల్లు ఇచ్చాడు. ఓనర్ యూఎస్‌లో ఉంటాడు కాబట్టి పెళ్లయిందని చెప్పాం.."

"ఆ సరెలే. ఇప్పుడు మళ్లీ పెళ్లి గోల మొదలు పెట్టకు. వస్తాను"

వెళ్ళిపోతున్న నేను వెనక్కు వచ్చి సందీప్ గుండెలపై వాలక తప్పలేదు. అలాగే రెండు గంటలు పెట్టుకున్న ఒకే ఒక్క ముద్దు మధ్య 'ఇక వెళ్ళాలి' అని నేను ఎన్నోసార్లు అనడమూ తప్పలేదు.

నేనంతే. విడిచి వెళ్ళలేను. వెళ్తే ఉండలేను.

* * *

నేను హాస్టల్‌లో ఉండటం లేదని మా అమ్మకి ఏ అనుమానమూ రాకూడదనే కొలమానంతో నా గదిని శుభ్రం చేసుకునే సరికి అలిసిపోయా. ఈ శుభ్రత కేవలం రూమ్‌కి మా అమ్మా అక్కా వచ్చినప్పుడే. మిగతా సమయమంతా సందీప్, ఇల్లూ సంసారం, పీహెచ్డీ తోనే.

ఎంత సర్దినా అమ్మ మెచ్చుకోనే మెచ్చుకోదు. ఆమేదో తన ఇల్లుని ఇంద్రభవనంలా పెడుతుందని కాదు. అమ్మ అంటే ఇలానే ఉండాలి కదా. అందుకు.

తల్లీకూతుళ్ళం ఏవో కబుర్లు చెప్పుకుంటుంటే గుమ్మంలో కనబడింది జూలియా.

"హాయ్ రేఖా ఎలా ఉన్నావు. చాలా రోజులైంది చూసి" అంటూ లోపలికి వచ్చింది.

"బావున్నాను. ఏ రూమ్‌లో ఉంటున్నావు జూలియా ఇప్పుడు?" కుర్చీ చూపిస్తూ పలకరించా.

"పక్క గదిలోనే. నీ థీసిస్ సబ్మిషన్ అయిపోయిందా?"

'పక్క గదే' అన్న మాట విన్న వెంటనే అమ్మ ముఖం గంభీరమైంది. నేను గతుక్కుమన్నాను. జూలియా గమనించకపోలేదు.

"జూలియా అంటే నీ పాత రూమ్మేట్ కదా! ఈ సంవత్సరం హాస్టల్ తెరిచి నెలన్నరవుతుంది. జూలియా పక్క గదిలో ఉంటున్నట్టు నీకు తెలియదా" అమ్మ కోపంగానే అడిగింది.

"అంటే నేను పొద్దున్నే దిగాను ఆంటీ అప్పుడు తను డిపార్ట్మెంట్‌కి వెళ్లుంటుంది"

జూలియా సమయస్ఫూర్తికి చూపులతోనే అభినందించాను.

"ఆ... లైబ్రరీకి కూడా వెళ్లి మధ్యాహ్నం వచ్చాను. అప్పుడు తను లేదు" నవ్వుతూ చెప్పాను అమ్మకి.

కిటికీలో వదలని దుమ్మునే చూస్తూ అమ్మ కూడా నవ్వింది!

జూలై మాసం

తొలకరి జల్లు...

కానీ అమ్మ పక్కనే పడుకుని ఉంది. సందీప్ పక్కన ఉంటే బావుణ్ను అనుకోవడం తప్ప అమ్మను తిట్టుకోలేనుగా. బయట తాళం పెట్టి ఒక గంటలో తిరిగి వస్తే ఈ లోపల అమ్మ లేస్తుందా. ఈ వర్షంలో సందీప్‌ని ఇబ్బంది పెట్టడం ఎందుకు. కలవడం ఇబ్బంది ఎందుకవుతుంది. వెంటనే మెసేజ్ పంపాను హాస్టల్‌కు రమ్మని. హాస్టల్‌కి చాలా దగ్గరలో ఉండే ఇల్లే తీసుకున్నాం. సందీప్ ఆఫీస్‌కి దూరమే అయినా నాకు యూనివర్శిటీ దగ్గరగా ఉంటుందని.

బండి మీద తడుచుకుంటూ రెయిన్ కోట్‌లో వచ్చాడు సందీప్. మరో రెయిన్ కోట్ నాకు ఇచ్చాడు. దాదాపు మూడేళ్ల నుంచి కలిసి ఉంటున్నా... కదా సంసారానికి సరిపడా అన్ని వస్తువులూ ఉన్నాయి. ఇద్దరం వర్షంలో గజగజా వణుక్కుంటూ ఇంటికి వెళ్లాం...

చీకట్లో కిటికీ అద్దాల్లోంచి జూలియా కళ్ళు మమ్మల్ని గమనిస్తూనే ఉన్నాయని నాకు తెలుసు.

"నాకు ముందే తెలుసు ఇది జరుగుతుందని" తడి బట్టల మీదే నన్ను ఎత్తుకుంటూ అన్నాడు సందీప్.

"ఒరేయ్ మా అమ్మ లేస్తే కొంపలంటుకుంటాయ్. త్వరగా వెళ్లిపోవాలి."

నా పెదాలను తన పెదాలతో మూసేశాడు. సందీప్‌తో ప్రతిసారీ మొదటిసారే. అలవాటైన నా సువాసనలు సందీప్‌ను మళ్లీ మళ్లీ మత్తెక్కిస్తూనే ఉన్నాయి. ఆ వాసనలన్నీ దీర్ఘంగా పీల్చుతున్నాడు.

అతను నాలోకి ప్రవేశించే కొద్దీ నేను ఇలాతలాన్ని విడిచి పెట్టేస్తుంటాను. ఏదో మరో లోకంలోకి వెళుతుంటాను. అక్కడ నేనూ సందీప్ మాత్రమే. నేను మైకంలో ఎన్ని లోకాలు చుట్టినా సందీప్ చటుక్కున తేరుకొని భూమ్మీదకి రావాల్సిందే. తనని తాను బయట పడేసుకోవాల్సిందే. ప్రేమనూ నిగ్రహాన్నీ పెళ్లి ఎప్పుడూ శాసిస్తూనే ఉంటుందిగా.

జడివానలో తడుస్తున్న రాత్రిని చూస్తూ మేం స్వేద వానలో తడుస్తున్నా... ఎన్ని కాలాల్లో ఎంత కాలం కలిసినా వానాకాలం వానాకాలమే. మా ప్రేమ కబుర్లూ కలయిక చప్పుళ్ళను దాస్తూ వర్షపు హోరు. మరింత పెనవేసుకోండి అన్నట్టు ఉరుముల ఫెళఫెళలు, మీ తీవ్రోద్రేకమా నేనా అంటూ పోటీపడే పిడుగుపాట్లు, అప్పుడప్పుడు మా నగ్న దేహాలను పలకరించే సన్నని చలి... ఇవన్నీ నాకు చాలా ఇష్టం. నేనంటే సందీప్‌కు ప్రాణం. అంటే సందీప్‌కి కూడా జూలై అంటే ప్రేమే. కానీ ఇదే జూలై మాసం మరో ప్రేమను పుట్టిస్తుందని అప్పటికీ మా ఇద్దరికీ తెలీదు.

* * *

"ఎలా అయితేనేం మా అమ్మ ముందు కాపాడావు" జూలియాకు ద్రాక్షపళ్ళు గిన్నెలో కడిగి అందిస్తూ అన్నాను.

"నిజానికి నేను వచ్చి సెమిస్టర్ దాటింది. నువ్వు కనిపిస్తావేమోనని రోజూ చూస్తున్నా. నీ ఫోన్ నెంబర్ మిస్ అయ్యింది. మీ డిపార్ట్మెంట్ దగ్గర సందీప్ నిన్ను దింపుతుంటాడు కదా అప్పుడు పలకరిస్తే బాగోదని ఊరుకునేదాన్ని బాలా"

"ఓహ్ నా పూర్తి పేరు ఇంకా గుర్తుందా"

"మెస్‌లో ప్రతి నెలా బిల్లు కట్టని పేర్లలో నీ పేరు ఉంటుందిగా కె. సురేఖా బాల"

"హహ అవును ఎప్పుడూ లేట్ గానే కడుతుంటా కానీ నన్ను మొట్టమొదటిసారిగా బాలా అని పిలిచింది నువ్వే. ఇన్ని రోజులకి మళ్ళీ నువ్వే పిలిచావ్"

చిన్న నవ్వు నవ్వింది జూలియా. ఆమె సన్నగా చిన్నగా ఉంటుంది. పల్చటి ముఖం. మెరిసే నలుపులో మేను నిగనిగలాడుతుంటుంది. పన్ను మీద పన్నుతో ఎప్పుడూ ఒక అందమైన నవ్వుతో ఉంటుంది. చిక్కు పడని జరజర జారే పొడవైన జుట్టు. ఆమెలో తెలియని ఆకర్షణ ఏదో ఎవరినైనా రెండోసారి చూసేలా చేస్తుంది.

"మరి ఇప్పటి నుంచైనా హాస్టల్లో ఉంటావా"

"లేదు జూలియా నీకు తెలుసు కదా నేనూ సందీప్ ఎప్పటినుంచో కలిసి ఉంటున్నాం. మా ఫ్రెండ్స్ అందరికీ కూడా తెలుసనుకో. హాస్టల్‌కి అప్పుడప్పుడు వస్తుంటాను."

"మరి ఆ రోజు రాత్రి నువ్వు వచ్చేసరికి మీ మమ్మీ పడుకునే ఉన్నారా"

"ఓ చూసావా. మంచి నిద్రలోనే ఉంది కాబట్టి బతికిపోయాం. అవునూ నువ్వు చర్చికి వెళ్ళలేదు? ఈరోజు సండే కదా"

"నాకు అటువంటి నమ్మకాలు లేవని తెలుసు కదా. ఇంట్లో వాళ్లు వెళ్తారు."

"మరి ఇంకా మెళ్ళో సిలువ ఏంటి" జూలియా గొంతుకున్న వెండి సిలువను తాకుతూ నవ్వాను.

బాణం వేసే ముందు గురి తప్పదన్న గర్వంతో వేటగాడు నవ్వే నవ్వు అది.

"ఇది చిన్నప్పుడు మా నాన్నమ్మ ఇచ్చింది. ఆమె కోసం వేసుకుంటా అంతే"

జింక పారిపోయింది. గురి మాత్రం తప్పలేదు.

* * *

"ఎన్ని సార్లు చెప్పాలి దీపు కాస్తాగమంటే ఆగలేకపోతున్నావ్. మా అక్క పెళ్లి ఇంకో రెండు నెలల్లో ఉంది. ఇప్పటికే మా ఇంట్లో మనం స్నేహితులం మాత్రమే కాదని లక్ష అనుమానాలు ఉన్నాయి. ఇప్పుడు చెప్తే గొడవ చేసుకోవడం తప్ప ఏ ప్రయోజనం ఉండదు."

"మీ పెద్దమ్మ కూతురేగానీ సొంత అక్క కాదు కదా. నన్ను మోసం చేయాలని చూస్తున్నావా"

సందీప్ చెంప మీద నా నాలుగు వేళ్ళు అచ్చుపడ్డాయి. అవే వేళ్ల వెంటనే సందీప్ చేతిలో నలిగిపోతున్నాయి.

"ఇంట్లో పెద్ద పెద్ద సంబంధాలు చూస్తున్నారు. అందులో గొప్పదాని కోసమే నువ్వు ఎదురు చూస్తున్నావని నాకు తెలీదనుకున్నావా"

సందీప్ చేతిలో ఇప్పుడు నా మెడ బిగుసుకుంది. సూటిగా అతని కళ్ళలోకే చూస్తున్నా. నా కళ్ళల్లో నీటి బొట్లు భయానికి కాదు బలమైన ఆత్మవిశ్వాసానికి చిహ్నాలని అతనికి తెలిసేలా చూస్తున్నా.

"ఏంటే ఆ చూపు నేనే మీ ఇంట్లో మాట్లాడతాను. ఒప్పుకోకపోతే లేపుకెళ్తాను"

ఈ మాటలంటూనే నా చర్మం కమిలిపోయేలా కోపంగా కసిగా గిచ్చుతున్నాడు. చేతుల మీదా మెడ మీదా తొడల మీదా సిగ్గు అనేది మర్చిపోయిన చర్మమేగా నొప్పిని కూడా మర్చిపోయి ఉంటుందని అనుకున్నాడేమో.

* * *

"ఇది మొదటిసారి కాదులే మాకు. చాలాసార్లు కొట్టుకున్నాం..." గాయాలకు ఆయింట్మెంట్ రాసుకుంటూ అన్నాను.

"ఎన్నిసార్లు కొట్టుకున్నా బాధపడేది నువ్వేగా. ఆయింట్మెంట్ కొనుక్కోవాల్సిందీ నువ్వే" గాయాలను బాధగా చూస్తూ అంది జూలియా.

"సందీప్ ప్రవర్తన వల్లే అతనితో పెళ్లంటే భయమేస్తుంది. అదీ ఈ పెళ్లి విషయంలోనే విపరీతమైన కోపం తెచ్చుకుంటాడు. మొదట్లో కొంత కాలం బానే ఉండేవాళ్ళం. ఎప్పుడు ఇలా కొట్టుకోవడం మొదలుపెట్టామో నాకే తెలీదు. ఎన్నోసార్లు వచ్చేసి హాస్టల్లో ఉండేదాన్ని. నానా గొడవ చేసి బతిమిలాడి తీసుకెళ్లేవాడు. మళ్లీ మామూలే. విడిపోదామంటే వద్దంటాడు. నన్ను వదలడు. నాకు నచ్చినట్టు చూసుకోడు"

"అంటే విడిపోవడానికి నువ్వు సిద్ధంగా ఉన్నావా" జూలియా కూడా నా తొడల మీద గాయాలకు ఆయింట్మెంట్ రాస్తూ అడిగింది.

"ముమ్మాటికీ. నా వల్ల కాదు ఇంత బాధను భరించడం. వారంలో రెండు రోజులు బాగుంటే ఐదు రోజులు గొడవ పడ్డాలు ఇక జరగవు."

"సందీప్ ఇప్పుడు వచ్చినా వెళ్ళవా?"

"ఇప్పుడు ఎక్కడ వస్తాడు. తను ఆఫీస్ పని మీద ఊరెళ్ళే ముందే జరిగింది. ఈ గొడవ. ఇక నీకూ నాకూ ఇదే చివరి రోజు అని నిన్న మెసేజ్ కూడా పెట్టేశాను. రిప్లై ఇవ్వలేదు. రేపు వస్తాడు ఊర్లోకి"

"ప్రేమ దోషములన్నిటిని కప్పును అని..."

వెటకారపు కవ్వింపుతో చూసింది జూలియా.

"నువ్వేంటమ్మాయి దేవుడు లేడంటావు బైబిలు ఏసుప్రభువు లేకుండా మాట్లాడవు"

"బైబిల్ నా మార్గదర్శి. ఏసుప్రభువు నాకెప్పుడూ స్ఫూర్తినిస్తుంటాడు. ఆయన మూడో రోజు లేచాడా ఐదు వేలమందికి ఐదు రొట్టెలు రెండు చేపలు పంచాడా అనేది నాకు అనవసరం. మంచిని గురించి చెప్తాడు. జీవితాన్ని ఎంత అందంగా నీతిగా బతకాలో చెప్తాడు. అంతవరకే"

"మంచి గురించి, జీవితం గురించి చెప్పడానికి నీకు క్రైస్ట్ ఒక్కడే కనబడ్డాడా. కృష్ణుడు రాముడు బుద్ధుడు గురునానక్, ఋషభదేవ మహమ్మద్ ప్రవక్త, సాయిబాబా కనబడలేదా? వీళ్ళు ఎవరూ ఇసుమంతైనా మంచే చెప్పలేదా"

"ముందే మనకు ఒకరు బాగా నచ్చినప్పుడు మనం ఇప్పటికే వారిని ఆరాధిస్తున్నప్పుడు ఇక వేరే ఎందుకు"

జూలియా దేవుళ్ల గురించే మాట్లాడుతుందా లేక నా ప్రేమ వ్యవహారంపై చతుర్లేస్తుందా అని నాకు స్పష్టంగా అర్థమయ్యేలోపే జూలియా వెళ్ళిపోయింది.

జూలియా మనసుపై కనబడని గాయమేదో చేసినట్టు అనిపించింది నాకు. నేనే నిండు గాయాలతో ఉన్నప్పుడు వెళ్లి ఓదార్చే ఓపికే లేదు.

జూలియా పి హెచ్ డి లో జాయిన్ అయిన సంవత్సరం మేమిద్దరమే రూమ్మేట్స్. తర్వాత ఒక్కొక్కరికీ ఒక్కో గది ఇచ్చారు. కలిసున్నప్పుడు మా ఇద్దరి మధ్య స్నేహం పెద్దగా నడవలేదు. ఎవరి మానాన వాళ్ళం ఉన్నాం. కానీ జూలియాలో ఏదో విషయం ఉన్నట్టు మాత్రం తోచేది నాకు. ఇప్పుడిప్పుడే జూలియా ఒక వ్యక్తిగా కనబడడం ప్రారంభిస్తుంది.

ఆయింట్మెంట్‌తో సిలువ గుర్తులను పెట్టిన పచ్చి గాయాలను చూసుకుంటూ ఒంటరిగా నిశ్చింతగా నిద్రపోయాను. ప్రతి రాత్రీ సందీప్ పక్కన ఉన్నాడు అంటే ఒక

నిరంతరమైన బాధను వెంట పెట్టుకున్నట్టు ఉండేది. ఈ రోజు నుంచి ప్రతి రాత్రీ నా రాత్రే. కోల్పోయిన విలువైన ఒంటరి రాత్రులు కుప్పగా నాపై పడ్డట్టుంది.

* * *

మర్నాడు సాయంత్రం వచ్చింది జూలియా.

"పొద్దున్నే నిన్ను చూడాలని వచ్చాను. నీ గది తాళం పెట్టుంది. నిన్న ఉన్నట్టుండి నేను అలా బయటకు వచ్చేయడం నాకూ నచ్చలేదు"

"అదీ... నేను..." నిన్న రాత్రి అన్నీ చెప్పి తెల్లారేసరికి సందీప్ దగ్గరకు వెళ్లానని చెప్పలేకపోయాను.

"ఓహ్ అర్థమైంది లే. ప్రేమా గెలిచింది. బైబిల్ లోని మాటా నిజమైంది" చిన్నగా నవ్వుతూ పనుంది అంటూ వెళ్ళిపోయింది జూలియా.

ఆకలితో తిన్న రొట్టె ఇంత రుచిగా ఉంటుంది అని తెలిసే కాబోలు నేనూ సందీప్ అన్నిసార్లు విడిపోతుంటాం. సందీప్‌ని ఆఫీస్ పని వదిలిపెట్టి వచ్చేలా చేస్తుంది ఈ ఆకలి. నన్ను ఉదయాన్నే హాస్టల్లో మాయం చేస్తుంది అదే ఆకలి.

నాకు సందీప్ కావాలంటే ఆ నిరంతర బాధా తీసుకోవాలి. తప్పదు. ఆవేశం వదిలించుకోమంటుంది. ఆలోచన ఆపుతుంటుంది.

* * *

ఆ రోజు యూనివర్శిటీలో చకచకా నా పనులన్నీ పూర్తి చేసుకుని సాయంత్ర మవుతుండగా జూలియా గదికి బయల్దేరాను. జూలియా తలుపు తోసుకువెళ్ళే చనువు లేదని నేనెప్పుడూ అనుకోలేదు. కానీ అప్పుడే స్నానం చేసి వచ్చిన జూలియా నా రాకను ఊహించినట్టు లేదు. ఆమె కంగారు పడినట్టు నేను పడలేదు. స్థిమితంగా మంచం మీద కూర్చుని అలవాటుగా కబుర్లు చెప్తున్నా.

"ఓయ్ కాసేపు నీ రూమ్‌లో కూర్చో, తయారయ్యి నేనే వస్తాను" కనబడుతున్న గుండెల్ని మరో టవల్‌తో కప్పుకుంటూ అనింది జూలియా.

"అబ్బా కానివ్వు. నేనే కదా. రూమ్మేట్స్‌గా ఉన్నప్పుడు కూడా ఇంతే సిగ్గుపడ్డావ్. ఇంకా తగ్గలేదా"

"ముందు నువ్వు పో తల్లి. నేనే వస్తాను"

నవ్వుతూనే నన్ను దాదాపు మెడపట్టుకు బయటకు నెట్టింది గానీ నేనుంటే తప్పేంటి అని ఆలోచించకుండా ఉండి ఉండదా?

చీర కట్టుకుని అందంగా తయారయ్యింది జూలియా. పచ్చని జార్జెట్ చీర మీద చిన్న చిన్న గులాబి పూలు అదే రంగు బ్లౌస్... జడవెయ్యకుండా వదిలేసిన ఆరీ ఆరని తడి జుట్టు, కుడిచేతి వాచ్, వేసి వెయ్యనట్టు లిప్స్టిక్ పెదవులు, సన్నని మెడలో అదే వెండి సిలువ, ఎక్కడ నుంచి తెచ్చిందో చెవి వెనుక తొంగి చూస్తూ ఓ ఎర్రని గులాబీ పువ్వు. ఆ సాయంత్రం చాలా ప్రత్యేకంగా ఉంది.

"ఎక్కడికి సడన్‌గా చీరలో బయల్దేరావ్?" కళ్ళ నిండా జూలియా అందాన్ని చూస్తూ అడిగాను.

"అదీ... ఫ్రెండ్స్ పిలిస్తే వెళ్తున్నా" తటపటాయిస్తూనే ఉంది జూలియా.

"అదే ఎక్కడికి? కొంపదీసి నువ్వూ ప్రేమలో పడ్డావా?" ఉత్సుకతతో నా కళ్ళు పెద్దవయ్యాయి.

"ఛ ఛ లేదు. సెమీ క్రిస్మస్‌కి పిలిస్తే వెళ్తున్నాను" తగ్గించిన స్వరంతో చెప్పింది జూలియా.

"ఓహో... నేనింకా నీ ముస్తాబు చూసి ఏదేదో అనుకున్నా"

"చెప్పేదాకా వదలవుగా. ఏదో వాళ్ళు పిలిచారని వెళ్తున్నా. కావాలంటే చూడు చేతిలో బైబిల్ కూడా లేదు"

"నేను అడగలేదే"

జూలియా ఏం మాట్లాడలేదు. బహుశా ఏం మాట్లాడాలో తెలిసుండదు.

"నీలా నువ్వుండు జూలీ. నీ కోసం నువ్వెళుతున్నావా వాళ్ళ కోసం వెళుతున్నావా ఆలోచించుకో. కానీ ఏం చేసినా నిర్భయంగా ఉండు. ఎవరి ముందూ మొహమాటం భయం ప్రదర్శించాల్సిన పని లేదు."

"మంచిది. బై" అహంకారం నటిస్తున్న జూలియాను చూడ్డం అదే మొదటిసారి. నచ్చేసింది. నాకు జూలియా మరింత నచ్చేసింది.

* * *

జూలియా దాదాపు సందీప్ స్థానానికి సమీపిస్తోంది. సహజంగానే అతనికి గిట్టడం లేదు. నాకు ఎంతమంది క్లోజ్ ఫ్రెండ్స్ ఉన్నా జూలియా మాత్రమే అతన్ని అభద్రతకి గురిచేస్తుంది.

జూలియా వచ్చిన తర్వాతే నా ఫోన్ లాక్ చేయడం మొదలు పెట్టాల్సి వచ్చింది. హాస్టల్‌లోనే ఎక్కువ సమయం ఉండిపోతున్నా. ఈ మార్పులేవీ సందీప్‌కు నచ్చడం లేదు. చూస్తుంటే నాకు చెప్పకుండా మా ఇంట్లో పెళ్లి గురించి మాట్లాడాలనే నిర్ణయానికి వచ్చేటట్టున్నాడు .

* * *

నా థీసిస్ త్వరగా సబ్మిట్ చేసి సందీప్ విషయం ఇంట్లో చెప్పాలి. చలి కాలంతో పాటు నా నెల కూడా వచ్చేసింది. భయంకరమైన నొప్పి. ఈ సమయాల్లో నేనస్సలు సందీప్ దగ్గర ఉండడం లేదు. హాస్టల్‌లో ఉంటే కనీసం ఫ్రెండ్స్ ఉంటారు. ముఖ్యంగా జూలియా ఉంటుంది. సందీప్ లా ఈ పరిస్థితుల్లో కూడా నాకు పనులు చెప్పేవాళ్ళు ఉండరు ఇక్కడ. ఈ పాటికి జూలియా రావాలి. లైబ్రరీలో పని ఇంకా అయినట్టు లేదునుకుంటూనే వచ్చింది.

“ఎక్కడికెళ్ళావ్ రాలేదేం పొద్దున్నుంచి” నీరసంగా అడిగా.

“తీసుకో” నొప్పి తగ్గడానికి మాత్ర ఇచ్చింది.

హ్యాండ్ బాగ్లోంచి నాకిష్టమైన చాక్లెట్ తీసిచ్చింది. వేడి వేడి చికెన్ ఫ్రైడ్ రైస్, ఇంకేవో ఫ్రూట్స్ తెచ్చింది.

“ఇందుకేనా లేట్ అయింది” తనకి కూడా చాక్లెట్ పంచుతూ అడిగాను.

అవునంటూ నైటీ మార్చుకుని పక్కన కూర్చుంది. తన వస్తువులు బట్టలు కొన్ని నా గదిలోనూ ఉంటాయి. మునుపటిలా ఇక నా ముందు బట్టలు వేసుకోడానికి మార్చుకోడానికి సిగ్గుపడ్డం లేదు జూలియా. నాకు ఎలాగూ ముందు నుంచీ అలాంటి ఇబ్బందులేమీ లేవు.

ఎప్పుడు తీసుకొచ్చిందో నేనూ చూడలేదు. నా షర్టు పైకి లాగి పోయినసారి వాళ్ళమ్మ తెచ్చిచ్చిన ప్రేయర్ ఆయిల్ నా పొట్ట పై రాయడం మొదలు పెట్టింది.

“ఇదెందుకే ఇప్పుడు?” మూలుగుతూ అన్నాను.

"నోర్మూయ్. నీకేం తెలీదు పడుకో మెదలకుండా. కొబ్బరి నూనె ఇది. మందు కాదు"

"మరి సిలువలెందుకు వేస్తున్నావ్" నొప్పి తట్టుకోలేక నా మాట మెల్లగా వస్తుంది.

"సిలువ లేదు నీ మొహం లేదు. మాట్లాడకుండా పడుకో"

జూలియా మెత్తని చేతులతో నా కడుపంతా మర్దన చేసింది. అలా కడుపు మీంచి నా తొడలు మోకాళ్ళు పాదాల వరకు వత్తుతూనే ఉంది. ఎంత హాయినిచ్చిందో ఆ స్పర్శ. నా శరీరానికే కాదు నా మనసుకి కూడా. నిద్రపోతున్నానా ఆలోచిస్తున్నానా నాకే తెలియని మనస్థితిలో ఉన్నా.

జూలియా కూడా అలసిపోయినట్టుంది. మెల్లగా నా పక్కనే పడుకుంది. ఎప్పటి నుంచో జూలియా నా గదిలో నా మదిలోనే ఉంటుంది. నన్ను అస్సలు విడిచిపెట్టదు. హాస్టల్ మంచాలు చిన్నవి. అయినా సరే రాత్రులు కలిసే పడుకుంటున్నాం. సందీప్ దగ్గర కూడా కాస్త చిన్న మంచమే అయినా మా మధ్య ఏదో తెలియని దూరం ఉంటుంది. అది జూలియా వచ్చాక కానీ నాకు అర్థం కాలేదు. నాతో కలిశాక సందీప్ ఇక నన్ను ముట్టుకోడు. ముట్టుకోకూడదు అనే ఒట్టేదో పెట్టుకున్నట్టే అంటకుండా పడుకుంటాడు. ప్రేమ లేదా అంటే చచ్చేంత ఉంది. అతనంతే. కానీ జూలియాకు నేనెప్పుడూ అతుక్కుని ఉండాల్సిందే. తన స్పర్శ నాకెప్పుడూ ఒక ధైర్యాన్ని ఆనందాన్ని ఇస్తూనే ఉంటుంది.

నొప్పి తగ్గుతున్నా నేను బొమ్మలా కదలకుండానే పడుకున్నా. జూలియా మెల్లగా నా భుజం మీదకు జరిగి తల వాల్చింది. దానికి నా మీద ప్రేమెక్కువైతే అంతే. ప్రతి నెలా ఈ నాలుగు రోజులు నన్ను చాలా జాగ్రత్తగా చూసుకుంటుంది. నా పనులన్నీ చేసి పెడుతుంది. తిడితే పడుతుంది. మౌనంగా అర్థం చేసుకుంటుంది. నన్ను ప్రేమిస్తుంది.

నిద్రలోనే పైకి జరిగి ముద్దు పెడుతుంది జూలియా. ఎంత మూడ్ స్వింగ్స్ అయినా దీని ప్రేమ ముందు తల వంచాల్సిందే. అకారణమైన కోపంతో అరవాలనుకునే దాన్ని కూడా తిరిగి జూలియా నుదుటి మీద ముద్దు పెట్టేలా చేస్తుంది.

ఒక్కోసారి పెదాల మీద గట్టిగా ముద్దు పెట్టేసి పారిపోతుంది. 'నాగ్గానీ కోపమొస్తే నడుం మీద ముద్దు పెట్టేస్తాను జాగ్రత్త' అంటూ బెదిరిస్తుంది. ఆ కోపం కోసమే నేనూ ఎదురు చూస్తున్నా...

ఎందుకు నేనంటే ఇంత ప్రేమ అని అడిగితే 'నిన్ను వలె నీ పొరుగువారిని ప్రేమించండని అన్నాడుగా దేవుడు' అంటూ నాలుక కరుచుకుంటుంది.

నిద్రలో నా నడుం చుట్టూ చేయి వేసి నా గుండెలకు మొహం పెట్టి లతలా చుట్టుకుంటుంది. ఆ అల్లిక నాకెంత ఇష్టమో. కానీ నేనెప్పుడూ తనకి చెప్పలేదు. చెప్పలేను. ఆమెకెలా తెలుసు? ఇక్కడే పట్టుకోవాలని. ఇక్కడే నన్ను తడమాలని. నా లోపలి మనిషిని ఇంత బాగా ఎలా ఆవిష్కరిస్తుంది? ఈ జూలియా నన్ను తడిమేస్తుంది తడిపేస్తుంది తరిమేస్తుంది.

* * *

"వెళ్ళాలా తప్పదా" నా కళ్ళలో నీళ్ళు.

"మధ్యలో కూడా ఇంటికి వెళ్ళలేదు. పండక్కి అయినా వెళ్లకపోతే ఎలా మరి" జూలియా ఎప్పట్లాగే నిశ్చలమైన నవ్వుతో చెప్పింది.

"మతం లేదు పాడు లేదు అంటావు మళ్లీ పండగొస్తే ఊరికి పరిగెత్తుతావ్. అంతా నాటకం. పో"

అదే ప్రసన్నమైన ముఖంతో ఉంది జూలియా.

"నాకోసం కా.."

"నా కోసం కాదు. ఇంట్లో వాళ్ళ సంతోషం కోసం అంటావు. అంతేగా. మనసుకి నచ్చకపోతే ధైర్యంగా చెప్పే సత్తా ఉండాలి ఇలా ఎంతకాలం నటిస్తావు"

"నువ్వు నటించట్లేదా. సందీప్ విషయం ఇంట్లో ధైర్యంగా చెప్పి పెళ్లి చేసుకోవచ్చుగా"

ఉన్నట్టుండి నా మనసంతా మౌనమైంది. జూలియా కూడా.

"ఎవరికైనా ఇంతే బాలా మనదాకా వస్తే గానీ తెలీదు" నా భుజం మీద చేయి వేస్తూ మెల్లగా అనింది జూలియా. ఇద్దరిలో ఎవరికి కోపం వచ్చినా తనే తగ్గుతుంది.

"నాకేం ధైర్యం లేక కాదు. నా థీసిస్ సబ్మిషన్ అయిన వెంటనే చెప్పేద్దామనే అనుకున్నా"

"సబ్మిట్ చేసి మూడు నెలలు అవుతుందిగా మరి ఎందుకు చెప్పలేదు."

"పెళ్లి చేసుకుని వెళ్ళిపోతే నన్ను బాలా అంటూ ప్రేమించే వాళ్ళు ఎవరూ ఉండరుగా"

"హహ! రేఖా అంటూ లాలించే వాడినేగా చేసుకుంటున్నావు ఇంకా బెంగెందుకు"

"పో" కోపంగా భుజం మీద జూలియా చేతిని వదిలించుకున్నా. నన్ను వెనుక నుంచి గట్టిగా వాటేసుకుంది జూలియా.

"నేను మాత్రం నువ్వు పెళ్లి చేసుకుని వెళ్ళిపోతే ఒంటరిదాన్ని అవ్వనా! కానీ తప్పదు కదా సందీప్ పాపం చాలా బాధపడుతున్నాడు" అదే కౌగిట్లో ముందుకి తిరిగాను. ఇద్దరి గుండెలూ దగ్గరగా హత్తుకుంటున్నాయి.

"మరిప్పుడు నువ్వు ఊరెళ్ళిపోతే నేను ఒంటరిదాన్ని అవ్వనా"

"సందీప్ ఉన్నాడుగా"

"జూలీ ఉండదుగా"

"సరె సరే ఆలస్యమవుతుంది వదులు. బట్టలు సర్దుకోవాలి. ట్వెంటీ ఫస్ట్ నీ డేట్. ప్యాడ్స్ కొనిపెట్టాను చూడు షెల్ఫ్‌లో. ఇంక వదులు"

ముందు అనుకున్నానా లేక అనుకోకుండా హఠాత్తుగా జరిగిందో లేక సరైన సమయం కోసం తెలియకుండానే ఎదురు చూసాను... మొదటిసారి జూలియా పెదాలను గాఢంగా ముద్దు పెట్టుకున్నాను. కానీ ఇది జూలియా పెట్టే మామూలు ముద్దు కాదు. అది ఘాటైన ప్రేమ ముద్దు. ఇంకా పెడుతూనే ఉన్నాను. జూలియా చేతులు చల్లబడుతున్నాయి. మొట్టమొదటిసారే అయినా ఎందుకో కొత్తగా లేదు. ఇద్దరి మనసుల్లో ఆలోచనలు నిశబ్దంగా ఉన్నాయి. ఇద్దరి చేతులూ దేహాలూ బట్టలూ ఒకదాని తరువాత ఒకటి తమ పని చేసుకుపోతున్నాయి.

పక్క గదుల్లో విద్యార్థులు చదువుకుంటున్నారు. స్నేహితులతో కబుర్లు చెప్పుకునేవాళ్ళు, తినేవాళ్ళు తింటూ రాసుకునేవాళ్ళు రాసుకుంటూ ఉన్నారు. మా గదిలో మాత్రమే ఎవరికీ తెలియని నిశ్శబ్దం. ప్రపంచం ఎరుగని నిశబ్దం. సందీప్ ఆఫీస్ ముగించుకొని నా కోసం ఇంట్లో ఎదురుచూస్తుంటాడు. జూలియా ఎక్కాల్సిన బండి వెళ్ళిపోయి అరగంట అయ్యుంటుంది. చలికాలం కదా ఊరంతా రద్దీగా సాయంత్రాన్ని త్వరత్వరగా విడుస్తూ రాత్రిని మేల్కొలుపుతూ ఉంటుందేమో.

అయినా, ఈ గదిలోనూ ఒక్కటైన మా మదిలోనూ నిశబ్దమే. శరీరాల రాసక్రీడల శబ్దాలు కూడా వినిపించని దట్టమైన నిశ్శబ్దం.

ఎంతసేపు ఉన్నామో ఆ సంగమంలో ఒకే ఆలింగనంలో...

తేరుకునే సరికి ఊరు నిద్రకొచ్చింది. మేమూ నిద్రపోయాం. స్వేచ్ఛగా. నిస్సంకోచంగా. నిర్భయంగా. ప్రేమగా!

* * *

నా రెండవ ప్రేమ యాత్ర మొదలైనట్టే. మొదట్లో సందీప్ విషయం నా తల్లితండ్రుల దగ్గర దాచినట్టు ఇప్పుడు జూలియా విషయం సందీప్ దగ్గర దాయాల్సివస్తుంది.

ఒక పక్క పూర్తిగా ఎదిగిన సందీప్ ప్రేమ. మరో పక్క అప్పుడప్పుడే మళ్ళీ కొత్తగా మొదలైన ఎదురుచూపులు విరహాలు కలహాలు అలకలు నిద్రలేని రాత్రులు. రెండో బిడ్డను మోస్తున్నట్టుంది నాకు. అన్నీ తెలిసిన అనుభూతులే. అనుభవించిన జ్ఞాపకాలు కళ్ళ ముందే ఉన్నా మళ్ళీ నూతనంగా ప్రేమలో పడడం బావుంది. మొదటి దానికంటేనా అంటే ఏం చెప్పను?

ఇద్దరు బిడ్డల తల్లికి ఎవరంటే ఎక్కువ ఇష్టం అంటే చెప్పలేకపోవచ్చు కానీ ఎవరో ఒక బిడ్డ మాత్రం తల్లికి బాగా దగ్గరవుతారని తెలియనిదా.

ఏదేమైనా వచ్చే జూలైలో సందీప్‌తో జరిగే నా పెళ్లిలో హడావుడంతా నా జూలియాదే.


✦✦✦



# మహి బెజవాడ

పుట్టింది నెల్లూరు జిల్లా కావలి. కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీ. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఆర్షియో క్రియేటివ్ ఏజెన్సీ పేరుతో డిజిటల్ మీడియా సంస్థ నడుపుతున్నాను. ఫిల్మ్‌మేకర్‌గా చాలా యాడ్స్, గవర్నమెంట్ ఫిల్మ్ తీశాను. సినీ పరిశ్రమలోనూ ఓ అడుగు ఉంది. ఎనిమిది కథలు వ్రాశాను. నన్ను కదిలించే ఏదైనా సంఘటన తాలూకు గ్రే–ఏరియాని విజువలైజ్ చేసి దానిని కథగా మలచటం నాకు అనివార్యం కనుక కథలు రాస్తున్నాను.

“శిథిలాల క్రింద ఏమి జీవం ఉంటుంది,
అంతా విధ్వంసమే.
ఇప్పుడు వాళ్లను అక్కున చేర్చుకునే ప్రేమ కావాలి.”



# గన్స్ అండ్ మాన్సూన్స్

ఆగకుండా బయట కురుస్తున్న వర్షపు చినుకుల్లా తన ప్రశ్నలు, రీనా మనసులో శబ్దం చేస్తూనే ఉంటాయి. అందుకే ఈ మౌనం. తన మౌనం అన్ని ప్రశ్నలకూ సమాధానం కాకూడదు. కానీ ఈ రాత్రి ఆ మౌనాన్ని బద్దలుకొట్టాలి. మేఘ ప్రశ్నలకి సమాధానం దొరుకుతుందేమో చూడాలి. చేతిలో ఉన్న లాస్ట్ పెగ్ పెదాలకు చేరి గుటక పడింది.

కరెంట్ పోయింది.

చేతిలో ఉన్న గ్లాస్ పట్టుకుని సెల్ ఫోన్ టార్చ్‌తో క్యాండిల్ కోసం వెతికి జేబులో వున్న సిగరెట్ లైటర్‌తో వెలిగించాడు. స్మాల్ పెగ్ ఒంపుకుని ఫ్లాస్క్‌లో ఉన్న ఐస్ క్యూబ్స్‌ని గ్లాసులో వేసుకుని కిటికీ దగ్గరగా వెళ్లి నిలుచున్నాడు మైక్. ఇల్లంతా క్యాండిల్ వెలుగుతో నిశ్శబ్దంగా ఉంది. బయట వర్షపు హోరు. సోఫాలో షాల్ కప్పుకొని తన ఎదురుగా ఉన్న కూతురినే కోపంగా చూస్తోంది రీనా.

మామ్... జార్జ్ గురించి చెప్పు.

మౌనం చాలా సేపు.

నాకు సమాధానం కావాలి. ఆ పేరు వినగానే ఎందుకు అంత పానిక్ అయిపోతావ్?

ఐయాం యువర్ మదర్. అండ్ మైక్ ఈజ్ యువర్ డాడ్. దిస్ ఈజ్ యువర్

ఫ్యామిలీ. ఇంకేం కావాలి. ఏం తెలుసుకోవాలి. నాకు ఇష్టమైన చదువు నువ్వు చదవట్లేదు. నా మాటా వినవు. ఇవన్నీ సరే సర్దుకుంటాను. కానీ నువ్వు వెళ్లడానికి మాత్రం నేను ఒప్పుకోను. ఒప్పుకోలేను. ఇక నన్ను విసిగించకుండా వెళ్ళి పడుకో అంటూ హాల్లో నుంచి లేచి తన బెడ్రూమ్‌లోకి వెళ్ళి తలుపు గట్టిగా వేసింది.

ఏంటిది?

ఎందుకింత ఫ్రస్ట్రేషన్?

ఎప్పుడు డాడ్ గురించి అడిగినా ఇలానే. ఇప్పుడే కాదు చిన్నప్పటి నుంచీ ఇంతే, ఎప్పుడు తన ప్రస్తావన వచ్చినా ఇంతే. ఐ వాంట్ టు నో ఎబౌట్ మై డాడ్, నా ప్రోజక్ట్ థీసిస్ ఆయన మీదనే కదా. తన గురించి చాలా దూరం ట్రావెల్ చెయ్యాలి. చాలా మందిని కలవాలి. నువ్వైనా చెప్పు మైక్ తనకి. తను ఇలా ఉంటే నాకు పిచ్చెక్కి పోతుంది. అంటూ మైక్ భుజంపై తన తల వాల్చింది. కిటికీలోంచి కురుస్తున్న వర్షాన్నే చూస్తూవున్నాడు మైక్.

నేను ఏమైనా చిన్న పిల్లనా మైక్?

తన తల నిమురుతూ నిర్మలమైన నవ్వుతో అలానే చూస్తూ లేట్ అయ్యింది పడుకో మేఘ అని అన్నాడు మైక్.

ఓకే మైక్ గుడ్ నైట్.

ఎర్లీగా లే – ఐ వాంట్ టు టాక్ టు యు, గుడ్ నైట్.

ఓకే, ష్యూర్.

మంచంపై పడుకున్న రీనాను తన ఒడిలో తీసుకున్నాడు. తన తల నిమురుతూ, చేతికి వెచ్చగా తగిలిన కన్నీటిని తుడుస్తూ,

ఏమైంది రీనా? ఎందుకిలా ప్రవర్తిస్తున్నావ్? ఇప్పుడు తనేమీ చిన్నపిల్ల కాదు. తనకు అన్నీ తెలియాలి. తెలుసుకోవాలి. వై డోంట్ యు అండర్‌స్టాండ్?

ఏమి తెలుసుకోవాలి? నా గురించి ఏమైనా ఆలోచిస్తుందా...? నువ్వే తన డాడ్ అంటే ఏమంటుందో చూశావా? నిన్నే పేరు పెట్టి పిలుస్తుంది, పొగరు.

లీవ్ ఇట్ రీనా – తను నన్ను అలా పిలవడమే నాకు ఇష్టం. చిన్నప్పటి నుంచి అలానే కదా నన్ను పిలిచేది. అందులో పొగరేముంది. ఇలా చిన్న చిన్న విషయాలను పెద్దవిగా చేసి ఆలోచించకు.

ఇది చిన్న విషయం ఎలా అవుతుంది మైక్. మన పెళ్లిలో తనని నువ్వు నీ భుజాలపై నుంచి దించలేదు, తనని ఎలా పెంచావ్ మైక్, తనకోసమే కదా నువ్వు మనకు పిల్లలు వొద్దు అని డెసిషన్ తీసుకుంది. పొగరు. ఇదే పొగరు. ఇదే మొండితనం ఇలానే ఉండేవాడు జార్జ్ కూడా. నేను కాదన్న పనల్లా చేసేవాడు, ఒద్దన్నా ఊర్లు పట్టుకు తిరిగేవాడు. నన్ను పట్టించుకునేవాడు కాదు. తన లోకం తనదే. కనీసం మేఘ కడుపులో ఉన్నప్పుడు కూడా ఇలానే వెళ్ళాడు – అలానే వెళ్ళిపోయాడు. తన నీడ కూడా నా కడుపులో పెరుగుతున్న బిడ్డపై పడకూడదని కాఫిన్ బాక్స్ దగ్గరికి కూడా వెళ్ళలేదు. వొద్దు అనుకున్నా తను గాని, తన జ్ఞాపకాలు కాని నా ఒంట్లో, ఇంట్లో కూడా లేకుండా పెంచాను తనని. చూస్తున్నావుగా ఎలా తయారయ్యిందో..? తనలో నాకు జార్జ్ కనబడుతున్నాడు మైక్. భయం వేస్తోంది.

తన ధైర్యం, ఎడమచేతి వాటం, తన ఇష్టాలు, తను కోరుకున్న చదువు, ఇవన్నీ నువ్వు పెంచితే రాలేదు రీనా. ఇట్స్ డి.ఎన్.ఏ. తనకేం కావాలో, తనేం తెలుసుకోవాలనుకుంటుందో లెట్ ఇట్ బి హర్ ఓన్ చాయిస్, అని నుదుటిపై ముద్దు పెట్టాడు.

* * *

మబ్బుల మాయగా ఆకాశం. తుంపర్లుగా వాన. బాగా నానిన గోడలు.

గుడ్ మార్నింగ్ మేఘ.

గుడ్ మార్నింగ్ మైక్... మత్తు కళ్లతో మైక్‌ని చూస్తూ,

ఏంటి ఇంత పొద్దున్నే...?

ఓ... నైట్ ఏదో మాట్లాడాలి అన్నావ్ కదా. చెప్పు. క్విల్ట్‌ని భుజం వరకు లాక్కుంది.

ETA అప్లై చేశాను... టిక్కెట్స్ కూడా బుక్ చేశాను. యు ఆర్ గోయింగ్ టు ఫ్లై ఇన్ ఎ కపుల్ ఆఫ్ డేస్.

వావ్ అంటూ ఒక్కసారి మంచంపై నుండి ఎగిరి మైక్‌ను కౌగిలించుకుంది.

మామ్ ఒప్పుకుందా...?

తను ఒప్పుకుంటుంది అని అనుకుంటున్నావా?

మరి?

తను ఒప్పుకోదు. అదంతా తనకు నీపైన వున్న ప్రేమ అని తెలుసుకోలేని వయసు నీది.

ఏంటి మైక్..? మళ్ళీ నువ్వు కూడా.

బెడ్‌రూమ్ పోర్టికోలో నిల్చుని సిగరెట్ వెలిగించాడు మైక్. సన్నగా జల్లు బయట.

మిమ్మల్ని బాధ పెడుతున్నా కదా మైక్...? వర్షపు జల్లుకు చేతులు చాచుతూ.

నెవర్ మేఘ.

టెల్ మీ మేఘ. వాట్స్ యువర్ ప్లాన్...?

ఐ వాంట్ టు కంటిన్యూ వేర్ జార్జ్ స్టాప్డ్.

అంటే?

అంటే ఏమీ లేదు. తను ఆగిన చోటున నేను మొదలవ్వాలి. ఐ మీన్ తన ఆఖరి మజిలీ చూడాలి. తను చివరిక్షణం గడిపిన వాళ్ళెవరో తెలుసుకోవాలి. తనేంటో తెలుసుకోవాలి. అలానే తను తీసిన చివరి ఫోటోస్ ఆ తమిళ్ రెబెల్స్ సిరీస్ మీద రీసెర్చ్ చెయ్యాలి. అందులో ఉన్న వాళ్ళను కలుసుకోవాలి, ఇదంతా ఒక టెన్ డేస్ ప్లాన్. తరువాత థీసిస్ ఫినిష్ చేసి సబ్మిట్ చెయ్యాలి. ఈ లోపు జాబ్‌కి అప్లై చెయ్యాలి. ఇదీ ప్లాన్.

సిగరెట్ లాస్ట్ పఫ్ గాల్లోకి వదులుతూ.

ఓకే... గెట్ రెడీ టు ఫ్లై విత్ యువర్ వింగ్స్ మేఘా.

థ్యాంక్యూ మైక్... ఫర్ బీయింగ్ విత్ మి. బుగ్గ మీద ముద్దుపెట్టి గట్టిగా కౌగిలించుకుంది.

సాక్షిగా బయట వర్షం కురుస్తూనే వుంది.

* * *

థీసిస్ మెటీరియల్ పెట్టుకున్నావా...?

హా...

వాయిస్ రికార్డర్?

హా...

కెమేరా?

హా...

లాప్‌టాప్, చార్జర్?

హబ్బా ఏంటి మైక్ నీ హడావుడి. అన్నీ పెట్టుకున్నా.

సరే సరే... హాల్లో ఒంటరిగా కూర్చున్న రీనా వైపు చూపించి వెళ్ళి మాట్లాడమన్నట్టు సైగ చేశాడు.

బ్యాగేజ్ అంతా హాల్లోకి షిఫ్ట్ చేసే పనిని తను అందుకుంటూ, రీనాతో మాట్లాడు అన్నట్టు ముందుకు తోశాడు.

మామ్... వెళ్తున్నా... అంది చిన్నగా.

నేలకేసి చూస్తూ, ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ వెళ్తున్నా అనకు అంది. జీరబోయిన గొంతుతో రీనా చేతిని సోఫా కుషన్ కేసి నొక్కుతూ నేలనే చూస్తోంది.

మామ్ చూడు, నన్ను చూడు ముందు, హార్డ్లీ టెన్ డేస్ అంతే నీ ముందుంటా, ఓకేనా...? రీనా ముఖాన్ని తన చేతిలోకి తీసుకుంటూ, తన కళ్ళలోకి కళ్ళు పెట్టి చూస్తూ అంది.

నీ భయమేంటి మామ్..?

ఈ ఒంటరి ప్రయాణాలు నాకు నచ్చవు మేఘ. జార్జ్ కూడా... నన్నొదిలి ఇలానే వెళ్ళాడు... తిరిగి వచ్చేస్తాను అని చెప్పి నిన్ను, నన్ను ఈ లోకాన్నే వదిలేసి వెళ్లాడు.

ఈ ఎదురు చుపులు... ఒంటరితనం.... యు నో హౌ పెయిన్ఫుల్ ఇట్ ఈజ్?

నీకు తోడుగా మైక్ ఉన్నాడుగా... ఒక టెన్ డేస్‌లో వచ్చేస్తా మామ్, రోజూ ఫోన్ చేస్తుంటా. రీనా చేతిని తన చేతిలోకి తీసుకుంది.

బ్యాగేజ్ అంతా హాల్లోకి షిఫ్ట్ చేసి రీనా భుజాలపై చెయ్యి వేస్తూ, వి హేవ్ టు లీవ్, వి ఆర్ గెట్టింగ్ లేట్, అన్నాడు మైక్.

హాల్‌లో ఉన్న లగేజ్ కార్‌లోకి షిఫ్ట్ చెయ్యడానికి కదిలాడు.

నువ్వు నమ్మవని తెలుసు. తన చేతిలోవున్న బైబిల్‌ని మేఘ చేతిలో పెట్టింది రీనా.

తనూ కాదనకుండా తీసుకుంది. కొన్ని మూమెంట్స్ అలా మొమెంటరీగా జరిగిపోతాయ్ అన్నట్టు.

జార్జ్‌కి ప్రేమంటే ఏంటో తెలియదు. లేకపోతే నిన్ను, నన్నూ వదిలేసి వెళ్లేవాడు కాదు.

హారన్ వినిపిస్తోంది.

ఓకే మామ్ ఐయామ్ లీవింగ్.

మేఘాను దగ్గరకి తీసుకుని నుదుటిపై ముద్దుపెట్టింది రీనా. అప్రయత్నంగా ఇద్దరి కళ్ళలో నీళ్లు.

మళ్ళీ హారన్ వినిపిస్తోంది.

బయట వర్షం మొదలైంది.

ఓకే మామ్, సీ యు... బై...

గుమ్మానికానుకుని వర్షంలో తడుస్తూ వెళ్తున్న కారునే చూస్తూ వుంది. అలా మసకగా దూరంగా వెళ్లిపోయింది కారు. అది వర్షం వల్ల కలిగిన మసకో లేక ఆగకుండా కారుతున్న తన కన్నీటి వలన కలిగిన మసకో.

* * *

చేతిలో వున్న బైబిల్‌ని చూస్తూ పేజీలన్నింటిని ఒక్కసారి అలా తిప్పింది. మధ్యలో కొన్ని ఫోటోలు ఉన్నాయి. జార్జ్ తీసిన ఫోటోలు. నేషనల్ జియోగ్రఫీ మ్యాగజైన్ నుంచి కట్ చేసిన ఫోటోలు అవి.

వర్షానికి కార్ వైపర్స్ లయబద్ధంగా చేస్తున్న శబ్దం.

ఈ ఫోటోస్ అమ్మ దగ్గరున్నాయని నాకు తెలియదు. ఇవి తెప్పించుకోడానికి నేను చాలా కష్టపడ్డాను. అంటే మామ్ తనని మర్చిపోలేదంటావా...? మైక్?

అవి మీ అమ్మ దగ్గర ఎప్పట్నుంచో ఉన్నాయి. జార్జ్ పోయాక ఆ ఫోటోస్ మ్యాగజైన్‌లో వచ్చినప్పుడు నేనే కొని తెచ్చాను ఆ మ్యాగజైన్. అయినా మరిచి పోవడానికి తను ఒక జ్ఞాపకం కాదు... వదులుకోవడానికి తనేమీ మనిషి కాదు. జార్జ్ ఒక ప్రేమ

రూపం. తనొక అడిక్షన్. నువ్వు చిన్నప్పుడే ఫోటోగ్రఫీ మీద ఇష్టం చూపించినప్పుడు రీనా చాలా భయపడింది. నిన్ను అటువైపు వెళ్లనీయకుండా చాలా ప్రయత్నాలు చేసింది. అందుకే జార్జ్ గురించి నీకు ఎప్పుడూ చెప్పదు. నన్ను కూడా చెప్పనివ్వలేదు.

ట్రాఫిక్ హారన్ శబ్దాలు, వెచ్చని నిశ్శబ్దం కారు లోపల.

చెప్పు మైక్...

స్టీరింగ్ రెండు వేళ్ళతో తిప్పుతూ... ట్రాఫిక్‌నే చూస్తూ...

మేమిద్దరం పరిచయం అయ్యిందే యూనివర్శిటీలో. తను ఫైన్ ఆర్ట్స్ నేను జర్నలిజమ్. అప్పుడు మా అందరికీ వాడంటే హీరో వర్షిప్. చదువులో టాపర్. తెలుసుకదా ఎంత మంచి ఫోటోగ్రాఫర్. తనని ఎవరన్నా ఫోటోగ్రాఫర్ అంటే ఒప్పుకునేవాడు కాదు. లెన్స్‌మేన్ అనమనే వాడు. తనకలాగే ఇష్టం అనేవాడు. స్టూడెంట్స్‌కే కాదు ప్రొఫెసర్స్‌కి కూడా తను ఫేవరెట్. వాడి ఫిలాసఫీ ఏంటో వాడి వర్క్స్ చూస్తే అర్థం అవుతుంది. ట్రావెలింగ్ ఎక్కువ ఇష్టపడేవాడు. ఒంటరిగా వెళ్లిపోయేవాడు. మనుషులు, కల్చర్, ప్రకృతి ఇవంటే ప్రేమ. అన్నీ తన కేమెరాలో రికార్డ్ చేసేవాడు. మా అందరికీ ఒక ఆంత్రోపోలజిస్ట్‌లా కనబడేవాడు.

ఒక రోజు క్యాంటీన్‌లో ఉండగా రీనాను తీసుకొచ్చి పరిచయం చేశాడు, తనను రేపు పెళ్ళి చేసుకోబోతున్నాను రిజిస్టర్ ఆఫీస్ కొచ్చి సంతకం పెట్టమన్నాడు. షాకయ్యాను. ఇంకా కోర్స్ పూర్తికాలేదు, ఎలా పోషిస్తావ్ రా... తనను..? అంటే... ప్రేమించేటప్పుడు ఆలోచించలేదు, పెళ్ళి చేసుకునేటప్పుడు ఎందుకు ఈ ఆలోచన...అని అన్నాడు. అప్పుడు సిల్లీగానే అనిపించింది. కాని వాడి ఉద్దేశం ఏంటో తరువాత అర్థం అయ్యింది. తనని హాస్టల్‌లో జాయిన్ చేసి తను ఫ్రీలాన్స్ వర్క్ చెయ్యడం స్టార్ట్ చేశాడు. కోర్స్ పూర్తి చెయ్యగానే కొత్త కాపురం పెట్టాడు.

తన ఇల్లు చాలా ఇంట్రెస్టింగా ఉండేది. ఫుల్ ఆఫ్ లైఫ్, రెడ్ ఆక్సైడ్ ఫ్లోరింగ్, యాంటిక్స్, ఫోటోగ్రాఫ్స్, అన్నీ ప్రాణంతో ఉన్నట్టే. జార్జ్ దేవుడిని నమ్మేవాడు కాదు. అక్కడే రీనాకు, జార్జ్‌ని అర్థం చేసుకోవడంలో దూరమవుతూ వచ్చింది. కానీ జార్జ్ ఎప్పుడూ దగ్గరగానే వున్నాడన్న విషయం రీనా గ్రహించలేకపోయింది. మనుషులందరి ప్రవర్తన, ఇష్టాలు, నమ్మకాలు అవి ఎప్పుడూ ఒకేలా వుండవని తను నమ్మేవాడు. ఇవన్నీ ప్రేమకు అతీతం అనేవాడు. అందుకే చాలా లో–ఎక్స్‌పెక్టేషన్స్‌తో బతికాడు. జార్జ్ డెసిషన్స్ అన్నీ చాలా instinctive గా ఉండేవి. అవి రీనాకు నచ్చేవి కాదు. జార్జ్

ఒక ప్రవాహమైతే రీనా ఒడ్డులాంటిది. అందుకే ఇద్దరి ప్రయాణం కలిసి ముందుకు సాగలేదు. తను కన్సీవ్ అయినప్పుడు రీనా చాలా గొడవ చేసింది, స్టేట్స్‌లో సెటిల్ అవుదామని, దానికి జార్జ్ ఒప్పుకోలేదు. అలా తను బతకలేనని, ఇష్టంలేని ఉద్యోగం తను చేసి ప్రాణంలేని బొమ్మలా తన మనసుకి సంజాయిషీ చెప్పుకోలేని పరిస్థితి తేవొద్దు అని గట్టిగా చెప్పాడు. ఇలా నువ్వు కడుపులో పెరుగుతున్న తొమ్మిది నెలలు, తొంభై గొడవల్తో దూరం పెరుగుతూవచ్చింది. కాని ఎప్పుడు రీనాను కోప్పడేవాడు కాదు. జార్జ్ జాబ్ రిజైన్ చెయ్యడంతో రీనా బాగా అప్సెట్ అయింది. తను శ్రీలంకన్ ఎత్నిక్ కాన్‌ఫ్లిక్ట్స్ మీద రీసర్చ్ చెయ్యాలని డిసైడ్ అయ్యాడు. Aaron Siskind Foundation, USA నుండి Individual Photographer Fellowship గ్రాంట్ అయ్యింది. రీనాకి నైంత్ మంత్ అప్పుడు. తను ఒప్పుకోలేదు జార్జ్‌ని ఉండమని ఒక్కటే గొడవ. నన్ను పిలిచింది తనకి చెప్పమని. కాని జార్జ్ ఇవ్వన్నీ పట్టించుకునేవాడా?

టెన్ డేస్‌లో వచ్చేస్తాను. ఐ నో ఇట్స్ ఏ గర్ల్. షీ ఈజ్ మేఘా. మేఘా జార్జ్. నువ్వే పుడతావు అని ముందే చెప్పేడు.

ఏదైనా ఎమర్జెన్సీ అయితే నువ్వు చూసుకుంటావు కదా! మైక్ అన్నాడు నాతో. డాక్టర్‌తో మాట్లాడాను. ఇంకా థ్రీ వీక్స్ ఉందంట డేట్. ఐ విల్ బి బాక్ ఇన్ టెన్ డేస్. అందులోనూ ఇప్పుడు మాన్సూన్స్ మైక్. ఐ నీడ్ టు క్యాప్చర్ ద సీజన్, అంటూ వెళ్ళాడు.

అంతా బాగానే ఉంది అనుకుంటున్న టైమ్‌లో వర్షాన్ని క్యాప్చర్ చేస్తూ ఏక్సిడెంటల్‌గా చనిపోయాడు. హిల్ పాయింట్‌లో కొండచరియలు విరిగి పడి. టూ డేస్ పట్టింది బాడీ ట్రేస్ చెయ్యడానికి. ఇప్పుడు మనం చూస్తున్న ఆ తమిళ్ రెబల్స్ ఫోటోస్ అన్నీ తన లాస్ట్ వర్క్. నేషనల్ జియోగ్రాఫిక్ మ్యాగజైన్‌లో ప్రింట్ అయిన ఫోటో ఆ సిరీస్‌లోనిదే.

యెస్ ఐ నో... అంది మేఘ.

తన రీసెర్చ్ కోసం తను పెట్టుకున్న పేరు ఏంటో తెలుసా..?

తెలీదు.

గన్స్ అండ్ మాన్సూన్స్.

ఇంట్రెస్టింగ్... మైక్.

యు నో హౌ డెస్టినీ డిసైడ్స్...?

రీనా ఏ జ్ఞాపకాలను అయితే వొద్దు అనుకుందో... ఆ జ్ఞాపకాల వెంటే నీ ప్రయాణాన్ని మొదలుపెట్టావ్.

సెక్యూరిటీ చెక్ దగ్గర ట్రాలీ ఆగింది.

విల్ మిస్ యు మైక్... అంది నీళ్లు తిరిగిన కళ్లతో.

గో... అండ్ కం బ్యాక్ యాజ్ మేఘాజార్జ్.

వెయిటింగ్ ఫర్ యు.

టేక్ కేర్ ఆఫ్ మామ్... సీ యూ మైక్... కౌగిలించుకుని లోపలికి వెళ్లిపోయింది.

అలా వెళ్తున్న మేఘానే చూస్తూ ఉన్నాడు. కురుస్తున్న వర్షం కూడా ఇద్దరినీ చూస్తూనే ఉంది.

* * *

జార్జ్...

ఊహ తెలిసినప్పటి నుంచి నాన్న ఎవరో తెలియకుండానే పెరిగాను. అన్నిటికీ మైక్ నాతోనే ఉన్నా, కాని జార్జ్ లేని లోటు చూస్తూనే పెరిగాను. ఏమైనా మైక్ ఈజ్ ద బెస్ట్, బట్ నాన్నని మిస్ అయ్యాను అనుకున్నప్పుడల్లా తెలియని బాధ. అమ్మని ఎప్పుడడిగినా సమాధానం ఉండదు. ఆఖరికి తన రూపం ఎలా ఉంటుందో కూడా నాకు తెలియకుండా చేసింది. అప్పుడు మైక్ నాతోనే ఉన్నాడు. తన వర్క్స్ అన్నీ నాకు పరిచయం చేసింది తనే. ఎంత గొప్ప వర్క్స్ అవి, ఎంత లైఫ్ చూశాడో, శ్రీలంకన్ ఎథ్నిక్ కాన్ఫ్లిక్ట్‌పై తను చేసిందే లాస్ట్ వర్క్. ఇంత జీవితాన్ని రికార్డ్ చేసిన వాడు, తన జ్ఞాపకాలను మాత్రం రికార్డ్ చెయ్యడం మరిచిపోయాడు.

అసలు ఒక మనిషి జ్ఞాపకాలను ఎలా తుడిచివెయ్యగలం, ఈ విషయంలో అమ్మ గ్రేట్. తనకు నచ్చని విధంగా జార్జ్ బతికాడు. కేవలం రీనాకు నచ్చలేదు అన్న ఇగో వల్ల తనని వద్దనుకుంది. ఇట్స్ ప్యూర్లీ ఇగో, ఈ ఇగో వల్లనే జార్జ్ జ్ఞాపకాలను నా పై పడకుండా పెంచింది. ఆఖరికి తన ఫోటో కూడా నాకు కనబడకుండా చేసింది. జార్జ్ ప్రేమకి చిహ్నం అయిన నేను, తనని ఊహల్లో కూడా బొమ్మగా గీసుకోలేని పరిస్థితి నాది. అందుకే చిన్నప్పటి నుండి జార్జ్‌ని వెతుకుతూనే ఉన్నా, అలానే జర్నలిజం జాయిన్ అయ్యాను.

జార్జంటే నాకు కొన్ని ఫోటోస్ అంతే. మొదటిసారి జార్జ్ తీసిన ఫోటోస్ నేషనల్ జియోగ్రాఫిక్ మ్యాగజైన్‌లో చూసినప్పుడైతే నేను ఏడ్చేశాను. ఎన్ని రోజులు ఆ ఫోటోస్‌నే చూస్తూ గడిపానో నాకే తెలియదు. ఇప్పుడు తన వర్క్స్ మీదనే రీసెర్చ్ చేస్తున్నా. జార్జ్ తీసిన చాలా ఫోటోస్ సంపాదించాను. అవి చాలా వరకూ ఇప్పుడు ఆర్కైవ్స్‌లో దొరుకుతాయి. కానీ నాకు మాత్రమే దొరికిన ఒక అద్భుత నిధి జార్జ్ తీసిన లాస్ట్ రోల్ ఫోటోస్. మైక్ అవి నా కోసం తెప్పించాడు. ఇవి అన్ పబ్లిష్డ్, లైబ్రరీ నుండి తెప్పించారు. నాకోసం లైటింగ్, ఎక్స్పోజర్, సబ్జెక్ట్, ఫ్రేమింగ్ వీటి గురించి స్టడీ చెయ్యమంటే నా చూపు మాత్రం అందులో ఒక ఫోటోపై పడింది. అదే నన్ను ఇప్పుడు నా ప్రయాణం మొదలు పెట్టేలా చేసింది.

ఆకుపచ్చని పులి చారల డ్రెస్‌తో చెరువులో నీటి కోసం వంగిన ఒక అమ్మాయి. టాప్ యాంగిల్ షాట్. నీళ్ళలో ఆమె మొహం, వెనుకన ఉన్న ఫోటోగ్రాఫర్ కూడా కనబడతున్నాడు. కాని మొహానికి కెమెరా అడ్డంగా ఉంది. అదీ ఔట్ ఫోకస్‌లో. ఆ ఒక్క ఫోటోనే నా ఫోకస్‌ని మార్చేసింది. ఆ ఫోటోలో ఆమె ఫోటోగ్రాఫర్ వైపు చూస్తూ నవ్వుతోంది. ఫోటోగ్రాఫర్ మొహంలో కూడా నవ్వు తెలుస్తోంది. అతనే జార్జ్ అని తెలుసు. కానీ ఎవరా అమ్మాయి? తన కోసమే ఇప్పుడు నేను బయల్దేరింది.

* * *

కొలంబో.

మేఘ అనే ప్లకార్డ్‌ని కళ్లు వెతుకుతున్నాయి...

ఆయు బొవన్... చేతిలో ప్లకార్డ్‌తో ఒక యాభైఏళ్ల బ్లేజర్ వేసుకున్న మనిషి పలకరింపు.

ఐ యాం డిసిల్వా హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్, ఫ్రెండ్ ఆఫ్ మైకేల్ డిసౌజా అని పరిచయం చేసుకున్నాడు.

హౌ వజ్ యువర్ జర్నీ?

ఫైన్... మిస్టర్ డిసిల్వా, మైక్ చెప్పాడు, మీరు రిసీవ్ చేసుకుంటారు అని.

యా....

షల్ వియ్ మూవ్.

షూర్.

తన గురించి ఏమైనా తెలిసిందా?

కనుక్కున్నాను. ఆమె పేరు నిలా.

నిలా. ఎంత అందమైన పేరు. అప్పటికప్పుడే ఆమె గురించి తెలుసుకోవాలి అనిపించింది.

వేర్ ఈజ్ షీ నౌ?

తెలియదు. మనం జాఫ్నా వెళ్లాలి. అక్కడికెళ్తే అన్ని వివరాలు తెలుస్తాయి.

వెళ్తున్న కార్లోంచి కొలంబో నగరాన్ని చూస్తూ వుంది.

వాట్స్ యువర్ షెడ్యూల్...? డూ యూ వాంట్ టు గో ఆన్ ఏ సిటీ టూర్...? కొలంబో ఈజ్ ఏ వెరీ ఓల్డ్ సిటీ. కల్చరల్ డైవర్సిటీని బాగా ప్రతిబింబించే నగరం. దట్ టూ ఇట్స్ ఏ రైనీ డే. ఇట్ విల్ బీ బ్యూటిఫుల్.

నో... నో... ముందు జాఫ్నా వెళ్లాలి.

యెస్ అది నేను ప్లాన్ చేసాను, రేపు ట్రైన్, ఈ లోపు ఏమన్నా చూస్తాను అంటే వెళ్దాం.

యా, షూర్.

ఇంటికెళ్ళి ఫ్రెష్ అయ్యాక వెళ్దాం.

ఓకే.

మబ్బులు పట్టిన ఆకాశం, వెలిసిన వాన, తడిసిన రోడ్లు.

గంటలో వివేక్నాదా రోడ్‌లో బెన్ అండ్ నాన్సీ అపార్ట్మెంట్స్ ముందు ఆగిన కారులోంచి సముద్రపు వాసన పీలుస్తూ బయటకు దిగారు ఇద్దరూ.

థర్డ్ ఫ్లోర్ 301.

లిఫ్ట్ అలవాటైన శబ్దంతో థర్డ్ ఫ్లోర్‌లో ఆగింది.

కాలింగ్ బెల్ మాములుగా మోగింది.

హాయ్ మేఘా అంటూ నవ్వుతూ ఒక నలభై ఐదు వయసున్న, డిసిల్వా భార్య పలకరింపు.

హాయ్ ఐయాం శారా... త్రీ ఫోర్త్ షార్ట్స్ వేసుకున్న రింగుల జుట్టు అమ్మాయి, రాసుకుంటున్న బుక్స్ వదిలేసి అమాంతంగా ఎగిరి కౌగిలించుకుంది.

ఎంత ఆనందమేసిందో. ముచ్చటైన ఇల్లు. తెలియని ప్రదేశంలో ఊహించని పలకరింపు.

ఇదంతా అరేంజ్ చేసిన మైక్‌తో మాట్లాడాలి. తను లేకుండా కూడా ఇంత కంఫర్టబుల్‌గా నన్ను చూసుకుంటున్నాడు.

డిసౌజా... ఐ వాంటు టు మేక్ ఏ కాల్.

ష్యూర్... యూ కెన్ యూజ్ మై ఫోన్.

ఓకే.

నడుచుకుంటూ వెళ్తే చేరగలిగే దూరంలో సముద్రం.

కిటికీలోంచి కనబడుతున్న ఏకాంతాన్ని కోరుకున్నట్టు, గొడుగుతో మెరైన్ డ్రైవ్‌లో ఇసుకలో కాళ్ళు చాపుతూ మేఘ.

హాయ్ మైక్...

మేఘా...

మౌనం...

ఆర్ యు ఓకే...?

యా... మైక్... జీరగా గొంతు.

వాట్ హ్యాపెన్డ్ మేఘా...?

మైక్, తన పేరు నిలా.

వాయిస్ క్లియర్‌గా లేదు... డిస్ట్రబెన్స్...

హౌ ఈజ్ డిసిల్వా...? హౌ ఈజ్ యువర్ స్టే...?

ఇట్స్ గుడ్ మైక్, ఎందుకలా అడుగుతున్నావ్?

ఏమీ లేదు... ఆర్ యూ కంఫర్టబుల్?

యా... ఐ లవ్ దిస్ ప్లేస్ అండ్ దీజ్ పీపుల్ మైక్.

నేను ఎక్కడ ఉన్నానో తెలుసా...?

టెల్ మి.

అంతం ఎక్కడో తెలియని వినీల తరంగపు మైదానంపై.

హే... ఏంటి ఇంత పోయెట్రీ?

అలా అనిపించిందా?

బూజ్ చేశావా?

లేదు... మైక్.

మరి?

అలా ఉంది మరి నా పరిస్థితి ఇక్కడ. దూరం ఏంటో తెలియని ప్రయాణం, చేరుకుంటానో లేదో తెలియని గమ్యం, మిస్సింగ్ యూ మైక్.

కంట్రోల్ యువర్ సెల్ఫ్ మేఘా, యూ ఆర్ నాట్ ఎ కిడ్.

హ... హా... హౌ ఈజ్ మామ్...?

యా... షీ ఈజ్ థింకింగ్ ఆఫ్ యు.

యా... ఐ నో

యూ నో సంథింగ్,

హా.

జార్జ్ కూడా ఇలానే ఉండేవాడు.

అంటే?

సముద్రం లోతెంతో తెలిసినవాడు, మేఘాల దూరం తెలిసినవాడు, ఈ విశ్వాన్ని అర్థం చేసుకున్నవాడు, మనిషి కానివాడు. ఇందాక అన్నావు చూడు ఆ పోయెట్రీలా బతికినవాడు.

అలా కూడా బతకొచ్చు...?

అలా బతకలేకేనేమో... సారీ మేఘా... ఐ డింట్ మీన్ దట్.

ఇట్స్ ఓకే ఐ కెన్ అండర్‌స్టాండ్ మైక్.

టెల్ మీ వాట్ ఎల్స్???

ఉండనా మరి...

హా...

నిద్ర పట్టని రాత్రి. వీస్తున్న వర్షపు గాలి. ఉదయం ఎప్పుడు అవుతుందా అని ఆత్రుత.

ఉదయం ఐదు గంటల ప్రాంతంలో జాఫ్నా ఎక్స్‌ప్రెస్ వెల్లవట్ట స్టేషన్ నుండి బయలుదేరింది. సన్నగా వాన, కిటికీ పక్కన సీట్ ఎదురుగా డిసిల్వా. చిరు చీకట్లో లీలగా కదులుతున్న సముద్రపు ఒడ్డును కిటికీ నుండి చూస్తున్న మేఘ, చిన్న గురకతో డిసిల్వా నిద్ర.

అప్పుడప్పుడే తెలవారుతోంది. పనులకి వెళ్లే వాళ్లతో ట్రయిన్ నిండుతోంది.

దూరంగా వర్షంతో తడిసిన మేఘాలను చూస్తూ... ప్యాంట్రీ వాడి ఆర్డర్‌తో మెలుకువలోకి వచ్చిన డిసిల్వా, మేఘాను చూసి నవ్వాడు.

బ్రేక్‌ఫాస్ట్ ఏం ఆర్డర్ చెయ్యను.

ఎనీథింగ్.

ఇడియాప్పం ఓకే నా?

యా!

వవునియా వచ్చిందా...?

తెలీదు.

హ్మ్.

ఎందుకు?

అదే ఎల్.టి.టి.ఈ సింహద్వారం, అక్కడి నుండి టైగర్స్ ఆధీనంలో ఉండేది, అదంతా గత చరిత్ర. ఇప్పుడు అంతా మారిపోయింది.

మారిపోయింది అంటే?

వి ఆర్ రీ బిల్డింగ్ ది నేషన్.

ఈ యుద్ధం ఏమి మిగిల్చింది?

శాంతి అనే పెద్ద మాట వాడను కానీ, కొంత అశాంతిని దూరం చేసిందనే చెప్పాలి. పైకి కనిపించేంత చిన్న ప్రాబ్లమ్ కాదు ఇది. మైనారిటీ రైట్స్, కల్చరల్ డైవర్సిటీ, ఎడ్యుకేషన్, ఎంప్లాయ్మెంట్ ఇలా చాలా ఇష్యూస్ ఉన్నాయి. ఇవన్నీ అర్థం కావాలంటే బర్డ్ ఐ పర్స్పెక్టివ్‌లో చూడాలి. ఇప్పుడిప్పుడే అన్ని దేశాల నుండి వస్తున్నారు సహాయం చెయ్యడానికి. నార్త్, యీస్ట్ అన్నీ బాగా దెబ్బతిన్నాయి.

మరి అక్కడ లైఫ్ ఉందా?

మిగిలిన శిథిలాల కింద ఏం జీవం ఉంటుంది. అంతా విధ్వంసమే. ఇప్పుడు వాళ్లను అక్కున చేర్చుకునే ప్రేమ కావాలి. మరలా కొత్తగా నిర్మించాలి జీవితాలను.

ఎనిమిది గంటల ప్రయాణం. జాఫ్నా రైల్వే స్టేషన్.

ఉత్సాహంగా ఉంది మేఘ. నిలాని కలవాలన్న ఆత్రుత కనిపిస్తుంది.

యుద్ధం ఫిరంగులు మోగిన నేల. విద్యాలయాల్లో విప్లవ భేరీలు ప్రతిధ్వనించిన గతం. ఇప్పుడు అయోమయంగా కనిపిస్తున్న జాతిని, జరిగిన విధ్వంసానికి సాక్షిగా మిగిలిన జీవితపు అస్తవ్యస్త నడకను చూస్తూ... మేఘ.

ట్యాక్సీ జాఫ్నా యూనివర్శిటీ చేరుకుంది.

వెల్కం డిసిల్వా, ఇఫ్ ఐయామ్ రైట్ షీ ఈజ్ మేఘ, కమాన్ యంగ్ గర్ల్, ఐ హావ్ ఏ గుడ్ న్యూస్ ఫర్ యు.

మేఘా మొహం వెలిగిపోయింది.

మీరు పంపిన ఫోటోస్ చుశాను. యెస్ షీ ఈజ్ బ్రిగేడియర్ నిలా, షి టుక్ హెర్ మెడిసిన్ డిగ్రీ ఫ్రం జాఫ్నా యూనివర్శిటీ, షీ లాస్ట్ హర్ ఫ్యామిలీ ఇన్ ఎయిర్ బాంబింగ్. తరువాత మూమెంట్లోకి వెళ్లింది. మెడికల్ డాక్టర్‌గా సర్వీస్ చేసింది. కాడర్ పరంగా చాలా ఫాస్ట్‌గా ఎదిగింది. తక్కువ టైంలోనే బ్రిగేడియర్ అయ్యింది. బ్లాక్

టైగర్స్‌ని లీడ్ చేసింది. అమేజింగ్ స్పీకర్ అండ్ సింగర్ ఆల్సో. మూమెంట్లో యాక్టివ్‌గా వున్న తను సీజ్ ఫైర్ అగ్రిమెంట్ తరువాత తన ఇన్ఫర్మేషన్ దొరకలేదు. మే బీ తను చనిపోయిందా అనుకుంటే, సివిల్‌వార్ ముగిసిన టైంలో తను శ్రీలంకన్ ఆర్మీకి సరెండర్ అయినట్టు రికార్డ్స్‌లో ఉంది. తరువాత రిహాబిలిటేషన్ సెంటర్‌లో జాయిన్ అయ్యింది. తన వేర్ అబౌట్స్ ఎవరికీ తెలియదు. బట్ నాకు తెలిసిన ఇన్ఫర్మేషన్ షీ వాజ్ డైయాగ్నైస్డ్ విత్ ఏ రేర్ ఇన్‌క్యూరబుల్ మాలిగ్నెన్సీ. గుడ్ థింగ్ ఏంటి అంటే, షీ అండర్ వెంట్ ట్రీట్మెంట్. నౌ షీ ఈజ్ ఇన్ ఎ బ్యాడ్ కండిషన్ అని తెలిసింది.

వేర్ షీ యీాజ్ నౌ?

నువారా ఎలియ, అక్కడ క్యాన్సర్ సెంటర్‌లో ట్రీట్మెంట్‌లో ఉంది.

ఓకే సర్ థ్యాంక్స్ ఫర్ యువర్ ఇన్ఫర్మేషన్, నీడ్ టు గో...

ఓకే.

మేఘా ఆర్ యు ఓకే...? కుర్చీలో కూర్చున్న మేఘా భుజాన్ని కుదుపుతూ అన్నాడు డిసిల్వా.

కమాన్ మేఘా నీడ్ టు రష్.

మిస్టర్ డిసిల్వా... నిలాని కలిస్తే, ఈ ఓల్డ్ ప్రొఫెసర్ గురించి కాస్త గుర్తు చెయ్యండి.

ష్యూర్.

డైరెక్ట్ ట్రైన్స్ ఏమీ ఉండవు ఇప్పుడు. సో బై రోడ్ వెళ్లాలి. బస్‌లో వెళితే లేట్ అయిపోతుంది. క్యాబ్‌లో వెళ్దాం.

జాఫ్నా టు క్యాండి, క్యాండి టు నువారా ఎలియా. ఎయిట్ అవర్స్ జర్నీ చెయ్యగలవా?

లేదంటే నైట్ ఇక్కడే స్టే చేసి రేపు ఎర్లీ మార్నింగ్ స్టార్ట్ అవుదామా.

స్టార్ట్ అవుదాం, నిలాని చూడాలి

ఓకే.

కిలినొచ్చి, మాంగుళం, పులియంగుళం మీదుగా జాఫ్నా క్యాండి హైవేపై వర్షపు చినుకులను చీల్చుకుంటూ ముందుకు పోతోంది క్యాబ్.

ఎలియ నువారా... ఎలియ నువారా... ఎలియ నువారా... ఈ మాటే మేఘా చెవుల్లో గింగురులు తిరుగుతోంది.

జార్జ్ లాస్ట్ డెస్టినేషన్ కూడా అదే. ఇప్పుడు నిలా కూడా అక్కడే వుంది అంటే, జార్జ్ జ్ఞాపకాలను వెతుక్కుంటూ అక్కడ చేరిందా? లేక కో–ఇన్సిడెన్సా?

రకరకాల ఆలోచనలు మేఘా మనసులో. అర్థం కాకపోయినా బావున్న శ్రీలంక పాట క్యాబ్లో.

కొన్ని ఊర్లు స్మశానాలై పోయాయి. కొన్ని ఊర్లు లేవు. సగం విరిగిపోయిన తాటి చెట్లు.

యుద్ధం ఇంత విధ్వంసం సృష్టిస్తుందా?

ఔను... సృష్టిస్తుందా?

దీనికి బాధ్యులు ఎవరు?

బాధ్యులు ఎవరు అని తెలుసుకోవడం కంటే భాధితులు ఎవరనే తెలుసుకో. ఈ యుద్ధం మిగిల్చిన జ్ఞాపకాలు చాలా ప్రమాదకరమైనవి. అవి వీలైనంత త్వరగా తుడిచెయ్యాలి. ఇక్కడ ప్రతి ఒక్కరిదీ ఒక్కో కథ. ఒక వైపు ఆర్మీ అట్రాసిటీస్, మైనారిటీస్‌పై దాడులు, చదువు, ఉద్యోగ అవకాశాలు, రిజర్వేషన్స్, ఇవన్నీ సివిల్ అన్‌రెస్ట్‌కి దారి తీసేలా చేశాయి. ఒక వైపు విప్లవం. మిలిటెన్సీ గ్రూప్స్, లీడర్షిప్ ఇలా మొదలైన ఉద్యమం రాను రాను కంట్రోల్ తప్పుతూ వచ్చింది. పోరాడి ప్రాణాలు వదిలిన వీరులు అమరత్వాన్ని ఏ తక్కెడా తూయలేదు. కాని అదే ఉద్యమ సమయంలో ప్రాణాలు కోల్పోయిన సివిలియన్సే ఎక్కువ తెలుసా? మరి వీళ్ల జీవితాలను ఎలా లెక్కగడతావు. ఇదే యుద్ధానికి ఉన్న రెండు పార్శ్వాలు. బొమ్మా, బొరుసులా. ఇప్పుడు నీలాంటివాళ్లు ఎటువైపు ఉండాలో ఆలోచించుకోవాలి.

బాధ్యుల వైపా...? బాధితుల వైపా...?

తను చెప్పే మాటలన్నీ వాయిస్ రికార్డర్లో రికార్డ్ చేసుకుంటోంది.

చలి ఎక్కువైంది, డిసిల్వా బ్యాగ్‌లో నుండి మఫ్లర్ తీసి తలకు చుట్టుకున్నాడు.

మేఘా జెర్కిన్ వేసుకుంది. చీకటిలో ఎదురుగా వస్తున్న కార్ల హై బీమ్‌లతో ప్రయాణం.

రంబోడా దాటి పిడురుతలగల ఫారెస్ట్ రేంజ్ చీకట్లో అడవి, ఏదో రహస్యాన్ని దాచుకున్నట్టు గంభీరంగా ఉంది. వర్షం మొదలైంది. సింగిల్‌రోడ్ వల్ల నెమ్మదిగా ఉంది జర్నీ.

మేఘా వి ఆర్ రీచింగ్ ఇన్ థర్టీ మినిట్స్.

సమాధానం లేదు.

పడుకున్నావా...?

లేదు చెప్పండి.

డిన్నర్ చెయ్యాలి కదా, బాగా పొద్దుపోయింది.

నాకు వద్దు, మీరు చెయ్యండి.

అలా కాదు. దారంతా ఏమీ తినలేదు కదా, ముందు డిన్నర్ చేద్దాం.

మీరు చెయ్యండి. నేను టీ తాగుతాను.

ఓకే.

ది ఫెర్న్ ఇన్ గెస్ట్ హౌస్ ముందు ఆగింది.

లగేజ్ రిసెప్షన్ హాల్లోకి తెచ్చాడు డ్రైవర్.

డిసిల్వా, గివ్ మీ యువర్ ఫోన్.

మైక్‌కి కాల్ చేసింది.

మేఘా...

హా... మైక్,

ఎలా ఉన్నావ్?

నిలాని కలిశారా?

ఐ యాం వెయిటింగ్ ఫర్ యువర్ కాల్.

నాకు భయంగా ఉంది మైక్. చాలా డిస్టర్బ్‌డ్‌గా ఉన్నా.

వై, వాట్ హ్యాపెండ్?

తను జార్జ్ చనిపోయిన ప్రదేశంలోనే ఉంది.

నువారా ఇలియా??? అక్కడే ఉండటానికి ఎనీ రీజన్?

తెలీదు.

నువ్వు ఉంటే బావుండేది మైక్. నాకు ధైర్యంగా.

నేను ఎప్పుడూ ఉంటాను. జార్జ్ నడిచిన అడుగులు వెంట నువ్వు నడవాల్సిన దారిని వెతుక్కోవలసిన క్షణం ఇది. దిస్ జర్నీ ఈజ్ ప్యూర్లీ యువర్స్.

నిలాని ఫేస్ చెయ్యగలనంటావా?

కూల్ మేఘూ, యు కెన్!

ఓకే మైక్ బాగా లేట్ అయ్యింది. మామ్ ఎలా ఉంది, షీ ఇజ్ ఫైన్, ఒకసారి ఫోన్ చేసి మాట్లాడు.

ఇప్పుడు కాదులే, రేపు చేస్తా.

ఓకే గుడ్ నైట్ మేఘు.

బై మైక్.

ఈ రాత్రి త్వరగా గడిస్తే బావుండు.

* * *

తెల్లని గోడలు. తెల్లని కర్టన్స్. సగం కప్పుకున్న నీలిరంగు దుప్పటి. వరుసగా ఇస్తున్న కీమోథెరపీ వల్ల శిథిలమైన మనిషి తను. వస్తున్న దారిలో చూసిన శిథిలాలు గుర్తుకొచ్చాయి తనని చూస్తే.

నిలా!

రా... మేఘూ...

ఆశ్చర్యం!

నా పేరు మీకెలా తెలుసు?

నువ్వు వస్తావని నాకు తెలుసు.

నిన్ను చూస్తుంటే, జార్జ్‌ని మళ్లీ చూసినట్టే ఉంది.

నేను వస్తానని మీకు ముందే తెలుసా?

నేను ఎవరో కూడా తెలియకుండా పెరిగావ్. నన్ను వెతుక్కుంటూ ఇక్కడ దాకా వచ్చావ్ అంటే అది కేవలం యాధృచ్ఛికమా కాదా అన్నది ముఖ్యం కాదు. జార్జ్ మీద ప్రేమే నిన్నిక్కడికి తీసుకొచ్చింది. బహుశా నీ కోసమే నేను ఇంకా బతికున్నాను.

కూర్చోమంటూ కాట్ పక్కన ఉన్న స్టూల్ చూపించింది.

వాయిస్ రికార్డర్ ఆన్ చేసింది.

డిసిల్వాను నవ్వుతూ విష్ చేసింది. గోడకు వీపునానించి నిలుచున్నాడు.

చెప్పు మేఘా ఏమి కావాలి. ఏమి తెలుసుకోవాలి నువ్వు. జార్జ్ గురించేనా?

తనని ఇలా చూస్తుంటే మేఘా కంట్లో నీటిపొర కరిగి కన్నీరై కారుతోంది. సమాధానం చెప్పలేదు. గొంతు పెగలట్లేదు. అది అవసరపు నిశ్శబ్దంలా ఉంది.

యుద్ధం అనివార్యమైనప్పుడు, ప్రేమ అవసరం తెలిపినవాడు అతను.

జార్జ్‌ని మొదటిసారి చివరిసారి కలిసింది ముల్లైత్తివులో. తను గన్స్ అండ్ మాన్సూన్స్ అనే ప్రాజెక్ట్ వర్క్ కోసం ఇండియా నుండి వచ్చాడు. జర్నలిస్ట్లు ఎవరైనా వస్తే ప్రత్యేకంగా ఆహ్వానించే పద్ధతి ఉండేది అప్పుడు. ముల్లైత్తివు ఎల్.టి.టి.ఈ ఆధీనంలో ఉన్న రోజులు. అది సముద్రపు అంచున ఉన్న ఊరు. సీటైగర్స్, నేవల్ బేస్ ఉండేది, రిక్రూట్మెంట్స్, ట్రైనింగ్స్ అక్కడ నుండి ఎక్కువ జరిగేవి. నా బ్రిగేడ్ కూడా అక్కడే ఉండేది. జార్జ్‌ని అక్కడే కలిశాను, తను ఒక సమ్మోహనం, మనుషులను ఇట్టే ఆకర్షించే గుణం. బాగా పెరిగిన లూజ్ హెయిర్. ఎరుపు రంగు టీ షర్ట్. బ్లూ జీన్స్, వైట్ స్పోర్ట్ షూ. భుజానికి కెమెరాబ్యాగ్.

హలో, నిలా అంటే మీరేనా...?

అవును.

బ్రిగేడియర్ అంటే చాలా వయసుంటుందని ఊహించాను. మీరు చాలా అందంగా వున్నారు. పులులు అందంగా ఉంటాయి అని ఇప్పుడే తెలిసింది.

ఏమి కావాలి?

నేనో ఫోటో జర్నలిస్ట్‌ని, రీసెర్చ్ వర్క్ మీద వచ్చాను, ఇదిగో పర్మిషన్ లెటర్ కూడా తెచ్చాను. మిమల్ని కలవమన్నారు.

ఇండియా నుండా?

హా!

తమిళ్?

కాదు.

మరి.

నాకు ఇలా ఐడెంటిటీ చెప్పుకోవాలి అనిపించదు.

సరే! ఏం కావాలి? అడుగు.

మీరు డాక్టర్ అన్నారు.

అవును.

మరి ఇంత కోపంగా ఉంటే, ఎలా ట్రీట్ చేస్తారు?

ఇప్పుడు నేను డాక్టర్ని కాదు. అయినా నాకు పరేడ్ ఉంది. కాసేపు అయ్యాక మాట్లాడుకుందాం.

థ్యాంక్స్ మిస్ నిలా... మీ నవ్వు బావుంది అంటూ పరిగెత్తుతూ గుడిసె కిందకు వెళ్లాడు.

సముద్రపు ఇసుక, గుడిసెలలో ఉద్యమకార్యశాలలు. ఒక వందమంది అమ్మాయిలు పరేడ్ చేస్తున్నారు. ఉద్యమపాట పాడారు. అద్భుతమైన గొంతు నిలాది. ఫొటోస్‌తో మొత్తం పరేడ్‌ని కవర్ చేశాడు. రెండు టీ గ్లాసులతో నిలా గుడిసె దగ్గరికి వచ్చింది.

మీ గొంతు చాలా బావుంది మిస్ నిలా. మీ గొంతు మీకు దేవిడిచ్చిన వరం.

దేవుడు లేడు. వరమూ కాదు. ఎక్కడ అణిచివేత ఉంటుందో అక్కడే పాట పుడుతుంది. కొన్ని వేల ఆర్తనాదాల నా జాతి అస్థిత్వ ప్రతీక నా గొంతు. నా గొంతు నా ధిక్కారం. నా పాట నా జాతి చరిత్ర.

ఏది ఏమైనా మీరు సింగర్. ఇంత అద్భుతమైన గొంతు మీ ఉద్యమానికే పరిమితం ఎందుకు చేస్తున్నారు?

ఏ ఆర్ట్‌ఫార్మ్ అయినా ఎలా పుడుతుందో తెలుసా? సప్రెషన్‌లో నుండే పుడుతుంది. నాది ఉద్యమపాట.

ఓకే ఓకే.

మబ్బులు పట్టిన ఆకాశాన్ని చూస్తూ ఇసుకలో ముందుకు నడుస్తూ నిలా మెడలో ఉన్న సైనైడ్ కాప్స్యూల్‌ని సర్దుకుంది.

మరణాన్ని మెడలో వేసుకుని ఎలా ఉంటారు? ఎలా నిద్రపోతారు?

నీకు మరణం అంటే భయం, మాకు మరణం అంటే క్షణికం. మా జాతి కోసం మరణాన్ని చిరునవ్వుతో ఆహ్వానిస్తాం.

ఇంత ప్రోగ్రామ్డ్‌గా ఎలా తయారవుతారు?

నువ్వో హిపోక్రేట్. బాగా చదువుకుని, గొప్ప ఉద్యోగాలు చేస్తూ, మంచి జీతాలు సంపాదిస్తూ, ఏదో టేస్ట్ కోసం ఇలా రీసెర్చ్‌లని అవి అని, ఇవి అని, తిరుగుతూ, ఇలా మాట్లాడుతుంటారు. అసలు ఇక్కడి పరిస్థితులు నీకేం తెలుసు? ఇక్కడి పోరాటం గురించి ఏం తెలుసు? నమ్మకాలు ఛిద్రమవడం తెలుసా? నమ్ముకున్న దేవుడి గుడిని కూల్చేయడం తెలుసా? కుటుంబాలు ఉన్న నేలను ఉన్నపళంగా ఖాళీ చెయ్యడం తెలుసా? పుట్టిన ఊరిని స్మశానంగా చూసుకోవాలి అంటే ఎంత ధైర్యం ఉండాలో తెలుసా? ఇవన్నీ తెలిస్తే మీకు మా ఉద్యమంలో ఏదీ ప్రోగ్రామ్డ్ కాదు, అది మా కర్తవ్యం అని తెలుస్తుంది.

ఐ కెన్ అండర్ స్టాండ్ యువర్ స్ట్రగుల్. కానీ ఈ యుద్ధంలో అందరూ చనిపోతారు. చివరికి మిగిలేది శవాలు, స్మశానాలే. అప్పుడు ఈ యుద్ధంలో ఎవరు గెలిస్తే ఏం లాభం? బైదవే... నాది హిపోక్రసీ అన్నారుగా, ఇవన్నీ నా వర్క్స్. చూడండి నా హిపోక్రసీ అర్థమవుతుంది. నేను మళ్లీ వస్తాను. జీప్ ఎక్కుతూ ఆమెకి తన ఫోటో ఆల్బం ఇచ్చాడు.

మిస్ నిలా మిమ్మల్ని ఒకటి అడగొచ్చా?

అడుగు అన్నట్టు సైగ చేసింది.

నువ్వు ఎవరు?

దీనికి సమాధానం చెప్పు నేను తిరిగి వచ్చేలోపు. అప్పుడు హిపోక్రసీ ఎవరిదో తెలిసిపోతుంది.

చేతిలో ఉన్న పుస్తకాన్ని చూసింది. కంబోడియా – ది సివిల్ వార్. ఏ విజువల్ హిస్టరీ బై వి.జార్జ్. యుద్ధం సృష్టించిన బీభత్సాన్ని అద్భుతమైన ఫోటోగ్రాఫ్స్‌లో చిత్రించాడు.

యుద్ధం తర్వాత మిగిలిన శిథిలాల గురించీ చాలా గొప్పగా రాశాడు. చాలా గొప్పగా అనిపించింది తన వర్క్. తన మీద నా అభిప్రాయాన్ని మార్చుకునేలా చేసింది ఆ పుస్తకం. అప్పుడే అర్థం అయ్యింది తన పర్స్పెక్టివ్ ఏంటో. తను అడిగిన ప్రశ్న గురించే అలోచించడం మొదలుపెట్టాను.

ఎవరు నేను?

టార్పలిన్ కప్పిన గుడిసె ముందు కూర్చున్న నా ముందుకు వర్షపు జల్లులకి తడుస్తూ జీపు దిగి పరిగెత్తుతూ వచ్చాడు.

మిస్ నిలా... నా ప్రశ్నకు సమాధానం దొరికిందా? తడిసిన జుట్టుని విదిలించుకుంటూ.

సారీ... ఇందాక అలా మాట్లాడుండకూడదు.

ఇవన్నీ కాదు. నువ్వు ఎవరు అన్న దానికి సమాధానం కావాలి నాకు.

నేను నిలా.

నిలా, బ్రిగేడియర్ ఇవన్నీ కాదు. నువ్వు ఎవరు అన్నది నా ప్రశ్న.

ఒక అమ్మాయిని.

జెండర్ అడగలేదు.

మరి ఎలా చెప్పాలి?

కనబడుతున్న ఆ అలను చూసి ఏమి చెబుతావ్?

మౌనం.

ఒడ్డు కోసం పరితపిస్తూ కలుసుకోవాలని ఎన్నో జన్మల నుండి చేస్తున్న ప్రేమికుల పోరాటంలా లేదు?

ఇంత భావుకత నాకు లేదని అర్థం అయ్యింది.

కురుస్తున్న చినుకుని చూస్తే నీకు ఏమనిపిస్తుంది?

వర్షాకాలం కదా అనిపిస్తుంది.

తన ప్రియురాలి కోసం నేలకు చేరుకుంటున్న యోధుడు కనిపించడం లేదా?

ఇంత రొమాంటిక్‌గా నేను బతకలేను.

మళ్లీ ఇక్కడే నాకు సమస్య వస్తుంది.

ఎందుకు?

నేను బతకలేను అన్నావ్ కదా... ఇక్కడ నేను అంటే నిలానా? లేక నువ్వా?

అన్నీ నేనేగా.

అన్నీ నువ్వు అనుకోవడంలోనే ఉంది. అన్నింటినీ దులుపుకుని నువ్వుగా నా దగ్గరకొస్తే నువ్వేంటో చూపిస్తాను.

ఇదంతా నేను ఎందుకు చెయ్యాలి? నీకోసమా?

కాదు నీ కోసం. ఈ విశ్వమంతా నిండి ఉన్న ప్రేమను నీలో చూపిస్తా.

నన్ను నన్నుగా ఇసుక తిన్నెలపై నడిపిస్తూ, నా ఒక్కో అడుగు కాంతులతో మెరిసిపోతుంటే, వెనక్కి తిరిగి చూశాను. వెనక్కిచూడకు. ముందుకి చూడు అని సముద్రంలోకి తీసుకెళ్లాడు. అది వెండి సముద్రం. నేను ఎప్పుడూ చూడలేదు. ఇద్దరం వెండి సముద్రంపై తేలుతూ, చంద్రున్ని చూస్తూ మాటలు చెప్పుకున్నాం. అసలు మునిగిపోతాం అన్న అనుమానం రాలేదు. అప్పటిదాకా ఉన్న నమ్మకాలను నమ్మొద్దు అని అన్నాడు. ఇంతలో ఒక పెద్ద తూనీగ వచ్చింది. నాకు నక్షత్రాలను తాకాలని ఉంది అన్నాను. మమ్మల్నిద్దరినీ ఎక్కించుకుపోయి నక్షత్రాల్ని తాకించింది. ఎంత దివ్యమైన వెలుగు అది. నమ్మకాలను వదిలేసి చూడు నువ్వు విశ్వాన్ని తాకుతావు అన్నాడు. ఈ సృష్టి అంతా ప్రేమమయం అందుకే ఆకాశం, నక్షత్రాలు, సముద్రం, మనుషులు, జంతువులు, అన్నీ ప్రేమ సృష్టే. మనల్ని మనం సృష్టించుకోవడానికే మళ్లీ మళ్లీ మనం పుడుతాం. ఈ విశ్వం ముందు అన్నీ ఎంత చిన్నవో! మన శోకం, మన కోపం, మన నమ్మకాలు ఎంత చిన్నవో అనిపించడం లేదా! కోపం, శోకం, కామం అన్నీ క్షణికాలు. ప్రేమే శాశ్వతం. ఈ నక్షత్రాలన్నీ చిందరవందరగా ఉన్నాయి. అంటే ఏమి సమాధానం ఉంది నీ దగ్గర, ఈ ఆకాశాన్ని చూస్తే ఏమి అర్థం చెప్పగలవు. ఇదంతా ప్రేమేనని ఒప్పుకోగలవా? నువ్వు నువ్వైనప్పుడు మాత్రమే ఒప్పుకోగలవు. మన ఒప్పుకోళ్లు ఎప్పుడూ మన నమ్మకాలపై ఆధారపడి ఉంటాయి. అవి వదిలేసి నువ్వుగా వచ్చావు కాబట్టి నువ్వు ఇవన్నీ స్పర్శించగలిగావు. అర్థమైందా?

వర్షం మొదలైంది. గుడిసెలోకి పరిగెత్తాం. తనని చూడాలంటే నాకు సిగ్గుగా ఉండింది. తను వర్షపు చినుకులలో తడిసిన జుట్టుని విదిలించుకుంటూ, రేపు నేను నువార ఎలియా వెళ్తున్నాను. అక్కడ వర్షాన్ని క్యాప్చర్ చెయ్యాలి. నాకు కూతురు పుట్టబోతోంది. తనకి మేఘా అని పేరు పెట్టాను. తనను మళ్లీ ఇక్కడికి తీసుకొస్తా. నిన్ను పరిచయం చేస్తా. అప్పటికయినా ఈ నేలపై శాంతి నెలకొని ఉంటుందని, నీ ఉద్యమ పాట, ప్రేమ గీతమై నన్ను స్వాగతం పలుకుతుందని నా విశ్వాసం.

నేను తననే చూస్తూ ఉండిపోయాను.

ఈ రాత్రి తెల్లారకపోతే ఎంత బావుంటుందో అనిపించింది.

* * *

అలా వెళ్లిపోయిన జార్జ్ మళ్లీ తిరిగిరాలేదు. నువారా ఎలియా వెళ్లిన జార్జ్ వర్షాలకి ప్రమాదవశాత్తూ కొండచరియలు విరిగిపడి చనిపోయాడని తెలిసింది. ఇక అప్పటి నుండి నేను నేనుగానే ఉంటూ వచ్చాను. నా జాతికోసం, శాంతి కోసం ఉద్యమాన్ని వదిలిపెట్టాను. ప్రేమను పంచాలని, ప్రేమను పెంచాలని, ఈ నేలపై శాంతి జెండా ఎగురవెయ్యాలని నా ప్రయత్నం. కానీ నా ప్రయాణం ఇక ఆగిపోతుంది. ఇప్పుడు కావలిసింది నాలాంటి వాళ్ళు కాదు, నీలాంటి ప్రేమ హస్తాలు. యుద్ధం చేసిన విలయతాండవంలో నేను ఒక భాగం అయ్యాను. నేను చీకటి. నన్ను ఇలానే ముగియనియ్యి. మీ తరమే ఇప్పుడు వెలుగు అందివ్వాలి.

తన గొంతు మూగబోయి నిశ్శబ్దం ఆవరించుకుంది.

ఏదో వదిలివెయ్యాలనుకున్న భారాన్ని వదిలేసి స్వేచ్ఛగా వెళ్లిపోయినట్లుగా తన ప్రాణం అనంతలోకాలకు చేరుకుంది.

చెదిరిన మోముతో హాస్పిటల్ బయటకు నడుచుకుంటూ వెళ్తోంది మేఘ.

దూరంగా ఒక చోట నిలా నీళ్లు తాగడానికి ఒక సెలయేరులోకి వంగింది. వెనుకే ఉన్న జార్జ్ నీటిలో ఆమె ప్రతిబింబాన్ని ఫోటో తీస్తున్నాడు. నిలా నవ్వుతూ చేతిలోకి నీళ్లు తీసుకుని అతనిపైకి విసిరింది. జార్జ్ కెమెరాని పక్కకి తీశాడు. అతని మొహం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. వాళ్లిద్దరూ వెనక్కి తిరిగి మేఘని చూసి చెయ్యి వూపారు. మేఘ వాళ్లని చూస్తూ చెయ్యూపింది. వాళ్లిద్దరూ చేతిలో చెయ్యేసుకుని ముందుకు నడుచుకుంటూ వెళ్లిపోయారు. మేఘ కంట్లోనుంచి కన్నీళ్లు ఉబికి వచ్చాయి.

డిసిల్వా వచ్చిఫోన్ చేతికిచ్చాడు.

రీనా కాలింగ్ అని డిస్ప్లేలో చూపిస్తోంది.

జార్జ్‌కి ప్రేమించడం తెలియక పోవడం కాదు. ప్రేమని ఒక్కరికే పంచాలని తెలియదు. ఈ విషయమే రీనాకి చెప్పాలనుకుంది మేఘ.

✦✦✦



# మిథున

నేను ఉత్తరాంధ్ర బొట్టెని! పుట్టింది విశాఖలో... చదివింది ఫిలాసఫీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్. చేస్తోంది టీచరుద్యోగం. కథలు చదవడం, రాయడం ఆసక్తి. సారంగ వెబ్ మ్యాగజైన్, సాక్షి, ఆంధ్రప్రదేశ్ పత్రికల్లో నా కథలు అచ్చయ్యాయి. ఉద్యోగ నిమిత్తం పల్లెల్లో నివాసం ఉండటం వల్ల, వారి జీవన విధానం, సామాజిక పరిస్థితులు, వారి అనుబంధాలు, కట్టూబొట్టూ యాసలు చాలా దగ్గరగా గమనించే అవకాశం కలిగింది. ఈ కథను ఉత్తరాంధ్ర మాండలికంలో రాయటానికి నాకు ప్రేరణనిచ్చినవి అవే!

“ యెన్ని మాటలెన్ని వూసులు! బూమి పుట్టిందీ..
నీరు పారేదీ మనకోసమేనన్నట్టు
యెన్ని తిరుగుల్లు.. యెన్ని పెమానకాలు! ”



# రామి

'నాకో బిడ్డని కనిస్తావా రామీ...'

గుండెకాయ పొత్తిట్ల కొట్టుకుంటంది... అరిపాదాల నీరు సెరువయ్యింది.. సెవులు మూసుకున్నా యినపడీ పిడుగు సెబదాల్లా అతని మాటలు బేజారెడుతున్నాయ్!

"ఓయమ్మ రావీ ఉ... యేటిసేత్తన్నావవతలా..." అయ్య మానిక్కెం కేకకి, సేతిలో గిన్ని జారి దొర్లుకుంట పోయి, బమ్మల్ల పడ్డాది!

తోవిన గిన్నిల్ని కాలేసి సెయ్యి తుడుసుకుంట లోనికెల్లింది రామి.

"పొయ్యి మింద పాలెట్టా, కాసింత సూడమని సెప్పాను కదయ్యా.. సూడెలా పొంగిపోనాయో!" మొకం సిట్లించుకుంటా పొయ్యి తుడుసుకుంది.

"నాన్ సూడగల్ను గాని, లెగిసి తియ్యలేను కదేటమ్మి, నిన్ను పిలిసీలోగ వొలిగిపోనాయ్! పోన్లేయే పాలు పొంగితే సుబమేలే! అయ్యలగుంచీ, నాక్కాస్త టీ సుక్కెట్టియ్యే" గారంగ అడిగేడు.

"యెదవదా బీవసింగి సమ్మందం కుదరగ్గానీ... లేకపోతే, ఇపాటికి నీకిద్దరు బిడ్డలు కలిగీసి, నీ యిల్లు సక్కబెట్టుకుంటా వుండేదానివి కదేటమ్మా! అందుకే అన్నారు 'సవురుండగానే కొంప సరుదుకోవాలా అని!' నా నడుం పడిపోకముందే నిన్ను యిల్లు దాటించలేకపోన్నే!" కల్లంట దిగులు కారింది మానిక్కానికి.

“వూరుకో నాన్నా… యిప్పుడేటయ్యిందీ? నాకు పెల్లై ఎల్లిపోతే, నిన్నెవలు సూసీవోరు?!”

“యెవులు సూడాలమ్మా? మీయన్న సచ్చినోడే సూసీవోడు. యెవడికోసం సూడ్డూ? వున్నదంత ఆడికే వూడిసెట్టీసిందిగా మీయమ్మ! యెదవది సచ్చి యేలోకంలుందో! పొలం సేతిల బడగానే సెల్లి పెల్లి బాజ్జెత కూడ వొగ్గీసి పెల్లవెనకాల పోనాడు యిదమ్మాలినోడు! ఆడి దినం జెయ్య!”

“అన్నియ్యనేటనకు నాన్నా… యేదెప్పుడు జరగాలో అప్పుడే జరుగుతాది.. యింద తాగు” అంటూ సేతికి టియ్యందించి, సెంగుతో అతని మొకం తుడిసింది.

రాత్తిబ్బమీదున్న తుంగసాప మింద ఆరబెట్టున్న తడి బియ్యాన్ని కాల్లతో సెదురుత్తున్న కోడి వంక సూత్తూ కూసుంది రామి.

యెనకమాల్లెల్లి హుస్సని అరుసుకుంటా తోలిందో తువ్వాలు. తోలద్దన్నట్టు ఆ సేతిని పట్టుకోని ఆపింది.

“అదేటే… అదలా బియ్యం బుక్కిత్తుంటె సూత్తూ నిలబడ్డావ్! మారెమ్మ సంపీగల్దు నిన్ను” కోడిని తవుల్తూ రామి పక్కన సేరాడు బైరి.

“తిన్నీవయ్యా… దాని పేనమెంతా?! అది తినీదెంతా?!” మనకెలాగూ గుప్పెడు మెతుకులు లోనికెల్లాలంటే గుంజిడీతులీదాల! తువ్వాలు సుట్టిన బైరి సేతినెనక్కి లాగింది.

“అడివిలాగ పెరిగిన సరుగుతోటనానుకొని సోడిచేలు, వోపక్క పెద్దమనుసుల్లా నిలబడ్డ తాడిసెట్లు..

పెండి వారంట రాలిన సోడిగింజల్ని యేరుకుంటున్న పిట్టలే తప్ప పిట్టమనిసి జాడ లేదక్కడ. తడిబియ్యంతో పొట్టనిండిన కోడి కూడ యెల్లిపోయింది.

పాత బాకీలేవో గుర్తుకొచ్చినట్టు రామి వొంక సూస్తా దగ్గిరికెల్లాడు బైరి.. సరుగు సెట్ల నీడ యెండపొడ దాసింది..

కొన్ని గడీలక్కడ కాకులెగరలేదు.. మేకలరవలేదు.. గడ్డి మోపులు నడవలేదు.. పంచుకుంటన్న వూపిరికి బయం,బెగులు తెలీలేదు..

తల్లోంచి దులుపుకున్న సరుగు సితుకును వొంటి మీంచి రాల్చుకుంటూ..బైరి సేతుల్లోంచి బయటపడగానే, సిమితపడ్డాది రామి యెర్రవోణీ…

"నన్నెల్లనీ బైరీ... నాన్న యెదురు సూస్తాడు. ఇయ్యాల ఆడ్ని ఆస్పత్రికి తీసుకుపోవాల... ఆడి నడువెప్పుడొస్తదో... యెప్పుడు లేసి తిరుగాడతాడో..!"

"వోయబ్బ... యిప్పుడు మీ నాన్నకి నడుంతో యేటి పనుందేటి? నువు యెడుతుంటే కులాసగ కూసునే తింటన్నాడుగా!"

"యేటలగంటావ్? మానాన్న నీకేటి సేసేడేటి?"

"మరి! కూతురు పెద్దమనిసై నాలుగేల్లు దాటి పోనాయ్... యెదురుగా అల్లుడుగోరు తిరుగుతన్ను... పిలిసి పిల్లనివ్వడం తెల్దేటాడికీ? "బైరి సేతినున్న రామి జెడ గట్టిగా బిగుసున్నాది. కుతుకనరాలు జిమ్మన్నాయ్..

"అబ్బా... యేటలా లాగేత్తావ్?! నొప్పి..." గింజుకుంది రామి.

"సెస్... యేటే నొప్పి? యిది నాదీ!"

"యేటీ? జెడ నీదా! ఐతే కోసుకుపో! ""

"ఔనా! నిజంగానే కోసుకుపోనేటే?!"

సేతిలో జెడని యింకొంచం లాగుతూ కొడవలి కోసం యెతికాడు బైరి!

"వోలమ్మో! యేటెతుకుతున్నావ్? నిజంగానే కోసెత్తవా యేటీ?"

"ఔనే... సెప్పాగా... కోసెత్తాననీ... మరీ నాగుపావులా బుసకొడతంది నన్ను సూసీ! యేవెట్టి పెంచుతున్నావోగానీ...!"

"నా మొగుడు అలమండ సంతలో కొన్ని సిట్టావదమెట్టి పెంచుతున్నలే! ఒగులు... ఒగులెహే..." బైరి సేతుల్నిడిపించుకుంది రామి జడ...

"సిట్టావదం యెట్టుకునే కరమం నీకేటే... నువు వూ... అను... సంపింగి నూన్లో ముంచీనూ నిన్నూ!"

"హహ్హహ్హహ్హ సాల్లే... అది నాకెందుగ్గానీ నీ మీసాలకెట్టుకో... యెనకటికి నీలాటోడే... మాటల్త యెకరాల్తడిపీ... పీటెక్కి యేలకి తొంగున్నాడట... హహ్హహ్హహ్హ" రెచ్చగొడితే యేటవ్వుద్దో తెలిసి కూడా నవ్వింది!

"అమ్మనీ... యెంత మాటనీసింది! సచ్చిపొయ్యింది ఇయ్యాల నా సేతిలో..."

యెంట పడ్డాడు బైరి! రామి కాల్లల్లో బలం వోడిపోయింది!

"ఒరేయ్ బైర్నాయుడూ..." దూరంగా తెలిసిన గొంతరిసింది.

"సిమ్మాద్రి గాడి సరుగులోడు తగలబడతన్నాదిరా... ఆడి కాలిరిగి ఆస్పత్తిర్లో సేరాడట... రాతిరి మీరేదో గొడవ పడ్డారటగా! "దూరం నుంచి సతీసుగాడరుస్తున్నాడు...

సేతిలో తువ్వాలు మట్టిలోనే వొదిలి పరుగుదీసాడా అరుపులేపు.

"రామీ... మారమ్మగోరు నిన్ను పిలమని సెప్పినారే" బయటనించి యెవరో పిలిసి పోయారు..

"అయ్యో! డాట్రుగారికి మందులందించీ టైమయ్యింది. మరిసి పోయాను! ఉండయ్యా... ఇప్పుడే వత్తా... మాలచ్చిమి సేతిలోంచి తీస్కున్న టీ గలాసును పక్కనెట్టి పరుగునెల్లింది.

"యేవే రామీ.. రోజూ ఇయ్యాలకి డాట్రుగారికి పాలూ, మందులూ అందిచ్చీ దానివే.. యీపొద్దు యింతాలీసిమే?" మారెమ్మ యెదురొస్తా రామి సేతిలో పాలముంతెట్టింది.

"మా నాన్నకి వొల్లు కాల్తందత్తా... గెంజి కూడా ముట్లేదు, ఇప్పుడే టీ తాపించి మాత్రేసా, ఆల్చిమైపోయింది... డాట్రుగారేరీ?" అంటా సుట్టూ యెతికింది.

"రామీ డియర్... గుడ్మార్నింగ్ రా...!

"యెన్నముద్ద తింటన్నట్టుంటాది రామికి... ఆ డాట్రుగారి మాటింటుంటే!"

అతని సేతికి పాలందిస్తా... "యిదిగోండి మందు... ఆల్చిమైంది, ఒక్క సిటంలో వంట సేసెత్తా... తినేసి అప్పుడెల్దురు ఆస్పత్తిర్కి... యేటీ?" అడిగింది.

" సరే... త్వరక్కానీ... ఇవాళ హాస్పిటల్లో చాలా పనుంది..." సేతికున్న వాచీ వేపు సూస్తూ అన్నాడాయన.

మంచోల్లు డాట్టర్లైతే యిలాగే వుంటారేటో! అతని సెయ్యి పడితే, పోయిన పేనం కూడా లేసొస్తాదంటారు ఆ వూల్లో!

ముందూ, యెనకా యెవరూ లేనోడని మారెమ్మ బతిమాలి మరీ ఆలింట్ల వుండమంది అతన్ని! అప్పుడప్పుడూ... వొకరిద్దరు సేయితులు తప్ప ఇంకెవర్రారు ఆ యింటికి!

"డాట్రుగారు ఆస్పత్రికి ఎలిపోయారు" అతని కోసం వచ్చినోల్లకి సమాదానం సెప్పి, పన్లో పడింది రామి.

నొసలకంటిన సెమట... పయ్యాటతో తుడబోయి... తన వొంటిమీదున్న తెల్ల సారల పంచిని సూసి, బయటికిలగే వొచ్చినందుకు సిగ్గుతో ముడుసుకుపోయింది!

"ఓయమ్మి రామీ... ఎంతసేపు గుంజుతావే ఆ పంచిని! యిటియ్, నేను బోవాల... మా ఫ్రెండ్స్ ఎయిటింగ్..."

జనాలు పెద్దగా తచ్చాడని ఆ సెరువొడ్డున పొలికేకల్లా వున్నాయి... బైరి మాటలు!

"వుండబ్బయా... మరకలు బోట్లేదు, సబ్బు లేదుగా, రాత్తో రుద్దనీ!" పంచిని పులుముతూ అంది రామి.

"వోయబ్బో... మరకలంటే యింకేటోలాగుందే! పసుపంటిన పాపానికి నా పంచికంత పావుడెందుకులే! అదొదిలి ఇంకో పన్సూడు!"

"సీ... యేటా మాట్లు! వొద్దంటున్నా... నా కాల్లకి పసుపు రాసి, మరకలంటించుకుంది నువ్వా! యిప్పుడిలా యీ పంచితోటెల్తె నీ ఫ్రెండ్స్ ఎక్కిరించరూ!"

"ఔనౌనే... పసుపు బట్ట కట్టేవూ... పగటింటా... రాత్రింటా... అని బానే ఎక్కిరిత్తారు! వుతికింది సాలుగానీ యిటీ" రామి సేతుల్నించి లుంగీపంచిని లాక్కున్నాడు.

"తడిబట్టతో యేటెల్తావ్ కానీ, నాకిచ్చీ... ఆరేసి రేపు తెస్తా! యింతకీ మీటింగెందుకంటా?" ఆరా అడగింది వుండబట్టలేక.

"సెన్నైలో పనికి పోదామనుకుంటన్నాం కదా... దాని గుర్నించి"

నెత్తిన రాయి పడింది రామికి!

"యేటీ? సెన్నైలో పనా? యే? యిక్కడ పనుల్లేకనా?!"

"వున్నయ్యే... వున్నై! కాయల్లేని మాడితోటక్కాపలా కాసీ పనీ... కాపులేని జీడితోట్లో ఎండాకులేరుకునే పనీ... గెడ కట్టని సెరుకు తోటలకి నిప్పెట్టే పనీ ఉన్నై! యెల్తే రోజుకో వందో పందో యిచ్చి బోయనమెడతారు! ఆటితో నా యిద్దరు సెల్లిల్ల పెల్లిల్లు సేసీయొచ్చు.. మాయమ్మ కిడ్నీ ఆపరేసను సేయించీ వొచ్చు... యింకా... నిన్ను పెల్లాడీవొచ్చు, నలుగురు పిల్లల్ని కని పెంచీయొచ్చు!"

"యేటా యెటకారం? వందా పందల్తో ఇయ్యన్నీ ఎలగౌతాయ్?!"

"మరేటే? మూనేడుగా వరసాల్లేక వూరంత యెండి మాడిపోయింది. ఆ బోర్లున్న పెద్దోల్ల పొలాలు తప్ప ఒక్కల్లియన్న పండాయా? కలుపు తీతలున్నాయా, కాలవ

పోతలున్నాయా? కోతలన్నాయా, కుప్పనూరుపులున్నాయా? పుస్తిలమ్మి పురుగుమందులు కొట్టినోల్లంతా వానల్లేక నోల్లెల్లబెట్టారే! యింకిక్కడుండి యేంపని సెయ్యమంటావ్? యెంత సంపాయించమంటావ్? అందుకే సెన్నై పోతన్న!

"సెన్నైలో ఏటి సేత్తావ్?"

"కనస్ట్రచ్చన్ పనే! బిల్డింగులమీద బిల్డింగుల్లేపీడమే! అక్కడ కూలి బాగిస్తారు.పని నచ్చితే కమీసను కూడా యిస్తారంట! యెంతా... వొక్క రెండు సంవ్సాలు! యిలాగెల్లీ... అలా వొచ్చీడవే!"

"రెండు సంవ్సాలే?! మరి నేనూ?!"

"నువ్వా... నువ్వుంటావ్!యే? వుండవా?! యింతలోనె నీకు పెల్లై పిల్లలు పుట్టేత్తరేటి?!

"రామి గొంతులో గొద్దుకారమ్ముద్ద దిగుతుంది. కల్ల జారిన నీరు కాటికను సెరుపుతుంటే... అతని భుజానికి బొట్టుని పులుముతా కరుసుకుండిపోయింది.

"అదికాదు బైరీ..."

"యేది కాదే? పోనీ... నాతో వొచ్చేత్తావా? సెయ్యి గుంజుతా అడిగేడు.

"హమ్మో! పెల్లి కాకుండానే?"

"సరే... యిప్పుడే సేసేస్కుందాం పద, పెల్లి"

సొక్కామడత పైకి జరిపాడు ఆవేసంగ.

"ఓలమ్మో... యేటా పోత్రం! ఆగూ..."

"యేటే రావీ... నేనంటె యిస్టం లేదా?" సూది దిగబడ్డట్టయ్యింది ఆ మాటకి...

"యిగో... ఆ కొడవల్తెచ్చి నా పీక్కొయ్యి. అంతేగాని యిలాటి మాట్లెప్పుడాడకు!" దుక్కాన్ని దాసలేకపోయిందింక.

"ఓయమ్మి... యేడకే... నువ్వేడిత్తె నేను సెన్నై కాదుగందా... యీ సెరువు గట్టు కూడ దాటి యెల్లలేను... అప్పుడప్పుడూ వచ్చిపోతుంటా కదే...! ముందు నేను సెయ్యాల్సింది సెల్లెల్ల పెల్లి, ఆనక మన పెల్లి ,అందాక వోపిక పట్టే! "ముద్దు సేసాడు, జెడ చుట్టిన మోచేతిని వొల్లోకి లాగుతా...

"తొరగొచ్చెత్తావ్‌గా? "బెంగతో నోరు పెగలడం లేదు రామికి..

"తొరగొచ్చేత్తానే... సెన్నై అంటే యెందూరం? సాయంకాలానికి రైలెక్కితే తెల్లారింటికొచ్చీడమే! నెలకి రెండుసార్లొచ్చీనూ! ముద్దైనా ముట్టకుండ వుండగల్ను గాని, నీ జెడ ముట్టుకోకుండ నేనుండగల్నేటే!"

"సిసీ... యెంతసేపూ యీ జెడగోలేటి? నాకంటే యిదే యెక్కువైపోయిందేటి నీకూ? పాడు జడ!"

"ఒయ్యమ్మో! నన్నేటన్నను. నా జెడనేటన్న అన్నావో..."

"అంటానయ్యా! దీన్నే అంటాను! అసల దీన్నీ..."

"ఆగే... ఆగు! నేనొచ్చీటప్పటికి నా జెడలో తేడా యేటన్న వుండాలీ... నిన్ను పనసపిందిని కొట్టినట్టు గుండ సేసీగల్ను!"

"యీ పనసపల్లు తీస్కెల్లి డాట్రుగారు గదిలో యెట్టవే రామీ... "వాకిట్లోంచి మారెమ్మ పిలుపుకి ఉలుకొచ్చి చూసింది రామి.

"డాట్రుగారితో పాటు... యియ్యాల యెవరో కొత్తాయనొచ్చాడు. సుట్టవేమో! యిక్కడే కొన్ద్రోజులు వుంటాడట. అతన్నిక్కడుండమని, డాట్రుగారు ఏదో వూరెల్లారు. నీతో సెప్మని సెప్పారు. అతనికేయేలకి యేం కావాలో నువ్వే సూస్కోవాలి." మారెమ్మ అంపకాలు రామికి సుతరాం నచ్చలేదు!

"వొంటిమీదకి యిరవయ్యేల్లచ్చినాయ్... దీనికి పెల్లిసేసి పంపాలనే బాజ్జితే లేదెవలికీ... పోయినోడు వొచ్చేది లేదని యెప్పటికి కల్లు తెరుస్తాదో! దీని యాతన్లెప్పుడు సల్లార్తాయో! "సాగిన నోరు మూత బడకుండా సదూతూ వున్నాది మారెమ్మ!

"మంచిమాట్లు సెప్తున్నానన్న పేరుతో మనసులో గునపాలు దింపడం యీ మారెమ్మకే సెల్లు!" సీపుర్తో నేల బరాబరా తుడుసుకుంట పోయింది రామి.

మారెమ్మ లాంటోల్ల మాటినీదైతే యీపాటికి రామి బిడ్డ తల్లైయ్యుండీది. సెన్నై యెల్లిన కొత్తలో రెంద్రోజులకోసారైన సతీసు టీకొట్టుకాడున్న డబ్బా పోన్లో పలకరించీవోడు బైరి. రెన్నెల్లయ్యాక పోనూ లేదు... రెండేల్లు దాటినా మనిసి రానూ లేదు!

"... ఇక్కడ బైరి నాయుడంటే ఎవరూ?"

నేల జేరేసిన సిమెంటు బీమ్ పైన కూర్సోని కేరేజీల్లో అన్నాల్తింటన్న వోల్లంతా ఆ గొంతువేపు ఒక్కసారి సూసారు.

'సినిమా సూటింగ్ మజ్జిలో ఆపీసి యిటచ్చీసిందేటో హీరోయిన్ను' గుసగుసలాడారు ఆల్లలో కొందరు...

“ఆవిడే మన వోనరమ్మ గారు” పెద మేస్త్రి సెప్పాడు బైరికి సూపిస్తూ..

“నేనేనండీ” అంటూ సగం కడిగిన సేతిని పేంటు జోబీకి రాస్కుంటూ కంగారుగా వచ్చేడు బైరి.

“ఆ మూడో ఫ్లోర్‌లో పూజగది డిజైన్ చేసింది నువ్వేనా?” అడిగిందావిడ.

“ఔను మేడమ్... ఇంజినీరుగారు వొద్దన్నా నేనే పొరపాట్న ఆ ఐడియా ఇచ్చానండి, స్వారీ” జంకుతూ సెప్పాడు.

“నోనో... ఇట్స్ నైస్! మిగతా అన్ని ఫ్లాట్లకీ అలాంటి డిజైనే పెట్టించమని చెప్పా

బావుంది. ఇంకేమ్మార్పులూ వద్దు. సరేనా?!” అనీసి, దూరంగా సూస్తున్న కూలీల్ని గమనిస్తూ వెనక్కి మల్లింది.

వొంటికి తుడుసుకున్న బైరి సగం ఎంగిలి సెయ్యి కూడా ఆవిడికి అందంగా కనపడినాదేటో... పోతూ పోతూ మల్లోసారి ఆ అరసేతుల్నే సూసింది. నిజానికి సూస్తానే వుంది రెన్నెల్లగా!

ఇంచి తక్కవ ఆరడుగులెత్తు... యిసాలమైన చాతీ... అరిటాకుల్లాంటి అరిసేతులు... గొడ్డు సాకిరీల్తో బండబారిన ఉక్కు మనిసాడు. పగలబడి నవ్వే ఆపసోణ్ణి సూస్తూ యెంత మంది ఆడపిల్లలు వుసూరుమన్నారో!

“బాగా ఆలోచించుకో... నాకైతే నీమీద ప్రేమ లేదు. వున్నదల్లా కోరిక! ఓ బిడ్డకి తల్లినవ్వాలనే కోరిక!” “నాకు పెళ్ళై నాలుగేళ్ళైంది. మా యిద్దరికీ ఒకరిమీద ఒకరికి ప్రేమ అలానే వుంది... లేనిదల్లా ఇద్దరం ప్రేమించే పిల్లలు!”

“హాస్పిటళ్ళ చుట్టూ తిరిగే టైం లేదిద్దరికీ... ఉన్నా... నాకెళ్ళాలని లేదు. మందుల్తో పిల్లలు పుడతారంటే ఎన్ని టన్నులైనా మింగేదాన్ని! పరాయి బీజాన్ని నా కడుపున పండించడం ఆయనకిష్టం లేదు. పరాయి కడుపున పుట్టిన బిడ్డ నాకక్కర్లేదు. అందుకే...

“నా జీవితాన్ని బలి కోరుతున్నారు? లోకంలో యింకెవ్వరూ దొరకనట్టు! నాకున్నది ఒకటే జీవితం, అందులో వున్నది నా రామి వొక్కతే ! “మేడమీద యెల్లకిలా పడుకొని ఆకాసంతో సెప్పుకుంటున్నాడు బైరి!

“పది లక్షలు... ఆలోచించుకో...” ఓనరమ్మ మాట్లు... బైరి సెవులకాడ కందిరీగ పాటలైనాయ్...

“సిమ్మాద్రి గాడు నిన్నెతుకుతున్నాడు... ఆడి సరుగు లోడు నీ మూలంగానే తగలబడిందట, కాలు కూడా నువ్వే యిరిసావని కేసుపెట్టాడు! రెండ్లచ్చలు నీ నుండి రాబట్టందే నిద్దరోడంట! నా కొట్టుకి పోన్ చేత్తే, పోలీసులు కబురెట్టమన్నార్రా! పాపం... ఆ రామిని కూడా నానా మాట్లంటున్నారు... తొరగా ఆ డబ్బేదో ఆల్ల మొగాన కొట్టీరా” సతీసు గాడి మాటలు...

“ఒక్క పిల్ల పెల్లి సెయ్యడానికే నానా పాట్లు పడాల... వొకల్లకిద్దర్ని కనీసి నామీదకొగ్గీసావ్... యిద్దర్నిల్లు దాటించాలంటే సెరో లచ్చన్నా లేకపోతే యెలాగే?! పోనీ నీ కన్నోరేవన్న యిత్తారేటో కనుకో” నాన్న నిష్టూరాలు...

“వొల్లు హూనమయ్యీలా కష్టపడ్డంత కాలం కష్టపడి, కాల్లు మడసలేక మంచం పాలైన అమ్మ కిడ్నీ జబ్బు..”

పదిలచ్చులకి సరిపడా బాదర్లన్ని వరసపెట్టి గుర్తొచ్చాయ్ బైరికి!

“కిమ్మనకుండ ఓనరమ్మ రూపంలో వచ్చిన లచ్చిందేవిని వొదులుకోకూడద”ని రాత్రి మయేసు గాడిచ్చిన సలహా...

రామి జెడ వురి తాడల్లె మెడకు బిగిసి వూపిరాడక సచ్చిపోతన్నట్టనిపించింది. యిడిపించుకుని, ఓనరమ్మ యింటివేపు అడుగులేసింది పేనం లేని ఆడి వొల్లు!

“ఏమే... రావీ... బైరి గాడి యిద్దరు సెల్లెల్ల పెల్లిల్లు కూడా ఐపోనాయ్ కదే! ఒకేసారి ఆ యిద్దరు కవలలకీ బలే సేసీనాడు! ఆరు లచ్చులెట్టాడట! యింతా సేసి... పెల్లికాడు రాకపోడమే సిత్రం! కొంపదీసి ఆడుకూడ మెడ్రాసుల యెవుర్తినైన కట్టీస్కున్నాడేటో!” అమ్మలక్కల గెడ్డం నొక్కులు రామి గుండెకాయని పిండేస్తన్నాయ్..

కుంకుడు రసంలో ముంచి తీసినట్టున్నై రామి కల్లు... సెంగు తడిసి పాలబాగం పుండయ్యింది..

యెన్ని మాటలెన్ని వూసులు! బూమి పుట్టిందీ... నీరు పారేదీ మనకోసమేనన్నట్టు యెన్ని తిరుగుల్లు... యెన్ని పెమానకాలు!

వొంటిమీద పంటిగాట్ల పచ్చింకా ఆరనట్టే వుంది... కాల్లమీద పసుపుచేతులింకా పాకుతూనే వున్నాయ్! సెంపమీద గెడ్డమింక గుచ్చుతానే వుంది! లాగుతున్న జెడకింద

కుతుకు నరాలింక గింజుకుంటూనే వున్నె! నన్ను వొదిలి పోయి యెన్నాళ్లైనా... యిప్పటికీ అయ్యన్నీ సెప్పేది ఆ వొక్క మాటే... "నీ బైరి వొస్తాడు!"

వాకిట్లో కారాగిన సప్పుడుకి బయటికొచ్చి సూసింది రామి. "తలనొప్పిగా వుంది... కాస్త కాఫీ కలిపి ఇస్తావా రామీ?!" చేతిలో పెట్టి పక్కనెడుతూ అడిగేడు... డాట్రుగారి సేయితుడు.

"నీ పూర్తి పేరేంటి? రామి యేనా?" కందిపోయిన రామి మొకంకేసి తేరిపార సూస్తూ యేవో కాయితాలు సరుదుకుంటన్నాడు ఆయన.

"రామ తులసి" అన్నాది.

"చాలా బాగుంది, ఐతే... తులసి అని పిలవొచ్చన్నమాట!" సనువు కోసం మాట కలిపినాడు!

"రామి!!"... పుల్ల యిరిసి సేతిలో పెట్టినట్టు సెప్పి లోనికెలిపోయింది.

"డాట్రుగారు వూర్నించి అప్పుడే రారంటే, నాను కూడ సూరిమాయింటికి పోతన్న, మనవణ్ణి సూడాలనిపిస్తంది. యిల్లు జార్త. రోజూ ముందార ముగ్గెయ్యడం మరిసిపోకు. యేటీ? "గదమాయించింది మారెమ్మ.

"సరే, యెల్లా అత్తా, మణక్కని, సూరి మాయనడిగానని సెప్పు "నవ్వుతా సాగనంపింది మారెమ్మని.

అరెకరం పొలం మజ్జిలో రెండే ఇల్లు. డాట్రుగారు వూర్లో లేరు, మారెమ్మ కూడా కొడుకు దగ్గరికి పోయాక, మనుసుల అలికిడి తగ్గి యిప్పుడక్కడ మిగిలింది ఆ యిద్దరే... ఒకరు డాట్రుగారి సేయితుడు, ఇంకోరు రామి!

ఆ పొద్దు... కానుగ సెట్ల గాలికి కాలీ వుయ్యాల బల్ల నింపాదిగ వూగుతుంది... సల్లబడ్డ సూరీడు కొండదాపలికి దాక్కుపోయేడు... రాలిపడ్డ రేగు పిందెల్ని వుడతలు యెంగిలి సేస్తన్నాయ్... సేతిలో సిగరెట్టూదుతూ కల్లు మూస్కున్నాడతను.

"వంటైపోయిందండి. నే యెల్తన్నా... బోజనం బల్లమీద పెట్టీసా... తినండ" ని సెప్పింది రామి.

"ఒక్క నిమిషం తులసీ... నీతో మాట్లాడాలి". ఆపాడు రామిని.

సెప్పండన్నట్టు సూస్తూ నిలబడింది.

"నువ్వింకా పెళ్ళెందుకు చేస్కోలేదూ? మంచి సంబంధం కుదరలేదా?"

"యేరాత దేవుడెలా రాస్తాడో గదండీ...

కుదిరీ టయానికి అన్నీ కుదరాల!"

"హ్మ్... ఔను... దేనికైనా టైం రావాలి. కానీ కొన్నిటికి కాలంతో పనుండదు, పనే కాలాన్ని వెతుక్కుంటూ వస్తుంది!"

సదుంకున్నోల్ల మాట్లు అంత బేగి అరదం కావనుకుంది రామి.

"మీ నాన్న వెన్నుకి ఆపరేషన్ చేయిస్తే బాగౌతుందటగా! డాక్టర్ చెప్పారు. అందుకు ఐదారు లక్షలు ఖర్చవుతాయని కూడా చెప్పారు. పాపం... నువ్వెలా చేయించగలవ్?!"

"మాలోటోల్లకి జబ్బులేగాని... డబ్బులెలా వస్తాయండీ? బతికున్నంత కాలం ఆడా మంచాన్ని... నేనాణ్ణి అంటిపెట్టుకొని వుండటమే!"

"అలా అనకు... అతని వయసెంతనీ! మహా ఐతే యాభై కూడా వుండవ్... ఆపరేషన్ చేయించి జాగ్రత్తగా చూస్కుంటే... ఇంకో యాభయ్యేళ్ళ లైఫుంది"

"నేనెలా చేయించగల్నండీ.. ఆపరేసనూ!"

"నవ్వు ఒప్పుకుంటే... నేను చేయిస్తా రామీ!"

రామి కనుబొమ్మలు ముడేస్కున్నాయ్... అరదం కాక అయోమయింగ అతనొంక సూసింది.

"నాకో బిడ్డని కనిస్తావా రామీ... "అసలిసయం నేరుగా సెప్పేసాడు!

గతుక్కుమని పోయి, కాల్లకింద నేల జారిపోయింది రామికి! తీసిపెట్టి కసరనూలేదు. సాసిపెట్టి కొట్టనూలేదు... మారుమాటాడకుండ గుమ్మం దాటబోయింది.

"ఆగు తులసీ..."

సటుక్కున సెయ్యి పట్టుకోబోయి వేల్లు ముడుసుకున్నాడతను.

"నాకు పెళ్ళైంది. కానీ..." అతను యేటేటో సెప్పుకొస్తానే వున్నాడు.... అందులో కొన్ని యింగిలీసు మాటలున్నాయ్... అర్ధంకాక బిక్కమొగమేసుకున్నాది!

ఐతే... అతను సెప్తున్న మాటల్లో నిజముందని అతని గుండెవేగాన్ని యింటన్న రామి సెవులు సెప్తున్నాయ్. కానీ...

యెంత నిజాయితీగ మాట్లాడినా... పెల్లికాని దాన్ని... గుండెల్లో మరోమనిసిని మోస్తున్నదాన్ని... యిలా బిడ్డని కనీమనడగడం యేం న్యాయం?

ఈమనుసులకెంత సొద! దుక్కం మింగలేక సేతుల్లో మొకం దాపుకుంది రామి...

"సీకటింట దీపమెట్టాల... సెయ్యేగులబ్బాయ్..." యెండి పోయిన రావాకులు గాలిక్కదుల్తున్న సప్పుట్లో కలిసిపోతున్నాయా మాట్లు!

"యెల్దుగాన్లేయే... రేపట్నుంచేటి పన్నీకు! సీకటింట దీపవూ... పడంటింట కాపరవే గదా!" బైరి పంటి సివరున్న రామి సిటికెనేలు సివుక్కుమంది!

"మరీ బెగలగొట్టకబ్బాయ్... నిజంగ యెలిపోతన్నావా సెన్నై? నొప్పి లేన్నొప్పితో సేతినెనక్కి లాగీస్కుంట అన్నాది..

"మ్మరీ! యిదిగోనే రైలు టిగెట్లూ... నాదీ... నా ఫ్రెండ్స్ దీను!" సేతిలో పేకముక్కల్లా సరిసి సూపించేడు మూడు టికెట్లనీ... కల్లకింద దాసిన నీటి సెలమలు పైకి పొంగుకొచ్చినాయ్...

"సీసీ... యేటా కన్నీల్లు? యేడద్దమ్మీ... కల్లు తుడుస్తా... మంతరమేసేసాడు!

"పో బైరీ..." గాజుల సప్పుడుతో కలిసి నవ్వుకుంటా రాయిసెట్టు కిందెల్లి సేరబడింది.

"అద్దీ... అలా నవ్వు... నేను సెన్నై నుంచొచ్చీవరకూ యిట్టాగె నవ్వుతుండాల!"

రామి సేతుల్నుంచి రాలిపడ్డ గాజుముక్కల్ని సూసి రాయిసెట్టు వుసూరంది... వొంటికంటిన మట్టి దులుపుకున్నారిద్దరూ... కీచురాయరుపులు మొదలయ్యాయి...

బెంగ తీరా కావలించుకుని యింటికి దిగబెట్టేడు రామిని...

* * *

"సినిమా వోల్లిల్లులా బలేగా కట్టారు! యెన్ని కోట్లుంటదో! "గోడల్ని, తలుపుల్ని, కిటికీల అద్దాల్నీ కల్లతోటె కొలుసుకుంట లోనికొచ్చాడు బైరి.

"పెద్దోల్ల యిల్లంటే బిలబిలమంటూ పనోల్లుంటారు కదా... ఒక్కలూ లేరేటీ" అనుకుంటా సుట్టూ సూసాడు.

"పైకి రా బైరినాయుడూ..."

తుల్లిపడి యెనక్కి తిరిగాడా మాటిని!

దేవకన్నెలుంటారని సినిమాల్లో యినడం తప్పు... నిజంగా సూడ్డం ఇదే తొలీత అతగాడికి... అంత యెలిగిపోతన్నాది వోనరమ్మ ఆయాల!

"మీరడిగిన డిజైన్లు తెచ్చాను మేడమ్... వోసారి సూస్తే... నేనెల్తా..." నంటూ సేతిలోనున్న కాయితాల కట్ట సూపించినాడు.

"పైకి రా బైరీ..."

మూడోసారి సెప్పించుకోడం యెందుకులే అన్నట్టు జంకుతూనే మెట్లు దాటాడు...

"చొక్కా బానే వుందిగానీ.. దాన్నొదులు..."

బైరి సేతిల నలుగుతున్న కాలరొంక సూస్తూ అన్నాది వోనరమ్మ...

తెచ్చిపెట్టుకున్న నవ్వుని ముడుసుకుంటా రుమాల్తో మూతి తుడుసుకున్నాడు...

సెంటోసనో... వోనరమ్మ వొంటోసనో గాని... బైరి బుర్రకు మత్తు సోకుతున్నట్టుగా అనిపించింది...

సిన్నగా తలను ఇదిలిచ్చుకుని కాయితాల కట్ట వోనరమ్మ సేతికిచ్చాడు. కట్టనొదిలి ఆవిడి బైరి సేతినొట్టుకోగానే రక్తం సర్రుమన్నట్టయ్యింది వొక్కసారే!

వుడుకునీల్లతో తలంటేసుకొన్న రామి వొంటినుంచి కుంకుడు రసపు వోసన అతనికి తెలుస్తుంది. చామంచాయ వొంటిపై పచ్చ జాకెట్టు... నొసట అంటించిన కుంకం, ముక్కుమీంచి సిన్నగా సెరిపిన ఆనవాలు...

నడుం కింద బాగాన్ని నీరోడుతూ తడుపుతున్న జెడ... రోజూ లాగే గదిలో యెలిగించిన అగరబత్తీల పొగ... అతను కాల్చీ సిగరెట్టు కంపుని మింగేస్తన్నాది.

"నీకు హైదరాబాద్‌లో మంచి పని దొరికిందని మీ నాన్నతో చెప్పు. ఆపరేషన్ సక్సెస్ అయింది కదా... ఇంకో నాల్రోజుల్లో అతను లేచి నడవగలడు. అతన్ని చూస్కోడానికి ఇక్కడ అన్ని ఏర్పాట్లు చేశా."

"ముందు మనం హైదరాబాద్ పోతున్నాం. నువ్వు నెల తప్పగానే చెన్నై తీస్కెళ్తా... మా యింటికి! అక్కడ నీకేలోటూ వుండదు. డెలివరీ అయ్యాక, నీ ఆరోగ్యం కుదుట పడగానే మీవూరొచ్చేద్దువు. ఆతర్వాత నేనే నీకు మంచి సంబంధం చూసి పెళ్లి చేస్తా!

"పొద్దున్నుంచీ నెమరేస్కున్న మాటలన్నీ సెప్తూ బేగులో దాసిన సీర తీసాడు.

"ఇదిగో ఈ చీర తీస్కోవూ" అంటూ రామి పైటవొంక సూసి ఆగినాడు!

సరిదిన మూటలు లెక్కెట్టాడు బైరి. మొత్తం ఆరు. సరిపోనాయ్... మజ్జాన్నం మూడుగంటలకి రైలు. యింకా గంట టైమూన్నాది. యీలోగ టేసనికి పోవాలి. ఆటోలో సామానెక్కించి బయటకెల్లబోతూ ఆగేడోసారి...

గోడకున్న అద్దం యెనకాల గూట్లో దేన్నో యెతికిందతని సెయ్యి... దొరికింది. గుప్పిట్లోకి తీస్కోని గుండెలమీద యెట్టుకున్నాడు దాన్ని! కంటి సివర సెమ్మ తుడుసుకుంట బయటికొచ్చాడు.

"యిదిగో... యెల్తే యెల్లేవు... రోజూ పోన్ జెయ్యి. నెలకోసారన్న వొచ్చిపో... లేకపోతేనే సచ్చిపోత! ఆనక నీ యిస్టం!

యింద... యిది తీస్కో పో..." అంటూ సేతిలో పెట్టిన సిక్కాన్ని నలుపుతూ అడిగేడు "యేటిదీ?" అని!

"సూడూ... "నవ్వుముకంతో బైరి కల్లలోకి సూస్తూ, యెదరకొచ్చి కూర్సుంది రామి.

సిక్కంలో కవరు, దాంట్లో... కత్తిరించిన 'అరజెడ!

పేనమెగిరిపోయినంత పనయ్యింది... దాన్ని సూడగానే బైరికి!

"ఒయ్యమ్మ పిచ్చిదాన... యేటిదీ? జెడ కత్తిరించీశావా?!"

"అవును"

"యెందుకే?!"

"దాన్ని ముట్టుకోకుండా నీకు ముద్ద దిగదంటివే?!"

"అందుకనీ?! యిలా కత్తిరించెత్తావా?!

మహా పాపమే!నేను సచ్చాక సెయ్యాలా పని! తెల్సా?!" కోపంగా అరిశాడు.

"నేను సచ్చీలోగన్నా నువ్వు తిరిగొత్తావేమోనీ. యిలా సేశా... ఐనా జుట్టేగా! ఆర్నెల్లలో పెరిగేద్ది! జాగర్తగా జెడల్లి పెట్టా... ముడియిప్పకుండా మురిపెంగ సూస్కో!

"ఆటో హారను అరిసింది.బైరి లగేజీనంత యెక్కించాడు. పదారు గంటల దూరం రామికీ నాకూ... యిన్నాల్లు గుండెల్లో దాస్కున్నయన్నీ యిప్పుకోవాల... నాబాధలన్ని దాంతో సెప్పుకోవాల... రామి లేని బైరిగాడు, పేనం లేని రాయిలా ఈ సెన్నపట్నంలో యెన్ని సిక్కులు దాటుకొచ్చాడో దానికి తెలియాల... గుండె బయటకొస్తన్నట్టనిపించింది.

నడికట్టుతో సెక్రాల కుర్సీకంటుకొని, అటూయిటూ వుసారుగ నడుపుతున్న నాన్నని సూసి మురిసిపోయింది రామి.

"యింకో నాల్రోజుల్లో నువ్వు లేసి నిలబడగలవు నాన్నా!"

"అలాగే అనిపిత్తుందమ్మా! యేదో కొత్త సత్తువొచ్చినాదే! బతుకుమీద ఆసొచ్చినాది! ఆ డాట్రుబాబు సేయితుడు శానా మంచోడే...!" మానిక్కెం గాల్లో తేలిపోతన్నాడు!

"అవున్నాన్న.. తొరలో నువ్వు లేసి తిరగాడొచ్చు..."

"యింక నీ పెల్లి సేయడానికే నేను తిరగాలమ్మా! నడుం రాగానే అల్లుణ్ణెతకాల! "కొత్త నటక మానిక్కాన్ని వొకసోట వుండనీటంలేదు...

"నేను... పెల్లి అప్పుడే సేస్కోన్నాన్నా! ఐదరాబాదు పోవాల. నీ ఆపరేసన్ కైన అప్పు దీర్సాల!"

సావు మాటిన్నట్టు నీరైపోయాడు మానిక్కెం..

"ఐదరాబాదులో యేం సేత్తావమ్మా?" దిగులుగా అడిగేడు కూతుర్ని.

"అక్కడ ఆస్పత్రిలో ఆయా పని..." డాట్రుగారి సేయితుడు సెప్పినట్టుగా సెప్పింది.

"నువ్వెందుకమ్మా పనికి పోడం? యిన్నాల్లు నాక్కాలూ, సెయ్యీ ఆడక... నువు కట్టపడ్డావ్... యిప్పుడు నాకాపరేసనై నడకొత్తె... యింకా నేనింట్లో యెందుక్కూర్సుంటానే?! నేనే పన్లోకి పోతా... నువు పెల్లి సేస్కుని సక్కగ కాపరం సేస్కో తల్లీ..." కల్ల నీరెట్టుకుంట బామాలుకున్నాడు కూతుర్ని.

సమాధానం సెప్పకుండ వొల్లకున్నాది.

"యెల్దాం... పదండి" అన్నాది రామి...

సేతిలో సంచిని సెంగుసాట్నుంచి తీస్తా...

"యెక్కడికీ?" అడిగేడు డాట్రు గారి సేయితుడు.

"అదేం పిచ్చి పెస్న? సవితి రాకముందే బయల్దేరాలని సెప్పారుగా!"

"నువ్వెక్కడికీ రావడంలేదు రామీ... యిక్కడే... హాయిగా వుండబోతున్నావ్!

"నీ బైరితో!" అన్నాడు, రామి సేతిలో బైరి సారల్లుంగీపంచిని పెడతా!

"వయసులో వున్న ఆడపిల్ల యింట్లో వున్నప్పుడు ఒంటిమీద ఏదో ఒకటి వేస్కుందంటే... పేదరికం అనుకోవచ్చు... కానీ ఒంటిమీద లుంగీ పైటేస్కుని అలాగే బయటకొచ్చిందంటే.. అది పరధ్యానమే అనిపించింది నాకు ఆరోజు నిన్నలా చూసినపుడు!"

...ఆ పరధ్యానానికి కారణాన్నీ... అప్పుడప్పుడూ నీ కళ్ళల్లో కనపడే కన్నీటి తెర కథనీ తెలుసుకోవాలనే నిన్న టీకొట్టు సతీష్‌ని పిలిపించి మాట్లాడాను!

నా మూర్ఖత్వంతో యెంత పాపం చెయ్యబోయానూ! నీ పేదరికాన్ని ఆసరాగా చేస్కుని నిన్ను ఓ బిడ్డకి తల్లిని చేసి, అది నా బిడ్డగా లోకాన్ని నమ్మిద్దామనుకున్నా!

నా స్వార్థం... రెండు నిండు జీవితాలు చెల్లాచెదురవడానికి కారణమయ్యిండేది. నన్ను క్షమించు రామీ..."

"సెన్నై నుంచి యిసా పట్నం కంటే... యీ టేసన్నుంచి మావూరే దూరంలాగున్నాది! బస్సు దిగి, బేగులు మీదేసుకుని... అడుగుల్ని తోసుకుంటున్నాడు బైరి.

యినాసవితి పందిల్లతో వూరంతా కలకల్లాడతంది..." మా టయిం బాగుంటె యీ తొమ్మిదోనెలకి తొమ్మిది నెల్ల కడుపుతో తిరుగాడేది నా పెల్లాం! నా జెడబుల్లి ఎక్కడుందో! నన్ను సూడగానే యెంత గొడవ సేసేస్తదో! " వూహించుకుంటంటేనే వొల్లంతా పొంగుతున్నాది బైరికి...

"గుమ్మంకాడే లగేజీనొదిలీసి కనీసం మమ్మల్ని పలకరించకుంటానే పోతన్నావేట్రా అయ్యా! యెందాకరా..."

బైరి తల్లి మాటలు గాల్లో కలిసిపోనాయ్...

టీకొట్టు సతీసుని సూడగానే దుక్కం పొంగుకొచ్చింది. ఆడినొక్క నిమసం ఆసగా అల్లీసుకున్నాడు, కల్లు తుడుసుకుంట సైకిలెక్కి పోతా... యెనక తగిలించిన నీలం కవరు పేకట్టునోసారి తడిమి సూస్కున్నాడు...

"ఈ ఎస్సార్కే గ్రూపాఫ్ ఇండస్ట్రీస్... వారసుల్లేని సంస్థైపోతుందేమోనని దిగులు పడ్డాం బైరీ...! నేను తల్లిని కాబోతున్నా! మాయింటికి ఓ వారసుడు రాబోతున్నాడు..." నీకు ఏవిధంగా థాంక్స్ చెప్పాలో తెలీట్లేదు!"

పదిలక్షలు చెక్కుతో పాటు, రామికిమ్మంటా ఓ నీలం కవరు పేకట్టును బైరి చేతుల్లో పెట్టింది వోనరమ్మ...

"ఇందులో నాదేవుందండీ! ఈ చెక్కు నాకొద్దు." అంటూ వెనక్కి తిరిగివ్వబోయాడు.

"కృతజ్ఞత... కాదనకూడదు... ఐనా ఇది నీ డీల్స్‌కి నీకు రావల్సిన కమిషనేలే... వుంచు, మీ రామిని పెళ్ళాడాక, ఈ రేణుకని మర్చిపోవుగా!" అంటా సాచిన ఆవిడ అరసేతికి తన సేతినిచ్చి బయల్దేరినాడు బైరి...

డాట్రుగారి సేయితుని మాటలకి రామి గుండె యేరయ్యింది. బరువు తీరేదాక యెక్కెక్కి యేడుస్తానే వున్నాది.

"రామీ... సాయంత్రం ఫ్లైట్‌కి చెన్నై వెళ్ళిపోతున్నా... డాక్టర్ గారొస్తే చెప్పు. నీకే అవసరం వచ్చినా నాకు ఫోన్ చెయ్యి. ఇదిగో "అంటా వో కార్డు ముక్క రామి సేతిలో పెట్టినాడు.

ఎస్సార్కే గ్రూపాఫ్ ఇండస్ట్రీస్... రామికి సదువొచ్చుంటే... ఆ కార్డునలాగే సదివేది!

"ఎందుకిలా చేశావ్ సుధీర్?! ఈ అవకాశం మిస్సైతే నువ్వు చాలా యిబ్బంది పడాల్సొస్తుంది! ఆ పిల్ల బ్లడ్ గ్రూప్ మీకు మేచ్ అయ్యిందనేగా యింత ప్లాన్ చేశాం? ఇప్పుడిలా చేసావేం?" ఫోన్‌లో డాక్టర్ మాటలకి సమాధానం చెప్పకుండానే పెట్టీసాడు ఆ డాట్రుగారి సేయితుడు సుదీరు.

"మనం ఓ బిడ్డను చట్టబద్ధంగా దత్తత తీస్కుందాం సుధీర్... ఈ బిజినెస్సులూ స్టేటస్ ల కంటే... మనిషికి మనిషే ముఖ్యం... మనసుల్ని కలిపే ప్రేమే ముఖ్యం... ఇంకే పిచ్చి ప్రయత్నాలు వొద్దు."

భర్త సుధీర్‌ని ఇంత సులువుగా వొప్పించగలుగుతా ననుకోలేదు రేనుక!

"వెనకాముందూ ఆలోచించకుండా ఆ డాక్టర్ మాటినుంటే ఇపాటికి నా పరిస్థితేంటని" తలుసుకుంటేనే ఆవిడి గుండెజారిపోతంది!

"మూడేళ్ల కష్టం మొత్తం వృధా పోయింది... ఆ బైర్నాయుడుగాణ్ణి చెన్నైకి అంకితం చేసి, రామి సేత పెల్లికాకుండానే బిడ్డను కనిపిస్తే, యిక అదెప్పటికీ నాదే అని ఎంతాశ పడ్డానూ... నా ఆశలన్నీ అడియాసలైపోయాయ్రయా సిమ్హాద్రీ! "మందు గలాసులు కాళీ సేస్తా కుమిలిపోయాడు డాట్రుగారు!!

జనమంతా ఇనాయక సంబరంలో మునిగిపోయారు... రాయిసెట్టు కొమ్మలంచి.. రావల్సినోల్లకోసం యెదురు సూస్తుంది... సీగట్లో వొక నీడ యింకో నీడని తరుముతంది...

“పరిగెత్తింది సాల్లేయే... ఆగలగా! ఆగూ... సెన్నెలో ఆడంగులు నీలాక్కాదే బాబూ... సెప్పిన మాటింటారు! నువ్వే మరీ సెట్టెక్కిపోతన్నావ్! ఆగవే...”రామి యెంట పరిగెత్తలేక గొంతులో ఆయాసాన్ని సేతుల్లోకి తెచ్చుకుంట నేలమింద కూలబడ్డాడు బైరి.

“యేటీ? అలిసిపోయావా? మేడమీద మేడకట్టీ పేద్ద ఇంజినీరునన్నావ్! ఇదేనేటి?! “ఆటపట్టిస్తా బైరి యెదరకొచ్చి, యెనక్కి తిరిగి నిలబడ్డాది రామి...

ఆసేతులకి యేటరదమయ్యిందో గాని... జెడ సుట్టూ బిగిసి... ఆనక ఒగిలితే ఒట్టు!

✦✦✦



# ఉషజ్యోతి బంధం

1984లో పుట్టాను. మాది ఖమ్మం. ఉస్మానియా యూనివర్శిటీ నుంచి ఎమ్మే తెలుగు చేశాను. కె.ఎన్.వై. పతంజలి రచనలపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో పి.హెచ్.డి చేస్తున్నాను. "వైయక్తికం– సామాజికం, వస్తుప్రాధాన్యం – శైలీగతం" లాంటి పడికట్టు పదాలకు దూరం జరిగి వోన్ చేసుకోగలిగిన సందర్భాలనూ, సంతోషాలనూ, సంక్షోభాలనూ అక్షరాలుగా బయట పెట్టగలుగుతున్నాను. ప్రస్తుతానికి అదే నా పరిమితేమో. రాసిందానికన్నా, చెరిపిందే ఎక్కువ కావడానికి ఫక్తు అకడెమిక్ పర్ఫెక్షన్ అనే యావ కారణం కాదు. అలజడికి అనువైన అక్షరాల్నే పేర్చుకోవాలనే తపన.

“దేహసౌఖ్యంలో దైవత్వాన్ని అనుభవించలేని వాళ్లని
ప్రేమే కాదు, ఏ భావావేశమూ తాకలేదేమో!”



# మోహఋతువు

"Winter is here" సాగర్ దగ్గరగా వచ్చి నా చెవిలో గుసగుసలాడినట్లైంది గాలి తగలగానే.

కొన్నికొన్ని వాసనలకీ, స్పర్శలకీ ఎప్పటివో జ్ఞాపకాలు గిచ్చినట్లవుతాయి. చలికాలం మొదలైనట్లు ఎలాగో తెలిసిపోయేది చిన్నప్పుడు. వున్నట్టుండి ఒకరోజు గాలి మారిపోయేది. ఓ రకమైన మగతపూల వాసన గాలితో వచ్చి తగిలినప్పుడు ముక్కుపుటాలు కొంచెం మంటగా అనిపించి పొడిగాలికి పెదాలు తడారిపోయి పిట్లిపోయేవి. కాళ్ళకీ చేతులకీ కొబ్బరినూనె పట్టించి పగిలిన పెదాలకి వెన్నపూస రాసేది అమ్మ . అటక మీద గొంగళి తీసి ఉతికించి ట్రంకుపెట్టెలో స్వెట్టర్లు తీసి అందరికీ బట్వాడా చేసేది. ఇదంతా కలిపి ఒక టెన్షన్ క్రియేట్ అయ్యేది. తెల్ల చామంతులూ, పచ్చ చామంతులూ, చిట్టి చామంతులూ తోటలో మిగిలిన పూలవాసన్ని డామినేట్ చేసేవి.  పనంతా అయిపోయాక, అమ్మ స్నానం చేసి తల్లో చామంతులు పెట్టుకుని వీధి గుమ్మంలో కూచునేది. తన వెనకగా కూచోని, మెడ చుట్టూ చేతులేసి కోటయ్య పెదనాన్న వాళ్ల పెంకుటింటి మీదగా మిణుకుమిణుకుమనే చుక్కల్ని చూడ్డం భలే వుండేది. ఇంత డ్రామా వుండేది లైఫ్‌లో.

చిన్నచిన్న సంతోషాలూ, ఎక్సైట్మెంట్లన్నీ వయసుతోపాటు బండబారిపోడం ఎప్పటికప్పుడు తెలుస్తూనే వుంటుంది. కానీ ఆ హెల్ప్‌లెస్‌నెస్‌ని ఏం చేయగలం? ఆరో నెంబర్ ప్రమాద ఘంటికలాంటి హెచ్చరిక లాంటివేవీ జారీచేయకుండానే జీవితం

అమాంతం మీద పడుతుంది. పడి లేచి దానితో కుస్తీ పడటంతోనే ఎన్ని సెన్సిబిలిటీస్ సైలెంట్‌గా చచ్చిపోతాయో మనకి గుర్తు కూడా వుండదు. ఒక్కోసారి వెనక్కి తిరిగి పారిపోదామనిపిస్తుంది. ఇంకొకళ్లని మిస్ అవ్వడం కంటే, నా పాత నన్నే ఎక్కువ మిస్ అయినట్లనిపిస్తది. పెసిమిస్ట్ అంటే అన్నారు గానీ, నిన్నల్లో మొన్నల్లో అన్నీ అందంగా అనిపిస్తాయి. బాధ కూడా కొన్నాళ్లు పోయాక, అప్పటి తీవ్రత పోయి రొమాంటిసైజ్ అవుతుంది.

ఇది పనికిరాని డిప్రెసివ్ నోస్టాల్జియా ఏం కాదు. కొండలూ గుట్టలూ ఎక్కి, రాళ్లూరప్పలూ తగిలి, మోకాళ్లు డోక్కుపోయి బొటనవేలి నుండి కారే రక్తంతో కాళ్లీడ్చుకుంటూ కొండ చివర నుంచొని చూసినప్పుడు ఆ ప్లేస్‌కన్నా, అక్కడి దాకా వచ్చిన దారే అందంగా కనపడదూ? వెనక్కి పోయే వీలులేక ముందుకు నడుస్తున్నాం అనిపించని వాళ్ళెంతమంది?

ఎందుకో అనుకోకుండా “మొదటి అనుభవం” సినిమాలో పాట గుర్తొచ్చింది. ఆ పేరు చాలా మెమరీస్‌ని ట్రిగ్గర్ చేస్తుంది విన్న ప్రతిసారీ. చుట్టింటి ముందు కూచొని, అమ్మ కాచే నెయ్యివాసన చూసినప్పుడు ఫస్ట్‌టైం అమృతంతో ఆ వాసన్ని పోల్చుకోడమూ, పధ్నాలుగేళ్లప్పుడు చాటుగా దాచుకొని పిల్లలు పుట్టడం మొదటిగా చూసినప్పుడు కలిగిన ఆశ్చర్యమూ, వికారమూ...

మొదటి మగ స్పర్శ, ఫస్ట్ ఎవర్ బ్రేకప్, మొదటి ముద్దూ అన్నీ అన్నీ గిర్రున తిరుగుతాయి బుర్రలో. మొదట ముద్దు పెట్టుకున్న అబ్బాయి మొహం ఇప్పటికీ స్పష్టంగా గుర్తురాదు. ఆ ముద్దు రుచి ఎలా వుండిందో ఎంతకీ జ్ఞాపకం రాదు.

కొత్త కాపురానికెళ్లేప్పుడు బీహార్ దాకా ఒక్కదాన్ని పంపించలేక, అక్కతో పాటు అరణంగా నన్ను కూడా పంపించాడు నాన్న. ఆ నార్త్‌లో అయిదు నెలల ఎక్స్ట్రీమ్ వింటర్‌ని అక్కాచెల్లెళ్లం ఎలా సర్వైవ్ అయ్యామో మాకే తెలియదు. ఇంటి ముందు కళ్లాపి చల్లడానికీ, గిన్నెలు కడగడానికీ కూడా నీళ్లు కాచుకునేవాళ్లం.

అలాంటి చలికాలపు ఉదయాల్లో మంచుని చేతితో బూజు తీసినట్లు జరుపుకుంటూ, చిన్న గౌనేసుకుని బుట్ట పట్టుకొని ఆర్మీ క్వార్టర్స్‌కి కొంచెం దూరంలో వున్న క్యాంటీన్‌కెళ్లి పాలపాకెట్లు తెచ్చేదాన్ని. క్యాంటీన్‌లోకెళ్లగానే ఓ పదహారుపదిహేడేళ్లబ్బాయి కౌంటర్ మీదినుంచే, చేతులు వేడిచేసి నా చెంపల మీద పెట్టేవాడు. దాదాపు రోజూ చేసేవాడలాగ. చిన్నదాన్ని కదా అలా చేసేవాడేమో అనుకునేదాన్ని. లేదులేదు అప్పుడలా అనుకునేంత జ్ఞానం లేదు లక్కీగా.

ఇప్పుడనిపిస్తుంది గుర్తుచేసుకుంటే అలాగని. ఐదునెల్ల తర్వాత ఇక మేం ఊరెళ్లిపోతున్నామని చెప్పటానికి వెళ్తే, ఒక బర్ఫీ చేతిలోపెట్టి, ఒంగి పెదాలమీద ముద్దు పెట్టాడు. గుమ్మం దగ్గరకెళ్లి వెనక్కి తిరిగి చూశాను. కళ్లనిండా నీళ్లతో తెల్లటి పిల్లాడి బుగ్గలు ఎర్రెర్రగా కందిపోయాయి. గుమ్మం దగ్గర పదేళ్ల ఆ పిల్ల–కౌంటరకవతల ఆ పదిహేడేళ్ల పిల్లాడు... ఆ ఫ్రేమ్ అలా ఫ్రీజ్ అయిపోయింది. కానీ ఆ ముద్దు టేస్ట్ ఎలా వుండిందో అని గుర్తు రాదు ఎంత గింజుకున్నా.

"You easily get carried away." “ఒక్క నిమిషం వదిలేస్తే ఆలోచనల్లో పడిపోతావ్” సాగర్ మళ్ళీ నా చెవిలో అన్నట్లే స్పష్టంగా వినిపించింది.

చూస్తే ఎదురుగా తను లేడు. కొద్దికొద్దిగా మంచు పడటం అప్పుడే మొదలైంది. ఇలా రాలే మంచుని చూసి స్మశానం నుంచి బూడిద తెచ్చి, ఎవరో ఆకాశం నుంచి చల్లినట్లనిపిస్తుంది అన్నాడోసారి. ఎందుకలా అబ్సర్డ్‌గా మాట్లాడతావంటే life itself is absurd అనేవాడు. తిరిగితిరిగి తను ఈ ప్లేస్‌ను ఎంచుకోడం ఆశ్చర్యం. నార్త్ నాకసలు దొబ్బదు మాన్, ఆ హిందీ వాళ్ల యాసా, ఆ జనాలూ నావల్ల కాదనేవాడు. ఇక్కడికి ఎప్పుడొచ్చినా నాల్రోజులొచ్చి చూసి తిరిగి వెళ్లిపోడం తప్ప నాక్కూడా ఇది ‘నా దేశం’ అనే ప్రత్యేకమైన ఫీలింగ్ ఏంలేదు, అన్‌లెస్ బాక్‌గ్రౌండ్లో ఎవరైనా జనగణమన పాడితే తప్ప. ఆల్ప్స్ యెంతో, వింధ్య హిమాచల్ అంతేగా. Geographically miles apart. అయినా భాగాలేసుకొని ఇయి నా కొండలూ, అయి నా లోయలు... ఈ పంపకాలు విచిత్రం. ఇండియాని బ్రిటిష్ ఇన్వేడ్ చేసివుండకపోతే, యురోపియన్ యూనియన్ లాగా ఇండియన్ యూనియన్ అనేవాళ్లేమో. అక్కడ లాగా ఇక్కడ కూడా బోలెడన్ని బుజ్జిబుజ్జి దేశాలుండేవి.

మంచు కొంచెం డెన్స్‌గా పడటం స్టార్ట్ అయింది. మనుషులంతా కొత్త, భాష తెలిసినా చుట్టూ అదో స్ట్రేంజ్ ఆంబియన్స్. లోపల వెచ్చగా వున్నా, కేఫ్ బయట మంచులో తడుస్తూ తనకోసం చూస్తూ కూచోడం బావుంది. అట్టే ఒళ్లు దాచుకోవాలని కూడా లేదు.

ఎక్కడినుంచొస్తుందో ఈ గాలి. ఈ చలికాలపు గాలి నాకెప్పుడూ గుర్తే. ఒక్కోసారనిపిస్తుంది my life is made up of only winters అని. పూలబాసలు ఎంకికి తెలిసినట్లు, ఈ గాలికన్నీ తెలుసనిపిస్తుంది. ఎక్కడో సైబీరియా మైదానాల మీద నుంచి గోబీ ఎడారులపైగా ప్రయాణం చేసి, ఈ హిమాలయాలని తట్టుకొని ఇక్కడే నిలిచిపోయిన ఈ గాలిలో ఏదో తెలియని మార్మికత ఉంది.

ఈ నేల మీద నడిచిన మొదటి మనుషులెవ్వరో? భాషొచ్చాక మాట్లాడుకున్న మొదటి మాటలేవైయుంటాయో? ఆ సమూహాల గుసగుసలు గాలిలో రాసిపెట్టి వెళ్లినట్లు ఈ గాలి తగిలినప్పుడు ఒళ్లు గగుర్పొడిచి ఎక్కడినుండో ఏవేవో గొంతులు వినిపిస్తాయి. అర్థమయ్యీ కాని భావం సతమతం చేస్తుంది. వేలమైళ్ల అవతలి నుండి అవ్యక్తంగా పిలిచినట్లు ఏవో రహస్యాలు చెప్పినట్లు ఉక్కిరిబిక్కిరైపోతాను. వెళ్లినవాళ్లంతా ఈ దారినే నడిచిపోయుంటారా? మనం చూడలేని వాళ్ల పాదముద్రల్లో అడుగులేస్తూ మనమెక్కడికి పోతామో! ఈ అనంత ఆకర్షణలోకి నన్నేదో లాక్కెళ్లిపోతున్నట్లు మనసు గతి తప్పుతుంది.

Down the South winters కీ, నార్త్‌లో వింటర్స్‌కీ ఎంత తేడా! అక్టోబర్ ఇప్పుడే స్టార్ట్ అయింది. శరద్మాసపు వెన్నెల్లో చిటికెడు మంచు కలిపినట్లు  నులివెచ్చని చలి అక్కడిది. మంటకి కాగినట్లు ఇక్కడి చలి కాల్చి ఒంటిని కోసేస్తుంది. బాడీ నంబ్ అయి, స్పర్శలేకుండా పోతుంది. నిపిల్స్ సెన్సిటివ్‌గా అయ్యి భరించలేనంత నొప్పేస్తాయి. వాటిని తాను కాపాడతానని చేతులడ్డుపెట్టి వెంటపడేవాడు. చెప్పుకోలేనంత సిగ్గేసేలా మోహించాడు.

తననెప్పుడైనా ప్రేమించానా? అనడుగుతుంది మనసు. అసలు ప్రేమంటే ఏంటని తెలిస్తేగా! తనని ప్రేమించానో లేదో తెలియడానికి. ప్రేమనే పదార్థపు చుట్టుకొలతలూ, లోతుపాతులూ తెలిసిన మనుషుంటే చెప్పాలి. చిక్కటి నలుపుతెలుపుల్లో వుండదు, life is always this abstract. ఎంత సింపుల్‌గా వుందామనుకుంటే అంత గజిబిజి దారుల్లో నడుస్తుంది. అనుకున్నవి అనుకున్నట్లుగా ఏ కొద్దిమందికో తప్ప జరగవేమో. నడక తడబడుతున్నా అడుగులొక్కోసారి అటుఇటుగా పడతాయి. కూడి ఎడమైతే పొరపాటు లేదని కవి ఎంత మధనపడి రాసుకున్నాడో! ఒక్కోసారి బాధకి సరండరై, మనల్నిమనమలా వదిలేసుకోడం నిజంగానే సుఖం. కొలబద్ధలతో మంచిచెడులెంచే మనుషులకి నా కథ ఏమని చెప్పుకోడం.

సత్య జ్ఞాపకాలింకా తడిగానే వున్నాయి. కలుసుకున్నంతసేపు పట్టలేదు విడిపోడానికి. ఎందుకు సత్య మీద అంత ప్రేమైందంటే ఎట్లా చెప్పడం? అయినట్లు కూడా చాలా రోజులు అర్థం కాలేదు. వుట్టి ఇష్టం అనుకున్నానేమో కూడా. తన లైఫ్‌లో ఎవరూ లేనప్పుడు చెప్పలేదు నువ్వంటే ఇష్టమని. ఆ తర్వాత చెప్పే అవసరం రాలేదు. కానీ ఓరోజు కోపంకొద్దీ నన్ను తనేదేదో అరిచేసరికి తమాయించుకోలేక చెప్పేశాను. చెప్పడమైతే చెప్పాను కానీ చెప్పేశాక, మనసు మనసులో లేదు. అర్థం లేని పని చేశానేమో! ఎక్కడికి పోతుందీ దారి? బోలెడన్ని ప్రశ్నలు.

ఆ రోజు రంజాన్ అనుకుంటా. సత్య కాల్ చేశాడు కలుద్దాం ఓసారని. ఇష్టంగా ఉంది కానీ ఆ కాంప్లికేటెడ్ సిచ్యుయేషన్‌లో అదోరకమైన బెరుకు. మనసు అటుఇటుగా పోతోంది. తనొస్తున్నాడనే ఎక్సైట్‌మెంట్ ఓ పక్క, ఎందుకిదంతా అని మరో పక్క. లైట్స్ ఆఫ్ చేసి, ఇల్లంతా దీపాలు పెట్టి, నల్లటి చీర కట్టుకుని, తల్లో బోలెడన్ని జాజులు పెట్టుకున్నా. చాలా చీకటైపోయింది తానొచ్చేసరికి.

ఆ రాత్రి అబద్ధమంత నిజం. చాలాసేపటిదాకా ముట్టుకోడానిక్కూడా సంశయించాడు. దగ్గరికి తీసుకుని అలా ఉండిపోయాడు తెల్లవారేదాకా!! ఇద్దరికీ కలగానే ఉంది. చుట్టూ ఇల్లంతా కలయజూసి, నా మొహాన్ని చేతుల్లోకి తీసుకుని, మొదటిసారి అంత దగ్గరగా చూశాడు.

“సిల్క్‌స్మితలా వున్నావు అచ్చం” అన్నాడు.

నేను ఆశ్చర్యంగా చూశా తనని.

ఆమె తన యవ్వనపు రాత్రులను వెలిగించిన దేవకన్య అని, వెలిగే కళ్లతో ఆమెను ఎంతగా ప్రేమించాడో చెప్పాడు. మురిపాల ఆ రాత్రి కొవ్వొత్తులతో పాటు కరిగిపోయింది.

విడిచిపెడితే దొరకదేమో అనేంత అపురూపంగా ఒకరిచేతులొకరం పట్టుకుని ఉదయంలోకి నడిచిపోయాం. రాత్రీ, పగలూ మనసొకలాగే వర్తించదు. మధురోహలు తేలిపోయి, మబ్బులు విచ్చుకున్నాక మిట్ట మధ్యాహ్నపు ఎండ వాస్తవంలా చుర్రుమంది. అదే మొదటీ, చివరీ కలయిక!!

ఆశలు అంత త్వరగా వాడిపోవుగా...

కానీ ఒట్టు పెట్టుకున్నాం. ఇక ఎప్పుడూ ఇలా కలుసుకోవద్దని. తేనెతుట్టెని కదిపితే ఊరుకుంటుందా...

ఆ రాత్రి మైకం త్వరగా వదల్లేదు నన్ను. తను నా ముందే ఎవరెవరితోనో కనిపించడం కష్టంగా ఉండేది.

సత్య అలాగని నాకు తెలిసినా, తనని అర్థం చేసుకున్నా, అప్పుడప్పుడూ బుద్ధి అదుపుతప్పి కోపమొచ్చేది తనమీద. అదీ అర్థం లేనిదే. కానీ ఇద్దరి మధ్యా పలచటి తెరలాంటి ఆకర్షణ కనీకనిపించకుండా ఊగుతూ వుండేది. లోకరీతికి తగదని చెప్పుకున్నా, మనసుకి ఏ తాళం వేస్తాం? సత్యలో వుండే ఇన్‌డిఫ్రెన్స్, వల్నరబిలిటీ, రెక్లెస్‌నెస్ వెనక

ఓ రకమైన పిరికితనం వుందనిపించేది. నేను కావాలి కానీ అందుకోలేదు. పోనీ దూరంగా వుండి, స్థిమితంగా వుంటాడా అంటే ఏదో ద్వైదీ భావంలో కొట్టుకునేవాడు. తనొకింత స్వార్థంగా ఆలోచించినట్లనిపించినా సత్య మీద ఇష్టం పోలేదెప్పుడూ. చిన్నపిల్లాడి ఉడుకుమోత్తనం సత్యది.

నన్ను నేను ఏ తక్కెడ లో వేసి తూచుకోవాలో తెలియదు. అసలు నన్ను నేనైనా యాక్సప్ట్ చేశానో లేదో కూడా అర్థం కాదు. గాలివాటుకి కొట్టుకుపోడం, ఏ తీరానికీ చెందకపోడం ఎంత శాంతి! టైం చాలా గడిచింది. వస్తానన్న సాగర్ ఇంకా రాలేదు. లోపల్లోపల ఆత్రంగా వున్నా కాల్ చేయాలనిపించలేదు.

మంచుతోపాటు మెల్లగా చీకటి కలిసి కురుస్తుంది. వెన్నెల మరకల్లో తడిచి మనుషులు వింతగా కనిపిస్తున్నారు. యూనివర్శిటీ క్యాంపస్‌లో వున్నప్పుడు బాగా రాత్రయ్యాక, దారి పక్కన మోరీ మీద పడుకుని పైకి చూస్తే... తురాయి చెట్ల మధ్యనుంచి మసకగా కనిపించిన చంద్రుడిలా వుండేది తనమొహం చెదురుమదురుగా పెరిగిన గడ్డంతో. పచ్చిగడ్డి కోసినప్పుడొచ్చే ఓ రకమైన కసురు వాసనా... చమేలీ, మరువం, గోల్డ్‌ఫ్లాక్స్ కలిపి కుప్పపోసి కదిపి చూస్తే వచ్చే వాసనా... తన చెవివెనక మెడమీద నుంచి వచ్చే స్మెల్‌తో సరిపోతుంది. "ఎందుకలా మీద మీద పడి వాసన చూస్తావు "you're my hachiko" అనేవాడు ఇంకా ఇంకా పైకి లాక్కుంటూ. అతని పల్చటిపెదాలు లేత ముంజెలంత మెత్తన. గుండె కొట్టుకోడం బయటికి తెలుస్తోంది. దాచుకోలేని తమకం ఓ చోట పుట్టి, ఒళ్లంతా పాకుతోంది. ఎప్పుడూ ఇంతే తానొచ్చే ముందు కొద్ది క్షణాలు ఏ కామదేవత పూని నిలవనీయకుండా చేస్తుందో. తన మొదటి స్పర్శ ఎంత బలంగా రక్తంలో ఇంకిపోయిందో.

"తాగిన మైకంలో తూలే మాటల్తో నిన్ను ముద్దు పెట్టుకోవాలనుంది కానీ అలా అనిపించి కూడా పెట్టుకోకుండా వుండచ్చు తెలుసాని అర్థం లేని మాటలేవో అన్నావు. ఆరోజే నిన్ను ఫస్ట్‌టైం 'సరిగ్గా' చూశాను. సివిల్ డ్రస్‌లో వున్న మావోయిస్ట్ మేధావిలాగా, సుత్తీకొడవలి చేతిలో పట్టుకున్న కామ్రేడ్లా కనిపించేదానివి. అంతకముందు... చూడగానే నీకో నమస్తే పెట్టి, పక్కకెళ్లిపోయేవాడిని. మొదటసారి నిన్ను చీరలో కాకుండా డ్రస్‌లో చూడటం, అదీ స్లీవ్‌లెస్ డీప్‌నెక్ టాప్‌లో. చూడగానే పిల్ల కత్తిలా వుందనుకున్నా. ముట్టుకొని చూస్తే నాచుపట్టిన రాయిలా జారిపోయింది నీ ఒంటి మీద నా చెయ్యి. అబ్బా! ఏంటంత నున్నగా వుంది పాపనుకున్నా" అంటూ ఓపలేనంత బలంగా దగ్గరకి లాక్కొని లిప్‌లాక్ చేశాడు.

ఎంత గట్టిగా కౌగిలించుకున్నాడో, ఇంకొంచెం దగ్గరకి జరిగాను. నొప్పిలో తియ్యందనం తెలిసింది. చిన్నప్పుడు ఈత చెట్టు మొదట్లో చుట్టుకొని పడుకున్న రక్తపింజర గుర్తొచ్చింది అతను గట్టిగా వెనకనుండి దగ్గరగా అదుముకున్నప్పుడు. పింజర రక్తం పీల్చి మనిషిని అమాంతం చుట్టేసి ఎట్లా ఉక్కిరిబిక్కిరి చేస్తుందో పిల్లలందరికీ కథలుకథలుగా చెప్పేవారు. అలాంటి డిస్క్లెమర్ ఏమీ వుండదుగా మనుషల విషయంలో. అన్నీ సొంతగా తాకిచూసి కొరికిమరీ రుచి తెలుసుకోవాలి.

నిషిద్ధ ఫలాలు తినడం నేను కాదు కదా మొదలుపెట్టింది. తల బొంగరంలా తిరుగుతోంది. అది సాగర్ ప్లేస్. దట్టంగా సిగిరెట్ పొగ మేఘాలు చుట్టూరా. ఫ్లోర్ మీద అడ్డదిడ్డంగా కొందరు స్నేహితులు.

“గదిలోకి తీసుకెళ్లిబోల్ట్ వేసి వెనక్కి తిరిగేలోపు బాత్రూమ్లోకెళ్లి షవర్ తిప్పి, చల్లటి నీళ్ల కింద వణుకుతూ నించున్న నిన్ను షవరాఫ్ చేసి బయటికి తీసుకొచ్చాను. టవల్ తెచ్చేలోపు బట్టలొక్కొక్కటిగా తీసి తిప్పితిప్పి విసిరేశావు. దుప్పటితో నిన్ను చుట్టబోతే అమాంతం మంచం మీద పడిపోయావ్. నిన్నలా చూడటం, ఆ ఇన్సిడెంట్ లైఫ్‌లో మరిచిపోలేను. ఇంతందం ఎదురుగా వుంచుకుని ఇన్నాళ్లేంచేశాను. నిన్ను తాకకుండా ఎలా వున్నాను? What an idiot I'm అనుకున్నా” అంటూ ఆ రాత్రి గురించిన చిన్నచిన్న డిటైల్స్ ఆలాపనలా చెప్తూవుంటాడు. నాకు మాత్రం తిరిగే రంగులరాట్నం మీద అతని తో పడుకున్నట్లు, రోలర్‌కోస్టర్‌లో సెక్స్ చేస్తుంటే... అది భూమికీ, ఆకాశానికీ మధ్య గిరికీలు కొట్టినట్లు తల మైకంలో తిరిగిపోయిన గుర్తు. మెలకువొచ్చేసరికి తల గిరగిరా తిరిగిపోతోంది. బరువుగా అనిపించి, కష్టం మీద కళ్ళు తెరిచి చూస్తే పైన తాను నాలుగైదు నీడల్లో కనిపించాడు. గదంతా చిన్నచిన్న లైట్లు మెరుస్తున్నాయి. చున్నీలూ, చీరలూ చింపి కట్టిన కర్టెన్లు కదలకుండా నిలబడున్నాయి. మట్టికుండ చేసే చక్రంలా రూఫ్ తిరుగుతూనే వుంది. తిరిగి ఇతన్ని చూశాను. కొత్త వాడు... అతనితో ఇలా మొదటిసారి. అన్నింటికీ మించి అతను సత్య క్లోజ్ ఫ్రెండ్ సాగర్. ఈ డిటైల్ దగ్గర ఆలోచన ఆగిపోయింది.

సాగర్‌ని చూసి ఇష్టపడ్డ, మోహపడ్డ గుర్తు లేదు. ఇద్దరం పరిచయస్తులమే అయినా ఆరేళ్లలో ఓ పదిసార్లు కలుసుకోని వుంటామంతే. ఆరాత్రి ఒడిలో ఇద్దరం గువ్వల్లా ముడుచుకుని పడుకునేదాకా తన చేతిని కూడా తాకలేదెప్పుడూ. తన మీద ప్రత్యేకమైన అభిప్రాయం కూడా ఏం లేదు. బాగా తాగేసిన మత్తులో అతని పెద్దపెద్ద కళ్లు చూసి మోహం కలిగింది. నియాన్ లైట్ అతని చెంపల మీద మెరుస్తుంటే

ముట్టుకొని చూడాలనిపించింది. దగ్గరకెళ్లి తాకిచూస్తే అతని టచ్ మంచిగా అనిపించింది. కొంచెం ఆడ్‌గా అనిపించిన విషయం ఏంటంటే ఈ అబ్బాయ్ గొప్పగా బాయ్‌ఫ్రెండ్లా వున్నాడు. ఆ అబ్బాయితో బ్రేకప్ అయిన తర్వాత, ఇప్పటివరకూ చూసి మాట్లాడింది లేదు. వెంటనే బెంగేసింది తను గుర్తొచ్చి. ఏ కారణమైతే ఏంటి అప్పుడు అతను నాకు కావాలనిపించింది.

ఆ క్షణంలో ఏ ఆలోచనా నిలవలేదు. అయితే ఏంటని మనసు తలెగరేసింది. ఇలా సుఖానికి ఒళ్లప్పగించి ఎన్ని రోజులైంది. తన గరుకు చేతుల్లో నలిగిపోయి, ఆ తియ్యటి బాధతో ఒళ్లంతా మూలుగుతోంది. వరదకి గేట్లెత్తినట్లు సుఖం పల్లానికి పాకింది. దేహం తడిరాగం పాడుతోంది. అయినా సాగర్ విడిచిపెట్టలేదు. నన్ను బొమ్మలా చేసి ఆడుకున్నాడు. అతన్ని ఇంకా రెచ్చగొట్టి, నా అణువణువులో కలిపేసుకోవాలనే వెర్రిమోహం పుట్టింది. కలలో నడకలా నిజానికీ మగతకీ మధ్య గీతల్లో ఎక్కడో నీడలాంటి జ్ఞాపకమే నాకు ఆరాత్రి. తెల్లవారింది, పొయ్యిలోంచి లేచిన పొగలా మంచు కమ్మి, అంతా మబ్బుమబ్బుగా వున్నాయి పరిసరాలు. సుఖం తాలూకు గుర్తుల్లో ప్రతిదీ అందంగా హాయిగా కనిపిస్తోంది.

చెత్త తీసుకెళ్లే టాటా ఏస్ ఆగివుంది ఇంటి ముందు. డ్రైవర్ పక్కసీట్లో ఒకామె పల్చటి ఆకుపచ్చ చీర కట్టుకుని కూర్చొనుంది. తలకి నూనె రాసి నున్నగా దువ్వి, పిన్నులు పెట్టి బిగుతుగా అల్లుకున్న జడలో కనకాంబరాలు పెట్టుకుంది. అటుగా తిరిగి కూర్చోని విండో లోంచి బయటకి చూస్తోంది. డ్రైవర్ సీట్లోంచి చెత్తవాడు దిగెళ్లి ఆమెతో ఏదో అనేసి, చెత్త కోసం వీధి లోకి వెళ్లిపోయాడు. సిగ్గు పడి ఇటువైపు తిరిగింది. ఆమె కళ్లూ నా కళ్లూ ఒక్క క్షణం కలుసుకొని విడిపొయ్యాయి. నా కళ్లలో చెకుముకిరాయి ఆమె కళ్ళల్లోనూ మెరిసింది. సంతోషపు స్థాయిలో ఏ తేడానూ వుండదనుకుంటా ఏ ఇద్దరి మధ్యా. ఆమే నేనూ ఒకే ఆత్మలా అనిపించాం ఆ నిమిషంలో.

అసలు సాగర్‌ని కలుస్తానని ఎప్పుడూ అనుకోలేదు. తన పేరు కూడా అట్టే గుర్తు రాలేదు. ఒక్కొక్కరూ ఒక్కో దారిన వస్తారు మన లైఫ్‌లోకి. ఇతను మాత్రం చుక్క తెగిపడ్డట్టు ఉల్కాపాతంలా వచ్చాడు. మంచిచెడ్డలు ఎంచుకునేంత వ్యవధి లేదు. అలా ఎందుకు చేశానంటే, సమాధానం లేదు నా దగ్గర. అసలు ఏదైనా ఎందుకు చేశానో తెలియదు. 'స్వైరిణి అన్నారు నన్ను శ్యామసుందరా...' మనసు పాటగా మూలిగింది. దుఃఖం తెరలుతెరలుగా తన్నుకొస్తోంది లోపలినుంచి. సహజాతాలు అణిచిపెట్టి ఎవరెంత సంతోషంగా వున్నారో అర్థం కాదు. చాలా అలసిపోయినట్లు నిస్సహాయంగా

అనిపించింది. ఎదుటి వాళ్లలో లేనిది, మనం పలికించలేం. ఇదిలాగని అర్థమయ్యేలా ఎవరికి చెప్పగలం? ఎవరి భూతద్దాలు వాళ్లకుంటాయిగా. ఆ రాత్రికి నన్ను నిస్సిగుగా వదిలేసుకున్నా. కానీ అతని ముందు మాత్రం సిగ్గు ముంచేసింది. ఎంత సిగ్గైతే అంత మురిపెం అతనికి. మొహాన్ని చేతుల్లోకి తీసుకుని మతాబుల్లా వెలిగే కళ్లతో ఎన్ని ముద్దులాడతాడో. దగ్గరైన ఆడామగా మధ్య మొదటి రోజుల ఆకర్షణని ఎంతటి బలమైనా చెరపలేదు కదా! పున్నమినాగుల్లా చుట్టుకొని విడిచి వుండలేనితనం, ఒకళ్లనొకళ్లు ధ్వంసం చేసేంత శక్తితో కూడటం, కాసేపటి విరహానికే వేగిపోడం, శీతకాలపు రాత్రుల తమకం...

చంద్రుడ్ని జల్లెడలో వేసిపట్టి వెన్నెల తుంపరలో తడవటం...

ఆ మోహావేశం మాటల్లో ఏం చెప్తాం !

కోరిక

అదంతా కోరికే...

రాత్రీపగలూ నరాలు మెలిపట్టేంత కాంక్ష...

దేహసౌఖ్యంలో దైవత్వాన్ని అనుభవించలేని వాళ్లని ప్రేమే కాదు, ఏ భావావేశమూ తాకలేదేమో! ఇది మనదైన అనుభవం కాబట్టి దీనికి ఔన్నత్యాన్ని ఆపాదించటం, గొప్పలు పోవడమేమో. బయట నిలబడి చూసేవాళ్లకి వుత్త వ్యవహారంలా అనిపించొచ్చు. నియమాలకి అవతల నిలబడ్డాను, నిరభ్యంతరంగా వాటిని తొక్కినడిచాను. బోలెడన్ని మాటలన్నారు.అందరినీ పక్కన పెడితే, సత్యా ఏమనుకున్నాడో, ఎంత దుఃఖపడ్డాడో ! ఆ రాత్రి తను పక్క గదిలోనే వున్నాడు వేరెవరితోనో. కష్టమేసింది చాలా, తనని ఇంకొకరితో చూడ్డం. మూడో పెగ్ అవ్వగానే సత్యని తాకాలన్న కోరిక ఎక్కువైంది. పక్కన ఇంకో అమ్మాయి, అయినా వుండలేక దగ్గరగా వెళ్లి తన గడ్డం తాకి చేతుల్లోకి తీసుకున్నా. మృదువుగా నా చేతులు తీసేశాడు. ఇద్దరం విడిపోయిన మాట నిజమే, కానీ ప్రేమెక్కడికి పోతుంది? ఒకరి పట్ల ఇంకొకళ్లకుండే ఫీలింగ్ చచ్చిపోతుందా? పరాయైపోతారా? కానీ కనపడని సన్నటి గీతలు, మనుషులం మనం అని గుర్తుచేస్తుంటాయిగా. మన మనసుకి మనల్నే కాపలా పెడతాయి. ఎంత నిస్సహాయంగా అనిపించిందో... ఎవ్వరిమీదో కూడా తెలియని కోపం, కసి.

ఇన్ని ముడులెందుకేసుకున్నాను? అందరికీ సంజాయిషీలిచ్చీ ఇచ్చీ నామీద నాకే విసుగొచ్చింది. ఎవరినీ సమాధాన పరచలేను. అదంతా సరిపోనట్లు ఇప్పుడు మళ్లీ

సత్య క్లోజ్ ఫ్రెండ్ సాగర్‌తో. ఆ పక్కరోజు ఉదయం మా గదిని దాటి వెళ్తూ సత్య చూసిన చూపులో భావం అర్థంకాలేదు. బాధా, అసహ్యమూ, వెగటూ... గాయపడ్డట్టు మాత్రం తెలిసింది. తనని ఆపి ఏదైనా చెప్పాలనికూడా తోచలేదు. రకరకాలుగా పోయింది మనసు.

ఓ వారం తర్వాత సత్యా, నేనూ ఎదురుపడ్డాం అనుకోకుండా. నా పక్కన సాగర్. ఏమీ కానట్లే పలకరించుకున్నాం. వెళ్లి భుజం పట్టుకొని కుదిపి అడగాలనిపించింది ఏమనుకుంటున్నావని. మౌనంగా వెళ్లిపోయాడు అక్కడ్నించి. ఆరోజు అర్ధరాత్రి దాటాక ఫోన్ చేసి దాచుకున్న కోపం బాధతో... దాచుకోలేని ఏడుపు గొంతుతో how could you do this to me అని ఎంత వేదనతో అడిగాడు. నాకు చచ్చిపోవాలనిపించింది. వెళ్లి తనని దగ్గరకి తీసుకొని ఏదేదో చెప్పాలనిపించింది. కానీ నిస్సహాయతకి మాటలు దొరకవు. తనకి దూరంగా వుండటం తప్పించి ఇంకేమీ చేయలేకపోయాను. సత్య ప్లేస్‌లో ఎవరున్నా అలాగే రియాక్ట్ అయ్యేవాళ్లేమో. బలహీనతల నుంచి ఎవరికి మినహాయింపు?

ఒక కథ ముగిసీ ముగియక ముందే మరొకటి. ఇందులో సుఖం సంతోషం మాట ఎటున్నా, విపరీతమైన ఇమోషనల్ ట్రామా. ఎటూ తేల్చుకోలేని స్ట్రగుల్. సాగర్ మాత్రం చాలా క్లియర్గా వున్నాడు. సత్య ఒకరితో వున్నప్పుడు నువ్వు వేరొకళ్లతో వుంటే తప్పేంటి? తనకి బాధపడే అవసరం ఏంటి? అదంతా హిపోక్రసీ. దానికి నిన్ను నువ్వు బ్లేమ్ చేసుకోవడంలో అర్థం లేదు అనేవాడు. కానీ అన్నీ గీతకి అటూఇటుగా అంత కచ్చితంగా వుంటాయా? ఒకరంటే ఒకరికి సరిపడక కాదుగా దూరమైంది సత్యానేను. ఇద్దరి లైఫ్‌లో వున్న మనుషుల ఫీలింగ్స్‌ని స్టేక్‌గా పెట్టలేకేకదా ఈ దూరమని నేనంటే, దానిలో వున్న హిపోక్రసీని నువ్వర్థం చేసుకోవట్లేదనేవాడు.

తప్పొప్పుల మాటెటున్నా సాగర్‌తో వున్నంతసేపూ ప్రశాంతంగా వుండేది. తను నా పాస్ట్ బట్టి నన్ను జడ్జ్ చేయలేదు. ఇప్పుడు తనతో వుండమనీ నన్నిబ్బంది పెట్టలేదు. ఎంత లాలనగా చూశాడో నన్ను. పావురాయి మెత్తటి రెక్కల కింద దాచుకున్నట్లు అపురూపంగా దాచుకున్నాడు గుండె కింద.

ముందేంటనే ప్రశ్నలేవీ వుండేవికాదు తనకి. నేనొదిలేసి పోతాననే దిగులు కూడా లేదు, వున్నా కనిపించనివ్వడు. తనలోపలికి నన్ను తొంగి చూడనివ్వడు. అలాగని నాతో టైంపాస్ చేసినట్లుకూడా ప్రవర్తించలేదు. లైఫ్ పట్ల తనకున్న డిటాచ్మెంట్ చూస్తే వండర్‌గా అనిపించేది. అంత డిటాచ్డ్‌గా ఉండే సాగర్‌కి మనుషుల పట్ల ఎంత అక్కరో. ఆ లెక్కలేనితనపు మాటల వెనకగా తనని చూడటానికి ప్రయత్నించాను.

అందరితోనూ ప్రేమగా వుంటాడు కానీ ఏ విషయాన్నీ లోతుగా తీసుకోడనిపించేది. ఎంత పెద్ద సమస్యైనా... అయితే ఏంటని తలెగరేసేవాడు. నేనెళ్లిపోతే ఏం చేస్తావంటే... ఇంకో అమ్మాయిని వెతికిపెట్టి వెళ్లనేవాడు. నేను గుర్తొస్తే ఏం చేస్తావంటే... సింపుల్‌గా నీకు ఫోన్ చేస్తా అనేవాడు. నేనేమో ఆర్ట్ సినిమాలో హీరోయిన్‌లా ఏవేవో ఊహలు చేసేదాన్ని. తను బెంగపడి, ఎవరితో పలక్క, ఏడుస్తూ ఒంటరిగా మిగిలిపోతాడని. వెర్రి ఒక విధం కాదు. నా మాటల గాలానికి ఒక పట్టున దొరికేవాడు కాదు సాగర్. కానీ ఎందుకో ఒక అర్ధరాత్రివేళ... ఏం గుర్తొచ్చి కలవరపడ్డాడో కానీ ఒళ్లో తలపెట్టుకుని వెక్కివెక్కి ఏడ్చాడు. గట్టిగా చేతులతో చుట్టేసి పొదువుకున్నాడు. "వెళ్తానని నిజంగా అన్నావా? ఒక వేళ వెళ్లిపోయినా కూడా నాతో పలక్కుండా దూరంగా వుండకు. నిన్ను బాధపెట్టే పనేదీ చేయను" అని చిన్నపిల్లాడిలా ఏడ్చాడు. ఎవరి దగ్గర నుంచి ఇదంతా కోరుకున్నానో తను అందీఅందక క్షోభపెట్టాడు. ఏమీకాని ఇతను మాత్రం ఎదురుచూడనంత ప్రేమను పంచాడు.

Sagar never made me feel the way Satya did. సత్య నన్ను ఒకరకమైన సఫకేషన్‌కి గురిచేశాడు. ఇదంతా శాశ్వతమా? సాగర్ నన్ను నిజంగా ప్రేమిస్తున్నాడా? ఇవన్నీ వట్టి వ్యర్థమైన ప్రశ్నలు. ఒక మనిషి ఎప్పుడూ ఒకేలా ఉండాలి. నిజమైన ప్రేమ ఏది అనే లాలూచీలో పడి, చేతుల్లో ఉన్న ఆనందాన్ని ఒలకబోసుకుంటాం మూర్ఖంగా. ప్రతిదాన్నీ ప్రశ్నించి తర్కంతో లెక్కలు కడతాం వెర్రిగా. ఎంత మెచ్యూర్డ్‌గా ఆలోచించడానికి ట్రై చేసినా, నన్ను మాత్రం ఏదో ఇన్‌సెక్యూరిటీ ఎప్పుడూ వేధించేది. అటూఇటుగా తూగుతూ వుండేదాన్ని. దానివల్ల వచ్చే రెస్ట్‌లెస్‌నెస్, ఎగొనీలతో ఎప్పుడూ ఓ ఏడుపు లోపల్లోపల. అంతా మంచిగా వున్నదాన్ని ఏదో చేసి చెడగొడతావే నువ్వు... అని అమ్మ అంటుండేది.

అలా ఈ స్ట్రగుల్ భరించలేక, ఒకరోజు సాగర్‌కి చెప్పకుండా చాలాచాలా దూరం వెళ్లిపోయాను. ఫోన్ తీసేసి ఏ కమ్యూనికేషనూ లేకుండా చేసుకున్నా. ఎవరికీ సమాధానం చెప్పే అవసరం లేని చోటికి నాపాత నన్ను నేనే మరిచిపోయేంత దూరం పోయా. సత్య కంటే సాగర్ ఎక్కువ గుర్తొచ్చేవాడు. తన పట్లమరీ సెల్ఫిష్‌గా ప్రవర్తించాననిపించింది. ఓ మాట చెప్పి వెళ్లిపోయుంటే బావుండని ఎంత అనిపించిందో. కానీ అలా చేస్తే వెళ్లిపోలేననే భయం వుండింది మనసులో. లోన్లీనెస్ భరించలేక ఏడ్చీ ఏడ్చీ గొంతు తడారిపోయేది. కానీ ఎవరికీ చెందని ఒంటరితనం ఒక సాంత్వన నిచ్చేది. పైగా సాగర్ లాంటి మనిషితో ఏదైనా బంధం కావాలనిపించింది. పెళ్లంటే వెగటు పుట్టి వున్నాను కాబట్టి, అది వద్దని తెలుసు కానీ చిత్రంగా తనతో పిల్లలుంటే బావుండనే


కోరిక చాలా భయపెట్టింది. మళ్లీ ఏవో చిక్కుముడులు అల్లడానికి సిద్ధమైంది. మనసు, ఏ బంధమూ లేకుండా నిలవలేదు వట్టి పిరికిది. అదంతా వద్దని తోసేసి, ఇలా ఒంటరిగా వుండటం ఒకరకమైన మొండితనాన్నిచ్చింది. రోటీన్‌నీ, స్తబ్ధతనీ తిట్టుకుంటాం కానీ, ఒక్కోసారి అవే కాపాడతాయి మనమల్లుకున్న చిక్కుముడులనుంచి.

నన్ను నేను తమాయించుకోగలననే నమ్మకమొచ్చాక కలవాలనుకున్న మొదటి మనిషి సాగర్. I owe him an answer. ఇప్పుడు మనసు కాస్త తేటగా వుంది. గతాన్నీ, భవిష్యత్తున్నీ భుజాలమీంచి వదిలించుకున్నా. ఈ క్షణం బ్రతకాలనుకుంటున్నా. సాగర్ ఎక్కడున్నాడో కనుక్కోడం పెద్ద కష్టం కాలేదు. వచ్చి కలుస్తానని చెప్పినప్పుడు తను మౌనంగా వున్నాడు ఓ నిమిషం. తర్వాత ఎక్కడికి రావాలో చెప్పాడు.

ఎలా ఉన్నాడో సాగర్? నేను చేసిన పిచ్చిపనికి ఎంత నొచ్చుకున్నాడో? తను రాగానే ఏం మాట్లాడాలి? ఎందుకెళ్లిపోయావంటే... ఏమని చెప్పాలి? వెనకగా అడుగుల చప్పుడు. కొద్దికొద్దిగా దగ్గరవుతుంది. హార్ట్‌బీట్ పెరిగింది. వెనక్కితిరిగి చూడాలనిపించింది. మంచు మరీ దట్టంగా పడుతోంది. గ్రే కలర్ ఓవర్‌కోట్‌తో బ్లాక్ క్యాప్‌లో వచ్చాడు సాగర్. కాస్తదూరంగా నించొని చూస్తున్నాడు. లేచి దగ్గరగా వెళ్లాను. ఏ భావమూ కనిపించలేదు తన మొహంలో. ఏదో ఒకటి మాట్లాడాలి కదా అని “నార్త్ నాకసలు దొబ్బదు మ్యాన్” అన్నావుగా. బావుందా ఈ చలీ, మంచూ అంటే పొగడపువ్వు విచ్చుకున్నట్టు మొత్తగా నవ్వాడు.

కళ్లలో పల్చగా నీటిపొర. దగ్గరగా వచ్చి, కంటి నిండా చూసుకుని గట్టిగా హత్తుకున్నాడు.

✦✦✦



# వెంకట్ శిద్దారెడ్డి

పుట్టింది నెల్లూరు జిల్లాలోని గుడిపాడు గ్రామంలో. ఇరవై ఏళ్లకు పైగా హైదరాబాద్‌లో నివాసం. సాఫ్ట్ వేర్ ఇంజినీర్ ఉద్యోగం వదిలేసి సినిమా పరిశ్రమలో వివిధ శాఖల్లో పనిచేస్తున్నాను. సాహిత్యం అంటే ఆసక్తి. రాయడంకంటే చదవడమే ఎక్కువ ఇష్టం. హరుకీ మురకామీ, మిలన్ కుందేరా రచనా శైలి అంటే ఇష్టం. సినిమాకీ సాహిత్యానికి మధ్య ఏర్పడిన అగాధాన్ని పూడ్చే ప్రయత్నంలో ఉన్నాను. సినిమాటిక్ షార్ట్ స్టోరీ రాయాలనే ప్రయత్నంలోంచి పుట్టిందే ఈ కథ.

" ఒక్కోసారి నా మనస్సు విశాలమైందనిపిస్తుంది.
లేకపోతే ఇన్ని జ్ఞాపకాలని అదెలా మోస్తుంది? "



# ది గేమ్స్ వియ్ ప్లే

"**S**omewhere, something incredible is waiting to be known"

*- Carl Sagan*

పదాలు మనసులో ఉన్నంతవరకే ధైర్యంగా ఉంటాయి. కాగితం మీద రాసినప్పుడో, నోటినుంచి బయటికొచ్చినప్పుడో – పిరికిగా జర్రున జారిపోతాయి. అర్థాలు కోల్పోతాయి. వర్షం నీరు మట్టిలో కలిసి మురికిపట్టినట్టు రోత పుట్టిస్తాయి. అందుకే నాకు మౌనంగా ఉండడమే ఎక్కువ ఇష్టం. ఎప్పుడైనా రాసుకున్నా కూడా నా డైరీలో రాసుకోవడమే ఎక్కువ ఇష్టం. ఎంత మురికి నీరైనా పారుతున్నప్పుడు చూడ్డం ఒక్కోసారి బానే ఉంటుంది. అలా ఎప్పుడైనా రాసుకున్నవి చదువుకోవడం కొంచెం ఇష్టంగానే ఉంటుంది.

ఫ్లైట్‌లో కూర్చుని నా డైరీ చదువుకుంటుంటే పక్క సీట్లో కూర్చున్నతను నాతో మాట్లాడాలని చాలాసార్లు ప్రయత్నం చేసినా, పెద్దగా మాట్లాడకుండా తప్పించుకోవడంలో నా ఉద్దేశం నన్ను ఒంటరిగా వదిలెయ్యమనే! ఢిల్లీలో ఫ్లైట్ ఎక్కిన దగ్గర్నుంచీ అతను చాలా ప్రయత్నం చేశాడు.

అయినా అతనడిగిన ప్రశ్నలకు, చెప్పాలన్నా నా దగ్గర సమాధానాలు లేవు. మీది హైదరాబాదా అన్న ప్రశ్నకు నేను అవుననీ సమాధానం చెప్పొచ్చు. కాదనీ సమాధానం చెప్పొచ్చు. నన్ ఆఫ్ ది ఎబోవ్. ఆల్ ఆఫ్ ది ఎబోవ్ అని కూడా

చెప్పొచ్చు. అందుకే అటూ ఇటూ తలూపాను. అతనెలా అర్థం చేసుకున్నాడో నేను పట్టించుకోలేదు. మీరు ఢిల్లీలో వర్క్ చేస్తారా అని అడిగాడు. నేను శ్రీలంకలో పని చేస్తాను. కశ్మీర్‌లో పని చేస్తాను. తమిళనాడులో పని చేస్తాను. నార్త్ ఈస్ట్‌లో పని చేస్తాను. అందుకే దానికి కూడా అర్థమయ్యీ కానట్టు ఒక నవ్వు నవ్వుతూ తలూపాను.

కాసేపటికి అతనికే విసుగొచ్చినట్టుంది, నన్ను వదిలేసి ఇన్ ఫ్లైట్ మ్యాగజైన్ చదవడంలో మునిగిపోయాడు.

ఫ్లైట్ దిగేలోపల ఇంకెలాంటి ప్రశ్నలేస్తాడో అని భయం నాకు. ఎందుకు మీరిలా ఊళ్లు తిరుగుతున్నారని అడిగితే ఏం చెప్పగలను? అందుకు నా దగ్గర వంద రకాల సమాధానాలు లేవు. ఒకటే సమాధానం ఉంది.

కానీ అది చెప్పగలనా?

అది చెప్పాలంటే లోపల ఒక అగ్ని పర్వతం బద్దలవుతుంది. అందులోనుంచి చిరునవ్వులు చిందిస్తూ ఒక అమ్మాయి బయటకొస్తుంది. నా చెయ్యిపట్టుకుని తనతో ఒక స్విమ్మింగ్ పూల్ వద్దకు లాక్కెళ్తుంది. వెన్నెల వెలుగులో ఆమె నీళ్లలో చేతులు ఆడిస్తూ మాట్లాడుతుంది.

ఆ రోజు ఆమె అడిగిన ప్రశ్నకు సమాధానాలు వెతుక్కుంటూ బయల్దేరాను. సమాధానం దొరికిందనుకున్న ప్రతిసారీ అక్కడ మరో ప్రశ్న నా కోసం ఎదురుచూస్తూ ఉంటుంది. మళ్లీ మరో ప్రయాణం. వెళ్తూ వెళ్తూ చాలా దూరమే వెళ్లిపోయాను. ఆమెకి దూరంగా.

హైదరాబాద్‌లో ఇంకాసేపట్లో ఫ్లైట్ ల్యాండ్ అవ్వబోతుందని అనౌన్స్ చేశారు. కిటికీలో నుంచి కిందకి చూశాను. దీపావళి వేడుకలతో హైదరాబాద్ ఆకాశం రంగురంగుల కాంతులతో మెరిసిపోతోంది.

హైదరాబాద్‌కి మళ్లీ ఎప్పుడూ రాకూడదనుకున్నాను. ప్రతి సంవత్సరం హైదరాబాద్‌ని నా జ్ఞాపకాల్లోనుంచి అస్పష్టంగా, దూరంగా తోసెయ్యాలనుకుంటాను. కానీ పర్స్‌లో ఎప్పుడో దాచుకున్న పాత క్యాలెండర్ ఫోటోలా ఉండీ ఉండనట్టే ఎప్పుడూ కళ్లముందే కనిపిస్తూ ఉంటాయి హైదరాబాద్‌లోని కొన్ని ప్రదేశాలు. కొన్ని పదాలు. దృశ్యాలు. కల్పనలు. ఆవిష్కరణలు. ఇవే అస్తవ్యస్తంగా మనస్సుని ఎప్పుడూ కల్లోలపరిచే జ్ఞాపకాలు. ఒక్కోసారి నా మనస్సు విశాలమైందనిపిస్తుంది. లేకపోతే ఇన్ని జ్ఞాపకాలని అదెలా మోస్తుంది?

అందుకేనేమో, వర్తమానంలోనే ఉండాలని ఎంత బలంగా కోరుకున్నా గతం సరిహద్దులకి దగ్గరగానే మనసెప్పుడూ తచ్చాడుతూ ఉంటుంది.

ఎయిర్ పోర్ట్ నుంచి బయటకొచ్చాను.

హైదరాబాద్ నేను పుట్టిన ఊరు కాదు. పెరిగిన ఊరు కాదు. ఉద్యోగం చేస్తూ కొన్ని నెలలున్నానంతే. ఆ తర్వాత మధ్యలో ఇంకో రెండు మూడు వారాలు. అయినప్పటికీ ఇక్కడి జ్ఞాపకాల బరువు మోయలేనంతగా ఉంది.

ట్రాఫిక్ లేకపోవడంతో క్యాబ్ వేగంగా వెళ్తోంది. నాకు స్పీడ్‌గా వెళ్లే కారుల్లో ప్రయాణించడం కష్టం. యాక్సిడెంట్ అవుతుందేమో అనిపిస్తుంది. భయం వెయ్యదు. యాక్సిడెంట్ అవుతుంది. చచ్చిపోతాను. నా జీవితం ముగిసిపోతుంది. చాలా అద్భుతంగా ఉంటుంది. కానీ కథ ముగియకుండానే ఆగిపోతుందా అనిపిస్తుంది. ఎక్కడో బాధ పెడ్తుంది.

హైదరాబాద్‌కి రావడం కష్టంగా ఉంది. సంతోషంగా కూడా ఉంది. ఏదో తెలిసీ తెలియనట్టుగా ఉంది. ఈ ఫీలింగ్, ఈ ఎమోషన్‌ని మాటల్లో చెప్పడం తెలియడం లేదు. మన సామర్థ్యానికి, కల్పనకీ మించిన ఎమోషన్స్ మనలో ఉండి ఉంటాయి. వాటిల్లో కొన్నింటిని మాత్రమే మనం ఇప్పటివరకూ నిర్వచించగలిగామేమో!

మొదటిసారి ఆమెను చూసినప్పుడు నాలో ఇలాంటి ఫీలింగే కలిగింది. ఆ ఫీలింగ్ ఇప్పటికీ గుర్తు. కానీ ఇప్పటికీ దాన్ని సరిగ్గా వర్ణించలేకపోయాను. సైంటిస్టులకు ఇంకా పూర్తిగా అర్థం కాని బిగ్ బ్యాంగ్‌లా ఆమె నా జీవితంలోకి  వచ్చింది. ఎటువంటి వార్నింగ్ లేదు. బుల్లెట్ ట్రైన్ వచ్చి అమాంతం గుద్దినట్టైపోయాను. వేల ముక్కలై నేల రాలి, దుమ్ములో కలిసిపోయాను. అప్పట్నుంచి రోజు రోజుకీ నన్ను నేను కొత్తగా పేర్చుకుని పునర్నిర్మించుకుంటూ ఉంటాను.

కారు కేర్ హాస్పిటల్ దాటి రోడ్ నెంబర్ టెన్ సిగ్నల్ దగ్గరకు చేరుకుంటోంది. ఏదో తెలియని ఉత్సాహం. సాక్షి ఆఫీస్ దాటగానే  గత ఐదేళ్లలో చాలా మారిపోయింది హైదరాబాద్. బరిస్తా కెఫే ఉన్న చోట ఏదో బ్యాంక్ ఉంది. బరిస్తా కెఫెలో నాకున్న జ్ఞాపకాల స్థానంలో వేరే ఏదో జ్ఞాపకాలు వచ్చి చేరొచ్చు కదా!

ఎటర్నల్ సన్ షైన్ ఆఫ్ ది స్పాట్ లెస్ మైండ్ సినిమాలోలాగా మన మెమొరీస్‌ని మనలోనుంచి తీసేసే మెడికల్ ట్రీట్మెంట్ ఏదైనా ఉందేమో గూగుల్ చెయ్యాలి.

రోడ్ నెంబర్ వన్ నుంచి క్యాబ్ తాజ్ బంజారాలోనికి ప్రవేశించింది. కారు వెళ్తున్న దారిలో ఆటోమేటిక్‌గా వెలుగుతున్న దీపాలు నన్ను చూసి గుర్తుపట్టి నవ్వుతున్నట్టుగా అనిపించింది.

సర్, మార్నింగ్ సిక్స్‌కి బయల్దేరాలి. కాల్ చేస్తాను, అని చెప్పి డ్రైవర్ వెళ్లిపోయాడు.

ఒకప్పుడు ఈ హోటల్లోకి ఎలా వచ్చాము? దొంగల్లా దర్జాగా వచ్చాము. చేతిలో ఏ.కే. రామానుజన్ పోయెట్రీ పుస్తకం. ఈ హోటల్ మాదేనన్నంత దర్జాగా వెళ్లి స్విమ్మింగ్ పూల్ పక్కన కూర్చుని రాత్రంతా పోయెట్రీ చదువుకున్న జ్ఞాపకాలు. ఇక ఈ రాత్రి నిద్ర పట్టదు. ఏ తెల్లవారుజామునో కాసేపు నిద్రపోదామని కళ్లు మూసుకున్నాను. కానీ ఎందుకో వెంటనే మెలకువ. కర్టెన్ తెరిచి బయటకు చూశాను.

చీకటి. ఇంకా తెలవారలేదు.

ఇంకా ఈ నిద్రలేని రాత్రులు ఎన్నినాళ్లో! బెడ్ మీద నుంచి లేచి లైట్స్ ఆన్ చేశాను.

బెడ్ పక్కనే టేబుల్ మీద ఉన్న శాండ్ క్లాక్. నా గుడ్ లక్ చార్మ్. నేనెక్కడికెళ్లినా నాతోపాటు తప్పక ఉండే ఒకే ఒక్క ఆధరువు. నేను ఎంతో ఇష్టపడి నా చేతులతో తయారు చేసుకున్న ఒకే ఒక్క వస్తువు. దాన్ని తీసి జాగ్రత్తగా మళ్లీ బ్యాగ్‌లో పెట్టేసుకున్నాను.

ఆరున్నరకి ప్రీ వెడ్డింగ్ ఫోటోషూట్. సిటీ ఔట్‌స్కర్ట్స్‌లోని ఒక రిసార్ట్‌లో పెళ్లి. సూర్యోదయం అయ్యేటప్పుడుండే మ్యాజిక్ లైట్‌లో ఫోటోలు తియ్యాలని ఆర్డర్. రిసార్ట్ లోనే ఫోటో షూట్. ఐదు యాభైకి లేచి, పది నిమిషాల్లో రెడీ అయ్యి కెమెరా కిట్ సిద్ధం చేసుకుని రిసార్ట్‌కి బయల్దేరాలని రాత్రే ప్లాన్ చేసుకున్నాను.

వెడ్డింగ్ ఫోటోగ్రఫీ నాకు అసలు ఇష్టం లేని పని. అయినా తప్పలేదు. నేనే ఈ ఫోటో షూట్ చెయ్యాలని మా బాస్ ప్రెజరైజ్ చేశాడు. తనకు బాగా తెలిసిన వాళ్లని మొహమాటపెట్టాడు. ఇండియాలోని టాప్ మోస్ట్ ట్రావెల్ పోర్టల్‌కి ఫోటోగ్రాఫర్‌గా చాలా దూరప్రాంతాల్లో తిరుగుతున్న నన్ను హైదరాబాద్‌కి పిలిపించారు.

ఆరున్నరకల్లా రిసార్ట్ చేరుకున్నాను. పెళ్లికి చేసిన అరేంజ్మెంట్స్ చాలా లావిష్‌గా ఉన్నాయి. అందుకే, నేను వెళ్లనన్నా – యూ డోంట్ వర్రీ ఎబౌట్ ది మనీ, అన్నాడు మా బాస్.

రాత్రి పార్టీ ప్రభావమనుకుంటా, ఇంకా ఎవరూ నిద్ర లేవలేదు. వెడ్డింగ్ ప్లానర్స్ నుంచి మేనేజర్ వచ్చి షూటింగ్ లొకేషన్‌కి తీసుకెళ్లాడు. రెడీ అవుతున్నారు, ఇంకో టెన్ మినిట్స్‌లో వచ్చేస్తారని చెప్పి అతను వెళ్లిపోయాడు.

ఇక ఈ రోజంతా పెళ్లి ఫోటోలే అనుకుంటూ అక్కడున్న ఒక కుర్చీలో కూర్చుని సిగెరెట్ వెలిగించాను.

పెళ్లి ఫోటో అనగానే నాకు గుర్తొచ్చేది మా అమ్మా నాన్నల పెళ్లి ఫోటో. అమ్మ కళ్లజోడు పెట్టుకుని, నాన్న టై కట్టుకుని ఉంటారందులో. ఆ ఫోటోలో తప్ప ఎప్పుడూ అమ్మ కళ్లజోడు పెట్టుకున్నది చూడలేదు. అలాగే నాన్న కట్టుకున్న టై కూడా. పెళ్లయిన రోజు స్టూడియోకి వెళ్లి వాళ్లు తీసుకున్న ఫోటో అది. బహుశా వాళ్లిద్దరూ కలిసి తీసుకున్న మొట్టమొదటి అలాగే చిట్ట చివరి ఫోటో అదే అయ్యుంటుంది. అమ్మ జబ్బున పడ్డ మా నాన్నకంటే ఆ ఫోటోనే ఎక్కువ జాగ్రత్తగా కాపాడుకుంది.

బహుశా అమ్మకు నాన్నకంటే ఆయన జ్ఞాపకమే ఎక్కువ ఇష్టం అయ్యుంటుంది. నాన్న కూడా అంతే. అమ్మంటే ప్రేమగా ఉండడం ఎప్పుడూ చూడలేదు.

గుడ్ మార్నింగ్ అన్న పలకరింపుతో నా ఆలోచనల్లోంచి బయటపడ్డాను. బ్లాక్ సూట్‌లో చాలా స్మార్ట్‌గా ఉన్నాడు పెళ్లికొడుకు. షి విల్ బి హియర్ ఇన్ ఎ మూమెంట్ అని నా దగ్గరకొచ్చి, ఐ యాం ప్రణయ్ అంటూ  హ్యాండ్ షేక్ చేశాడు.

మిమ్మల్ని ఇక్కడికి తీసుకురావడానికి చాలా రికమెండేషన్స్ చేయించాల్సి వచ్చింది. నేను కొల్‌కత్తాలో మీ ఫోటో ఎగ్జిబిషన్‌కి వచ్చాను. మీ ఫోటో ఎగ్జిబిషన్‌లో మీరొక మాటన్నారు. ఫోటోగ్రఫీ అనేది లైఫ్ అండ్ టైం మధ్యలో జరిగే ఒక ఇంటర్సెక్షన్ అని. అది నాకు చాలా బాగా నచ్చింది. ఈ రోజు నా జీవితంలో అలాంటి ఒక రోజు. ఇట్ ఈజ్ ఎన్ ఇంటర్సెక్షన్ ఆఫ్ అవర్ లైవ్స్. ఐ వాంటెడ్ దిస్ టు బి స్పెషల్. అందుకే మీరే కావాలని పట్టుపట్టాను. సారీ మిమ్మల్ని ఇబ్బంది పెట్టుంటే, అతను అందంగా మాట్లాడుతున్నాడు.

బాగా డబ్బులున్న కుర్రాడెవడో ముచ్చటపడి ఇండియాలో టాప్ ఫోటోగ్రాఫర్‌ని పిలిపించి పోటోస్ తీయించుకునే వాడిలా లేడు. చాలా సెన్సిబుల్ గా అనిపించాడు.

అప్పటికే లైట్స్, స్టాండ్స్ పట్టుకుని కెమెరా టీం వచ్చేసింది. ప్రణయ్ ఫోన్‌లో మాట్లాడుతూ, టు మినిట్స్ అని పక్కకు వెళ్లిపోయాడు. పది నిమిషాల్లో మేము అన్నీ సిద్ధం చేసుకుని రెడీగా ఉన్నాం.

అప్పుడొచ్చింది ఆమె.

ఎన్నిసార్లు చూసినా మళ్లీ మొదటిసారి చూసినట్టుంటుంది తనని చూస్తే.

ఆమెను చూడడం. నా గుండెకి నిప్పంటుకోవడం.

అప్పటికప్పుడు అక్కడ్నుంచి పరుగుతీసి పారిపోవాలనిపించింది. కానీ అంతలోనే ఆమె నన్ను చూసింది.

మేకప్ సరి చేసుకుంటూ అద్దం కిందకి తీసి ఎదురుగా ఉన్న నన్ను చూసింది. మళ్లీ అద్దంలోకి చూడబోయి ఆగింది. తను చూసింది నిజమే అనుకుని నిర్ధారించుకుంది. ఆమె పెదవులు కదిలాయి.

అప్పుడామె నోట్లోంచి వెలువడే పదాలేంటో నాకు తెలుసు. ఆమె మాటలు వినిపించనంత దూరంలో ఉన్నా ఆ మాటలు నాకు ముందే వినిపించాయి.

నో చాన్స్.

* * *

నో చాన్స్.

ఆమె అలా అన్నప్పుడు ఆమె మొహంలో తెలిసీ తెలియని నవ్వు. ఆ తర్వాత నో చాన్స్ అని ఎవరైనా అనడం నేను వినలేదు. చూడలేదు కూడా. ఆమె గురించి ఆలోచించినప్పుడు మొట్టమొదట గుర్తొచ్చేది ఆ రెండు పదాలే. ఆమెను మొదటిసారి కలిసినప్పుడు మాట్లాడిన చివరి మాటలు అవి.

ఆమె నో చాన్స్ అన్నప్పుడు, వృత్తంలా ముడుచుకున్న ఆమె చిన్ని పెదాలు. ఆ తర్వాత ఆమె నవ్విన నవ్వు. క్లోజప్లో గుర్తుండిపోయింది. మర్చిపోలేని ఆ రాత్రికి నేను పొందిన రిటర్న్ టికెట్ ఆ రెండు క్షణాలే.

ఇప్పటికీ కళ్లు మూసుకుంటే మొదట ఆ రెండు క్షణాలు గుర్తుకొస్తాయి. సొరంగపు చీకటిని చీల్చుకుంటూ వెలుగులోకొచ్చిన రైలింజను వెంట, ఒకటొకటిగా వెలుతురు చూస్తున్న రైలు పెట్టెల్లా జ్ఞాపకాలు పరుగుతీస్తాయి. బీచ్‌లో వెన్నెల వెలుగులో ఎగిసెగిసి పడుతున్న అలల్లా జ్ఞాపకాలు ఎగిసిపడతాయి. ఉక్కిరిబిక్కిరి చేస్తాయి.

గోవా. నవంబర్ నెల. కార్తిక పౌర్ణమి.

వీకెండ్లో ఫ్రెండ్స్‌తో కలిసి గోవా వచ్చాం. బీచ్‌లో గుంపులు గుంపులుగా జనాలు. గుంపులో ఒంటరిగా నేను. జనాలకి దూరంగా నడుచుకుంటూ వెళ్లాను. అలా ఎంతసేపు నడిచానో తెలియదు. దాదాపు బీచ్ చివరికి వచ్చేశాను. చుట్టూ ఎవరూ లేరు. ఒక రాయి మీద ఒంటరిగా కూర్చున్నాను.

సముద్రపు అలలు తప్ప వేరే శబ్దమే లేదు. దూరంగా సముద్రంలో తేలుతున్న పడవలు. పైన ఆకాశంలో నిండు చంద్రుడు. బ్యూటిఫుల్ నైట్ అనుకున్నాను. అనుకోకుండా నా కళ్లలోనుంచి నీళ్లొచ్చాయి. బహుశా నాలోపల ఒక సముద్రం ఉండి ఉండాలి. చాలా సులభంగా కన్నీళ్లొచ్చేస్తాయి నాకు. అది బాధో, సంతోషమో అని నేనాలోచించేలోపే, ఎవరివో నవ్వులు వినిపించాయి.

ఒక రాయి చాటునుంచి అతను బ్లూ కలర్ టీషర్ట్ వేసుకుంటూ బయటకి వచ్చాడు. సినిమాలో హీరోలా ఉన్నాడతను. అతని నడుము చుట్టూ చెయ్యేసి పక్కనే నడుస్తోంది ఒకమ్మాయి. అతనామెను ముద్దు పెట్టుకున్నాడు. అక్కడ ఉండడం ఇబ్బందిగా అనిపించింది. మళ్లీ జనాల వైపు బయల్దేరాను.

అందరూ అలలతో పోటీపడి కేరింతలు కొడుతుంటే నాకు కష్టంగా అనిపించింది. చిన్నప్పట్నుంచీ కష్టం తప్ప ఏదీ తెలియదు నాకు. అందుకే ఇలాంటి సంతోష సమయాల్లో ఆనందంగా ఉండడం కూడా తెలియదు. పుట్టుక కష్టం. పెరగడం కష్టం. చదువు కష్టం. చివరికి కష్టపడి తెచ్చుకున్న ఉద్యోగమూ కష్టంగానే ఉంది. కష్టపడి చదువుకుంటే ఉద్యోగం వస్తుంది. ఉద్యోగం వస్తే పెళ్లవుతుంది. పెళ్లి చేసుకుంటే మంచి కట్నం వస్తుంది. మా అమ్మ చిన్నప్పట్నుంచీ ఇదే చెప్పింది. వింటూ వచ్చాను. ఉద్యోగం వరకూ వాళ్ల మాట కాదనలేదు. కానీ పెళ్లి మాత్రం వద్దన్నాను. అమ్మ బాధపడింది. అమ్మలు చాలా వరకూ ఎప్పుడూ బాధపడుతూనే ఉంటారు. ఎందుకో తెలియదు. నాన్న కోప్పడ్డాడు. ఏంట్రా లంగా వేషాలు? ప్రేమిస్తున్నావా ఎవర్నైనా? అడిగాడు నాన్న. అవును ప్రేమిస్తున్నానని చెప్పాలనిపించింది.

కానీ నేనెవర్నీ ప్రేమించలేదే! తను నాకింకా ఎదురుపడలేదే!

ఊరు, ఇల్లు, స్కూల్, కాలేజ్, ఆఫీస్ తప్ప వేరే లోకం తెలియదు నాకు. ముక్కూ మొహం తెలియని ఈ అనామక నాయకుణ్ని ప్రేమించే నాయకి ఎక్కడుందో? నా అన్వేషణ ఈ జీవితకాలానికైనా ఫలిస్తుందో లేదో? మొదటిసారి గోవాకి రావడం. మొదటిసారి బీచ్ చూడడం. కొత్త ఊరిలో ఎన్నో ఆలోచనలతో నడుస్తున్నాను.

వెన్నెల వెలుగులో సముద్రంలోనుంచి నడుచుకుంటూ వచ్చి, ఒడ్డున ఉన్న చెక్క కుర్చీపై కూర్చుంది ఆమె. తల మీదనుంచి మొహంపై చేరిన తన తడి జుట్టుని చేత్తో వెనక్కి తోసింది. కుర్చీకి ఎదురుగా ఉన్న బల్లపై ఉన్న దీపపు వెలుగులో ఆమె మొహం కనిపించింది.

అప్పటివరకూ ఏ సముద్ర గర్భానో నిద్రిస్తున్న నేను, దాని లోతుల్నుంచి లేచి వచ్చి, నాతో పాటు తెచ్చిన దోసెడు నీళ్లతో ఆమె మొహాన ఉన్న ఇసుకను శుభ్రం చేసి ఆమె నుదుటిని ముద్దాడాలనిపించింది.

ఎవరామె?

అప్పటి నా బాధాకరమైన వాంఛల్ని శాంతింపజేయడానికి దేవుళ్లందరూ కలిసి నాకోసం ప్రత్యేకంగా తయారుచేసి పంపిన దేవకన్యా? కష్టాలను తీర్చడానికి దేవతలు ఏదో రూపంలో మనకి తారసపడతారనుకోవడం మూఢనమ్మకమే! కానీ ఆ క్షణంలో ఆమె నాకు ఎదురుపడడం కేవలం యాధృచ్ఛికమని ఎలా నమ్మను? ఆమె గురించే కదా ఇన్నేళ్ల నా ఎదురుచూపులు. తనెలా ఉంటుందో తెలియని రోజుల్లోనే ఆమెను ఊహించాను. తనని ప్రేమించాను. చేసిన కఠోర తపస్సు మెచ్చి భక్తునికి వరాలివ్వడానికా అన్నట్టు, ఆమె తను కూర్చున్న చోటునుంచి లేచింది. అప్పటివరకూ నేను ఎవరిలోనూ చూడని అందం ఆమెది. ఆమె నా వైపే వస్తోంది. నా కోసమే అనుకున్నాను. కానీ నన్ను దాటుకుని వెళ్లిపోయింది. కల చెదిరింది. కానీ ఆ జ్ఞాపకపు వాసన మాత్రం నన్ను వదల్లేదు.

ఆ రాత్రంతా వెన్నెల కురిపించాల్సిందే అని చంద్రుణ్ణి ఆజ్ఞాపించాను. అలలనీ ఆగకుండా ఆడమన్నాను. కానీ ఆమె వెళ్లిపోయాక పౌర్ణమి రోజు కూడా చిక్కటి చీకట్లు కమ్ముకున్నాయి. అలలు సైతం అలిసిపోయి ఆగిపోయాయి.

ఆమె మళ్లీ ఇంకోసారి కనిపించకపోయుంటే అది కలేననుకునేవాడిని.

ఉదయం.

బాగా బీచ్‌లోని బ్రిట్టోస్‌లో కూర్చుని పుస్తకం చదువుతున్నాను.

బ్లూ కలర్ టీ షర్ట్ వేసుకున్న సినిమా హీరో హడావుడిగా లోపలికొచ్చాడు. లోపల టేబుల్స్ అన్నీ అప్పటికే దాదాపు నిండిపోయి ఉన్నాయి. నేను కూర్చున్న టేబుల్ పక్కనే ఉన్న ఖాళీ టేబుల్‌పై కూర్చున్నాడు. అటు వెళ్తున్న వెయిటర్‌ని పిలిచి మెనూ అని గట్టిగా అడిగాడు. వెయిటర్ మెనూ తెచ్చివ్వగానే చాలా సీరియస్‌గా మెనూని

పరీక్షించాడు. అతన్ని చూస్తే ఏదో సమస్యలో ఉన్నాడని అర్థమైంది. సమస్య ఐదడుగుల ఆరంగుళాల ఎత్తుంది. రాత్రి నేను చూసిన దేవకన్య.

వాట్ ది హెల్. నేను అడుగుతుంటే సమాధానం చెప్పకుండా ఇక్కడొచ్చి కూర్చుంటే నేనేం అర్థం చేసుకోవాలి? అతని ఎదురుగా నిలబడి అడిగిందామె.

కెన్ యూ ప్లీజ్ లీవ్ మీ ఎలోన్ ఫర్ సం టైం అన్నాడతను కోపంగా.

ఓకే. ఐ యాం లీవింగ్ నౌ అని ఆమె అక్కడ్నుంచి కదలబోయింది.

అతను లేచి ఆమె చెయ్యిపట్టుకున్నాడు. ప్లీజ్ కొంచెం సేపు ప్రశాంతంగా కూర్చో అని ఆమెను కుర్చీలో కూర్చోపెట్టాడు.

నువ్వనుకున్నట్టు ఏం జరగలేదు. షీలాకి తన హజ్బెండ్‌తో గొడవైంది. మాట్లాడాలంది. ఈవినింగ్ అలా బీచ్‌లో నడుచుకుంటూ వెళ్లాం. తన బాధలు చెప్తుంటే విన్నానంతే!

అతను చెప్తున్నదేదీ ఆమె వినడం లేదు. తల పట్టుకుని కూర్చుంది.

నిజం చెప్తున్నాను. ఎందుకు నేనంటే నమ్మకం లేదు నీకు, అన్నాడతను.

ఆమె తలెత్తి కోపంగా అతని వైపు చూసింది. నిన్న రాత్రి బీచ్‌లో మీ ఇద్దరినీ చూశాను అంది.

నేను కూడా చూశాను.

మనసులో అనుకున్నాను ఆ మాట. బయటికెలా వచ్చిందో నాకూ అర్థం కాలేదు.

వాళ్లిద్దరూ నావైపు చూశారు ఒకేసారి. నేను మెల్లగా తలవంచుకుని పుస్తకంలో తలదాచుకున్నాను.

అయినా నువ్వనుకున్నట్టు ఏం జరగలేదు. వి వర్ జస్ట్ – అని అతను ఏదో చెప్పేలోగా ఆమె అక్కడ్నుంచి లేచింది. అతను కూడా లేచాడు. వెళ్లిపోతున్న ఆమెను చెయ్యిపట్టి లాక్కుని మళ్లీ టేబుల్ దగ్గరకు తీసుకొచ్చాడు.

నువ్విక్కడ్నుంచి వెళ్తే – దిస్ ఈజ్ ది లాస్ట్ టైం. మళ్లీ నీ మొహం చూడను, అన్నాడు.

అతను కూర్చుని మెనూ వైపూ, ఆమె వైపూ చూస్తున్నాడు.

ఆమె కూర్చోలేదు. అతని వైపే కోపంగా చూస్తూ చాలా సేపు అలానే నిలబడింది.

ఏమైందో ఏమో! నాకు అర్థమయ్యేలోపే ఆమె నా ఎదురుగా కూర్చుంది. ఏం చూశావు నువ్వు? అని అడిగింది.

ఆమె నాతో మాట్లాడిన మొదటి మాటలు.

విధి ఎంత నిర్దాక్షిణ్యమైనది? నిన్ను వెతుకుతూ ఎక్కడెక్కడో తిరిగాను. ఇవాళ నువ్వు నీ ప్రియుడి రహస్య ప్రియురాలి గురించి వెతుకుతూ నా ఎదురుగా నిలిచావు. ఈ మాటలు మనసులోనే అనుకున్నాను.

సారీ! నేను ఏదో బుక్ చదువుతూ నాలో నేను మాట్లాడుకుంటున్నాను. నేనేం చూళ్లేదు అన్నాను.

నిజం చెప్పు అని అడిగింది ఆమె.

ఇంతలో అతను లేచొచ్చాడు. పద వెళ్దాం అని ఆమెని చెయ్యిపట్టుకుని లాగబోయాడు.

ఇతను ఇంకొక అమ్మాయిని ముద్దు పెట్టుకోవడం చూశాను అన్నాను. ఆ మాటలు నోట్లోంచి ఎలా వచ్చాయో నాకే తెలియదు. భయమో ఏంటో తెలియలేదు. ఎదురుగా ఉన్న కాఫీని ఒక్క గుక్కలో తాగేశాను.

ఎవడ్రా నువ్వు? అని అతను నా కాలర్ పట్టుకోబోయాడు. ఆమె అడ్డుపడింది. ప్లీజ్ లీవ్ అజ్ ఎలోన్ అని గట్టిగా అరిచింది,

అందరూ మా వైపే చూస్తున్నారు. అతను కోపంగా అక్కడే నిల్చున్నాడు. ఆమె అక్కడ్నుంచి బయటకు నడిచింది. అతను ఆమె వెంటే వెళ్లాడు.

చెప్తే నీకర్థం కాదా? ఇట్స్ ఓవర్ అని ఆమె వెళ్తూ ఆగింది. మళ్లీ లోపలికొచ్చింది. నా చెయ్యి పట్టుకుని ప్లీజ్ నాతో వస్తారా? అని నా సమాధానం కోసం ఎదురు చూడకుండానే నన్నక్కడ్నుంచి లాక్కెళ్లిపోయింది. అతను మా వైపే చూస్తూ ఆగిపోయాడు.

ఆమె నడుస్తోంది. ఆమె వెంటే నేను. ఆమెతో ఈ ప్రయాణం కోసమే కదా జీవితంలో త్యాగం చేసిన ఎన్నో ప్రయాణాలన్నీ!

ఆమె నన్ను నడిపించుకుని ఇంకొక కేఫేకి తీసుకొచ్చింది.

చాలాసేపు ఇద్దరి మధ్యా నిశ్శబ్దం.

ఐ యాం సారీ. ఒక్కోసారి అతను చాలా వయొలెంట్‌గా బిహేవ్ చేస్తాడు. తెలిసి కూడా ఇన్నాళ్లు అతనితో ఉండడం నా తప్పే! అంది ఆమె.

నాకు కొంచెం ఇబ్బందిగా ఉంది అన్నాను. ఐ యాం రియల్లీ సారీ. అతను మిమ్మల్నేం ఇబ్బంది పెట్టడు అని చెప్పింది. నా ఇబ్బంది అతని గురించి కాదు అన్నాను.

అర్థమయ్యీ కానట్టు ఒక చూపు చూసింది.

సాయంత్రం.

బాగా బీచ్‌లో కూర్చుని ఉన్నాం.

నాకు ఆరేళ్ల వయసున్నప్పుడు ఒకరోజు ఒక ఆలోచన వచ్చింది. నాకు స్కూల్లో ఎక్కువమంది ఫ్రెండ్స్ లేరు. ఎవరితోనూ మాట్లాడ్డం ఇష్టం ఉండేది కాదు. కానీ నాకొక ఫ్రెండ్ కావాలనిపించింది. రాత్రి అందరూ నిద్రపోయాక నేను దేవుడిదగ్గరకెళ్లాను. దేవుడు ఏం కావాలని అడిగాడు. నాకొక ఫ్రెండ్ కావాలని చెప్పాను. ఎందుకు అన్నాడు దేవుడు. గేమ్స్ ఆడుకోవడానికని చెప్పాను. దేవుడు నవ్వాడు. బాయ్ ఫ్రెండ్ కావాలా, గర్ల్ ఫ్రెండ్ కావాలా అన్నాడు దేవుడు. గర్ల్ ఫ్రెండ్ అన్నాను. సరే అని దేవుడు మాయమైపోయాడు. అప్పట్నుంచీ నేనామెని వెతుకుతూనే ఉన్నాను. ఇప్పటికి దొరికావు నువ్వు.

ఆమెతో ఆ మాటలు చెప్పడానికి నాకెంత ధైర్యం కావాలో అనుకున్నాను. కానీ ఆమెతో ఉంటే దేవుడే పక్కనున్నంత ధైర్యం ఉండింది ఆ రోజు నాకు.

బుల్ షిట్. నువ్వు చెప్పేదంతా అబద్ధం. ఇవన్నీ నేను నమ్మను అంది ఆమె.

నమ్మమని చెప్పటం లేదు. చెప్పాలనిపించి చెప్తున్నానంతే అన్నాను.

ఏమో, ఇవన్నీ వినడానికి బావున్నాయి. కానీ నువ్వు చెప్పేవేవీ నార్మల్ గా లేవు. నువ్వు మెంటల్లీ ఒకే కదా! అంది.

కోపంగా చూశాను.

సారీ. సారీ. చెప్పు. ఇంకో కథ చెప్పు.

అనగనగా ఒక ఊరు. ఇప్పుడా ఊరు లేదు. ఆ ఊర్లో ఒక చిన్న పిల్లాడు. ఇప్పుడా పిల్లాడు లేడు. ఆ చిన్న పిల్లాడిని చూసి ఊరివాళ్లంతా ముద్దాడేవాళ్లు. ఇప్పుడు అతని ముద్దాడేవాళ్లే లేరు. ఆ పిల్లాడు ఒక నగరానికొచ్చాడు. నగరంలో గుంపులు గుంపులుగా

ఉన్న జనాల్ని చూసి తప్పిపోతానని భయపడ్డాడు. అప్పుడొక అమ్మాయి అతన్ని చెయ్యిపట్టుకుని జనాలకు దూరంగా తీసుకెళ్లింది. భయపడొద్దని ధైర్యం చెప్పి మళ్లీ జనాల్లో కలిసిపోయింది. ఆమెనే వెతుక్కుంటూ అతను తిరుగుతున్నాడు. ఒకరోజు అతను గోవాకి వచ్చాడు. గోవాలో మళ్లీ ఆమెను చూశాడు. నీకోసం ఎన్నో జన్మలనుంచీ ఎదురుచూస్తున్నానన్నాడు. ప్రేమించానని చెప్పాడు. ఆమె నమ్మలేదు. అతను ఆమెను నమ్మించడానికి ఎన్నో కథలు చెప్పాడు. అయినా ఆమె నమ్మడంలేదు.

అబ్బా నీ కథలు బోర్ కొట్టేస్తున్నాయి. నాకు ఈ ప్రేమంటే నమ్మకం పోయింది. ప్రేమే కాదు. అసలీ మానవ సంబంధాలన్నింటి మీదా నాకు నమ్మకం పోయింది. ఇద్దరు మనుషుల మధ్య చివరికి మిగిలేది ద్వేషం. లేదంటే విరక్తి. అంతకుమించి ఏమీ ఉండదు. సో ఐ డోంట్ బిలీవ్ ఇన్ యువర్ బుల్ షిట్ థియరీ ఆఫ్ కాస్మిక్ కనెక్షన్.

నేను ఆమెను చూడకముందే ఊహించానని చెప్పినందుకు ఆమె చెప్పిన సమాధానం అది.

ప్రేమ మన ప్రాధాన్యతలను అత్యంత వేగంగా పునర్నిర్మిస్తుంది. నిన్న సాయంత్రం దాకా తనెవరో తెలియదు. కానీ ఈ సాయంత్రం ఆమె కోసం నేను ప్రాణ త్యాగానికి కూడా సిద్ధపడి ఉన్నానని చెప్పినందుకు ఆమె చెప్పిన సమాధానం అది.

ఆ ఉదయం బ్రిట్టోస్ నుండి ఆమె నా చెయ్యిపట్టుకుని బయటకి వస్తున్నప్పుడు నాచేతిలో వెరోనికా డిసైడ్స్ టు డై పుస్తకం లేకుంటే ఆమె సాయంత్రం వరకూ నాతో ఉండేది కాదు. అంతకుముందు రోజు సాయంత్రం ఆమెకి ఫోన్ కాల్ వచ్చి ఉండకపోతే హడావుడిగా అక్కడ్నుంచి లేచి వెళ్లుండేది కాదు. వెళ్తూ వెళ్తూ అక్కడ వెరోనికా డిసైడ్స్ టు డై పుస్తకాన్ని వదిలేసి వెళ్లేది కాదు. ఆ పుస్తకాన్ని నేను తీసుకుని ఉండేవాడిని కాదు. ఉదయం మా ఫ్రెండ్స్ అందరూ అరంబోల్ బీచ్‌కి వెళ్లకుండా ఉండుంటే, నేను హొటల్ రూంలో ఒంటరిగా ఉండేవాడిని కాదు. కాఫీ తాగుదామని బ్రిట్టోస్‌కి వచ్చి ఉండే వాడిని కాదు. అప్పుడే చదవడం మొదలుపెట్టిన పుస్తకంలో రెండో పేజ్‌లో పదకొండో లైన్‌లో ఉన్న – Nothing in this world happens by chance అనే లైన్‌ని నేను అండర్లైన్ చేసి ఉండేవాడిని కాదు. అదే టైంకి ఆమె అక్కడకొచ్చి తన బాయ్ ఫ్రెండ్‌తో గొడవపెట్టుకున్నప్పుడు నా చేతిలో ఉన్న తన పుస్తకాన్ని చూసుండేది కాదు. ధైర్యంగా నా చెయ్యిపట్టుకుని బయటకి తీసుకెళ్లేది కాదు. నా పుస్తకం నీ దగ్గరకెలా వచ్చిందని ఆమె అడిగేది కాదు. పుస్తకం తెరిచి అండర్లైన్ చేసున్న ఆ లైన్‌ని చూసేది కాదు. మా ఇద్దరి మధ్య ఆరు గంటల పాటు సంభాషణ జరిగేది కాదు.

దిస్ ఈజ్ స్ట్రేంజ్. నేనెప్పుడూ ఎవర్తోనూ ఇంతసేపు మాట్లాడలేదు. నా బాయ్ ఫ్రెండ్‌తో కూడా. అదే ఎక్స్ బాయ్ ఫ్రెండ్‌తో కూడా! మేము కూర్చున్న చోటునుంచి లేస్తూ అంది ఆమె.

నాకైతే ఇది చాలా నార్మల్ అనిపిస్తుంది. ఇది ఇలానే జరుగుతుందని నేనెప్పుడో ఊహించాను. ఆణువణువునా రంగుల కాంతులు విరజిమ్మే తారలా నా జీవితంలోకి హఠాత్తుగా నువ్వు వచ్చి పడతావని నాకు ముందే తెలుసు. నువ్వో సగం. నేనో సగం. రెండు సగాలు ఇవాళ కలుసుకున్నాం అంతే  అన్నాను ఆమెతో పాటే నడుస్తూ.

ఇవాళ నేనున్న మూడ్ వల్లకానీ, లేకపోతే నీ సోది థియరీస్ అన్నింటినీ విని భరించగలిగి ఉండేదాన్ని కాదు. బహుశా నీకు ఇది ఫస్ట్ లవ్ ఎక్స్‌పీరియన్స్ అయ్యుండొచ్చు. అందుకే ఇదంతా ఇలా మ్యాజికల్‌గా అనిపిస్తుంది. కానీ రెండు మూడు సార్లకి అలవాటైపోతుంది. ఇదంతా పెద్ద ఇల్యూజన్ అని తెలుస్తుంది. ఎనీ వే, ఇట్ వాజ్ నైస్ టాకింగ్ టు యూ. బై అని చెప్పి వెళ్లబోయింది.

చెయ్యి పట్టుకున్నాను.

మీకు ఇవాళ మార్నింగ్ మీ బాయ్ ఫ్రెండ్‌తో బ్రేకప్ అయింది. అలాంటి టైంలో నా విషయాలన్నీ చెప్పి మిమ్మల్ని ఇబ్బంది పెట్టాలన్నది నా ఉద్దేశం కాదు. కానీ నా వైపు నుంచి కూడా ఆలోచించండి. నేను మీ కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నాను. మీరు వదిలేసి వెళ్లిపోతే మళ్లీ ఎన్ని జన్మలు ఎదురుచూడాలో మీ కోసం.

నేనిదివరకే చెప్పాను. నాకిలాంటి పిచ్చి థియరీస్‌లో నమ్మకం లేదని. కలిసి ఇరవై నాలుగు గంటలు కూడా కాలేదు. నువ్వెవరో తెలియదు. నీ పేరేంటో తెలియదు. నా పేరేంటో తెలియదు, నా ఊరేంటో కూడా నీకు తెలియదు. మరి ఎలా నువ్విలా మాట్లాడగలుగుతున్నావు. జస్ట్ బికాజ్ నీకు మాట్లాడే అవకాశం ఇచ్చాననే కదా!

నాలోపల సముద్రమేదో కళ్లల్లోకి పొంగుకొచ్చింది. ఆపుకున్నాను. ఈ సముద్రానికీ, చందమామకీ పరిచయముందా? మరి ఎందుకు పౌర్ణమి రోజు అలలు ఎగిసెగిసి పడతాయి? అని అడిగాను.

ఓకే. నేను కొంతవరకూ ఒప్పుకుంటాను. నువ్వు బాగా మాట్లాడగలిగావు. అందుకే ఇంతసేపు నేను వినగలిగాను. అంతకుమించి మన మధ్య వేరే ఏ కనెక్షన్ లేదు. సరే! నువ్వు చెప్పినట్టే మన మధ్య ఏదో తెలియని కాస్మిక్ కనెక్షన్ ఉండుంటే మనల్ని అది మళ్లీ కలపాలి. మనిద్దరం ఒకరికొకరు తెలియదు. ఇప్పుడు నేనిక్కడ్నుంచి బయల్దేరి

వెళ్లిపోతాను. నువ్వు నన్ను ఫాలో కాకూడదు. నా గురించి హొటల్స్‌లో ఎంక్వైరీ చెయ్యకూడదు. నా బాయ్ ఫ్రెండ్ కనిపించినా అతని దగ్గర్నుంచి నా డీటైల్స్ అడక్కూడదు. నువ్వు నాగురించి కానీ, నేను నీ గురించి కానీ వెతికే ప్రయత్నాలే చెయ్యకూడదు. మళ్లీ ఇప్పుడు కలిసినట్టే యాధృచ్చికంగా మళ్లీ మనం కలిస్తే – అప్పుడు నువ్వు చెప్పింది నిజమని ఒప్పుకుంటాను. మే బీ అప్పుడు నీ ప్రపోజల్ గురించి ఆలోచిస్తాను. అప్పటివరకూ గుడ్ బై, అని చెప్పి తను అక్కడ్నుంచి కదిలింది.

మనం తప్పకుండా కలుస్తాం అన్నాను.

వేగంగా అక్కడ్నుంచి నడుచుకుని వెళ్లిపోతున్న తను వెనక్కి తిరిగింది.

నో చాన్స్ అని నవ్వుతూ అక్కడ్నుంచి వెళ్లిపోయింది.

వెన్నెలలో ఆమె నడిచి వెళ్లిన పాదాల గుర్తులు కనిపిస్తున్నాయి. అప్పుడే మాయమవుతున్న ఒక పాదం గుర్తుని తాకి, ఆమెను తాకిన అదృష్టానికి నోచుకున్న గుప్పెడు ఇసుకని నా చేతిలోకి తీసుకున్నాను. ఒక పెద్ద అలలో ఆమె పాదాల గుర్తులన్నీ మాయమయ్యాయి. దూరంగా నడుచుకుని వెళ్తున్న ఆమె చీకట్లో కలిసిపోయింది. చేతిలో తడి ఇసుక. మనసులో ఆమె రూపం పదిలంగా మిగిలాయి.

* * *

ఫోటో షూట్ చేసినంత సేపూ ఆమె నన్ను చిత్రమైన చూపులు చూస్తూనే ఉంది. ఆమెకు నాతో మాట్లాడాలని ఉంది. నన్ను చూడగానే నా దగ్గరకొచ్చింది. నో చాన్స్. ఇట్స్ నాట్ పాజిబుల్. హౌ కమ్ అని అడిగింది. ఆమె కళ్లలో వేలప్రశ్నలు.

నేను పెద్దగా మాట్లాడలేదు. తనకి కాబోయే భర్త నేనే ఫోటో షూట్ చెయ్యాలని ఎలా నన్నక్కడికి తీసుకొచ్చాడో చెప్పాను. ఇంతలో అతను మా దగ్గరకొచ్చాడు. మీకు ముందే పరిచయం ఉందా? అని అడిగాడు. ఇద్దరం నవ్వి ఊరుకున్నాం.

ఆ రాత్రికే పెళ్లి. మధ్యాహ్నానికి ఫోటో షూట్ ముగించుకుని నేను రిసార్ట్‌లోని నా రూంలోకి వెళ్లిపోయాను.

బ్యాగ్‌లో నుంచి శాండ్ క్లాక్ టేబుల్ మీద పెట్టాను. బహుశా ఇది నా దగ్గర ఉండడమే మమ్మల్ని దగ్గర చేస్తుందేమో! దీనికేవైనా మంత్ర శక్తులు ఉన్నాయా అనిపించింది. చాలాసేపటివరకూ ఆ శాండ్ క్లాక్‌లోని ఒక అరలోనుంచి మరో అరలోకి పైనుంచి కిందకు రాలుతున్న ఇసుకని చూస్తూ గడిపేశాను. ఆ రాలుతున్న ఇసుకలాగే నా జ్ఞాపకాలు కూడా నా మీదకి మెల్లగా జారుతున్నాయి.

గోవాలో తనని మొదటిసారి కలిసిన రెండు సంవత్సరాలకి ఆమెను హైదరాబాద్‌లో కలిశాను. అంతకుముందు ఆరు నెలల క్రితమే నన్ను బెంగళూరు ఆఫీస్ నుంచి హైదరాబాద్‌కి ట్రాన్స్‌ఫర్ చేశారు. అమ్మకి హెల్త్ బాగోలేకపోవడం వల్ల ప్రతివారం బెంగళూరు నుంచి విజయవాడకి రావడం, విజయవాడ నుంచి అమ్మని తీసుకొచ్చి హైదరాబాద్‌లో డాక్టర్స్‌కి చూపించడం చాలా కష్టమవుతున్న రోజులు. కష్టపడి హైదరాబాద్‌కి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాను. కొన్ని రోజుల్లోనే అమ్మకి సీరియస్ అయింది. హాస్పిటల్‌లోనే చనిపోయింది. మళ్లీ బెంగళూరు వెళ్లిపోదామనుకున్నాను. కానీ కుదర్లేదు. హైదరాబాద్‌కి కొత్త. ఫ్రెండ్స్ కూడా ఎవరూ లేరు. బెంగళూరులో ఉన్నప్పుడు రంగ శంకరకి వెళ్లడం, నాటకాలు చూడడం అలవాటు. అందుకే రోజూ రవీంద్ర భారతికో, ఇంకో దగ్గరకో వెళ్లేవాడిని. ఏ ప్రోగ్రాం ఉన్నా చూసేవాడిని. ఉదయాన్నే పేపర్ కొనుక్కుని ఆ రోజు నగరంలో ఎక్కడెక్కడ ఏమేం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయో చూసుకునేవాడిని. అలా ఆమెను ఒక రోజు హైదరాబాద్‌లో కలిశాను.

రవీంద్రభారతిలో సంగీత కచేరీలో చూశాను. ఆ సాయంత్రం అందరికంటే ముందు నేను రవీంద్రభారతి చేరుకున్నాను. ప్రోగ్రాం మొదలుపెట్టిన కాసేపటికి ఆమె వచ్చింది. హాల్లో చీకటిని తొలగిస్తూ తలుపు తెరుచుకుని మెల్లగా వచ్చింది. ఆమె రావడంతో హాల్లో ఒక మెరుపు మెరిసినట్టయింది. చీకట్లో సీట్లు వెతుక్కుంటూ మూడో వరసలో కూర్చుంది. నేను ఆమెకు నాలుగు వరుసల వెనక కూర్చుని ఉన్నాను.

ఆమె పక్కనే ఒక ఖాళీ సీటు ఉంది. ఆమె వచ్చి కూర్చున్న దగ్గర్నుంచీ వెళ్లాలా వద్దా అని నా కాళ్లాడటం లేదు. కాసేపటికి ధైర్యం చేసి హాలు బయటకొచ్చి, ఆమె వచ్చిన డోర్ నుంచే మళ్లీ లోపలకొచ్చాను. వెళ్లి ఆమె పక్కన కూర్చున్నాను. ఆమె నన్ను గమనించలేదు. కళ్లు మూసుకుని వింటోంది. అప్పుడప్పుడూ ఆమె వైపు చూస్తున్నాను. మోహన రాగంలో గణేశ్ కుమరేశ్ వయోలిన్‌పై పొందికగా రంజని రాగంలో సంగీతాన్ని కూరుస్తున్నారు. ఆమె కళ్లనుంచి ధారగా కన్నీళ్లు కారుతున్నాయి.

సంగీతంలో తన్మయత్వం చెందుతున్న ఆమెను చూడ్డం కోసమే నేను పుట్టాననిపించింది. ఆ క్షణంలో చచ్చిపోయినా నాకు నష్టం లేదనిపించింది. సంగీతం కూడా ఒక భాషే అని ఆ రోజు నాకర్థమైంది. సంగీతంలో భాషని మించిన ఏదో క్వాలిటీ ఉందని కూడా నాకారోజే అర్థమైంది. వ్యాకరణాల నిబంధనలు లేకుండానే సంగీతం మనల్ని పలకరిస్తుంది. ఆ రోజు ఆమెను ఎదుర్కోడానికి ధైర్యమిచ్చింది ఆ సంగీతమే.

కచేరీ అయిపోయాక ఆమె నన్ను చూసింది. గుర్తు పట్టదనుకున్నాను.

వాట్? నో చాన్స్! అంది.

ఆ రాత్రి మేము నగరమంతా తిరిగాం.

రవీంద్రభారతిలో పక్కపక్కన సీట్లలో కూర్చోవడం యాధృచ్చికం కాకపోవచ్చు కానీ ఇద్దరం ఆ సాయంత్రం రవీంద్రభారతికి రావడం యాధృచ్చికమనే ఒప్పందానికి వచ్చాం.

ఐ వాజ్ వెరీ ఫూలిష్ టు ప్రపోజ్ దట్ ఐడియా ఇన్ గోవా అని గట్టిగా నవ్వింది. కొంపదీసి నువ్వది సీరియస్‌గా తీసుకోలేదు కదా అని అడిగింది.

నేనెంత సీరియస్‌గా తీసుకున్నానో ఆమెకు చెప్పడం అర్థం లేదనిపించింది. రెండు సంవత్సరాలు ఎక్కడికెళ్లినా నా కళ్లు ఆమె కోసం వెతకని చోటు లేదు. ఎంతో నిరీక్షణ తర్వాత ఆమెను కలవడం బాగానే ఉంది కానీ ఇబ్బందిగా కూడా ఉంది.

గోవాలో తన బాయ్ ఫ్రెండ్‌తో బ్రేకప్ అయిపోయిందని చెప్పింది. ఆ తర్వాత కొన్ని రిలేషన్ షిప్స్ ట్రై చేసినా వర్కవుట్ అవలేదనీ, ఇప్పుడిప్పుడే ఒక రిలేషన్‌షిప్ స్టేబుల్ అయ్యే దిశలో ప్రయాణిస్తున్నాను అని చెప్పింది. ఆమె మాటలు వినడమే ఆనందం. కానీ హఠాత్తుగా, వాట్ ఎబౌట్ యూ? అని ఆడిగేసరికి నా దగ్గర సమాధానం లేదు.

నా ఫోన్ నెంబర్ తీసుకుంది. తర్వాత కలుద్దామంది.

ఇక మళ్లీ కలవదులే అనుకున్నాను. నెక్స్ట్ డే ఫోన్ చేసింది.

సీ... నిన్న నేను చూసినప్పుడు నిజంగా పెద్ద ఎక్సైట్ కాలేదు. కానీ రాత్రి ఇంటికెళ్లిన తర్వాత నువ్వే గుర్తొచ్చావు. మనమిలా కలవడం నీకెలా ఉందో నాకు తెలియదు. బట్ నాకైతే ఇట్స్ వెరీ న్యూ. ఇలాంటి ఫీలింగ్ ఎప్పుడూ కలగలేదు నాకు. బహుశా టెన్త్ క్లాస్‌లో ఉన్నప్పుడు, స్కూల్ అయిపోయాక నా క్లాస్ మేట్ నాకు సీక్రెట్‌గా లవ్ లెటర్ ఇచ్చినప్పుడు నాకిలాంటి ఫీలింగ్ కలిగింది. యూనో లైక్ బట్టర్ ఫ్లైస్ ఇన్ ది స్టమక్, దట్ కైండ్ ఆఫ్ ఫీలింగ్.

నాకు తెలుసు తనకొక బాయ్ ఫ్రెండ్ ఉన్నాడని. కానీ వారానికొకసారైనా నన్ను కలిసేది. ప్రతి కలయికా ఒక అడ్వెంచర్.

ఒక మంత్ ఎండ్లో. ఇద్దరి బ్యాంక్ అకౌంట్స్ దాదాపుగా ఖాళీ అయిపోయిన సమయం. నాకీ రోజు తాజ్ బంజారాకి వెళ్లాలని ఉంది అంది. అనుకున్నాం. బయల్దేరాం.

ఏ.కే. రామానుజన్ పోయెట్రీ పుస్తకం పట్టుకుని స్విమ్మింగ్ పూల్ దగ్గర కూర్చుని చదువుకున్నాం. తిన్నాం. తాగాం. డబ్బులు కట్టకుండా పారిపోవాలనీ అనుకున్నాం. నాకంత ధైర్యం రాలేదు. క్రెడిట్ కార్డ్‌లో కట్టేశాను.

అప్పట్నుంచీ తాజ్ బంజారా స్విమ్మింగ్ పూల్ మా కలయికకి వేదిక. చాలాసార్లు కలిశాం అక్కడ. చాలా రాత్రయిన తర్వాత కొన్నిసార్లు అమీర్‌పేట్‌లో మా ఇంటికి వెళ్లేవాళ్లం.

సెక్స్ విత్ యూ ఈజ్ వెరీ వైల్డ్. బహుశా నీకు ఇది కొత్తనుకుంటా. అందుకేనేమో.

ఉదయాన్నే బాల్కనీలో నిలబడి కాఫీ తాగుతూ నాకు బాయ్ ఫ్రెండ్ ఉన్నాడని నీకు తెలుసు కదా అని అడిగేది.

ఒక ఆరు నెలలు ఆమెతో గడిపిన తర్వాత ఒకరోజు.

ఎప్పట్లానే స్విమ్మింగ్‌పూల్ పక్కన ఉన్నాం.

నీకొక విషయం చెప్పాలి. నువ్వంటే నాకిష్టమే. నీతో అంతులేని సంభాషణలంటే ఇష్టం. నువ్వు చెప్పే చాలా థియరీస్‌ని నేను నమ్మకపోయినా నాకు అవి వినడం ఇష్టం. కానీ మనం చేస్తున్నదంతా తప్పు. ఐ డోంట్ థింక్ దిస్ ఈజ్ లవ్. దిస్ ఈజ్ సంథింగ్ ఎల్స్.

అవును. దిస్ ఈజ్ సమ్‌థింగ్ ఎల్స్. దిస్ ఈజ్ మోర్ దేన్ లవ్ అని నాకు చెప్పాలనిపిస్తుంది. కానీ నాకు మాటలు రావు. కన్నీళ్లు వచ్చినట్టనిపించింది. అయినా ఆపుకున్నాను. ఆమెకి అర్థమయింది.

వచ్చి తన పెదాలతో నా పెదాలను మూసేసింది. అంత దగ్గరగా ఆమెనెప్పుడూ చూడలేదనే ఆనందంతో కళ్లు తెరవాలనిపించింది. కానీ పారవశ్యంతో నా కళ్లు మూసుకుపోయాయి. నేను మరో లోకంలో మేల్కొన్నాను. బహుశా ఇదే స్వర్గమేమో అనిపించింది. ఇదంతా తప్పెలా అవుతుంది. ఇంత ఆనందం ఎప్పటికీ తప్పు కాదు అని గట్టిగా చెప్పాలనిపించింది. కానీ వర్షం పడేముందు భూమి అనుభవించే ఉద్రిక్తత నాలోనూ కలిగింది. నాకు ఊపిరాడలేదు. మాటలు రాలేదు. నాలో ఇంత జరుగుతుందంటే అది తప్పైనా ఫర్వాలేదు. నేను నీతో ఎన్ని తప్పులైనా చేస్తానని చెప్పాలనిపించింది. కానీ తప్పుగా అనుకుంటుందేమోనని మనసు మూగపోయింది. కానీ నాలో చిక్కుబడ్డ ఇన్ని ఆలోచనల ముడులు విప్పేలోగానే ఆమె, ప్రకృతికే సాధ్యమయ్యే అద్భుతమైన ఉదాసీనతతో పెదాలను విడదీసింది. మళ్లీ ఏం జరగనట్టు వెళ్లి తన కుర్చీలో కూర్చుంది.

ఒకరోజు మధ్యాహ్నం. మేము జింజర్ హనీ టీ తాగుతూ బరిస్తా కేఫేలో కూర్చుని చెరొక పుస్తకం చదువుకుంటూ ఉన్నాం. మధ్యలో ఏదో గుర్తొచ్చిన దానిలా తలెత్తింది. నీకో విషయం చెప్పాలి అంది.

నిన్నే ఎక్కడో చదివాను. గోల్డ్ ఫిష్‌కి జ్ఞాపకశక్తి ఉండదట తెల్సా? అవి ప్రతీ దాన్నీ అదే మొదటిసారి అన్నంత పారవశ్యంతో అనుభవిస్తాయట. నాకూ జీవితం అలాగే ఉండాలి. నాకు ఒకచోట స్థిరంగా ఉండడం ఇష్టం ఉండడం లేదు. ఎప్పుడూ కొత్త ప్రదేశాలను చూడాలి. కొత్త వ్యక్తులని కలవాలి. నాకు ఈ ప్రేమంటే ఏంటో అర్థం కాదు. బైదివే నా బాయ్‌ఫ్రెండ్‌తో బ్రేకప్ అయింది.

ఇలాంటి సమయాల్లో ఎలా రియాక్ట్ అవ్వాలో తెలియని రాతి హృదయం నాది. సైలెంట్‌గా ఉన్నాను. కొంచెం సేపటికి నేనూ నీకో విషయం చెప్పాలి అన్నాను.

మనం రవీంద్రభారతిలో కలవడం అంత యాధృచ్ఛికమేమీ కాదు. నిన్ను కలిసే ముందు రోజు నేను హిందూ పేపర్‌లో నీ ఫోటో చూశాను. అంతకు ముందు రోజు జరిగిన కచేరీకి వచ్చిన ఆడియన్స్‌లో నువ్వున్నావు. అందుకే ఆ రోజు రవీంద్ర భారతికి వచ్చాను అని చెప్పాను.

బట్, హౌ డజ్ ఇట్ మ్యాటర్ నౌ అని అడిగింది.

నేను సమాధానం చెప్పలేదు.

సినిమాకెళ్దామా అని అడిగింది. ప్రసాద్ ఐ మ్యాక్స్‌లో సినిమా చూడ్డానికి వెళ్లాం.

సినిమా చూసి ఇంటికొస్తున్నాం.

ఆటోలో వెళ్దామా అన్నాను. సమాధానం చెప్పకుండా ఆమె వేగంగా నడుస్తుంటే నేనూ ఫాలో అయ్యాను. ఖైరతాబాద్ రైల్వే సిగ్నల్ క్రాస్ చేసి చింతల్‌బస్తీలోనుంచి నడుస్తున్నాం. పండుగ సీజన్. వీధుల నిండా జనాలు.

ఎక్కడికి అని అడిగింది.

అర్థం కాలేదు.

నడి రోడ్డులో జనాల మధ్యలో నిల్చుని ప్లీజ్ ఇంక చాలు. వెళ్లిపో అంది.

సినిమాల్లో చూపిస్తుంటారు. హీరోకి ఒక విషయం తెలుస్తుంది. షాక్ అవుతాడు.

ఏం చెయ్యాలో అర్థం కాదు. చుట్టూ ఉన్న శబ్దాలు ఒక్కసారిగా ఆగిపోతాయి. తన చుట్టూ ఉన్న ప్రపంచం స్లోమోషన్‌లో కదుల్తుంది. అదంతా సినిమా వాళ్లు చూపించే మ్యాజిక్ అనుకునేవాడ్ని. ఇప్పుడు అనుభవంలోకి వచ్చాక కానీ తెలియలేదు.

తను వెళ్ళిపోతోంది.

నాకూ వెంట వెళ్లాలనే ఉంది.

పరిగెత్తి ఆమె చేతిని పట్టుకుని ఆపాలని ఉంది.

కానీ ఎవరో శాపం పెట్టినట్టు ఇక్కడే శిలలా నిలబడిపోయాను.

గుర్తు పెట్టుకోవాలి. ఈ క్షణం మళ్లీ రాదు. ఈ అనుభవం మళ్లీ రాదు.

ఎదురుగా కనిపిస్తున్న హ్యాపీ హెయిర్ సెలూన్ బయట ఎవరైనా కస్టమర్ వస్తాడేమో అని చూస్తూ పేపర్‌తో విసురుకుంటూ కూర్చున్న అతని దీనమైన చూపుని గుర్తుంచుకోవాలి.

పక్కనే బండి మీద యాపిల్స్ బేరం చేస్తున్న భార్య వైపు కోపంగా చూస్తున్న భర్తని గుర్తు పెట్టుకోవాలి. వాడిపోయిన ఆకు కూరలని దిగులుగా చూస్తున్న పెద్దమనిషిని గుర్తుంచుకోవాలి.

సగం ఎండిపోయిన ఈ చెట్టు, జనాలతో నిండిపోయిన ఈ వీధిని గుర్తుంచుకోవాలి.

దూరంగా పేలిన టపాకాయ చప్పుడికి నేను ఉలిక్కిపడడం గుర్తుంచుకోవాలి.

ఇదంతా నిజంగా జరిగిందని గుర్తుంచుకోవాలి. బహుశా ఇంకొన్నేళ్ల తర్వాత ఈ రోజు గురించి, ఈ రోజు నాకు జరిగిన దాన్ని గురించి, ఈ రోజు నాలో జరిగిన దాని గురించి నేనింకా బాగా చెప్పగలుగుతానేమో! కానీ అప్పటికి ఈ విషయం నా జీవితంలో ఇంత ప్రాముఖ్యతని కలిగి ఉండదేమోనని కూడా నా అనుమానం. ఏదేమైనా ఇప్పటికి నా జీవితంలో ఇలాంటి ఒక అనుభూతి కూడా ఉందని గుర్తుంచుకోవాలి.

చెట్టునుంచి ఆకు రాలినంత సహజంగా ఆమె నన్ను విడిచి వెళ్లిపోయింది.

ఒకవేళ సూర్యుడు భూమిని వదిలేసి దూరంగా వెళ్లిపోతే. భూమి మనగలదా? తను లేకుండా నేనెలా ఉండగలను. షీ వాజ్ మై సన్ షైన్. ఆమె కోసం ఎదురుచూడడంలో బాధ నాకు తెలుసు. ఆమెనెప్పుడు మర్చిపోవాలనుకోవడంలోనూ ఎంత బాధ ఉంటుందో కూడా తెలుసు. కానీ ఇలా హఠాత్తుగా నన్ను వదిలేసి వెళ్లినప్పుడు ఏం

చేయాలో తెలియకపోవడంలో ఉన్న తీవ్రమైన బాధ నాకు తప్ప ఇంకెవరికీ అర్థం కాదు. అందుకే గలగలా పారుతున్న కాలువలో రాలిన ఆకులా నేను అప్పట్నుంచీ ప్రయాణంలోనే ఉన్నాను. ఆ ప్రయాణంలో ఎంతో మందిని కలిసాను. అప్పటివరకూ నేననుభవించిన బాధ ప్రపంచంలోనే అపూర్వమైనదిగా భావిస్తూ వచ్చిన నాకు సాటి ప్రయాణీకుల సావాసం దొరికింది. వారి అనుభవాలు తెలుసుకున్నాను. వారు పడిన హింస, అనుభవించిన బాధల ముందు నా బాధ ఒక లెక్కకాదనిపించింది.

హైదరాబాద్‌లో మొదటిసారి కలిసినప్పుడు, మా కలయిక ప్రపంచంలోని ఎనిమిదో వింతలా ఫీలయ్యింది తను. కానీ ఈ రోజు ఇక్కడ ఆమె పెళ్లిలో కలవడం నాకు నిజంగానే వింతగా ఉంది. అంతకుముందు ప్రతిసారీ నేనామెని కలవబోతున్నాననే ఎటువంటి సిగ్నల్స్ లేవు. చాలా నేచురల్‌గా జరిగిపోయాయి. కానీ ఈసారి మా కలయిక విశ్వమంతా కలిసి పన్నిన పెద్ద వ్యూహంలానే అనిపిస్తోంది.

ఫోన్ రింగయింది. లంచ్ రెడీ అని మేనేజర్ ఫోన్ చేశాడు. నేను తర్వాత తింటానని చెప్పాను. మేడం మిమ్మల్ని కలవాలంటున్నారు. తన రూంకి రమ్మన్నారని చెప్పాడు.

ఆమెనెలా ఎదుర్కోవాలి? ఏం మాట్లాడాలి.

జీవితానిక్కూడా బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఉంటే బావుండేది. ఒక ఉధృతమైన మ్యూజిక్ ప్లే అవుతుండగా మనకిద్దరికీ కుదరదు. అయినా ఎవరో మన జీవితాలని ఆడిస్తున్నారు. నాకు మళ్లీ ఎప్పుడూ కనిపించకు. నీకూ ఎప్పుడూ కనిపించను అని చెప్పి ఆవేశంగా అక్కడ్నుంచి వెళ్లిపోవచ్చు. కానీ నాలో అంత ఆవేశం లేదు. ఆమె ఎదురుగా మామూలుగా మాట్లాడ్డమే కష్టం నాకు. ఆమె చూడనంతవరకూ నా ఉనికే నాకు తెలియదు. నన్ను నేను ఇష్టపడడం మొదలుపెట్టిందే ఆమెని కలిసిన తర్వాత. కానీ ఈ ఆట నాకు నచ్చడం లేదు. కలవడం. విడిపోవడం. ఇది ఇంతటితో ఆగిపోవాలి.

ఏదైతే అదయింది. నేను తన రూంకి వెళ్లదలుచుకోలేదు.

చాలాసేపటి తర్వాత నా డోర్ బెల్ రింగ్ అయింది.

తలుపుతీస్తే అవతల ఎవరుంటారో తెలుసు నాకు. తలుపుతీయకుండా తలుపు వైపే చూస్తూ కూర్చున్నాను చాలాసేపు. ఇలా జరగడం ఇది మొదటిసారి కాదు. సంవత్సరం క్రితం కొల్‌కతాలో జరిగిన సన్నివేశాన్ని మళ్లీ ఫ్లాష్ బ్యాక్‌లో చూసినట్టుంది నాకు.

* * *

తను లేని హైదరాబాద్ నాకు నచ్చలేదు. బెంగళూరుకి ట్రాన్స్‌ఫర్ అడిగాను. కుదరదన్నారు. వెంటనే ఉద్యోగం మానేసి కొన్ని రోజులు ఎటైనా వెళ్లిపోదామనిపించింది.

ఒక గమ్యం లేకుండా చాలా చోట్ల ప్రయాణం చేశాను. అక్కడ తిరుగుతూ నేను తీసిన ఫోటోస్‌ని నా బ్లాగ్‌లో పెట్టుకుంటూ చాలా రోజులు తిరిగాను. నా బ్లాగ్‌లో ఫోటోస్ చూసి మా కంపెనీ బాస్ నన్ను కాంటాక్ట్ చేశాడు. తన కంపెనీలో ఉద్యోగమిచ్చాడు. అలా ఢిల్లీకి చేరుకున్నాను.

ఢిల్లీ నాకు నచ్చింది. ఉద్యోగం నచ్చింది. ఉద్యోగం పేరుతో ఎక్కడెక్కడికో ట్రావెల్ చెయ్యడం నచ్చింది. మూడేళ్లు ఎలా గడిచిపోయాయో కూడా తెలియదు. ఫోటోగ్రాఫర్‌గా నాకు చాలా మంచి పేరొచ్చింది.

కోల్‌కత్తాలో ఒక ఆర్ట్స్ సెంటర్ వాళ్లు నన్ను ఫోటో ఎగ్జిబిషన్‌కి ఇన్వైట్ చేశారు.

కోల్‌కత్తాలో ఫోటో ఎగ్జిబిషన్ చివరిరోజు తనని జనాల్లో చూశాను. ఆమె నన్ను చూడలేదు. ఆమె చూడకముందే అక్కడ్నుంచి వెళ్లిపోయాను నేను.

ఆ రాత్రి చాలా సేపు నిద్రపోలేదు. అర్ధరాత్రి దాటిన తర్వాత నా డోర్ బెల్ మోగింది. వచ్చింది తనేనని తెలుసు. ఎలా తెలుసో తెలియదు.

చాలా సేపటికి తనే డోర్ తెరుచుకుని లోపలకొచ్చింది.

నేను కోల్‌కత్తా నీ కోసమే వచ్చాను.

తెలుసు. ఆర్ట్స్ సెంటర్ మేనేజర్ చెప్పింది.

మరి నన్ను కలవకుండానే ఎందుకు వెళ్లిపోయావ్?

నువ్వు నన్ను వెతుక్కుంటూ రావడం మన రూల్స్‌కి వ్యతిరేకం.

ఆ గేమ్ నువ్వింకా ఆడుతున్నావా?

అది గేమ్ కాదు.

వాటెవర్. ఒక ఫోన్ చెయ్యలేవా? నా నెంబరుంది కదా! నువ్వు మాత్రం నీ నెంబర్ మార్చేశావు. నీ కోసం లాస్ట్ త్రీ ఇయర్స్‌లో ఎంత వెతికానో తెలుసా?

ఎందుకు?

ఐ నో. హైదరాబాద్‌లో నిన్నలా వదిలేసి వెళ్లాల్సింది కాదు.

...

అప్పటి నేను వేరు. మనం కోరుకునేలా మనుషులు ఎప్పుడూ ఉండరు. ఒక్కోసారి వాళ్లు మనల్ని నిరుత్సాహపరుస్తారు. కానీ అందరికీ ఒక ఛాన్స్ అయితే ఇవ్వాలి. ఎక్కడో బీచ్‌లో ఒకమ్మాయిని అనుకోని పరిస్థితుల్లో కలిసి ఆమె నువ్వనుకున్నట్టు ఉంటుందని ఎలా అనుకున్నావ్? ఒక చాన్స్ ఇచ్చుండొచ్చు కదా? ఇచ్చుంటే నేను నువ్వు ఊహించినదానికంటే బెటర్ పర్సన్‌గా నీకు ఎదురయ్యేదాన్నేమో!

నేనేం సమాధానం చెప్పలేదు.

నీకు మౌనం ఒక ఆయుధం. నువ్వొక ఋషివి. నీకు ఎక్స్‌పెక్టేషన్స్ ఉండవు. అవును. నిజమే. అందరూ నీలా ఉండలేరుగా! ఆ రోజు వెళ్లిపోతుంటే నన్నాపుండొచ్చుగా? ఆ రోజు హైదరాబాద్‌లో నువ్వు నన్ను ఆపుంటే ఈ రోజు నిన్ను వెతుక్కుంటూ రావాల్సిన అవసరం వచ్చుండేది కాదు. కానీ నా బాయ్ ఫ్రెండ్‌తో బ్రేకప్ అయిన కోపంలో నేను వెళ్లిపోయాను కానీ, నా కళ్లముందు ఒక పర్ఫెక్ట్ బీయింగ్ ఉన్నాడనే విషయం మర్చిపోయాను. నీకు గుర్తుందా? నాకు గోల్డ్‌ఫిష్‌లా మెమొరీస్ లేకుండా బతకడం అని చెప్పాను. కానీ తర్వాతే తెలిసింది నాకు చేపల్లో అన్నింటికంటే ఎక్కువ జ్ఞాపకశక్తి ఉండేది గోల్డ్‌ఫిషెస్‌కే అని. అప్పటివరకూ నన్ను నేను ఎంత మోసం చేసుకుంటూ వచ్చానో అర్థమైంది. ప్రతిరోజూ నీ ఫోన్ కాల్ కోసం మాత్రం ఎదురుచూశాను. ఐ రియల్లీ మిస్డ్ యూ. కానీ ఎందుకో నాకెప్పుడూ అర్థం కాలేదు. బహుశా నువ్వు చెప్పిందే నిజమనిపించింది.

ఆ రాత్రి తనది. ఆమెకే మాట్లాడే అవకాశం ఇచ్చాను. నేను శ్రోతగా మిగిలిపోయాను.

ఇంత విశాలమైన విశ్వం ఒక సమగ్ర రూపంలో ఉందంటే దానికి కారణం గురుత్వాకర్షణ శక్తే అని నువ్వు చెప్పావు గుర్తుందా? చెట్లపై నుంచి పండ్లు భూమిపై పడటానికి, మనం నేలపై నిలబడి ఉండటానికి, నక్షత్రాలు, గ్రహాలు ఏర్పడేందుకు, కక్ష్యల్లో తిరిగేందుకు గురుత్వాకర్షణ శక్తి  కారణం అయితే, నేను ఇంకా ఈ నేలమీద బ్రతికి ఉండి, ఇక్కడ ఈ రోజు హోటల్లో నీ ముందు నిలబడి ఉండి నీతో మాట్లాడగలుగుతున్నానంటే అది కూడా అలాంటి ఒక శక్తి వల్లనే. అదే ప్రేమని నాకు చాలా రోజులకి అర్థమైంది. అందుకే నీ గురించి వెతుక్కుంటూ వచ్చాను. నా ప్రాబ్లం ఏంటంటే నాకు ప్రేమ కావాలి. అది నాకు దొరకలేదనుకున్నాను. బాయ్ ఫ్రెండ్ ఆఫ్టర్

బాయ్ ఫ్రెండ్. వాళ్లు నన్ను కోరుకున్నారు, కానీ నాకు ప్రేమనివ్వలేదు. నువ్వు కూడా వాళ్లలో ఒకడనుకున్నాను. నీ ప్రేమ నాకర్థం కాలేదు. నువ్వెళ్లిపోయాకే నాకర్థమైంది నాకసలు ప్రేమంటేనే అర్థం కాలేదని. ప్రేమంటే నువ్వే అని తెలుసుకునేటప్పటికి చాలా దూరం వెళ్లిపోయావ్. అందుకే నిన్ను వెతుక్కుంటూ వచ్చాను. నాకిప్పుడు ఒక స్థిరత్వం కావాలి. ఈ పరుగు ఆపాలి. నువ్వొప్పుకుంటే మనం పెళ్లి చేసుకుందాం అంది.

పెళ్లి. నాకు నవ్వొచ్చింది. కోపమొచ్చింది.

ఏ మాత్రం అనుకూలత లేకుండా, విరుద్ధ భావాలు కలిగిన ఇద్దరిని కలపడానికి కనిపెట్టిన ఒక మంత్రం ఈ పెళ్లి. నీతో ఉన్న ప్రాబ్లం కూడా అదే! యూ నీడ్ ఎ హీరో ఇన్ యుర్ ఫ్యామిలీ మూవీ అండ్ దట్స్ వాట్ యూ వాంట్ మీ టు బి. కానీ నువ్వనుకుంటున్న హీరోని నేను కాను. నువ్వు నన్ను వెతుక్కుంటూ రాలేదు. వాట్ ఆర్ యూ గోయింగ్ టూ డూ విత్ యువర్ లైఫ్? అని అందరూ నిన్ను అడిగే ప్రశ్నకి నేను సమాధానం అనుకున్నావు. నేను నిన్ను నమ్మాను. అన్నింటికంటే మన ప్రేమను పూర్తిగా నమ్మాను. నన్ను నీకు పూర్తిగా సమర్పించుకున్నాను. ఎటువంటి కండిషన్స్ లేకుండా! నా తప్పేంటో నాకర్థం కాలేదు. చాలా బాధపడ్డాను. ఐ వాజ్ డీప్లీ హర్ట్. నేను జీవితంలో చాలా బాధలు అనుభవించి ఉన్నాను. నువ్వు కూడా నన్ను బాధపెడ్తావని అనుకోలేదు. అందుకోసం ఇప్పుడు నిన్ను బాధపెట్టాలని నా ఉద్దేశం కాదు. దిస్ ఈజ్ నాట్ మై రివెంజ్. జస్ట్ దట్, ఇట్ ఈజ్ నాట్ నాచురల్.

ఆమె కళ్ళలో బాధ  మెరిసింది. దగ్గరికి లాక్కున్నాను.

ఒక పని చేద్దాం. మళ్లీ మనం మొదటికొద్దాం. అప్పుడు నువ్వు గోవాలో పెట్టిన రూల్సే. మనమిద్దరం ఒకర్నొకరు కలవడానికి ప్రయత్నం చేయకూడదు. ఒకవేళ మనం నిజంగానే ఒకరికొకరమైతే మనం మళ్లీ యాధృచ్ఛికంగా కలవాలి. అప్పుడు నిన్ను నాతో తీసుకెళ్లిపోతాను. ఈ ప్రపంచం మొత్తం అడ్డొచ్చినా సరే.

ఆ తర్వాత ఇదే ఆమెను మళ్లీ చూడడం.

ఆమె పెళ్లిలో.

* * *

డోర్ బెల్ రింగవుతూనే ఉంది. నేను డోర్ ఓపెన్ చెయ్యలేదు. కోల్‌కత్తాలాగా తలుపు తెరిచి పెట్టలేదు. చాలాసేపు ప్రయత్నించి తను వెళ్లిపోయినట్టుంది.

అర్ధరాత్రి నన్ను నిద్రలేపాడు ఈవెంట్ మేనేజర్. ఉదయాన్నే మూడింటికి ముహూర్తం. ఫోటోషూట్‌కి సిద్ధం కావాలని చెప్పి వెళ్లిపోయాడు.

కెమెరా కిట్ తీసుకుని మ్యారేజ్ హాల్లోకి బయల్దేరాను. పెళ్లి కార్యక్రమం మొదలవ్వకముందే పెళ్లికొడుకు, పెళ్లికూతురు ఫోటోస్ విడివిడిగా తీయమని ఈవెంట్ మేనేజర్ చెప్పాడు.

ముందు ఆమె రూంకే తీసుకెళ్లారు. నన్ను చూడగానే, మేకప్ అవుతున్న ఆమె లేచి నిలబడింది. అక్కడున్న అందరినీ బయటకి పంపించింది.

నిజంగా ఇది నీ పెళ్లని నాకు తెలియదు.

నేనూ నిన్ను కావాలని ఈ పెళ్లికి పిలిపించలేదు.

ఇద్దరం ఒకేసారి మాట్లాడాం.

ఏం చేద్దాం? అడిగింది.

ఇప్పుడింక ఏం చెయ్యలేం కదా! అన్నాను.

అంటే మన గేమ్ అయిపోయిందా? చివరికి ఎవరు గెలిచారు? నువ్వా? నేనా? అడిగింది.

నాకేం చెప్పాలో తెలియలేదు.

నీకోసం ఎదురుచూశాను. ఎదురుచూస్తూ సంవత్సరాలు గడిపేశాను. ప్రణయ్ చాలా మంచోడు. నేను నీ కోసం కోల్‌కత్తా వచ్చాను గుర్తుందా? అక్కడే కలిశాను అతన్ని. హైదరాబాద్‌కి తిరిగొస్తుంటే ఫ్లైట్‌లో నా పక్క సీట్లో కూర్చున్నాడు. హైదరాబాద్ తిరిగొస్తున్నంత సేపూ నేను ఏడుస్తూనే ఉన్నాను. అతను నన్ను డిస్టర్బ్ చెయ్యలేదు. ఫ్లైట్ దిగిన తర్వాత ఎక్కడైనా డ్రాప్ చెయ్యాలా అని మాత్రం అడిగాడు. నన్ను ఇంటి దగ్గర డ్రాప్ చేసి వెళ్లిపోయాడు. తర్వాత కొన్ని రోజులకి మళ్లీ కలిశాడు. వియ్ బికేమ్ ఫ్రెండ్స్. సంవత్సరం తర్వాత ప్రపోజ్ చేశాడు. నేనొప్పుకోలేదు. నువ్వెప్పుడొస్తావా అని ఎదురుచూస్తూ ఉన్నాను. రోజూ నీ ఆలోచనలతోనే జీవితం ఆగిపోయింది. ప్రణయ్ నన్ను ఎప్పుడూ ఏమీ అడగలేదు. జడ్జ్ చెయ్యలేదు. ఒక రోజు నాకూ అనిపించింది. ఒకసారి నిన్ను కలవాలనిపించింది. ఎక్కడెక్కడో వెతికాను. చాలా ప్రయత్నాలు చేశాను. ప్రణయ్‌కి ఇదంతా ఏం తెలియదు. ఢిల్లీలో మీ ఇంటికొచ్చాను. లాక్ చేసుంది. ఫోన్ ట్రై చేశాను. కుదర్లేదు. మూడు రోజులు అక్కడే వెయిట్ చేశాను. డే అండ్ నైట్.

నువ్వెక్కడికో వెళ్లావని చెప్పారు. ఇక నాకు ఓపిక పోయింది. ఐ కుడ్ నాట్ ప్లే యువర్ గేమ్ ఎనీమోర్. ఐ గేవ్ అప్. నన్ను పెళ్లి చేసుకుంటావా అని ప్రణయ్‌ని అడిగాను. అంతా బావుందనుకుంటుంటే ఇప్పుడు నువ్వు మళ్లీ వచ్చావ్! నన్నేం చెయ్యమంటావ్? చాలా కంగారు కనిపిస్తోంది ఆమె మొహంలో. ట్రైన్ వెళ్లిపోతున్నప్పుడు మాట్లాడే చివరిమాటల్లా.

నేను నిజంగా చెప్తున్నాను. ఇక్కడికి ప్లాన్ చేసి రాలేదు. నీకో విషయం తెలుసా. నాకసలు ఇక్కడికి రావడం ఇష్టం లేదు. కానీ ప్రణయ్ చాలా ఫోర్స్ చేశాడు. అలా అని ప్రణయ్‌కి మన గురించి తెలుసని కాదు. ఇలా జరిగిందంతే. నాకూ ఇప్పుడేం చెయ్యాలో తెలియక ఇబ్బందిగానే ఉంది. మళ్లీ మళ్లీ ఎందుకిలా జరుగుతోందో అర్థం కావడం లేదు. నిజంగా మనం సోల్ మేట్స్ ఏమో! ఒకప్పుడు నేను నిజంగానే నమ్మాను. నువ్వు నాకోసమే పుట్టావని. కానీ ఇప్పుడంత నమ్మకం లేదు. కానీ ఈ రోజు ఇలా నిన్ను ఇక్కడ కలవడం, మళ్లీ నమ్మకం కలిగిస్తోంది.

దగ్గరగా జరిగాను. నా చెంప మీద ముద్దుపెట్టింది.

ఇద్దరి మధ్య చాలాసేపు మౌనం. కాసేపటికి ఆమె మాట్లాడింది.

ప్రణయ్‌ని నేను ఇష్టపడ్డానికి కారణం నువ్వు నా కోసం రాకపోవడం కాదు. నేను నిన్ను మర్చిపోలేదు. కోల్‌కత్తాలో నిన్ను కలిసినప్పుడు నువ్వు ఒప్పుకుని ఉంటే, హైదరాబాద్‌లో నేను నిన్ను వదిలేసి వెళ్లకుంటే, గోవాలోనే మనిద్దరం ఇంకొన్ని రోజులు కలిసి ఉండుంటే, ఇలా ఏవేవో ఊహలు నన్ను వెంటాడుతూనే ఉంటాయి. మనిద్దరికి పెళ్లై, పిల్లలు పుట్టి, మనందరం కలిసి ఎక్కడో యూరోప్‌లో ఒక సాయంత్రం పూట చేతులు పట్టుకుని నడుస్తున్నట్టు, ఒక మధ్యాహ్నం మనందరం పార్క్‌లో ఆడుకుని అలసిపోయి చెట్లకింద రిలాక్స్ అవుతున్నట్టు – మరొక జీవితం అప్పుడప్పుడూ కళ్లముందు మెరుస్తూ ఉంటుంది. కానీ ప్రణయ్‌తో ఉన్నప్పుడు అలా ఉండదు. అతను నవ్విస్తాడు. నా మాటలు వింటాడు. అతనిలో ఒక క్లారిటీ ఉంటుంది. అతనెప్పుడూ చెప్పేవాడు. మనిషికున్న పెద్ద సమస్య థింకింగ్. మన ఆలోచనలే మన సమస్య. ప్రాణమున్న ప్రతి జీవి ఎంతో కొంత ఆలోచించగలదు. మనిషి సమస్య ఏంటంటే మన ఆలోచనల గురించి కూడా మనం ఆలోచిస్తుంటాం. వియ్ కెన్ థింక్ ఎబౌట్ అవర్ థింకింగ్. అదే మిగిలిన ప్రాణులైతే దే థింక్ అండ్ దే యాక్ట్. మన సమస్య ఏంటంటే వియ్ థింక్ బట్ వియ్ డోన్ట్ యాక్ట్. ప్రణయ్ నాకు ఈ విషయం చెప్పిన తర్వాతే నేను అతనికి ప్రపోజ్ చేశాను. ఏం చెయ్యకుండా ఉండడం నావల్ల కాలేదు.

నా చేతులు పట్టుకుని కళ్లలోకి చూసింది.

నువ్వు చేసిందాంట్లో తప్పేం లేదు. ప్రణయ్ చెప్పింది నిజం. ఐ డోంట్ వాంట్ టు థింక్ ఎనీ మోర్. నాతో వచ్చేస్తావా?

తను నా చేతిని గట్టిగా పట్టుకుంది. నన్నిక్కడ్నుంచి తీసుకెళ్లేంత ధైర్యముందా? అడిగింది.

ఆమెను తీసుకుని రూంలోనుంచి బయటకి వచ్చాను.

నేను ముందు నడుస్తుంటే ఆమె నా వెనుకే ఫాలో అవుతోంది. ఇదే సినిమా అయ్యుంటే బ్యాగ్రౌండ్‌లో సన్నాయి మేళం మోగించుండేవాళ్లేమో!

కారిడార్ దాటి మెట్ల దగ్గరకు చేరుకున్నాం. మెట్లు దిగితే పెళ్లి మంటపం. అంతా హడావుడిగా ఉంది. మెట్లు దిగుతుంటే ఆమె ఫ్రెండ్స్ ఎవరో ఎదురయ్యారు. ఎంత బావున్నావో అని ఆపి ఆమెను ముద్దాడారు. ఆమె ఇబ్బందిగానే ఆగింది. ఇంకొన్ని మెట్లు దిగాం. చంకలో ఒక పిల్లవాడ్నేసుకుని ఒకావిడ ఎదురొచ్చింది. ఎక్కడికే ఈ టైంలో? ఎవరితను? కొంపతీసి నీ బాయ్ ఫ్రెండ్‌తో లేచిపోతున్నావా ఏంటి? అని నవ్వుతూ ముందుకు వెళ్లిపోయింది. మెట్లు దిగి హాల్లోకి వచ్చాం. హాలు నిండా జనాలు. పిల్లలు హాలంతా హడావుడి చేస్తూ తిరుగుతున్నారు. ఎదురుగా సూటేసుకున్న ఒక పెద్దాయన వచ్చాడు. బాసికం పెట్టుకోలేదా ఇంకా? అని ఎవర్నో పిలిచి రూంలోకి వెళ్లి బాసికం తీసుకురండి అని ఆర్డర్ వేశాడు. కొంత మంది ఆడవాళ్లు వచ్చి గుంపుగా చేరారు. అబ్బా ఎప్పుడూ నీకు ఫ్రెండ్సేనా? ఇంకాసేపట్లో నీ పెళ్లి. మేకప్ కాకుండా ఇక్కడేం చేస్తున్నావ్? అని అడిగారు.

ఆమె చేతిని గట్టిగా పట్టుకుని జనాల్లోనుంచి ముందుకు కదుల్తానే ఉన్నాను. ఎవరో ఒకరు మమ్మల్ని ఆపుతూనే ఉన్నారు. ఇంకో పది అడుగులు వేస్తే హాలు బయటకొచ్చేస్తాం. ఒక్కొక్కరూ ఎదురవుతున్న కొద్దీ ఆమె పట్టు జారిపోతోంది. నేను ఆమె చేతిని ఇంకా గట్టిగా పట్టుకున్నాను. ఎంత గట్టిగా పట్టుకుంటే అంత ఎక్కువగా రాలిపోయే ఇసుకలా ఆమె చేయి నా చేతిలోనుంచి జారిపోతూనే ఉంది.

ఎక్కడో ఒక శాండ్ క్లాక్‌లో ఇసుక ఒక అరలోనుంచి మరో అరలోకి మెల్లగా జారిపోతోంది.

దాదాపు మెయిన్ డోర్ వరకూ మేము చేరుకునే సరికి ఆమె చెయ్యి పూర్తిగా నా చేతిలోనుంచి జారిపోయింది.

వెనక్కి తిరిగి చూసే ధైర్యం కూడా నాకు లేదు. అలాగే ముందుకు నడుస్తూ హాలు బయటకు వచ్చాను.

నన్నిక్కడ్నుంచి తీసుకెళ్లేంత ధైర్యముందా?

ఆమె అడిగిన ప్రశ్న నా చెవుల్లో మారుమ్రోగుతోంది.

నిజమే నాకు ధైర్యం లేదు. అందరిముందు తనని ఇబ్బంది పెట్టే ధైర్యం లేదు.


ఆగకుండా నడుస్తూనే ఉన్నాను. రిసార్ట్ వదిలి మెయిన్ రోడ్‌లోకి వచ్చాను.

త్వరగా వెళ్లిపోవాలి. దూరంగా వెళ్లిపోవాలి. ఎవరైనా నా బాధ వినేవాళ్లుంటే నా బాధంతా చెప్పుకోవాలి.

వేగంగా నడుస్తుంటే నాకెందుకో ఢిల్లీ ఫ్లైట్‌లో వస్తున్నప్పుడు నా పక్కన కూర్చుని నాతో మాటలు కలపాలనుకున్న వ్యక్తి గుర్తొచ్చాడు. ఢిల్లీకి తిరిగి వెళ్లే ఫ్లైట్‌లో అతను కనిపిస్తే, ఈసారి అడక్కుండానే అన్నీ ధైర్యంగా చెప్పేస్తాను.

జారిపోయే నా పదాలకూ ధైర్యం నేర్పిస్తాను.

✦✦✦




# కె.వి. కరుణ కుమార్

శ్రీకాకుళం జిల్లా పలాస దగ్గర ఓ గ్రామం నా స్వస్థలం. పదోతరగతితో చదువాగి పోయినా... చదవటం ఆపలేదు. మనుషుల్ని, స్నేహితులని వెతుక్కోవటంలో పుస్తకం సహాయపడింది. నా శ్రీమతికి రాసిన ప్రేమలేఖ మొదటి రచన. కొన్ని కథలు వ్రాశాను. కొన్ని సినిమాలకు పనిచేశాను. ట్రావెల్ఎక్స్పర్ట్ వృత్తి. సినిమా గమ్యంగా ప్రయాణం. ప్రేమలోని తీవ్రత మూడు దృక్కోణాల్లో చూపే కథగా ఇది వ్రాశాను.

‘నీదెలాంటి ప్రేమ?’

‘నాదా... నా కూతుర్నేమైనా చెయ్యాలనుకుంటే ఆడినే చంపేద్దామనుకునే ప్రేమ.’



# జింగిల్ బెల్స్

డిసెంబర్ 15. సంవత్సరం అప్రస్తుతం.

ఆటోనగర్... విశాఖపట్నం...

ముదునూరి కెమికల్స్‌కు దగ్గరలో ఉన్న టీ కొట్టు

మధ్యాహ్నం 3.20

వాళ్లిద్దరూ చాలా కాలం తర్వాత కలుసుకున్నారు. చాలా కాలం అంటే ఓ నాలుగేళ్ల తరువాత.

'రెండు టీ, ఒక లైట్స్... నీకు కింగే కదా'

'లేదు... మానేశాను... టీ చాలు'

'మానేశావా? ఎప్పుడ్నుంచీ... బాగా కష్టం కదరా... ఎలగ మానేసావ్రా బాబూ?'

'పాప ఇంటర్‌లో జాయినయ్యాక ఒక రోజు చెప్పింది రా... నా దగ్గర వాసన నచ్చట్లేదని... మానీసా... ఇంట్లో అంతా కులాసేనా'

'అంతా హ్యాపీరా... ఇంకేటి సంగతులు... ఏటి సడన్ దర్శనం'

'...........'

'ఏట్రా... ఏటైంది'

'...........'

'ఫోన్ చేస్తావు. కలవు. నాలుగు సవంత్సరాల తర్వాత సెలవు పెట్టుకోని కలడానికి ఇంత దూరం వచ్చి... మాట్లాడవేట్రా'

....... ....... ....... .......

'డబ్బులేమైనా కావాలా? డబ్బులే అయితే ఇప్పుడు కొంచెం టైట్‌లో ఉన్నాను.. సారీ... ఇంకో రెణ్ణెల్ల వరకు సాయం చెయ్యలేను'

'డబ్బుల పని కాదులే... పిల్లలు బా చదూతున్నారా?

'ఇంత దూరం అది తెల్సుకోటానికొచ్చావా. పెద్దోడు బి కామ్ ఫస్టీరు, రెండో వోడు ఇంటర్'

'అదృష్టవంతుడివి... ఆడపిల్లల్లేరు నీకు'

'సర్లే... మగ్గుంటల టార్చర్ నీకు తెలీదు. ఇంతకీ ఏం పనిమీదొచ్చావో చెప్పట్లేదు'

'కె సి ఎన్ కావాలి'

'ఏటీ'

'అదే... పొటాషియమ్ సైనేడ్... ఒక ట్వంటీ గ్రామ్స్ కావాలి'

'నీ యబ్బ... జోకులెయ్యకు. సైనేడ్ తిని సచ్చిపోయినంత కష్టం నీకేట్రా'

'నేంచచ్చిపోడానిక్కాదు...'

'ఏట్రా... నిజంగానే అడుగుతున్నావా'

సీరియస్ రా'

'బుర్ర పాడైపోయిందేట్రా. ఊర్లో ఉండి కలకుండా... సడన్‌గా నాలుగేళ్ళ తర్వాతొచ్చి సైనేడ్ అడుగుతే ఏటనుకోవాలి. ఎవర్ని సంపేస్తావ్? జీవితంలో ఎవర్నైనా కనీసం గూబ మీద ఒకటి కొట్టావా? నన్ను బొక్కలో తోసే ప్రోగ్రాం పెట్టుకున్నావా?

'లేదు... నాకు చాలా అవసరం. ఎంత డబ్బైనా ఇస్తాను. నాకెక్కువ టైం లేదు.'

....... ....... ....... .......

....... ....... ....... .......

....... ....... ....... .......

....... ....... ....... ....... సరే... నేనివ్వకపోతే నువ్వే ఎలాగైనా సంపాదించేలాగున్నావ్... సీనియార్టీ వేరేదానికి పనికొస్తాది కానీ... ఫ్యాక్టరీ నుండి సైనేడ్ తేటం అంత చిన్న పని కాదు. విషయం చెప్పు. రిస్క్ లేకపోతే ఆలోచిద్దాం'

చివరి గుక్క టీ తాగి అతను చెప్పటం మొదలుపెట్టేడు.

అదేరోజు సాయంత్రం

సంగం శరత్ జంక్షన్ పక్క సందులో అతను ఆ అబ్బాయిని కలిశాడు.

అప్పుడే మాట్నీ వదిలారు. బయటికొస్తున్న జనాలు, బైకులు, కార్ల హారన్లు ఫస్ట్ షో కి తయారవుతున్న మనుషుల హడావిడి రొదల మధ్య వాళ్ళు ఎవరి గమనింపులో లేకుండా మాట్లాడుకున్నారు.

'ఇంకోసారి ఆలోచించండి అంకుల్'

'బాగా ఆలోచించాను. నెలకు రెండో మూడో పేపర్లో చదువుతున్నాం కదా. ముందే జాగ్రత్త పడాలి. ఒక్కగా నొక్క కూతురు'

'కరెక్టే. వర్కౌట్ అవుద్దంటారా'

'మనమిద్దరం అనుకుంటే అవుద్ది. నీకు ఈ పని చేసే ధైర్యం ఉందా'

'....... .......'

'పర్లేదు... ఆలోచించుకో... వీలయితే సాయం చెయ్. లేకపోతే ఎవరికీ చెప్పకు. బయల్దేరుతాను మరి.'

'నేను వాడిని చూశానంకుల్... మీరు చెప్పినట్లు జరిగితే రిస్క్ లేకపోవచ్చు. నేను రెడీ'

'సరే మనం మళ్ళీ కలుద్దాం'

'మీరు ఆంటీకి చెప్పకండి. ఇది మనిద్దరి మధ్యే . . . .'

డిసెంబర్ 11. అంజలి ఎంటర్ ప్రైస్, పూర్ణామార్కెట్, విశాఖపట్నం.

సాయంత్రం 5.00 గంటలు

వాడు, వాడి ఫ్రెండు  అంజలి ఎంటర్ ప్రైస్‌లో యాసిడ్ బాటిల్ కొనుక్కుని బయలుదేరారు. టూ వీలర్ బారెక్స్‌ను దాటుతుండగా ఫ్రెండు అడిగాడు.

'నిజంగానే పోస్తావా'

'నా సంగతెత్తెలీదా'

'కేసవుతుందిరా'

'టూ ఇయర్స్ నుండి దానెనక తిరుగుతున్నాను. ఫోజు దొబ్బుతుంది'

ఇది బాత్రూంలు కడిగే యాసిడ్‌రా మాయ్యా. ఏటవ్వదు'

'మరి దాని పీక్కోసీమంటావా?  అదంతా మనవల్ల అవ్వదు. ఇద్దైతే దూరంనుండే పోసీవొచ్చు.  పోస్తే కనీసం కళ్ళు పోతాయి. మొకమంతా దొబ్బుద్ది .... .... ... అయినా అది తెలివైంది. అందాకా తెచ్చుకోదులే... ఇది చూపించి మళ్ళీ వార్నింగిస్తే దెబ్బకు ఐ లవ్యూ అంటాది.'

'మొన్నే బాగ బెదిరిపోయింది రా... పాపం రా... దానికిష్టం లేదేమో... వదిలేరా మాయ్యా... ఎంత మంది లేరు... నీకేటి తక్కువ.'

'నా బాదా అదే కదా. నాకేటి తక్కువ. నాకు అది కావాలి. నాకు కాకపొతే ఇంకెవడితోనూ దానికి పని కానివ్వను.'

'ఇదంతా పని కోసమా... ప్రేమిస్తానన్నావ్ కదరా'

'రెండూ ఒకటే... నీకర్థం కాదులే'

'వద్దురా... రిస్క్ రా...'

'మరెందుకు ఊపుకుంటూ నాతో వచ్చావ్. బయట ఏం జరుగుతుందో చూడు. పదిరోజులు ఫాలో అయితే బ్లాక్ టికెట్ నాకొడుకులకి పడిపోతున్నారు. ఇంటర్ అమ్మాయిల్లో సకం మందికి ఆటోడ్రైవర్లే లైనేసుకుంటున్నారు. ఒప్పుకోకపోతే హ్యాపీగా పీకలు కోసేస్తున్నారు. నేనేం చంపాలనట్లేదు. ప్రేమిస్తే ఒకే... లేకపోతే దాని మొకం మీద యాసిడ్ పోసి జైల్లో పీజీ  కంప్లీట్ చేసేస్తా. అది మాత్రం ఇంకొకడికి దక్కకూడదు.

'ప్రేమిస్తే ఇలాగ మాట్లాడకూడదు మాయ్యా. కొద్దిగ ఓపికపట్టు. చదువుకుంటుంది కదా'

'అది బావుంటాదిరా... చర్చిలో అదే టాప్ ఫిగరు. ఎవడో ఒకడు లాగేస్తాడు. తర్వాద్దొరకదు. నాదీ లవ్వే. లవ్ చేసాను. టూ ఇయర్స్ తిరిగాను. ఎంతకీ ఒప్పుకోదు.. చాల్రా బాబు... నాకోపిక లేదు.'

'నువ్వింత సీరియస్ అనుకోలేదు మాయ్యా. నాకు భయమేస్తుందిరా. అది ఆళ్ళింట్లో చెప్తే కంపైపోది.'

'చెప్పుంటే... ఈ పాటికి ఆళ్ళ నాన్న కంప్లైంట్ ఇచ్చేవోడు.. లేదా నన్నడిగీ వోడు... లేకపోతే మా ఇంటికొచ్చి గొడవ చేసీవోడు కదా.. చర్చిలో కనిపిస్తే నవ్వుతున్నాడు. అంటే చెప్పలేదనే కదా.'

'.......వద్దురా... నాకెందుకో కరక్ట్ కాదనిపిస్తుంది మాయ్యా'

'ఇప్పుడిదే ట్రెండ్ రా... ఒప్పుకోకపోతే బెదిరించాల... లేకపోతే పనులు జరగవు. పేపర్ చదవట్లేదేటి? మొన్నే ఒకడు విజీవాడలో పిల్లని ట్యూషన్ దగ్గర నరికీసాడు. రాజమండ్రిలో ఇంకోడు పీకకోశాడు. ఇద్దరూ జంపు.'

'తర్వాత లైఫ్ నాశనం అయిపోద్ది కదరా... దానిదీ... నీదీ'

'నువ్వెక్కువాలోచించకు. నాకిదే కరక్ట్ అనిపిస్తుంది.'

'డైమండ్ పార్క్ దగ్గర ఆపీ... నేనెళ్ళిపోతాను'

'యాసిడ్ సంగతి ఎవరికైనా చెప్పావని తెలిసిందంటే ఫ్రెండువని చూడను. సగం నీ మీద పోసేస్తాను.'

'అలాక్కానీ... బై'

డిసెంబర్ 12. ఆశీలు మెట్ట జంక్షన్. ఫోర్సీజన్స్ బేకరీకి ఎదురుగా పెట్రోల్ బంక్ దగ్గరలో బస్టాప్

సమయం : ఉదయం 7.30

షేర్ ఆటోలోంచి ఆమె కాలేజ్ బ్యాగ్ తో దిగింది. పరుగులాంటి నడకతో కాలేజ్ వైపు వెళ్తూ, మెయిన్ రోడ్ నుండి ఎడమవైపుకు తిరుగుతుంటే..., ఎప్పటినుండి ఎదురుచూస్తున్నాడో వాడు బైక్ మీదనుంచి దిగి ఎదురొచ్చాడు. చేతిలో కర్చీఫ్‌తో చుట్టి కనపడకుండా ఉన్న యాసిడ్ సీసా. అది చూడగానే ఆమె కాళ్ళూ, చేతులూ వణికాయి... మోకాల్లో మూలుగంతా చచ్చుబడిపోయినట్లు ఒక విధమైన నీరసం

ఆవరించింది. ఆమె భయంతో బిక్కచచ్చిపోయింది. దారిన పోయే విశాఖ పౌరులు ఒకరిద్దరు సెల్ ఫోన్‌లు తీసి వీడియో కెమెరాలను రెడీ చేసుకుంటుండగా... వాడు చాలా నింపాదిగా మొదలుపెట్టాడు.

'యాసిడ్ కూడా కొనీసాను. ఏటాలోచించావ్'

'నీకు దండం పెడతాను. నన్నొదిలెయ్'

'మాటంటే మాటే... లాస్ట్ వీక్ పేపర్ చదివావా... రాజమండ్రిలో ఒకడు పీక కోసీసి జంపైపోయాడు. అది చచ్చిపోయింది.నీకలక్కాదు. లైఫంతా అద్దం చూసుకున్నప్పుడు నేను కనిపిస్తాను. క్రిస్మస్ వరకే నీకు టైం. ఇరవయ్యారో తేదీ ఇలా మాట్లాడాను. మొఖంమీద పోసీసి ఫోర్త్ టౌన్ కెళ్ళి లొంగిపోతాను. ఏటంటావ్ ?

అదే రోజు. బాలయ్య శాస్త్రి లేఔట్ మెయిన్ రోడ్ మీద బేకరీ

సాయంత్రం 4.00 గంటలు

'ఏమైంది. ఏడుస్తున్నావేంటి?'

'......'

'మాట్లాడు.. ఏం జరిగిందో నాకెలా తెలుస్తుంది'

'భయంగా ఉంది. నీకు చెప్పకపోవటం తప్పే. రెండు సంవత్సరాలుగా వెంటబడుతున్నాడు. టెన్త్‌లో నాకు స్కూల్ ఫస్ట్ వచ్చిందని చర్చిలో గిఫ్ట్ ఇచ్చారు. అప్పుడొచ్చి షేక్ హ్యాండ్ ఇచ్చాడు. ప్రతి సండే చర్చిలోనే పలకరించేవాడు. కోయర్‌లో కీబోర్డ్ వాయిస్తాడు. ఫ్రెండ్లీగా నవ్వేదాన్ని. లాస్ట్ ఇయర్ క్రిస్మస్‌కు ప్రపోజ్ చేసాడు. నాకిష్టం లేదని చెప్పేశా.'

'ఉ...'

'తర్వాత మెల్లగా హెరాస్ చెయ్యటం మొదలుపెట్టాడు. ఫాలో అవ్వటం. బస్‌లో వెనకాల నిలబడటం. నాకిష్టం లేదని చెప్తూనే ఉన్నాను. లాస్ట్ త్రీ మంత్స్ నుండి చాలా హెరాస్ చేస్తున్నాడు.'

'ఎక్కడుంటాడు?'

'సీతంపేట. వాళ్ళ నాన్న మా చర్చ్ కమిటీలో మెంబర్'

'మరి మీ నాన్నకు చెప్పలేదా'

'ఊహూ... చెప్తే నాన్న మీద కూడా ఆసిడ్ పోస్తానని బెదిరిస్తున్నాడు. ఆల్రెడీ యాసిడ్ బాటిల్ పట్టుకుని తిరుగుతున్నాడు.'

'నాకు చెప్పటానికేమైంది?'

'నువ్వు పరిచయం కాకముందునుంచే జరుగుతుంది. చెప్పాను కదా. టూ ఇయర్స్ నుండి అని. వాడే ఓవర్ ఏ పీరియడ్ ఆఫ్ టైం వదిలేస్తాడు అనుకున్నా... చాలా భయంగా ఉందిప్పుడు.'

'పోలీస్ కంప్లైంట్ ఇవ్వొచ్చుగా.'

'ఊహు... కేసంటే అల్లరైపొద్ది. కాలేజీకి పంపరు. చదువాగిపోతుంది. చదూకోవాలి'

'మనిద్దరి సంగతి తెలుసా వాడికి... నేనొకసారి మాట్లాడుతా'

'వద్దు. కొబ్బరితోట, అల్లిపురం బాచ్‌లతో తిరుగుతాడు వాడు. నీకోసం తెలిస్తే నిన్ను కూడా ఏమైనా చెయ్యొచ్చు'

'మరేం చేద్దాం '

'ఏమో'

'ఓ పని చెయ్. మామూలుగా కాలేజ్ కెళ్ళు. క్రిస్మస్ వరకు టైం ఇచ్చాడు కదా. వాడేమైనా చేస్తాడో లేదో క్రిస్మస్ వరకు తెలీదు. నువ్వు కూడా అప్పటిదాకా నన్ను కలొద్దు. ఫోన్ లో టచ్‌లో ఉందాం. ఈ ఆదివారం మీ చర్చికొస్తాను. వాడిని ఒకసారి చూడాలి. కీబోర్డ్ వాయిస్తాడా?'

'ఉ.... ఏం చేస్తావ్... వద్దన్నాను కదా. గొడవ పెట్టుకుంటే చర్చ్ అంతా తెలిసిపోతుంది. ఇంకా కాంప్లికేట్ చెయ్యకు ప్లీజ్'

'హలో దేవుని బిడ్డా–ఒక్క మాట మాట్లాడను సరేనా. ఎలా ఉంటాడో చూస్తాను. గొడవ పెట్టుకోవటానికి నేనేమైనా సినిమా హీరోనా?

'.......'

'అబ్బా... నవ్వావా... టెన్షన్ పడకు... బయల్దేరు'

'బై'

ఆమె వెళ్ళిపోయాక., ఆమె తాగకుండా వదిలేసిన కూల్ డ్రింకును తాగి తనతో పాటు పదో తరగతి వరకు కలిసి చదువుకున్న రెల్లివీధి ఫ్రెండ్ కు ఫోన్ చేసాడు.

డిసెంబర్ 13. పోర్ట్ క్వార్టర్స్, విశాఖపట్నం

సమయం: ఉదయం 8.30

అతను జనరల్ షిఫ్ట్‌కు బయల్దేరుతూ... కూతురు ఇంకా మంచం మీదే ముసుగుతన్ని పడుకోవటం చూసి ఆశ్చర్యంతో.., పేపర్ చదువుతూ దోశలు తింటున్న భార్యను అడిగాడు.

'పాప కాలేజ్ కెళ్లలేదా'

'ఊహూ. నిన్నటినుంచి డల్లుగా ఉంది. ఏమైంది అంటే చెప్పదు. ఒంట్లో బాలేదేమో'

'హాస్పిటల్‌కు తీస్కెళ్ళనా?'

'అడిగాను. వద్దంది'

'ఏమైందో కనుక్కో... ఫోన్ చెయ్. హాఫ్ డే లీవ్ పెట్టి వచ్చేస్తాను. వినపడుతుందా... పరీక్షలకు ప్రిపేర్ అయినట్లు పొద్దున్నే పేపర్ అంత దీక్షగా చదువుతున్నావ్'

'ఏముంటుంది చదవటానికి... అంతా దరిద్రం. ప్రేమించలేదని పిల్లని , పిల్ల పేరెంట్స్‌ని కత్తితో పొడిచేశాడంట. విజయవాడలో. అప్పుడు శ్రీలక్ష్మి. ఇప్పుడు పిల్లలు, ఆడపిల్లల్ని కన్నందుకు తల్లితండ్రులు'

'.... ...... ...... ...... ...... ...... ...... ... సరే... దాన్ని లేపి టిఫిన్ తినమని చెప్పు. నేనెళ్తున్నా...

'వెళ్ళస్తానని చెప్పటం రాదు. రోజూ చెప్పాలి. జాగ్రత్త. దానికోసం కంగారొద్దు. నిద్ర లేదు. ఏం ఇంటర్మీడియట్లో... పిల్ల ప్రాణాలు తీస్తున్నారు. హాస్పిటల్‌కు తీసుకెళ్లాలంటే నేను తీసుకెళ్తాను. మీరు కంగారుపడకండి. ఫోన్ చేస్తాను.'

పాపా... లేవవే... ఏదీ చూడనీ... ఒంట్లో బాలేకపోతే చెప్పూ... మీ నాన్న సాయంత్రం వచ్చేటప్పటికి ఇలా ఉన్నావంటే నన్ను తిడతారు.'

డిసెంబర్ 13. కె జి హెచ్ డౌన్ లో బీచ్ రోడ్డు

సమయం : ఉదయం 9.10

అతను చేతక్ పార్క్ చేసేటప్పటికి వాళ్లిద్దరూ అతని కోసమే ఎదురుచూస్తున్నట్లు చెయ్యెత్తి 'మేమే' అన్నట్లు సైగ చేశారు. వాళ్ళను ఇంతకుముందు చూసింది లేదు. అతను సంశయంగా వాళ్ళ దగ్గరకు వెళ్ళాడు.

'నేనే అంకుల్ మీకు ఫోన్ చేసింది. మీ అమ్మాయి ఫ్రెండ్‌ని.  నా పేరు... గీతమ్‌లో బీ టెక్ చేస్తున్నాను... దొండపర్తిలో ఉంటాను. వీడు నా ఫ్రెండు... ఇక్కడే రెల్లి వీధి.'

'ఏదో అర్జెంట్ విషయం అన్నారు బాబూ. నేను పోర్టులో చేస్తాను. డ్యూటీకెళ్ళాలి. సంగతి చెప్పండి.'

'మీ అమ్మాయి కోసమే కొంచెం మాట్లాడాలి'

'దేని గురించి'

ఆ తర్వాత ఇరవై నిముషాలు వాళ్ళు మాట్లాడుకున్నారు. అతను సెలవు తీసుకున్నట్లుగా వెనుతిరిగి మళ్ళీ ఏదో గుర్తొచ్చినట్లు ఆగాడు.

'నాకు తెలిసినట్లు దానికి తెలియనివ్వకు బాబూ... నీతో టచ్‌లో ఉంటాను'

'మీరు కూడా ఇంట్లో ఆంటీకి చెప్పకండి. టెన్షన్ పడతారు'

'థాంక్ యు. పదిహేనో తేదీ కలుద్దాం. నేను ఫోన్ చేస్తాను'

డిసెంబర్ 18. ఫాదర్ క్వార్టర్, ఇన్ఫెంట్ జీసస్ చర్చ్. సీతమ్మధార.

సమయం : రాత్రి 7.10

'ప్రెయిజ్ ద లార్డ్ ఫాదర్'

'ప్రెయిజ్ ద లార్డ్. కూర్చోండి. చెప్పండి.'

'క్రిస్మస్ నైట్ ప్రేయర్ తర్వాత కేక్స్ పంచాలనుకుంటున్నాము. పర్మిషన్ తీసుకోవాలని'

'ఆల్రెడీ ఎవరో కేక్స్, రోజ్ కుకీస్ పంచుతున్నట్లున్నారు. మీరు మనీగా ఇవ్వండి. చాలా కార్యక్రమాలు ఉన్నాయి. వాటికి పనికొస్తాయి. మీ పేరు చదువుతాం'

'మనీ ఇస్తాను ఫాదర్. అది ప్రాబ్లెమ్ కాదు. రెండునెలలక్రితమే ప్రమోషన్ వచ్చింది. సంవత్సరానికి చర్చికి సరిపడా సాంబ్రాణి, క్రిస్మస్ నైట్ ఆల్మండ్ కేక్స్ పంచుతానని మొక్కుకున్నాను. అందుకే'

'ఓ ఫైన్... అలాగే కానివ్వండి. పాప ఎలా ఉంది. ఈ మధ్య చర్చ్‌కు రావటం లేదా'

'మార్నింగ్ మాస్‌కు వచ్చి వెళ్ళిపోతోంది. ఇంటర్ కదా... చాలా కష్టపడి చదువుతోంది.'

'ఇంటర్‌లో కూడా టెన్త్‌లా మార్కులొస్తే చర్చ్‌కు మంచి పేరు. బాగా చదవమని చెప్పండి'

'ఉంటాను ఫాదర్ '

'గాడ్ బ్లెస్స్ యు '

డిసెంబర్ 24. ఇన్ఫెంట్ జీసస్ చర్చ్

సమయం : రాత్రి 11.55

'పరవశించి పాడనా పరమ తండ్రి పుట్టెను... శిరము వంచి వేడనా చిన్నారి బాల యేసును'

వంద గొంతులు పైగా లయబద్ధంగా పాడుతుంటే వాడు ఆ పాటకు తగినట్లు కీబోర్డ్ పైన వేళ్ళ ను కదిలిస్తున్నాడు. చర్చ్ అంతా కొవ్వొత్తులతో, కొత్తబట్టలతో, మెరిసే మొహాలతో వెలిగిపోతోంది. హెూలీ వాటర్ జల్లబడింది. పాట ముగిసింది. ఉత్సాహం ఉరకలేసింది. కొవ్వొత్తుల వెలుగుకు దీపాల కాంతి తోడైంది... వెలుగు... వెలుగు... క్రీస్తు పుట్టిన రోజు వెలుగు... లోకానికి వెలుగు 'హ్యాపీ క్రిస్మస్' ఎలుగెత్తిన సంతోషపు అరుపు. చప్పట్లు... తెల్లని బట్టల్లో దేవదూతల్లాంటి ఆడపిల్లలు లయబద్ధంగా తలలూపుతూ... మళ్ళీ పాట మొదలయ్యింది.

'జింగిల్ బెల్స్... జింగిల్ బెల్స్ జింగిల్ ఆల్ ద వే... ఓ వాటే ఫన్...'

పరిచయం లేని మొహాలు కూడా పలకరించుకుంటున్నాయి. సంతోషం. ఆలింగనాలు. కొత్తకోకల కోసం ఆరాలు తీస్తున్న ఆడవాళ్లు. నిద్ర మత్తును లెక్కచెయ్యని పిల్లలు. రకరకాల సెంటు వాసనలన్నీ గాల్లో కలిసి ఏర్పడిన ఒక వింత పరిమళం. ఆనకట్ట గేట్లు ఎత్తివేసినంత ఉత్సాహం.

'ప్రియ దేవుని బిడ్డలారా. పూజ సమాప్తమైనది. సమాధానంతో వెళ్లి దేవుని ప్రేమలో జీవించండి. దయచేసి అందరూ దాతలు పంచుతున్న కేకులు, తినుబండారాలు

తీసుకుని వెళ్ళవలసిందిగా కోరుచున్నాము' ఫాదర్ మైక్‌లో అనౌన్స్ చేస్తున్నారు. అట్టపెట్టెల్లో ఉన్న కేకులు ముగ్గురు వాలంటీర్లు పంచుతున్నారు. ఒకామె రోజ్ కుకీస్ పంచుతోంది. పిల్లలకి మాత్రమే ఒకరు చాక్లేట్లు పంచుతున్నారు. అవి అందుకున్న పిల్లల మొహాల్లో పూసిన నవ్వులో ఏసుక్రీస్తు కనిపిస్తున్నాడు.

వాడు కీ బోర్డును నల్లటి సంచీలో సర్ది ఆమె ఎక్కడుందో అని గుంపులోకి చూపును పంపించాడు. కనిపించింది. చర్చిలో వెలుగుతున్న దీపాలు తరిమికొట్టిన చీకటంతా తన మోహంలో నింపుకుని కూర్చుని ఉంది. మనిషి పీక్కుపోయింది. వాడు నవ్వుకున్నాడు. 'బెదిరిపోయింది. ఈరోజు ఎలాగైనా చెప్తుంది. లేకపోతే రేపో ఎల్లుండో... దాని మొహాన్ని నాశనం చేస్తాను' అని ఒకటికి రెండుసార్లు అనుకున్నాడు. బ్యాగ్ లోంచి వాటర్ బాటిల్ తీస్తున్నప్పుడు నీలం రంగు ముచ్చిలో చుట్టిన యాసిడ్ బాటిల్ చేతికి తగిలింది. వాడు బ్యాగ్ మూసి ఆమె దగ్గరకు వెళదామనుకుంటుండగా వినిపించింది.

'హ్యాపీ క్రిస్మస్ బాబూ... కేక్ తీస్కో' వాలంటీర్లతో ఒకడిగా ఆమె తండ్రి. కేకును చేతిలోపెట్టి ఎప్పటిలాగే నవ్వాడు.

వాడికి గక్కురుమన్నది. కానీ నవ్వేడు. ఆమె తండ్రి కేకులు పంచుకుంటూ వెళ్ళిపోయాడు. పిల్లా, పెద్దా అందరూ కేకులు తినటం చూస్తే వాడికి ఒక్కసారి అమితమైన ఆకలి కలిగింది. సాయంత్రం నుండీ ఏమీ తినలేదు వాడు. తొమ్మిది గంటలనుండి కొయర్లో వాయిస్తూనే ఉన్నాడు. ఆబగా తిన్నాడు. ఇంకో కేక్ ఉంటే బావుణ్ణనిపించింది. వాటర్ బాటిలెత్తి మొత్తం నీళ్లు ఖాళీ చేశాడు. కడుపులో బావున్నట్లనిపించింది. నోరంతా ఆల్మండ్ రుచి.

'అది కనుక ఐ లవ్యూ చెప్పకపోతే, దానిమొహం మీద యాసిడ్ పోస్తే, కేకిచ్చిన దాని బాబు రియాక్షన్ ఎలా ఉంటుందో' అని అనుకుంటూ ఆమె వైపు అడుగులేశాడు. కొయర్ డయాస్ దిగుతుండగా మొదట కలుక్కుమంది. ఒళ్ళంతా ఒకసారి జలదరించింది. తర్వాతి సెకనుకు ఊపిరితిత్తులను ఎవరో పటకారుతో నొక్కినట్లనిపించింది. గుప్పుమని ఒళ్ళంతా చెమట పట్టింది. చుట్టూ చూశాడు. జనాలు హ్యాపీ క్రిస్మస్‌లు చెప్పుకుంటూ కేకులు తింటున్నారు. తినని కేకుల్ని కొంత మంది హ్యాండ్ బాగుల్లో సర్దుతున్నారు. కోలాహలంగా ఉంది. చర్చి పక్కరోడ్డులో ఒకేసారి బయలుదేరిన వాహనాల హారన్లు వినిపిస్తుండగా వాడికి ఊపిరి పీల్చుకోవటం కష్టమైంది. దబ్బున పడిపోయాడు. కళ్ళకు మసగ్గా అప్పుడే పుట్టిన బాలయేసు విగ్రహం కనిపిస్తోంది. ఎవరో కేకేశారు.

'ఏయ్... అటు చూడండి... ఆ అబ్బాయి'

తర్వాత వాడికేమీ వినిపించలేదు. కనిపించలేదు.

చర్చికి కూతవేటు దూరంలో ఉన్న ఏ ఎం జీ హాస్పిటల్‌కు వాడిని తీసుకెళ్తుండగా దారిలోనే వాడు చచ్చిపోయాడు.

కాసేపటికి వాడి ఒళ్ళు రంగు మారిపోయింది. సైనేడ్ తిని చనిపోయాడని డాక్టర్లు చెప్పారు. కొంతసేపటికి పోలీసులొచ్చారు.

ఆ తర్వాత రోజు పోస్టుమార్టం జరిగింది. వాడి బ్యాగులో యాసిడ్ బాటిల్ని, కొంత గంజాయిని, ఒక పొట్లంలో ఉన్న పొటాషియం సైనేడ్‌ని పోలీసులు స్వాధీనపరుచుకున్నారు.

డిసెంబర్ 31. ఉడా కాంప్లెక్స్ పార్కింగ్ దగ్గర

సమయం : రాత్రి 11.30 దాటింది.

దగ్గర్లో ఉన్న వాల్తేర్ క్లబ్ లో జరుగుతున్న న్యూ ఇయర్ ఈవెంట్ శబ్దాలు గట్టిగా వినిపిస్తున్నాయి. వాళ్లిద్దరూ కార్లో బీరు తాగుతున్నారు.

'ఎలగ సచ్చిపోయాడ్రా? పేపర్లో రోజూ అదే న్యూసు. బుర్ర పాడైపోతుందిరా బాబు'

'ఆడి ఫ్రెండే పోలీసులకి చెప్పాడు కదా. యాసిడ్ కొన్నాడంట. సైనేడ్ ఉందంట. యాసిడ్ పోసే ధైర్యం చెయ్యలేక సూసైడ్ చేసుకున్నాడంటన్నారు పోలీసులు.'

'మరి నువ్వు, ఆ పిల్ల నాన్న పదిహేనో తేదీ కలుస్తానన్నారు. మీరిద్దరే ఏదో చేస్తారని అనుకున్నాన్నేను'

'నువ్వేదైనా చేస్తావేమో అని నీకు చెప్తే నువ్వే ఏంచెయ్యలేననీశావ్. వాడు డేంజర్ గాడ్రా. ఆసిడ్లు, సైనేడ్, కత్తులు, గ్యాంగ్‌లు... మేమేం చేస్తాం. విషయం చెప్తే అంకుల్ కొంచెం జాగ్రత్త పడతాడని చెప్పాను. పదిహేనునాడు అంకుల్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇద్దామనుకున్నాడ్రా... మళ్ళీ దూబ ఎందుకనివ్వలేదు. అన్నిటికీ ప్రభువే ఉన్నాడు అని చెప్పెల్లిపోయాడు. చూశావా... దేవుడున్నాడ్రా... లేకపోతే ఆడు చర్చిలోనే సూసైడ్ చేసుకోడమేంటి? ఆడుంటే నాకు చాలా కష్టమయ్యేది. ఆ పిల్ల కూడా నరకం చూసుండేది.'

'సర్లే... నీకు లైన్ క్లియరయ్యింది కదా'

'అదే. ఆ పిల్ల ఇప్పుడు హ్యాపీగా ఉంది. చాలా భయపడింది. తిండి లేదు. నిద్ర లేదు. వాళ్ళ మాయ్య గారింటికి ఏలూరు పంపేద్దామనుకున్నారంట'

'సర్లే... అంకుల్‌కు నీ మీద ఒక మంచి అభిప్రాయం వచ్చింది కదా... ఇంతకీ నీ లవ్వు పరిస్థితేంటి'

'తనంటే నాకు ఎంత ఇదో నీకు తెలీదా. ప్రస్తుతానికి ఫ్రెండ్షిప్. తను కాంపిటీటివ్‌కు ప్రిపేర్ అవుద్దంట. అవన్నీ కానీ... ఇంకో రెండేళ్ల టైముంది. అప్పుడు చెప్తాను'

'టైమయింది... హ్యాపీ న్యూ ఇయర్ రా'

హ్యాపీ న్యూ ఇయర్ బావా. తనకు, ఆళ్ళ నాన్నకు కూడా ఫోన్ చేసి విష్ చేసి రెండో బీర్ ఓపెన్ చేద్దాం.'

జనవరి 1. పోర్ట్ క్వార్టర్స్, విశాఖపట్నం

ఆహ్లాదకరమైన సాయంత్రం.

ఆడవాళ్లు , పిల్లలు హాల్లో కూర్చుని తంబోలా ఆడుకుంటున్నారు. మగవాళ్ళిద్దరూ ఇప్పుడే వస్తామని చెప్పి వీధి చివర కిళ్లీ కొట్టు దాకా వచ్చారు.

'ఒక లైట్స్'

'నాకొక కింగ్ తీస్కో'

'మానీశానన్నావ్'

'నీతో కలిసి ఒక సిగరెట్ తాగాలనిపిస్తుంది... తీస్కో'

పొగను గాల్లో కలుపుతూ పార్క్ దగ్గరకొచ్చి నిలబడ్డారు. సిగిరెట్లు కాలిపోయాయి.

'దొరికిపోయుంటే?'

'నీ పేరు చెప్పేవోడిని కాదులేరా'

'అది సర్లే... ఒకటే అర్థం కాలేదు. అన్ని కేకుల్లో ఆడికి మాత్రం సైనేడ్ కేక్ ఎలా ఇచ్చావ్?'

'అమ్మాయి ఫ్రెండ్ ఒకబ్బాయి హెల్ప్ చేసాడు. ఆల్మండ్ కేకులన్నీ తెల్ల బట్టర్ పేపర్‌లో చుట్టించాను. ఆడి కేక్ మాత్రం పేపర్. బట్టర్ పేపర్ కాదు. ఆడికివ్వటానికి నిముషం ముందు ఈ అబ్బాయి తెచ్చిచ్చాడు. డబ్బాలో ఒక పక్కన పెట్టుకుని...' వివరించాడు.

‘బయమెయ్యలేదా?’

‘ఎందుకెయ్యదు. బాగ బయమేసింది. ప్రాణం తియ్యడం అంత సులభం కాదు కదా. పాపం చిన్న వయసు. చేతిలో విద్యవుంది. ఎంత బాగా కీబోర్డ్ కొడతాడో తెలుసా. కానీ ఆ భయంకంటే నా కూతురి మొకం యాసిడ్ వల్ల కాలిపోవడం తల్చుకుంటే బయమెయ్యలేదు. ఆడపిల్లలు లేరుకదా నీకు. అలోచించి చూడు నీక్కూడా బయమెయ్యదు. ప్రేమించకపోతే యాసిడ్ పోస్తానన్నాడు ఆడు. ఆడికి  నాకూతురిమీద ఆసిడ్ పొయ్యాలన్నంత ప్రేమ.  నేను హెల్ప్ చేస్తానన్నాడు ఇంకొకడు . ఆడికి  నాకూతురికి ఏం జరక్కుండా చూసుకోవాలన్నంత ప్రేమ...’

‘మరి ఆ అబ్బాయి ఈ విషయం బయట చెప్పడని గారంటీ ఉందా’

‘చెప్తే జైలుకి నాకు తోడొస్తాడు. అయినా అంత దైర్యం చెయ్యడు. ఆడికి నా ప్రేమ కోసం తెలిసుంటాది కదా’

‘నీదెలాంటి ప్రేమ’ ఆటపట్టించే ఉదేశ్యంతో అడిగాడు.

‘నాదా... నా కూతుర్నేమైనా చెయ్యాలనుకుంటే ఆడినే చంపేద్దామనుకునే ప్రేమ. ఏలూరు పంపిచేద్దామనుకున్నాను పాపను. కానీ ఆడు ఇంకెవరి మీదో యాసిడ్ పోస్తాడు. ఇంకెవడో పీక మీద కత్తి పెట్టి ప్రేమించమంటాడు. ఇంకొకడు రోజూ టార్చర్ పెడతాడు. ఏలూరు పంపిస్తే ఈ సమస్య తీరుద్దా? అందుకే ఆడినే పంపేశాను. తప్పో, రైటో... అంతే... మరింక ఈ టాపిక్ మాట్లాడొద్దు. ఇంకేటి సంగతి? ఇంకో సిగిరెట్ కాలుద్దామా’

‘నీ యబ్బ... మానీడం అంటే ఇదా’

డేట్, సమయం అక్కర్లేని ఒక మామూలు రోజు...

కాలేజీలో అప్పుడే క్లాస్ పూర్తయ్యింది. ఆమె ముత్యాల్లాంటి దస్తూరీతో కెమిస్ట్రీ రికార్డు రాస్తూ ఉంది.

పొటాషియమ్ సైనేడ్ బాదం రుచి, వాసన కలిగి ఉంటుంది. నీటిలో పూర్తిగా కరిగిపోతుంది. ఇరవై గ్రాములు లేదా ఆపైన పరిమాణంలో దీనిని తీసుకుంటే ఆరోగ్యకరమైన మనిషి 2 నుండి 5 నిముషాల్లోపు చనిపోతాడు. మొదట ఊపిరితిత్తులు పనిచేయటం మానేసి శ్వాస తీసుకోవటం కష్టమవుతుంది. అక్కడికి కొన్ని సెకెన్ల వ్యవధిలో మెదడు పనిచేయటం మానేస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా దీనిపైన జరిగిన పరిశోధనల్లో...

బ్యాగ్‌లోని ఫోన్ మోగింది

అటువైపు గొంతువినగానే మోహంలో నవ్వు తన్నుకొచ్చింది.

'ఈ రోజు కుదరదేమో... రేపు కలుద్దాం... బాలయ్య శాస్త్రి లే అవుట్ బేకరీ... మన రెగ్యులర్ మీటింగ్ పాయింట్'

అవతలి వైపు అతనేమో మాట్లాడుతున్నాడో కానీ ఆమె నవ్వుతూ రికార్డ్‌ను ఆపేసిన దగ్గర., మళ్ళీ రాయటం మొదలెట్టింది.

✦✦✦

# మళ్ళీ కలిసేదాక...

'ప్రేమ' అనే పదం మెదిలినప్పుడల్లా నాకు వేక్సినేషన్ గుర్తొస్తుంది. వైరస్ సోకి చావకుండా, అదే వైరస్‌ని కొంత మోతాదులో వేక్సిన్‌గా ఇస్తారు. ప్రేమా అంతే. ప్రేమే రోగం. ప్రేమే మందు. ఈ ప్రేమ కథల సమాహారం కూడా అంతే. ఈ కథలు చదువుతున్నప్పుడు కలిగిన పెయిన్‌కి, ఈ కథలే పెయిన్ రిలీవర్స్.

సంవత్సరాల నెంబరు మారుతుంది. నెలలు మాత్రం అవే. మారవు. మన జీవితంలో ఫేజెస్ మారుతుంటాయి. మనలో ప్రేమ 'ప్రెజెన్స్' మారదు. జనవరిలో వచ్చే సంక్రాంతి పండగ ప్రస్తావనతో మొదలైన 'ఇన్ ద మూడ్ ఫర్ లవ్' డిసెంబరులో వచ్చే క్రిస్మస్ వేడుకలు పూర్తి చేసుకుని, మళ్ళీ జనవరిని ఆహ్వానించింది. కలర్ వీల్‌లో ఉండే పన్నెండు రంగుల్లా పన్నెండు కథలు!

కులం, మతం, పెళ్ళి, సెక్స్, డబ్బు.. వీటిలో ఏదో ఒక పరీక్ష నాళికలో ప్రేమ కథల సఫలాలు, విఫలాలు తేల్చేస్తుంటాం. 'ఇవి కాక అసాధారణంగా నా కంటికి కనిపించిన వేరే కారణం ఈ ప్రేమ కథని రాయించింది' అన్న నాగేంద్ర కాశి మాట అతని కథకే కాదు, ఈ సంపుటిలోని ప్రతీ కథకూ వర్తిస్తుంది.

'ఆమె వెనకే ఉండాలని చేసిన ఆ పది అడుగుల ప్రయాణం జీవితంలోనే గొప్ప ప్రయాణం' అనే వాక్యం 'సత్యవేణి' కథలో చదివినప్పుడు, యవ్వనపు తొలి రోజుల్లో ఇన్‌స్టింక్ట్స్ చేసే హడావుడి గుర్తొస్తుంది. కథ చివర్లో సత్యవేణి వేసిన రెండు పెద్ద కేకలకి అక్షరాలు అలుక్కుపోయినట్టు కనిపిస్తాయి. ఓర్చుకుని, కళ్ళు తుడుచుకుని మళ్ళీ పుస్తకం చేతిలోకి తీసుకున్నాక; ఆరు వందల రూపాయలకి డ్రస్ అద్దెకు తెచ్చుకుని, తనని తాను ఎలా ప్రెజెంట్ చేసుకోవాలో తెల్సిన శ్వేత మెరుస్తుంది. అరేంజ్డ్ మారేజ్ చేసుకుని, భార్యకి వేలంటైన్స్ డే విషెస్ చెప్పే మర్యాదస్తుల లోకం ఇది. వేలంటైన్స్ డే నాడు ప్రపోజ్ చేయాలని అనిపించినా ఆగిన కృష్ణని, 'నీ నడుం చుట్టూ చేయి వేయడానికి కన్సెంట్ ఉందా?' అని అడిగే ఆ శ్వేతని చేస్తే, మనుషుల మీద కొత్త విశ్వాసం ఏదో పుట్టుకొస్తుంది.

'చూడటానికి ఒక సీతాకోకచిలుకలా ఉన్నా రంగులేకపోతే అది ఒక పురుగు మాత్రమే' అనుకున్న అబ్బాయికీ, చిమట రంగు వెనక రంగుల కథ అల్లిన అమ్మాయికీ.. పుట్టిన రెండో కథ జమా లెక్కల కొత్త తరం కుర్రాడు. పదాల మధ్య ఖాళీల్లా 'నల్ల అళగి' ఇచ్చిన స్పేస్ 'మూడో కథ' మనలో నింపని ఖాళిని గుర్తు చేస్తుంది. మోనోగమి, బైగమి, వాటిలో డొల్లతనం, వాటి వల్ల స్త్రీల సంఘర్షణ, ఏంత్రోపాలజి, సైకాలజి అంటూ నెత్తి పగిలే థియరీలు, ప్రాక్టికల్ సమస్యలు అంటని వర్ధనం, చిట్టిల మొగుడి ప్రేమే 'నిద్రగన్నేరు'.

ఆశపడి, గాయపడి, భంగపడనిది ఎవరు! మూవ్ ఆన్ అవటం ఎంత కష్టమైన ప్రాసెస్! కేఫ్ సైలెన్స్ డోరు ఆ కౌగిలింత బరువుకి క్రిరుమనక పోయుంటే, మన గుండె ఆ డోర్లోనే పడి నలిగి, మూల్గుతుంది. లేదా ఒకప్పటి మన మూలుగు గుర్తొస్తుంది. మూవ్ ఆన్, బాక్ వాటర్స్ అలాంటి కథలు.

ఇక 'జూలియా'. మన తెలుగు సాహిత్యం చాలా మటుకు ప్రేమ విషయానికి వచ్చేసరికి డిజిటల్ ఎలక్ట్రానిక్స్ లాంటిది. మనకి తెల్సిన ప్రేమ – 'బైనరి'. ఒకేసారి ఇద్దరితో ప్రేమలో ఉండచ్చు అనేదే ఆకళింపు చేసుకోని చోట, 'రెండో బిడ్డ'ని మోయటం అంత సహజమైన విషయంలా రెండు భిన్నమైన జెండర్లతో ప్రేమని, మోహాన్ని చిత్రించటం... హ్మ్! ఈ కథ చదువుతుంటే అవతలి గట్టుకు వంతెన మీద వెళ్తున్నట్టు అనిపిస్తుంది. ఇలాంటి వంతెనే ఆ తర్వాత వచ్చే కథలో భిన్న దేశాలకి, భిన్న తరాలకి, భిన్న ఆశయాలకి మధ్య ఉంది. అరుణ కాంతుల కోసం చీకటిలో చేసే పోరాటంలో, అర చేతిలోని గోరింటాకు ఎరుపుని ఉన్నట్టుండి ఎవరన్నా గుర్తు చేస్తే, అది 'ఇన్‌సెర్చ్ ఆఫ్ నిలా'. వెదుకులాట ఎవరికోసం అయినా అవనీండి, ట్రయాంగ్యులర్ లవ్, రెక్టాంగులర్ లవ్‌లాంటి రొడ్డ కొట్టుడు మాటల్ని తోసేసి.. రీనా జార్జ్, రీనా మైక్, జార్జ్ నిలాలని దాటి 'ప్రేమ' మేఘాతో కలిపి మనల్ని కూడా తీరం దాటిస్తుంది.

అవతలి తీరపు యుద్ధాల నుండి తేరుకునేలోపే, ఇవతలి తీరంలో 'రామి' మన కోసం ఎదురుచూస్తుంటోంది. జడ కత్తిరించి ప్రియుడికి ఇచ్చిన ఆ పిల్ల వెర్రి ప్రేమకి ఏదైనా గాయం అవుతుందేమో అని ఆదుర్దా నుండి తేరుకునేలోగా; చలికాలపు రోజుల్లో నెత్తుట్లో పారే వేడి చింతను గుర్తు చేస్తుంది 'నేనే'. ప్రేమ మాట్లాడే సూటి, సరళమైన భాష – దైహిక భాష. దాన్ని ఓవర్‌లుక్ చేసి అజరామర ప్రేమ, అలౌకిక ప్రేమ అంటూ చేసే వెదుకులాట 'అబ్సర్డ్'. మోహరాగంలో పలికే దేహ సంగీతాన్ని రాయటం, దాన్ని చదవటం – ఆర్ట్!


ప్రేమ మీద ఎన్ని అయినా మాట్లాడతాం. ఊహించుకుంటాం. డెస్టిని, కాస్మిక్ కనెక్షన్ పేరేదైనా పెట్టుకోండి, తోచిన థియరీ చెప్పుకోండి; ప్రేమ నీ తలుపు తట్టినప్పుడు ఏం చేస్తాం? ఏం చేశాం? ఈ ప్రశ్నకి మొత్తం ఎంత మంది మనుషులమో, అన్ని సమాధానాలు. అన్ని సమాధానాలు కూడా ఒకే రిజల్యూషన్ వైపు మనల్ని నడిపిస్తాయి. 'జారిపోయే నా పదాలకు ధైర్యం నేర్పిస్తాను' అని. నేర్పిస్తామా? ఏమో! ది గేమ్స్ వియ్ ప్లే కథలో చెప్పినట్లు, ప్రేమంటే సైంటిస్టులకి అంతుపట్టని బిగ్‌బ్యాంగ్ థియరి. మోహపు దారుల్లో ప్రయాణించేప్పుడు భయం నీడలు మన లోపలా బయటా ఉంటాయి. ఉన్మాదాన్ని, క్రైమ్‌ని ప్రేమకి సఫిక్స్‌గానో, ప్రిఫిక్స్‌గానో చెల్లుబాటు చేస్తున్న రోజులు ఇవి. మరి 'దీన్ని' ఇగ్నోర్ చేసి, ప్రేమని తలవగలమా! ప్రేమ సందేశాన్ని మోసుకొచ్చిన క్రీస్తు పుట్టిన నాడు, ఉన్మాదాన్ని తుడిచేయటం, కొత్త సంవత్సరానికి స్వాగతం పలకటం.. కొత్త ఆశని ఇస్తుంది.

అర్బన్ ప్రాంతాల్లో, అడవుల్లో, పల్లెటూళ్ళో... ప్రాంతం ఏదైనా, నేపథ్యం ఏదైనా, ప్రతీ కథలో మనం కనిపిస్తాం. ఏదో జ్ఞాపకం మెదిలి, గుండె కలుక్కుమంటుంది. పన్నెండు కథల్లోనూ సబ్జెక్ట్ ప్రేమే. కానీ ఒకదాని ఇన్‌టెన్సిటితో మరొకటి పోటీ పడుతుంది. ఒకదానికి ఒకటి భిన్నం. వైవిధ్యం. ఒక కథ గ్లూకోజ్‌లా తక్షణ శక్తి ఇస్తే, మరో కథ సెలైన్‌లా చుక్క చుక్కగా ఎక్కుతుంది. మడి కట్టుకుని ఉన్న సాహిత్యపు భాషకి, మర్యాదలలో చిక్కుకున్న ఎమోషన్స్‌కి గట్లు తెగ్గొట్టటం అంత తేలికేం కాదు. ప్రేమలోని ఇన్‌టెన్సిటిని నిజాయితీగా చెప్పగల సాహసం కావాలి. అక్షరాల్లోకి తర్జుమా చేసే నేర్పు కావాలి. జీవితాన్ని ఉత్సవంగా మార్చగల శక్తి ప్రేమది. సాహిత్యాన్ని ఫోర్త్ డైమెన్షన్‌లో చూపెట్టగల శక్తి ఈ ప్రేమ కథలది. ఒక ఎమోషనల్ రోలర్‌కోస్టర్ మీద ఎడాపెడా తిప్పిన కథలని అందించినందుకు ఎడిటర్లకి కృతజ్ఞతలు.

తెలుగులో చదివే వాళ్ళు తగ్గిపోతున్నారు అని బాధపడతాం. మరి చదవటం ఎలా అలవాటు చేస్తాం? ప్రేమ అనేది అందరికీ కామన్ అయిన ఒక ఇంటెన్స్ హ్యూమన్ ఎమోషన్. ఏ ప్లేన్‌లో ఉన్న పాఠకులకి అయినా, ఇన్‌స్టెంట్ కనెక్ట్ తీసుకురాగల శక్తి. సామాజిక, ఆర్థిక, జెండర్ వలయాలని దాటి, అందరికీ అనుభవంలోకి వచ్చే ప్రేమ గురించి డిఫరెంట్ డిగ్రిల్లో, డిఫరెంట్ టోన్స్‌లో రాసి, అందుబాటులో ఉంచటం ఒక దారి. 'ఇన్ ద మూడ్ ఆఫ్ లవ్' అటువంటి పర్పస్‌ని నిర్వర్తిస్తుంది. కొత్త తరానికి, సాహిత్యానికి ఉండే గేప్‌ని కొంతైనా తగ్గిస్తుంది. మనం చేయాల్సిందల్లా ఈ కథలని ఆస్వాదించటం. అనుభవించటం. పలవరించటం. వేరొకరికి అందించటం.

చైతన్య పింగళి
డిసెంబర్ 2015

✦✦✦



**IN THE MOOD FOR LOVE**

anthology of telugu love stories

నాగేంద్ర కాశి

అపర్ణ తోట

అరిపిరాల సత్యప్రసాద్

రిషిశ్రీనివాస్

స్వాతికుమారి

పూర్ణిమ తమ్మిరెడ్డి

మానస ఎండ్లూరి

మహి బెజవాడ

మిథున

ఉషజ్యోతి బంధం

వెంకట్ శిద్దారెడ్డి

కె.వి.కరుణ కుమార్

NEW WAVE
BOOKS